

'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+4+20 వెల: ₹5.00

సంపుటి: 10 సంచిక: 361

శుక్రవారం 23-3-2018

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మెగా
డిస్కౌంట్ మేళ
iPhone 6
₹5,780
FLASH DISCOUNT
iPhone SE
30%
FLASH DISCOUNT
iPhone 7
₹10,000
FLASH DISCOUNT
iPhone X
₹14,500
FLASH DISCOUNT
Samsung Galaxy S8/S8+
₹10,000
Paytm CASHBACK
Samsung Galaxy S9+
₹6,000
CASHBACK
*Conditions appy
మీ ఫోను మా EMI తో
Redmi 5A
₹928 pm
Samsung J2 Pro
₹1,161 pm
Vivo Y53
₹1,280 pm
Oppo A37
₹1,354 pm
Vivo Y1
₹1,400 pm
Redmi Note 4
₹1,502 pm
Samsung J7 Nxt
₹1,503 pm
Oppo A83
₹1,869 pm
Redmi Note 5 Pro
₹2,136 pm
Samsung J7 Max
₹2,372 pm
GRAND OPENING
Opp Bus Stand,
KUKATPALLY,
Hyderabad
4G స్మార్ట్ ఫోన్
కేవలం ₹499 pm కే
ప్రతి ఫోన్ కొనుగోలుపై
ఖచ్చితమైన బహుమతి
*Conditions apply
You can also shop at www.sangeethamobiles.com
Finance options from BAJAJ FINSERV HDB FINANCIAL SERVICES HDFC BANK CAPITAL FIRST
Sangeetha EMI Powered by zest
Sangeetha® PIONEER THEN, LEADER NOW.
సంగీత
9 STATES | 500 STORES | 20 MILLION HAPPY CUSTOMERS
For feedback/suggestions, write to us at support@sangeethamobiles.com or call us at 080 4939 7000 | Connect with us SangeethaMobilesIndia | For terms and conditions, visit www.sangeethamobiles.com/sangeetha-advantage/price-challenge
OVER 500 STORES ACROSS INDIA
*Prices offered are applicable only on exchange.


'ప్రజల రుణం తీర్చుకునేందుకు
ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 18+4+20 వెల: ₹5.00
సంపుటి: 10
సంచిక: 361

శుక్రవారం 23-3-2018

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఫేస్‌బుక్‌కు మరింత భద్రత
పొరపాటుకు చింతిస్తున్నాం..
క్షమించండి: జుకర్‌బర్గ్ - 8లో



ఇంగ్లండ్ 58 ఆలౌట్
6 వికెట్లతో చెలరేగిన
కివీస్ బౌలర్ ట్రెంట్ బౌల్ట్ –స్పోర్ట్స్‌లో

రహదారులన్నింటా..

ఆగ్రహోదాగ్ని

రాష్ట్రవ్యాప్తంగా రహదారుల దిగ్బంధం

- హోదా కోసం దిక్కులు పిక్కటిల్లేలా గొంతెత్తి నినదించిన జనం
- ప్రత్యేక హోదా సాధించేవరకు విశ్రమించబోమని ప్రతిజ్ఞ
- రోడ్లపై నిరసనలు.. ఆందోళనలు.. మానవహారాలు
- గుంటూరు జిల్లాలో ఆందోళనలో పాల్గొన్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్
- హోదా ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు: పలుచోట్ల అరెస్టులు
- ప్రజాగ్రహం ముందు ఎంతటివారైనా తలవంచక తప్పదు: వైఎస్సార్‌సీపీ

విశాఖ ఎన్‌ఏడీ జంక్షన్‌లో వైఎస్సార్‌సీపీ, వామపక్ష శ్రేణులు జాతీయ రహదారిని నిర్బంధించడంతో భారీగా నిలిచిపోయిన వాహనాలు



సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్

రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనే ధ్యేయంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోపాటు ప్రతిపక్షాలు, ప్రత్యేక హోదా సాధన సమితి ఇచ్చిన పిలుపు మేరకు గురువారం రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారుల దిగ్బంధం పూర్తిస్థాయిలో విజయవంతమైంది. అన్ని జిల్లాల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక హోదా ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు వెంటనే ప్రత్యేక హోదా కల్పించాలి, హోదా మా హక్కు అంటూ దిక్కులు పిక్కటిల్లేలా గొంతెత్తి నినదించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. మానవ హారాలు నిర్వహించారు. రహదారులపై క్రికెట్, కబడ్డీ వంటి ఆటలు ఆడి నిరసన తెలిపారు. హోదా సాధించే వరకూ విశ్రమించబోమని ప్రతిన బూనారు. జాతీయ రహదారులన్నీ ఆందోళన కారులతో నిండిపోయాయి. రహదారుల దిగ్బంధంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఆందోళన మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగింది. పొరుగు రాష్ట్రాలకు వెళ్లే వాహనదారులు సైతం పూర్తిస్థాయిలో సహకరించారు. పలుచోట్ల ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేసి, పోలీసు స్టేషన్లకు తరలించారు.

ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోపాటు 8 వామపక్షాలు, జనసేన, లోక్‌సత్తా, ఆమ్ ఆద్మీ తదితర పార్టీలు, 45 ప్రజా సంఘాలు రహదారుల దిగ్బంధంలో పాలుపంచుకున్నాయి. అధికార తెలుగుదేశం పార్టీ ఒంటరి పోరంటూ రోడ్డు పక్కన టెంట్లు వేసుకుని తూతూమంత్రంగా ధర్నాలు చేయగా, బీజేపీ ఈ పోరాటానికి దూరంగా ఉండిపోయింది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతీయ రహదారుల దిగ్బంధానికి మద్దతుగా

మిగతా 6వ పేజీలో ▶



గుంటూరు శివారులోని అంకిరెడ్డిపాలెం రహదారి వద్ద ఆందోళనలో పాల్గొన్న ప్రతిపక్షనేత వైఎస్ జగన్



విజయవాడ కనకదుర్గ వారథిపై ఆందోళన నిర్వహిస్తున్న వామపక్ష నేతలు రామకృష్ణ, మధు తదితరులు

విచారణ భయంతో

లాలూచీ

కేంద్రంతో చంద్రబాబు రాజీయత్నాలు..



- కాస్త రాయితీలిచ్చి మమ్మల్ని బయటపడేయండి..
- దగ్గరగా ఉంటాం.. నమ్మకమైన మిత్రపక్షంగా ఉంటాం..
- కేసుల భయంతో వణుకు.. అతకని ఆరోపణలు..

సాక్షి ప్రత్యేక ప్రతినిధి

నాలుగేళ్లుగా కేంద్రంలో అధికారాన్ని పంచుకుని రాష్ట్రానికి సంజీవని వంటి ప్రత్యేక హోదాను సాధించకపోగా, దానిని శాయశక్తులా నిర్వీర్యం చేసి... హోదా కోసం ప్రజలే పోరాడుతున్న దశలో అకస్మాత్తుగా యూటర్న్ తీసుకుని తనే హోదా ఛాంపియన్ అని నిరూపించుకోవడానికి చంద్రబాబు చేస్తున్న విన్యాసాలను మనం రోజూ చూస్తున్నాం..

తెలుగుజాతి ఆత్మగౌరవ సమస్య అని ఒక రోజు, రాష్ట్రంపై కేంద్రం యుద్ధం చేస్తున్నదని మరో రోజు, కేంద్రంపై రాజీలేకుండా పోరాడుతున్నట్లు ఇంకోరోజు కలరింగ్ ఇస్తూనే నాలుగేళ్లుగా పాల్పడిన లక్షల కోట్ల అవినీతి వ్యవహారాలు ఎక్కడ బయటపడతాయో అని వణుకుతున్న చంద్రబాబు కేంద్రంతో రాజీయత్నాలు ప్రారంభించారు..

ఒకవైపు పోరాటం చేస్తున్నట్లు కనిపిస్తూనే.. మరోవైపు లాలూచీకి యత్నిస్తూ ఆయన ఈ నాటకాన్ని మహా బాగా రక్తికట్టిస్తున్నారు. జాతికి జీవధార వంటి పోలవరంపైనా, పట్టిసీమ పనులపైనా, రాజధాని భూములపైనా, అన్ని రంగాలకూ విస్తరించిన అవినీతిపైనా నిన్నమొన్నటివరకు మిత్రపక్షాలుగా ఉన్న పవన్, బీజేపీ ప్రశ్నలవర్షం కురిపిస్తున్నాయి. ప్రజలలో కూడా చంద్రబాబు అవినీతిపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. దాంతో విచారణ ఎదుర్కోవలసి వస్తుందేమోనన్న వణుకు చంద్రబాబులో మొదలయ్యింది. అందుకే ఢిల్లీలో పార్టీకి అనుకూలంగా ఉన్న పెద్దలతో ఇద్దరు మంత్రులను కలసి ప్రయత్నాలు చేయడం ప్రారంభించినట్లు తెలిసింది. 'ఏదో ఒక సానుకూల ప్రకటన చేసి మమ్మల్ని బయటపడేయండి రాజీపడతాం' అని ఆయన అభ్యర్థిస్తున్నట్లు సమాచారం. అయితే తమ అనుకూల పత్రికలో మాత్రం ఇదే విషయాన్ని మరోరకంగా ప్రచారం

మిగతా 2వ పేజీలో ▶

స్వదేశీ సీకర్‌తో
'బ్రహ్మోస్' పరీక్ష సక్సెస్ 8 లో

ఐదోరోజూ చర్చకు నిరాకరణ

- పార్లమెంటులో ఏఐఏడీఎంకే, టీఆర్ఎస్ ఆందోళన
- కేంద్రంపై ఆరోసారి అవిశ్వాస నోటీసులిచ్చిన వైఎస్సార్‌సీపీ, టీడీపీ

14 లో



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీలు

సీబీఐ విచారణ ఎదుర్కోండి

- బీజేపీ, జనసేన ఆరోపణలపై వారి ఓట్లతో నెగ్గిన చంద్రబాబు స్పందించాలి
- సీఎం చంద్రబాబును డిమాండ్ చేసిన వైఎస్సార్‌సీపీ ఎంపీలు

14 లో

పట్టిసీమపై సీబీఐ విచారణా?

- బీజేపీపై సీఎం చంద్రబాబు ఆగ్రహం
- కేంద్ర పథకాల్లో కాగ్ అభ్యంతరాలపై కూడా సీబీఐతో విచారిస్తారా?
- జరగరానిది జరిగితే ప్రజలు ఊరుకోరు
- ఈశాన్య రాష్ట్రాలకు ఇచ్చినట్లే నిధులిస్తే హోదా అవసరం లేదు

2 లో



డీఎస్సీ నోటిఫికేషన్లు

లేనేలేవు

టీచర్ల పోస్టుల భర్తీని పట్టించుకోని ప్రభుత్వం

- టెట్ నిర్వహించినా నోటిఫికేషన్ ఎప్పుడిస్తారో తెలియదు
- 22,814 పోస్టుల భర్తీకి గతేడాది మంత్రి గంటా ప్రకటన
- ప్రస్తుతం ఖాళీలు 19,468 ఉన్నా.. 10,603 పోస్టుల భర్తీకే ఆర్థిక అనుమతి
- అయినా ప్రభుత్వం ఆమోదంలేక వెలువడని నోటిఫికేషన్లు
- పోస్టుల కోతపై ఆందోళనలో డీఎస్సీ అభ్యర్థులు

సాక్షి, అమరావతి: ఏటా టీచర్ల పోస్టులు భర్తీ చేస్తామన్న హామీని చంద్రబాబు ప్రభుత్వం తుంగలోతొక్కింది. 2014లో ఓ నోటిఫికేషన్ ఇచ్చి ఆ తర్వాత చేతులు దులుపుకొంది. ప్రభుత్వం ఆమోదంలేకపోవడంతో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయలేకపోతున్నామని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల ఉపాధ్యాయ అర్హత పరీక్షను నిర్వహించినా మళ్లీ డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడు ఇస్తారో తెలియక అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఒకపక్క ఉద్యోగ వయోపరిమితిని 34 నుంచి 42 ఏళ్లకు పెంచినా నోటిఫికేషన్లు లేకపోవడంతో నిరుద్యోగుల ఆశలు ఎండమావులే అయ్యాయి. రాష్ట్రంలో ఉపాధ్యాయ ఖాళీలు రిటైర్మెంట్ అయిన పోస్టులతో కలుపుకుంటే 19,468 ఉన్నాయి. వీటిని భర్తీ చేయడానికి ప్రభుత్వం

మిగతా 6వ పేజీలో ▶

టన్నెల్లో టన్నుల అవినీతి!

రెట్టింపు కంటే పెరిగిన వెలిగొండ సొరంగాల అంచనాలు

- ఈపీసీలో కాకుండా ఎల్ఎస్–ఓపెన్‌లో టెండర్ల ద్వారా పనులు
- కోటరీలో ఇద్దరు బడా కాంట్రాక్టర్లకు అప్పగించి కమీషన్లు అందుకునే వ్యూహం
- అంచనాల పెంపులో అక్రమాల బాగోతాన్ని ముందే బహిర్గతం చేసిన 'సాక్షి'

పాత కాంట్రాక్టర్ల నుంచి తొలగించిన పనుల విలువ
రూ.415.92 కోట్లు

వీటి అంచనాలు పెంచుతూ సర్కారు ఉత్తర్వులిచ్చింది
రూ.1,012.41 కోట్లకు

- వివరాలు 5లో

ఏపీలో పీజీ చదివితేనే ఇన్‌సర్వీస్ కోటా

- జాతీయ పూల్‌కు వెళితే కోటా వర్తించదు
- సందిగ్ధంలో ఎంబీబీఎస్ వైద్యులు

సాక్షి, అమరావతి: పీజీ వైద్య విద్యలో చేరాలనుకునే అభ్యర్థులు సొంత రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో చదివితేనే ఇన్‌సర్వీస్ కోటా వర్తిస్తుందని, జాతీయ పూల్‌లో భాగంగా ఇతర రాష్ట్రాల్లోని కళాశాలల్లో చేరితే వర్తించదని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఎంబీబీఎస్ అర్హతతో రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సివిల్ అసిస్టెంట్‌లుగా, మెడికల్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న వైద్యులకు ప్రభుత్వ పీజీ వైద్య సీట్లలో 30 శాతం ఇన్‌సర్వీస్ కోటా ఉండేది. తాజాగా మొత్తం పీజీ వైద్య సీట్లలో 50 శాతం సీట్లను జాతీయ పూల్‌కు ఇవ్వాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సర్వీసులో ఉన్న ఎంబీబీఎస్ వైద్యులు ఇన్‌సర్వీస్ కోటా కింద పీజీ చదవాలంటే ఏపీలో ఉన్న వైద్య కళాశాలల్లోనే చేరాలి. ఇలా చేరితేనే కోర్సు పూర్తయ్యే వరకూ ఉద్యోగానికి విరామం ఇవ్వడంతోపాటు మూడేళ్లపాటు వేతనం కూడా చెల్లిస్తారు. కోర్సు పూర్తయ్యాక తిరిగి ఉద్యోగంలో చేరే అవకాశం ఉంటుంది. అలా కాకుండా మంచి ర్యాంకులు పొంది జాతీయస్థాయిలో ఉత్తమ వైద్య కాలేజీల్లో చేరతామంటే ఇక్కడ ఉద్యోగానికి సెలవు ఇవ్వకపోగా, వేతనం కూడా రాదు. జాతీయ స్థాయిలో మంచి కళాశాలల్లో చేరితే ఇక్కడ ఉద్యోగం పోతుందని, ఏం చేయాలో అర్థం కావడం లేదని అభ్యర్థులు అంటున్నారు. రాష్ట్రంలోని పీజీ వైద్య సీట్లలో 50 శాతం సీట్లు జాతీయ పూల్‌కు వెళ్లడంతో ఇన్‌సర్వీస్ కోటా సీట్లు భారీగా తగ్గిపోయాయని, దీనిపై ఇప్పటికే పలుసార్లు ప్రభుత్వానికి లేఖ రాసినా పట్టించుకోలేదని ప్రభుత్వ వైద్యుల సంఘం కన్వీనర్ డా.జయధీర్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1,500 మంది వైద్యులు ఎంబీబీఎస్ అర్హతతో గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్నారు. మరోవైపు ఈ నెల 24వ తేదీలోగా పీజీ వైద్య సీట్లకు ఆప్షన్లు ఇచ్చుకునేందుకు గడువుంది. జాతీయ పూల్‌కు వెళ్లాలా? లేక ఇక్కడే సీటు తీసుకోవాలా? అని సందిగ్ధంలో అభ్యర్థులు ఉన్నారు.

విచారణ భయంతో లాలూచీ

▶ మొదటి పేజీ తరువాయి

చేసుకున్నారు. బీజేపీయే దిగివచ్చి చంద్రబాబుతో 'కలిసుందాం..ఇంకా దూరం పెంచుకోవద్దు' అని రాజీ ప్రతిపాదనలు చేస్తున్నట్లు అందులో వచ్చింది. నిజానికి పోలవరం, పట్టిసీమ వంటి ప్రాజెక్టులలో అడ్డగోలుగా అవినీతిపై సాక్ష్యాధారాలతో సహా ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ గతంలోనే అనేకమార్లు బయటపెట్టింది. మీడియాలో కూడా అనేక కథనాలు వచ్చాయి. కాగ్ తూర్పారబట్టింది. ప్రజాపద్దుల కమిటీ కూడా ఆక్షేపించింది. టీడీపీతో చెడిన తర్వాత బీజేపీ కూడా ఈ అవినీతిపై విచారణ జరగాల్సిందేనని డిమాండ్ చేస్తోంది. దాంతో చంద్రబాబుకు భయం పట్టుకుంది. నిజంగానే సీబీఐ విచారణ జరిగితే అడ్డంగా దొరికిపోతామన్న వణుకు మొదలైంది. ఢిల్లీలో చేస్తున్న లాలూచీ ప్రయత్నాలు ఫలించలేదని, కేంద్రం నుంచి సానుకూల ఫలితం రాలేదని గురువారంనాడు చంద్రబాబు అసెంబ్లీలో చేసిన ప్రసంగాన్ని చూసిన వారికి స్పష్టంగా అర్థమయ్యింది.

ఫలించని రాజీ యత్నాలు..


అవినీతి కేసుల భయంతోనే చంద్రబాబు కేంద్రంతోనూ, బీజేపీతోనూ లాలూచీ ప్రయత్నాలు మొదలుపెట్టారని ఢిల్లీ పరిణామాలను గమనిస్తున్న విశ్లేషకులంటున్నారు. 'కాస్త రాయితీలిచ్చినట్లు ప్రకటించండి.. ఈ సమస్య నుంచి మమ్మల్ని బయటపడేయండి. మేం మీకు దూరం పోము.. నమ్మకమైన మిత్రపక్షంగా ఉంటాం' అని కేంద్రంలో పలుకుబడి ఉన్న ఒక ప్రముఖ వ్యక్తి ద్వారా ఒకరిద్దరు మంత్రులతో సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది. కేంద్రంతో రాజీపడదామని ప్రతిపాదనలు పంపినా కేంద్రం నుంచి ఎలాంటి సుముఖతా వ్యక్తం కాలేదని తెలుస్తోంది. కేంద్రం నుంచి సానుకూలత కనిపించకపోవడంతో ఆ నిర్వేదం చంద్రబాబు అసెంబ్లీ ప్రసంగంలో స్పష్టంగా కనిపించింది. నాలుగేళ్లపాటు అవినీతి జరిగితే ఇపుడెందుకు మాట్లాడుతున్నారని చంద్రబాబు అడగడం చూసి అందరూ విస్తుపోతున్నారు. అవినీతి జరిగిందా లేదా అనేది చెప్పకుండా ఇపుడెందుకు మాట్లాడుతున్నారని అనడమిటి? అవినీతి జరిగితే అడగొద్దా అని విమర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానమంత్రిని అదీ పార్లమెంటులోనో, ప్రధాని కార్యాలయంలోనో ఓ ఎంపీ కలిస్తే తప్పేమిటి? ఏ తప్పూ చేయకపోతే భయపడాల్సిన పనేమిటి? అన్న ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. విచారణ చేసుకోండి అని అంటూనే నాపైన విచారణ ఎలా చేస్తారు? అని చంద్రబాబు ప్రశ్నించడంపై కూడా విస్మయం వ్యక్తమవుతోంది. తప్పు చేసినట్లు ఆరోపణలొచ్చినపుడు విచారణ జరగడం తప్పెలా అవుతుందని విమర్శకులంటున్నారు. ఇక ప్రత్యేక హోదా విషయంలోనూ అంతే. ప్రత్యేక హోదా ఇచ్చి అది ఎవరో పోరాడితే ఇచ్చినట్లు కేంద్రం చెప్పబోతోందని చంద్రబాబు వ్యాఖ్యానించడం పట్ల కూడ విస్మయం వ్యక్తమవుతోంది. రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ఆశగా ఎదురుచూస్తున్న ప్రత్యేక హోదా సాకారం కావడం ముఖ్యం కానీ ఎవరు సాధిస్తే ఏమిటి అని విమర్శకులు ప్రశ్నిస్తున్నారు.

తప్పు జరగబట్టే వణుకు కనబడుతోంది..

కేంద్రం మెత్తబడకపోవడంతో ఎక్కడ విచారణ వేస్తారోనన్న భయంతో చంద్రబాబుకు వణుకు మొదలైంది. గురువారం జరిగిన టెలికాన్ఫరెన్స్‌లో ఇది స్పష్టంగా కనిపించింది. 'నా మీద, లోకేశ్ మీదా విచారణ వేస్తారట' అని చంద్రబాబు పదేపదే కలవరించడం చూసి పార్టీ ముఖ్య నాయకులు ఆశ్చర్యపోయారని సమాచారం. ఇవే విషయాలను అసెంబ్లీలోనూ బాబు పదేపదే ప్రస్తావించారు. ఒకవైపు అసెంబ్లీలో బీజేపీ ఆరోపణలు చేస్తుంటే అసందర్భంగా వైఎస్సార్‌సీపీని తిట్టడం చూసి ప్రజలు విస్తుపోతున్నారు. చంద్రబాబు సంబంధం లేకుండా మాట్లాడడం చూసి ఏ తప్పూ చేయకపోతే ఆయన ఎందుకు అంతగా భయపడుతున్నారు అని ప్రజలు చర్చించుకుంటున్నారు. అసెంబ్లీలో చంద్రబాబు ప్రసంగం చూసిన వారంతా ఆయన భయంతో వణికిపోతుండడాన్ని స్పష్టంగా గమనించారు. తప్పు జరగబట్టే చంద్రబాబు స్వరంలో మార్పు వచ్చిందని, బింకాన్ని ప్రదర్శిస్తూ లేనిపోనివి మాట్లాడుతున్నారని విశ్లేషకులంటున్నారు. అసెంబ్లీ సాక్షిగా బీజేపీ చేసిన విమర్శలకు చంద్రబాబు నుంచి సమాధానమే లేకుండా పోయింది. తప్పు జరగలేదని, తాము అంతా మంచే చేశామని ఎందుకు చంద్రబాబు చెప్పలేకపోయారని విమర్శకులు ప్రశ్నిస్తున్నారు. చంద్రబాబు అసెంబ్లీలో చేసిన అతకని ఆరోపణలపై వైఎస్సార్‌సీపీ నేతలు కూడా ఘాటుగానే స్పందించారు. 'అంత సచ్ఛీలుడివైతే భయపడడం ఎందుకు? ధైర్యంగా విచారణను ఎదుర్కోవచ్చు గదా.. గతంలో తనపై ఆరోపణలొచ్చినపుడు దివంగత సీఎం రాజశేఖరరెడ్డి సీబీఐ విచారణకు సిద్ధపడలేదా?' అని వారు ప్రశ్నిస్తున్నారు.

118వ రోజు

22-03-2018, గురువారం
కావూరు, గుంటూరు జిల్లా


ప్రజా సంకల్పం పాదయాత్ర డైరీ

హోదాపై మీకేమాత్రం చిత్తశుద్ధి ఉందో.. దీన్నిబట్టే తెలుస్తోంది

ప్రత్యేక హోదా సెగల మధ్యే ఈ రోజు నా పాదయాత్ర సాగింది. హోదానే ఊపిరిగా భావిస్తున్న ఆ జనంతో కలిసి ఎంతవరకైనా పోరాడాలనే పట్టుదల నాలో మరింత పెరిగింది. అంకిరెడ్డిపాలెం వద్ద ప్రత్యేక హోదా కోసం ఉద్యమిస్తూ.. జాతీయ రహదారులను దిగ్బంధం చేసిన ఆందోళనకారులకు సంఘీభావం తెలిపాను. వాళ్ల చేతుల్లో ప్లకార్డులున్నాయి. ముఖంలో ఆవేశం పెల్లుబుకుతోంది. విభజనతో ఏకాకి అయిన రాష్ట్రానికి హోదానే సంజీవని.. ప్రాణాలొడ్డయినా దాన్ని సాధించుకుంటామనే భావోద్వేగం వాళ్లలో కన్పించింది. హోదా కోసం మాట తప్పని, మడమ తిప్పని పోరాటం మీదంటూ వాళ్లు నాతో అన్న మాటల్లో సడలని విశ్వాసం చూశాను. పూటకోమాట చెబుతున్న చంద్రబాబుపై రగిలిపోతున్న వాళ్ల భావావేశాన్ని గమనించాను. వాళ్లతో మమేకమయ్యాను. హోదా కోసం అలుపెరగని పోరుబాటకు నేను సిద్ధమని భరోసా ఇచ్చాను. ఈ ఒక్క సంఘటనే కాదు.. చిలకలూరిపేట నుంచి కావూరు వరకూ సాగిన పాదయాత్రలోనూ ఇలాంటి దృశ్యాలు ఎన్నో కన్పించాయి. కాలేజీ బస్సుల్లోంచే కరతాళ ధ్వనులు చేసిన విద్యార్థులు, ప్రత్యేక హోదా కోసం ఉద్యమిద్దామన్నా.. అంటూ నినాదాలు చేసిన తమ్ముళ్లు, భావితరాల భవితవ్యం కోసం హోదా సాధించాల్సిందేనన్నా.. అంటూ చెప్పిన అక్కచెల్లెమ్మలు.. ప్రతీ మదిలోనూ రగులుతున్న హోదాగ్ని సెగలే కన్పించాయి. ప్రతీ గుండెలోనూ.. అదే హక్కు అన్న మాటలు విన్పించాయి. ఊహ తెలిసిన పిల్లాడి నుంచీ.. వయో వృద్ధుల వరకూ హోదా కావాలంటూ నినదించే జనాభీష్టాన్ని ఏ నేత అయినా గుర్తించాల్సిందే. ఈ విషయంలో వైఎస్సార్ సీపీ ఎప్పుడూ ప్రజల పక్షమే. అవరోధాలను లెక్కచేయకుండా పోరాటమే ఊపిరిగా చేసుకుంది. కేంద్రానికి రణ నినాదం విన్పించేందుకు నాలుగేళ్లుగా అవిశ్రాంత పోరాటం చేస్తూనే ఉంది. సాధించే వరకూ పోరాడుతూనే ఉంటుంది. కానీ ఆశ్చర్యమేంటంటే.. ప్రజల గొంతుకైన హోదాను కూడా చంద్రబాబు స్వప్రయోజనాలకు వాడుకుంటున్నాడు. నాలుగేళ్లుగా ఆయనే నీరుగార్చి.. ఇప్పుడు నేనే పోరాట యోధుడినని చెప్పుకొంటున్నాడు. ఆయనెన్ని మాటలు చెప్పినా, ఏ డ్రామాలాడినా హోదా కోసం ఉద్యమించేదెవరో? ఎవరు ఉద్యమించగలరో? ప్రజల నాడి చూస్తేనే తెలుస్తోంది. వైఎస్సార్ సీపీ సారథ్యంలోనే ప్రత్యేక హోదా సాధ్యమని నమ్మే ప్రజావిశ్వాసాన్ని కాపాడాలనే తపన నాలో మరింత పెరిగింది.

పాదయాత్రలో వైఎస్సార్ కాలనీవాసులు తమ గోడు చెప్పుకొన్నారు. నాన్నగారి హయాంలో కట్టించిన ఆ కాలనీ బాగోగులను చంద్రబాబు సర్కారు ఏమాత్రం పట్టించుకోలేదట. బడికోసం మైళ్ల కొద్దీ వెళ్లాల్సి వస్తోందని, గుక్కెడు నీళ్ల కోసం బోలెడు కష్టాలుపడాల్సి వస్తోందని చెప్పారు. రేషన్ బియ్యం కూడా వేరే ఊరెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోయారు. ఊళ్లో కనీసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూడా ఏర్పాటు చేయలేదన్నారు. మేం అసలు ఈ రాష్ట్రంలోనే ఉన్నామా? ఈ ప్రభుత్వానికి మేం ఉన్నామని తెలుసా? అన్న అనుమానం వ్యక్తం చేశారు. కనీస సౌకర్యాలే లేకపోతే ఎలా ఉండాలయ్యా? అని ప్రశ్నించారు. నిజంగా నాకు బాధేసింది. పేదల కోసం నాన్నగారు కాలనీనే కడితే.. చంద్రబాబు కనీసం సౌకర్యాలు కూడా ఇవ్వకపోవడం దారుణం. ఇలాంటి పేదలంటే ఆయనకు ఎప్పుడూ చిన్నచూపే. వాళ్లకూ మంచి రోజులొస్తాయని భరోసా ఇచ్చాను. మన ప్రభుత్వం వచ్చాక మంచి జరుగుతుందని నమ్మకం కలిగించాను.

మేం ఏం పాపం చేశామయ్యా.. మాకేంటీ శిక్ష.. అంటూ లింగంగుంట్ల దగ్గర వృద్ధులు కన్నీళ్లు పెట్టడం నన్ను కలచివేసింది. నన్ను కలిసిన 18 మందిలో ఎనిమిది మందికి అప్పటికే వస్తున్న పింఛన్లు తీసేశారట. మిగతా పదిమందికి అర్హత ఉన్నా పింఛన్లు ఇవ్వడం లేదట. జన్మభూమి కమిటీలు వేధించుకుతింటున్నాయని, డబ్బుల కోసం పీడిస్తున్నాయనేది వాళ్ల ఆందోళన. కనికరించాలంటూ అధికారుల చుట్టూ తిరిగినా టీడీపీ నేతల సిఫార్సులు లేకపోవడంతో వాళ్లూ చేతులెత్తేస్తున్నారని చెప్పారు. అర్జీలు పెట్టారట. ఎంతో మందికి చెప్పీ చెప్పీ విసిగిపోయారట. ఇప్పుడా అవ్వా తాతల గుండెలు రగిలిపోతున్నాయి. ఓపిక నశించి, ఆవేశం కట్టలు తెంచుకుంది. 'ఈ చంద్రబాబు సర్కారు పాడుగాను.. మీరు రావాలయ్యా.. మాలాంటి వాళ్లకు న్యాయం జరగాలయ్యా..' అన్నారు. ఎంత అన్యాయం! పేదలనే కనికరం కూడా ప్రభుత్వానికి లేకపోవడం దారుణం. సంక్షేమ పథకాలకూ రాజకీయ మకిలి అంటిస్తే పేదల గుండెలే అగ్ని పర్వతాలవుతాయని చంద్రబాబు తెలుసుకునే పరిస్థితి దగ్గరలో ఉంది. ఆ అవ్వా తాతలకు మంచి రోజులు రావాలని నేను మనస్ఫూర్తిగా కోరుకున్నాను.

ముఖ్యమంత్రి గారికి నాదో ప్రశ్న.. లోక్‌సభ సజావుగా జరగడంలేదన్న కారణంతో గత ఐదు రోజులుగా అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా వాయిదా పడుతోంది. వెల్‌లోకి వెళ్లి రోజూ ఆందోళన చేస్తున్న ఇతర రాష్ట్రాల సభ్యులను సహకరించాల్సిందిగా మీ పార్టీ తరఫున ఎవరైనా.. ఒక్కసారైనా కోరిన దాఖలాలున్నాయా? హోదాపై మీకేమాత్రం చిత్తశుద్ధి ఉందో దీన్ని బట్టే తెలుస్తోంది. ఈ వేషాలు, నాటకాలు, లాలూచీ రాజకీయాలతో రాష్ట్ర ప్రజలను ఇంకెన్నాళ్లు మోసం చేస్తారు?

వైఎస్. జగన్.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే డిమాండ్లు పరిష్కరిస్తాం

- పశువైద్య విద్యార్థుల సమ్మెకు జగన్ సంఘీభావం
- పశువులు, జీవాలకు పూర్తిగా బీమా వర్తించేలా చర్యలు తీసుకుంటామని హామీ

గన్నవరం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే పశువైద్య విద్యార్థుల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించడంతో పాటు పశువులు, జీవాలకు పూర్తిగా బీమా వర్తించేలా చర్యలు తీసుకుంటామని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం విమానాశ్రయానికి వెళ్తూ మార్గంమధ్యలో స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాల అతిథిగృహంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. పక్కనే ఉన్న కళాశాలలో.. తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్న పశువైద్య విద్యార్థుల విజ్ఞప్తి మేరకు దీక్ష శిబిరం వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థుల డిమాండ్లను అడిగి తెలుసుకున్న వైఎస్ జగన్.. వారి సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. గ్రామీణ పశువైద్య కేంద్రాలను ఉన్నతీకరించాలని, పశువైద్యుల నియామకాలు చేపట్టాలని 22 రోజులుగా తరగతులను బహిష్కరించి నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వెలిబుచ్చారు. 2016లో సమ్మె చేసినప్పుడు కూడా స్వయంగా మీరు దీక్ష శిబిరం వద్దకొచ్చి మద్దతు తెలిపాక ప్రభుత్వం దిగొచ్చి 250 కేంద్రాలకు పశు వైద్యశాలలుగా పదోన్నతి కల్పించిందని వారు వివరించారు.

పశువైద్యుల ఉద్యోగాలు భర్తీచేస్తాం: అనంతరం జగన్ మాట్లాడుతూ.. రైతు బాగుండాలంటే పాడిపరిశ్రమ బాగుండాలన్నారు. అయితే టీడీపీ ప్రభుత్వంలో పశువులు, గొర్రెలు, మేకలు చనిపోయినా బీమా ఉండదని ధ్వజమెత్తారు. మన ప్రభుత్వం రాగానే రాష్ట్రంలోని 1,217 పశు వైద్యుల ఉద్యోగాల్లో సగం వెంటనే భర్తీ చేస్తామని, మిగతావాటిని ఏడాదిలోపు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. పశువులు, జీవాలకు బీమా వర్తింపజేస్తామని భరోసా ఇచ్చారు. పశువైద్య విద్యార్థులందరికీ ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు యార్లగడ్డ వెంకట్రావు, డాక్టర్ దుట్టా రామచంద్రరావు, కొలుసు పార్థసారథి, సామినేని ఉదయభాను, వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, కైలే అనిల్, బొప్పన భవకుమార్ తదితరులున్నారు.


పశువైద్య విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

పట్టిసీమపై సీబీఐ విచారణా?

బీజేపీపై సీఎం చంద్రబాబు ఆగ్రహం

సాక్షి, అమరావతి: ఎన్డీఏ నుంచి తాము వైదొలగాక పట్టిసీమ ఎత్తిపోతల పథకంలో అక్రమాలు జరిగాయంటూ బీజేపీ దుర్మార్గమైన రాజకీయాలు చేస్తోందని సీఎం చంద్రబాబు విమర్శించారు. వైఎస్సార్ సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి పీఎంవోలో తిరుగుతూ తనపై ఫిర్యాదులు చేస్తున్నారని, ఇకపై కూడా ప్రధానిని కలుస్తానని చెబుతూ తనను జైల్లో పెట్టిస్తానంటున్నారని మండిపడ్డారు. జరగరానిది జరిగితే ప్రజలు ఊరుకోరన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలపై కాగ్ వ్యక్తం చేసిన అభ్యంతరాలపైనా సీబీఐతో విచారణ జరిపిస్తారా? అని బీజేపీని ప్రశ్నించారు. ప్రపంచ జలదినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం చంద్రబాబు గురువారం శాసనసభలో ఓ ప్రకటన చేశారు. కేంద్రమంత్రి గడ్కరీ ప్రతిపాదనల మేరకే పోలవరం స్పిల్‌వే కాంక్రీట్ పనులను నవయుగ సంస్థకు అప్పగించామని చెప్పారు. కేవలం పేరుకోసమే పాత ధరలకే పనులు చేసేందుకు నవయుగ ముందుకొచ్చిందన్నారు. భూసేకరణ, పునరావాస వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించేలా తాను ఒప్పుకున్నట్లు పవన్‌కళ్యాణ్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో భారీగా అక్రమాలు జరిగాయంటూ 'సాక్షి' పత్రికలో నాలుగు రోజులు కథనాలు ప్రచురించారని, వీటిపై విచారణ జరిపించాలని కొందరు కోరుతున్నారన్నారు. ఆర్ అండ్ ఆర్, భూసేకరణకు ఇంకా రూ.28 వేల కోట్లు అవసరమని, ఆ నిధులు రాకుండా చేయడం ద్వారా పోలవరం ప్రాజెక్టును అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను రాష్ట్రప్రభుత్వానికి అప్పగించాలని తాను ఎక్కడా కోరలేదని, రాష్ట్ర ప్రభుత్వమైతేనే వేగంగా పూర్తి చేస్తుందంటూ నీతి ఆయోగ్ చేసిన సిఫార్సుల మేరకే తమకు కేంద్రం అప్పగించిందని చెప్పారు. దేశంలో 16 జాతీయ ప్రాజెక్టులు ఉంటే ఎక్కడా లేని రీతిలో పోలవరం పనులను శరవేగంగా చేస్తున్నామన్నారు.

వైకుంఠపురం బ్యారేజీకి ఈ నెలలోనే టెండర్లు

రూ.2,800 కోట్లతో నిర్మించే వైకుంఠపురం బ్యారేజీకి ఈ నెలలోనే టెండర్లు పిలుస్తామని సీఎం తెలిపారు. వైకుంఠపురం బ్యారేజీ నుంచి నాగార్జున సాగర్ కుడి కాలువలోకి ఆరు దశల్లో నీటిని ఎత్తిపోసి గోదావరి–పెన్నా తొలి దశ అనుసంధానాన్ని పూర్తి చేస్తామన్నారు. నియోజకవర్గానికి రూ.25 కోట్లను తాను తరలించినట్లు పవన్ ఆరోపించారని.. ఆ డబ్బులుంటే ఆయన తీసుకోవచ్చని వ్యాఖ్యానించారు. బీజేపీ సంధించే వంద ప్రశ్నలకు తాము సిద్ధమేనన్నారు. ప్రత్యేక హోదాకు సమానమైన రీతిలో నిధులు ఇస్తామని అరుణ్ జైట్లీ తనకు ఫోన్‌లో చెప్పారని.. అందుకే అర్ధరాత్రి ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీని స్వాగతించానని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాలకు ఇచ్చినట్లే రాష్ట్రానికి కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలు, విదేశీ రుణాలను కేంద్రం 90 శాతం రాష్ట్రం 10 శాతం భరించేలా ఇచ్చి, పారిశ్రామిక రాయితీలు అందచేస్తే ప్రత్యేక హోదా అవసరం లేదని చెప్పారు.

సాగునీటిపై రూ.52 వేల కోట్ల వ్యయం

పట్టిసీమ ఎత్తిపోతలపై సీబీఐ విచారణ జరపాలంటూ బీజేపీ పక్ష నేత విష్ణుకుమార్‌రాజు చేసిన డిమాండ్‌ను ఖండిస్తున్నానని జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా పేర్కొన్నారు. జలవనరుల పద్దుపై జరిగిన చర్చకు మంత్రి గురువారం అసెంబ్లీలో సమాధానం ఇచ్చారు. అదనపు పనులు చేస్తే అదనంగా నిధులిచ్చామని, అన్నీ నిబంధనల మేరకే చేశామన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై ఇప్పటికే 52 వేల కోట్ల రూపాయలను వ్యయం చేసినట్లు ఆయన తెలిపారు.


నన్ను, లోకేశ్‌ను టార్గెట్ చేశారు: చంద్రబాబు

లోకేశ్‌ను, తనను కేంద్రం టార్గెట్ చేసిందని గురువారం తన నివాసం నుంచి టీడీపీ ఎంపీలు, ముఖ్య నాయకులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కక్ష సాధింపు చర్యలు ఇంకా పెరుగుతాయని, అన్నింటికీ అందరూ సిద్ధంగా ఉండాలని చెప్పారు. మూడు పార్టీలు కలిసి తనపై ముప్పేట దాడి చేస్తున్నాయన్నారు. మీపై సీబీఐ దర్యాప్తు ఖాయమని వైఎస్సార్‌సీపీ స్పష్టం చేస్తోందని మంత్రి యనమల ప్రస్తావించగా తాను ఎక్కడా ఏ తప్పూ చేయలేదని చంద్రబాబు చెప్పారు. సినీ పరిశ్రమపై ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ వ్యాఖ్యల గురించి ఎంపీ మురళీమోహన్ ప్రస్తావనకు తేగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, ఎవరూ వ్యక్తిగత ఎజెండాతో విమర్శలు చేయవద్దన్నారు.

హోదా పేరుతో కాకపోయినా.. ఈశాన్య రాష్ట్రాల్లా రాయితీలిస్తే సరే

ప్రత్యేక హోదా పేరుతో కాకపోయినా ఇప్పుడు ఈశాన్య రాష్ట్రాలకు కేంద్రమిస్తున్న రాయితీలన్నింటినీ మన రాష్ట్రానికి ఇస్తే రాష్ట్ర ప్రజలందరినీ తాను ఒప్పిస్తానంటూ చంద్రబాబు వ్యాఖ్యానించారు. శాసనమండలిలో ఆయన ప్రత్యేక హోదా అంశం గురించి ప్రసంగించే సమయంలో బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ జోక్యం చేసుకుంటూ ఈశాన్య రాష్ట్రాలకు రాయితీలు ఇస్తున్నప్పటికీ ప్రత్యేక హోదా పేరును ఉపయోగించడం లేదన్నారు. మన రాష్ట్రానికి కూడా 90:10 నిష్పత్తిలో నిధులు ఇవ్వడానికి కేంద్రం అంగీకరించిందని, పారిశ్రామిక రాయితీలు పొందేందుకు కలిసికట్టుగా ప్రయత్నం చేద్దామని సూచించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలకు బీజేపీ నేతలు కట్టుబడి ఉండాలని కోరారు. ఈశాన్య రాష్ట్రాలకు కేంద్రమిస్తున్న రాయితీలన్నీ మన రాష్ట్రానికి ఇస్తే కమ్యూనిస్టు పార్టీలను కూడా తానే ఒప్పిస్తానని, ఆందోళన చేస్తున్న ప్రజలను ఒప్పించే బాధ్యత కూడా తనదేనన్నారు. కేంద్రం మన రాష్ట్రానికి 90:10 నిష్పత్తిలో నిధులతో పాటు ఈఏపీ ఇవ్వాలని, పారిశ్రామిక రాయితీలు కల్పించాలని తాను మొదట నుంచి చెబుతున్నానన్నారు.

ఇదండీ జోక్



...బీజేపీ నమ్మట్లేదని మరీ అన్యాయంగా మాట్లాడకండి సార్! అతను కూడా నమ్మట్లేదట!!

అగ్ని 'పరీక్ష'

- ఓ పక్క తండ్రి మరణం... మరో పక్క సంవత్సరాంత పరీక్షలు
- విషణ్ణవదనంతో పరీక్షలు రాసిన అక్క, తమ్ముడు



నవీన కళాశాలలో పరీక్ష రాస్తున్న మణికుమారి, పదో తరగతి పరీక్ష రాస్తున్న మందా రాజేష్

పిడుగురాళ్ల(గురజాల)/పులివెందుల టౌన్: పరీక్షకు సంబంధించిన ఆలోచనలు మనసులో తిరుగుతుండగా నిద్రలోకి జారుకున్న ఆ అక్క, తమ్ముడు తెల్లవారు జామున తమకు అండగా నిలిచే తండ్రి అనంతలోకాలకు చేరడంతో కన్నీటిపర్యంతమయ్యారు. అంతటి విషాదాన్ని గొంతులోనే దిగమింగుకుని పరీక్షలకు హాజరయ్యారు. ఈ సంఘటన గుంటూరు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పిడుగురాళ్ల పట్టణానికి చెందిన మందా బెంజిమన్ గురువారం తెల్లవారుజామున మరణించారు. ఆయన కుమార్తె మందా మణికుమారి స్థానిక స్కాలర్స్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. తండ్రి మరణించిన బాధను గుండెలోనే అదిమి పెట్టుకుని ఆమె వార్షిక పరీక్షకు హాజరైంది. మణికుమారి తమ్ముడు మందా రాజేష్ పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. స్కాలర్స్ కళాశాలలో పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక కన్నీటిపర్యంతమవుతూనే పదోతరగతి పరీక్షకు హాజరయ్యాడు. అక్కడి ఉపాధ్యాయులు, పెద్దలు ధైర్యం చెప్పడంతో పరీక్ష రాశాడు.

బాధను దిగమింగుతూ...

వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణంలోని వైఎస్ రాజారెడ్డి ఆసుపత్రిలో స్వీపర్‌గా పనిచేస్తున్న గడ్డం రాముడు(52) గురువారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతిచెందాడు. రాముడు రెండో కుమారుడు ఆదర్శ పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. తండ్రి మరణంతో తీవ్ర విషాదానికి గురైన ఆదర్శకి బంధువులు నచ్చజెప్పి పరీక్ష రాసిరమ్మని పంపించారు. బాధను దిగమింగి అతికష్టం మీద పరీక్ష రాసిన ఆదర్శ తిరిగి వస్తూనే తండ్రి మృతదేహంపై పడి బోరున విలపిస్తుంటే బంధువులంతా కన్నీటిపర్యంతమయ్యారు. ఇంటికి పెద్దదిక్కు మృతి చెందడంతో ఆ కుటుంబం శోక సముద్రంలో మునిగిపోయింది. రాముడు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

వైవీయూ సెట్ నోటిఫికేషన్ జారీ

వైవీయూ: వైఎస్సార్ జిల్లాలోని యోగివేమన విశ్వవిద్యాలయంలో ప్రవేశాల కోసం నిర్వహించనున్న వైవీయూ సెట్–2018 నోటిఫికేషన్‌ను వైస్ చాన్సలర్ ఆచార్య అత్తిపల్లి రామచంద్రారెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైవీయూలో ఆహ్లాదకరమైన వాతావరణం, అన్ని వసతులు ఉన్నాయని చెప్పారు. వైవీయూ ప్రవేశాల సంచాలకులు ఆచార్య టి. శ్రీనివాస్ మాట్లాడుతూ.. వైవీయూ పీజీ కళాశాల, అనుబంధ కళాశాలల్లో 32 కోర్సులకు సంబంధించి ప్రవేశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. అర్హత, ప్రవేశ పరీక్షలకు సంబంధించిన సిలబస్, తదితర అంశాలను www.yvudoa.in వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను మే 15వ తేదీలోగా వైవీయూకి పంపించాలని చెప్పారు.

ఫ్లోరైడ్ ప్రాంతాల్లో నీటి శుద్ధి ప్లాంట్లకు రూ. 21 కోట్లు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఆర్సెనిక్, ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాల్లో సామాజిక నీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటుకు రూ. 21 కోట్లు మంజూరు చేసినట్టు కేంద్ర తాగునీరు, పారిశుద్ధ్య శాఖ సహాయ మంత్రి ఎస్.ఎస్.అహ్లూవాలియా తెలిపారు. గురువారం ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు లోక్‌సభలో రాతపూర్వక సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో 421 ఆవాసాలను ఫ్లోరైడ్ ప్రభావితం చేస్తోందని తెలిపారు. 261 ఆవాసాల్లో ప్లాంట్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



కృష్ణపట్నం నౌకాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్టు

కృష్ణపట్నం నౌకాశ్రయంలో ఆధీకృత ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్టు 2018 ఫిబ్రవరి 8 నుంచి పనిచేస్తోందని కేంద్ర షిప్పింగ్ శాఖ మంత్రి మన్‌సుఖ్ ఎల్. మాండవీయ తెలిపారు. గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా సమాధానమిచ్చారు.



మోడల్స్	Hexa	Tiago	Tigor	Zest	Safari Storme
ఎక్స్-షోరూం ప్రారంభ ధర (లక్షలు)*	11.84	3.35	4.79	5.22	10.33
లాభాలు (వరకు)*	1,05,000	39,000	45,000	63,000	88,000


ఆర్టీసీ ఎండీగా సురేంద్రబాబు

హోంశాఖ ముఖ్యకార్యదర్శిగా అనురాధ కొనసాగింపు

సాక్షి, అమరావతి: ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎన్వీ సురేంద్రబాబు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీగా డీజీపీ మాలకొండయ్య వ్యవహరిస్తున్నారు. ఆయన డీజీపీగా ఈ ఏడాది జనవరి1వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి ప్రభుత్వం ఆర్టీసీ ఎండీగా ఎవ్వరినీ నియమించలేదు. మాలకొండయ్యే ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 1987 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సురేంద్రబాబు ప్రస్తుతం గ్రేహౌండ్స్ అండ్ ఆక్టోపస్ ఆపరేషన్స్ అదనపు డీజీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సురేంద్రబాబుకు డీజీపీగా హోదా కల్పిస్తూ, ఆర్టీసీ ఎండీగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న ఏఆర్ అనురాధను అదే పోస్టింగ్‌లో కొనసాగిస్తూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించినట్టు సీఎస్ దినేశ్ కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.







సాక్షి
శుక్రవారం, మార్చి, 23

మాధ్యమాల మాయాజాలం

ప్రపంచవ్యాప్తంగా 220 కోట్లమంది క్రియాశీల వినియోగదారులతో వెలిగిపోతూ ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చేసిన ఫేస్‌బుక్‌పై మరోసారి నీలినీడలు కమ్ముకున్నాయి. ఆ సామాజిక మాధ్యమంలో ఉన్న వినియోగదారుల వివరాలు, వారి ఇష్టాయిష్టాలు సంతలో సరుకులా మారాయని... బ్రిటన్ కేంద్రంగా పనిచేస్తున్న కేంబ్రిడ్జ్ అనలిటికా (సీఏ) సంస్థ వాటిని ఎడాపెడా ఉపయోగించుకున్నదని, పలు దేశాల్లోని రాజకీయ పక్షాలకు ఎన్నికల్లో వాటి ఆధారంగానే వ్యూహాలు రూపొందించిందని తాజాగా బయటపడింది. అంతేకాదు... మన దేశంలోని పార్టీలు కూడా ఆ మాదిరి సేవలను పొందుతున్నాయని సీఏకు భారతీయ భాగస్వామిగా ఉన్న ఒవలెనో బిజినెస్ ఇంటెలిజెన్స్(ఓబీఐ) తన వెబ్‌సైట్లో ప్రకటించింది. ప్రధాన రాజకీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, జేడీ(యూ) తమ క్లయింట్‌లుగా ఉన్నాయని తెలిపింది. మన దేశంలో ఫేస్‌బుక్ వినియోగదారులు అమెరికాతో పోల్చినా ఎక్కువే. ఇక్కడ 24 కోట్లకుపైగా క్రియాశీల వినియోగదారులున్నారు. కనుక ఎలాంటి అవాంఛనీయ పోకడలకు ఆస్కారమిచ్చినా వాటి పర్యవసానాలు ప్రమాదకరంగా మారతాయి.

ప్రజాస్వామ్యంలో ఎన్నికలనేవి అత్యంత కీలకమైనవి. ఎన్నికల ద్వారా ఓటర్లు తమ అభీష్టాన్ని వ్యక్తం చేస్తారని, ఆ రకంగా తమ భవిష్యత్తును తామే ఉమ్మడిగా నిర్దేశించుకుంటారని అంటారు. ఈ ప్రక్రియను ఏమార్చడానికి, ఇందులో కుల మత ప్రమేయాలనూ, ధన ప్రభావాన్ని జొప్పించి లాభపడటానికి చాన్నాళ్లుగా ప్రయత్నాలు సాగుతున్నాయి. కానీ ఆ ఓటర్లను వారి వారి వయసులరీత్యా, వారి అలవాట్లరీత్యా, వారి ఇష్టాయిష్టాలరీత్యా వర్గీకరించి సమాజంలో ఏ వర్గం ఏం కోరుకుంటున్నదో ఆనుపానులు తెలుసుకోవడంతోపాటు వారిని ప్రభావితం చేసేలా తప్పుడు సమాచారాన్ని వెదజల్లి ఓట్లు గుంజుకునే ప్రయత్నాలు ఈమధ్య కాలంలో ప్రారంభమయ్యాయి. కుల, మత, ధన ప్రభావాలైతే నేరుగా తెలిసిపోతాయి. అలాంటి తప్పుడు పనులపై చట్టం దృష్టి పడుతుంది. చర్యలు తీసుకోవడం సాధ్యమవుతుంది. దొరికితే అభాసుపాలవుతామన్న భయం పార్టీల్లో ఎంతో కొంతైనా ఉంటుంది. పైగా చాలామంది ఈ ప్రలోభాలకు దూరంగా ఉంటారు. తమ విచక్షణా జ్ఞానాన్ని ఉపయోగిస్తారు. కనుకనే మన ప్రజాస్వామ్య వ్యవస్థ కనీసం ఈ మాదిరిగా అయినా మిగిలింది. కానీ సామాజిక మాధ్యమాల ద్వారా మాయ చేసే వారికి ఈ బాదరబందీ ఉండదు. ఓటర్లు తప్పుడు సమాచారం ప్రభావంతో తమ ఇష్టాలను మలుచుకుంటారు. నిర్ణయాలు తీసుకుంటారు. కనీ సం తాము మాయలో పడ్డామని గ్రహించే ఎరుక కూడా వారికుండదు. అంతా తెలుసుకునేసరికి ఏమీ మిగలదు. అమెరికా పౌరులు అనుభవపూర్వకంగా ఆ సంగతి ఇప్పుడిప్పుడు గ్రహిస్తున్నారు. 2016 అధ్యక్ష ఎన్నికల్లో సీఏ సంస్థ డోనాల్డ్ ట్రంప్ కోసం ఎన్ని మాయలు చేసిందీ ఇప్పటికే కొంత బయటపడింది. ఆ విషయంలో అక్కడ దర్యాప్తు సాగుతోంది. అమెరికా ఎన్నికలు మాత్రమే కాదు... యూరప్ యూనియన్ (ఈయూ) నుంచి బయటికి రావాలని బ్రిటన్ పౌరులు దృఢంగా నిర్ణయించుకునేలా చేసింది కూడా సీఏ సంస్థే. పలు యూరప్ దేశాల్లోనూ దీని లీలలు బయటపడుతున్నాయి. బ్రెగ్జిట్ వ్యవహారంలో సీఏ పాత్రపై బ్రిటన్ విచారణ చేయిస్తోంది.

సామాజిక మాధ్యమాలవల్ల భావ వ్యక్తీకరణ విస్తృతి పెరిగింది. సామాన్యులు సైతం క్రియాశీలంగా వ్యవహరించేందుకు అవి వేదికలయ్యాయి. ఏ మూల ఏ అన్యాయం జరిగినా అది క్షణాల్లో సామాజిక మాధ్యమాలకెక్కుతోంది. ప్రభుత్వాలకది కంటగింపుగా మారింది. ఏదో ఒక చర్య తీసుకున్నట్టు కనిపించడానికి అవి తాపత్రయపడుతున్నాయి. అయితే ఇదే సమయంలో సీఏ లాంటి సంస్థలు సైతం తమ దొంగ వ్యవహారాలను చడీచప్పుడు లేకుండా కానిచ్చేందుకు ఆ మాధ్యమాలను దుర్వినియోగం చేస్తున్నాయి. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను భ్రష్టు పట్టిస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఒక పార్టీకి 'సమ్మతి'ని లేదా 'అసమ్మతి'ని సృష్టిస్తున్నాయి. ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలు తమలో చేరేవారికి కొన్ని ప్రశ్నలేసి జవాబులు రాబట్టి, వారి నుంచి కొన్ని అంశాలపై ఆమోదం తీసుకుని వినియోగదారులుగా చేర్చుకుంటాయి. ఇలా ఆమోదం ఇవ్వడం ద్వారా తామేం చేస్తున్నామో, అది దేనికి దారితీస్తుందో వినియోగదారులు గ్రహించలేక పోతున్నారు. ఆ మాధ్యమాల చేతుల్లో తెలియకుండానే మర మనుషులుగా మారుతున్నారు. సామాజిక మాధ్యమాలు రూపొందించే ఉపకరణాలు, అవి సేకరించే డేటా పౌరులపైనా, వారి ద్వారా మొత్తంగా ప్రజాస్వామ్యంపైనా ఎంతటి ప్రభావం చూపుతున్నాయో తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. డేటా చౌర్యాన్ని నిరోధించడానికి, వినియోగదారుల వ్యక్తిగత విషయాలు బయటకు పోకుండా ఉండటానికి రకరకాల ఫిల్టర్‌లను అందుబాటులోకి తెచ్చామని ఫేస్‌బుక్ చెబుతున్నా వాటిని నిరర్థకం చేసే ఉపకరణాలు కూడా ఆ వెంటనే తయారవుతున్నాయి.

సీఏ సంస్థ సీఈఓ అలెగ్జాండర్ నిక్స్ ఒక స్టింగ్ ఆపరేషన్‌లో దొరికిపోవడంతో ఇదంతా బట్టబయలైంది. ఆ సంగతలా ఉంచి ప్రజాస్వామ్యాన్ని 'కరి మింగిన వెలగపండు' మాదిరిగా మార్చే ఇలాంటి అనైతిక సంస్థల ప్రాపకాన్ని పొందడానికి ప్రధాన రాజకీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్‌లు వెంపర్లాడాయన్న వార్తలు దిగ్భ్రాంతికలిగిస్తాయి. ఈ పార్టీల నేతలు ఎవరికి వారు సచ్ఛీలురమని చెప్పుకోవడంతో పాటు ఎదుటివారిపై ఆరోపణలు చేస్తున్నారు. ఈ విషయంలో నిజానిజాలేమిటో రాగలరోజుల్లో నిర్ధారణవుతుంది. మన వినియోగదారుల వివరాలు దుర్వినియోగమైతే కఠినంగా వ్యవహరిస్తామని కేంద్ర ఐటీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ చెబుతున్నారు. మంచిదే. ఓటర్లను స్వీయ ఆలోచనల్లేని వ్యక్తులుగా, మరమనుషులుగా మార్చి పబ్బం గడుపుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నించినా, ఒక ప్రైవేటు సంస్థ ప్రయత్నించినా ఆ చర్య ప్రజాస్వామ్య వ్యవస్థను ధ్వంసం చేయడమే అవుతుంది. ఈ మాధ్యమాల మాయలో తాము పడకుండా ఉంటే, జాగ్రత్తగా వ్యవహరిస్తే అది తమకూ, ప్రజాస్వామ్యానికి కూడా క్షేమదాయకమని మన పాలకులు, ప్రధాన రాజకీయ పక్షాలు తెలుసుకోవాలి.




వ్యక్తికి సంబంధించిన సమస్త సమాచారం గోప్యంగా ఉండటం, ఉంచడమే నాగరికత పురోగతికి సంకేతం.

– అయాన్ ర్యాండ్
అమెరికన్ రచయిత్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు చైత్ర మాసం, తిథి శు.షష్ఠి ప.12.10 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం రోహిణి సా.5.07 వరకు, తదుపరి మృగశిర, వర్జ్యం ఉ.9.31 నుంచి 11.02 వరకు తిరిగి రా.10.21 నుంచి 11.53 వరకు, దుర్ముహూర్తం ఉ.8.29 నుంచి 9.17 వరకు, తదుపరి ప.12.30 నుంచి 1.19 వరకు.

సూర్యోదయం	: 6.06	12.00 వరకు
సూర్యాస్తమయం	: 6.07	యమగండం :
రాహుకాలం :		ప.3.00 నుంచి
ఉ.10.30 నుంచి		4.30 వరకు



నమాజ్ వేళలు

ఫజర్	5.06	మగ్రీబ్	6.28
జొహార్	12.23	ఇషా	7.40
అసర్	4.45		

ప్రజాగళం విచ్చుకొని పదేళ్లు



దిలీప్ రెడ్డి

తెలుగునాట జర్నలిజం వృత్తికి ఎనలేని గౌరవం తెస్తూ ఒక ప్రభంజనంలా మొదలైంది. మీడియా ఉద్యోగులు, ముఖ్యంగా జర్నలిజంలో ఉన్న వారి గౌరవాన్ని, జీతభత్యాల్ని, అవకాశాల్ని ఒక్కపెట్టున పెంచింది సాక్షి. ఈ విషయాల్లో పరిశ్రమ ఊహించని స్థాయి మార్పు సంతరించుకుందంటే అతిశయోక్తికాదు కదా, ప్రత్యర్థి కూడా కాదనలేని సత్యమిది. పత్రికల, పత్రికలు నిర్వహించే మీడియా సంస్థల ప్రవర్తనలోనే పెను మార్పులకు నాంది పలికింది. ఎన్నో ప్రజా ఉద్యమాలను అద్దమై ప్రతిబింబించింది.

సమకాలీనం



'వార్త అంటేనే, ఎవరో అణచివేయ జూసేదే. మిగిలిందంతా ఉత్తి వ్యాపార ప్రకటన. ఎజెండా ఏర్పాటుకే శక్తి కావాలి. మనం దేన్ని వెలుగులోకి తెస్తున్నాం, దేన్ని వెలుగులోకి రానీకుండా నిలిపివేస్తున్నామన్నదాంట్లోనే ఎంతో మతలబుంది!'అంటారు, అమెరికా మీడియా దిగ్గజం, రెండు దశాబ్దాల పాటు 'వాషింగ్టన్ పోస్ట్'ను నడిపిన క్యాథరీన గ్రాహమ్. నిజమే! మొత్తం సమాచార వ్యవస్థనే చెరపట్టిన గుత్తాదిపత్యంతో.... మేం చెప్పిందే వార్త, చేసిందే వ్యాఖ్య! చూపిందే చిత్రం, అల్లిందే కథ! అన్నట్టు కొన్ని మీడియా శక్తులు రాజకీయ గమనాన్ని, సమాజాన్ని శాసిస్తున్నపుడు తెలుగునాట ప్రజాస్వామ్యం పరిహాసం పాలయింది. అబద్ధాలకు నగిషీలు చెక్కి, నిజాలను నిలువునా పాతరేసి ఏకస్వామ్యం నడుస్తున్నపుడు జనహితం కోరే గొంతులకు స్థానం లేకుండా పోయింది. అప్పుడు.... నేనున్నానంటూ ఓ స్వరం గొంతు పెగుల్చుకుంది. గోదావరి ఉధృతితో పరవళ్లు తొక్కుతున్నపుడు ధవళేశ్వరం వద్ద ఏటికెదురీదే పొలసచేపలా వచ్చింది. సరిగ్గా దశాబ్దం కింద.. ఆ పొలికేక పెట్టింది వేరెవరో కాదు 'సాక్షి'. దిక్కులేని వారికి, దిగాలు పడ్డవారికి, అణచివేత వాతపడిన వారికి, ఆదరణ కోల్పోయిన వారికి... ఇలా సమాజంలో ఎందరెందరికో గొంతుకయింది. గుంపు గుంపు కొట్టుకుపోతుంటే, వేల సమూహాలు నోరు మెదిపే ధైర్యం, ఆస్కారం, అవకాశం లేని వేళ.. ఒక స్వరం పొలికేకై, మూగవోయిన కోటి గొంతులకు స్వరాన్ని, గుండె ధైర్యాన్ని, ఆత్మ నిబ్బరాన్నీ ఇచ్చిన కొత్త ఊపిరైంది. వ్యవస్థల్ని చెరబట్టిన వారు దుర్బుద్ధితో దాపెట్టిన నాణెపు రెండో పార్శ్వాన్ని సాక్షి ఆవిష్కరించింది. ప్రత్యామ్నాయ సమాచారానికి, అవసరానికి, అవకాశాలకు తానే వేదికయింది. సమాచారం సంకెళ్లు విప్పి, నిజాన్ని నిజంలా చెబుతామని సంకల్పం తీసుకొని నేటికి సరిగ్గా పదేళ్లయింది. ఈ పదేళ్ల ప్రస్థానంలో ఎన్నెన్నో ఆటుపోట్లు, మరెన్నో విజయాలు. సరళ సమాజంలోనే విజయాలంత తేలిగ్గా దక్కవు, అటువంటిది సంక్లిష్టమైన మన సమాజంలో అదంత తేలికయింది కాదు. సాక్షి విషయంలోనూ అదే జరిగింది. మొగ్గ దశ నుంచి సాక్షిని తుంచేసే యత్నాల్లో అనేక శక్తులు! ఇప్పటికీ నిరంతరంగా అటువంటి యత్నాలు సాగిస్తూనే ఉన్నాయి. నిన్నటికి నిన్న, అధికారంతో కళ్లు మూసుకుపోయిన పెద్దలు, 'ఇంకేముంది, సాక్షిని సీజ్ చేసినట్టే, అంటే ప్రభుత్వం గుప్పెట్లోకొచ్చేసింది, రేపో మాపో తీసేసుకొని సర్కారే నడిపిస్తుంద'ని గర్వాతిశయాన్ని చాటడం తెలిసిందే. అన్ని అణచివేతల్ని, దాష్టీకాల్ని సమర్థంగా ఎదుర్కొంటూ, అడుగడుగునా ఉద్యమిస్తూ, తనను తాను నిరూపించుకుంటూ తెలుగువారి గుండె చప్పుడుగా సాక్షి సాగిపోతూనే ఉంది. ఇదొక నిరంతర యజ్ఞం.

నిజం చెప్పే జనం పత్రిక

సాక్షి లేకుంటే ఎన్నో నిజాలు వెలుగు చూసేవి కావు. ఇది సర్వత్రా ఆమోదం ఉన్న వ్యాఖ్య. వారి వారి నేపథ్యాల్ని, సామాజిక పరిస్థితుల్ని బట్టి ఏ విషయంలో ఎవరికి ఏ భిన్నాభిప్రాయమున్నా, ఈ విషయాన్ని మాత్రం అందరూ అంగీకరిస్తారు. సాక్షి పుట్టాక ఏడాదిలోనే వచ్చిన 2009 ఎన్నికలప్పుడు ఇది మరింత స్పష్టంగా కనిపించింది. ఎన్నెన్ని విష ప్రచారాలు! లేనివి ఉన్నట్టు, ఉన్నవి లేనట్టు వండివార్చిన వార్తా కథనాల కనికట్టుతో మాయాజాలం చేయజూసింది పచ్చ మీడియా! అది అప్పటివరకు వారికున్న సహజ లక్షణం. పైగా ఎప్పుడూ వారది దాచింది లేదు. ఎన్నికలవడంతో రాజకీయ ప్రయోజనాల కోసం ఆ తత్వాన్ని అనేక రెట్లు పెంచి ఆచరించారు. దాన్ని సాక్షి సమర్థంగా ఎదుర్కొంది. జనం రోజువారీ జీవితంతో ముడివడి ఉన్న ప్రతి విషయంలోనూ వాస్తవం ఇది అని విడమర్చి చెప్పింది. 'ఇదీ! పనిగట్టుకొని కనుమరుగు చేస్తున్న వాస్తవం'అని సాక్ష్యాధారాలతో ప్రచురించి తన రాతలతో నిజాల్ని నిగ్గుతేల్చింది. జనాన్ని చైతన్య పరచింది. ముఖ్యంగా రాజకీయ వ్యవహారాలు, పరిణామాలకు సంబంధించిన విష ప్రచారాల తెర వెనుక భాగోతాల్ని ఎప్పటికప్పుడు ఎండగట్టింది. ఆ ఎన్నికల తర్వాత కొందరు సామాజిక వేత్తలు, రాజకీయ పరిశీలకుల వ్యాఖ్యల్ని విశ్లేషించినపుడు అప్పుడు సాక్షి నిర్వహించిన పాత్ర ఇట్టే బోధపడుతుంది. ఎన్నికల ఫలితాల తర్వాత 'అబ్బో! సాక్షి లేకుంటే....!'అని పలువురు వ్యక్తం చేసిన ఆందోళనలోనే సాక్షి సాధించిన విజయ గాథలు దాగి ఉన్నాయి. మార్చి 24, 2008 న సర్వసన్నాహాలతో సాక్షి మొదలయినప్పుడు, ముఖ్యమంత్రి హోదాలో ఆవిష్కరణ సభకు విచ్చేసిన డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఒక ఆశీర్వచనం ఇచ్చారు. కొత్తగా ఆరంభమైన దినపత్రిక సాక్షి నిజాన్ని నిజంలాగే వెల్లడించాలని ఆయన సూచించారు. ''...ఎలాంటి వక్రీకరణలూ వద్దు, ఇది ఆంధ్రప్రదేశ్ (నాటి ఉమ్మడి తెలుగు రాష్ట్రం) ఉజ్వల భవిష్యత్తుకు సాక్షిలా నిలబడాలి. ప్రతి తెలుగువాడూ సగర్వంగా చెప్పుకునేలా ఎదగాలి''అని అభిలషించారాయన. అదే జరుగుతూ వచ్చింది. ఆయన ఆశయాల పునాదులపై ఎదిగిన, ఎదుగుతున్న సౌధమిది!

నిరంతర ప్రయోగం

సాక్షి ఓ దినపత్రికగా ఆరంభం నుంచే చాలా ప్రయోగాలు చేసింది. పాఠకుల అభిరుచి, ఆసక్తి, అవసరాలే ప్రాతిపదికగా ఆ పరంపర కొనసాగిస్తూనే ఉంది. 19 నగరాల్లో ప్రింటింగ్, 23 ఎడిషన్లతో ప్రారంభమే ఒక గొప్ప ప్రయోగం! తెలుగునాట జర్నలిజం వృత్తికి ఎనలేని గౌరవం తెస్తూ ఒక ప్రభంజనంలా మొదలైంది. మీడియా ఉద్యోగులు, ముఖ్యంగా జర్నలిజంలో ఉన్న వారి గౌరవాన్ని, జీతభత్యాల్ని, అవకాశాల్ని ఒక్కపెట్టున పెంచింది సాక్షి. ఈ విషయాల్లో పరిశ్రమ ఊహించని స్థాయి మార్పు సంతరించుకుందంటే అతిశయోక్తికాదు కదా, ప్రత్యర్థి కూడా కాదనలేని సత్యమిది! పత్రికల, పత్రికలు నిర్వహించే మీడియా సంస్థల ప్రవర్తనలోనే పెను మార్పులకు నాంది పలికింది. మానవసంబంధాల మూల స్తంభమైన కుటుంబాన్ని ఆలంబన చేస్తూ 'ఫ్యామిలీ'ని విలువల గీటురాయి చేసింది. ఇంటిల్లిపాదినీ పత్రికకు పాఠకుల్ని చేసింది. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల ప్రపంచాన్ని అరచేతికి చేర్చి యువతరం 'భవిత'కు ఆశాసౌధాలు కట్టింది. కార్పొరేట్లకు ఎర్రతివాచీలు పరచి వ్యవసాయం దండగ అన్న దుర్నీతి పాలకుల పన్నాగాల్ని ఎండగడుతూ, అన్నం పెట్టే రైతన్నకు 'సాగుబడి'పాఠాలు చెప్పింది. ప్రకృతి వ్యవసాయాన్ని పొత్తిళ్లలో పెట్టి ప్రోత్సహించింది. 'ఇంటిపంట'ను ఆర్థిక–ఆరోగ్య మంత్రం చేసింది. మహిళా సాధికారతకు పట్టం గట్టింది. ప్రాంతీయ వార్తలతో పాటు జాతీయ-అంతర్జాతీయ వార్తలకు ప్రాధాన్యం తెచ్చింది. క్రీడలు, వాణిజ్యం, సాహిత్యం, తదితర రంగాలన్నిటా కొత్త పుంతలతో పాఠకుల్ని సరికొత్త తీరాలకు చేర్చింది. వార్తా కథనాల్లోని అంశాలకు కారకులయ్యే, ప్రభావితులయ్యే వారి అభిప్రాయాలకూ ఎక్కడికక్కడే స్థానం కల్పించే సంస్కృతిని విస్తృత పరచింది. మీడియా బాధ్యత-జవాబుదారీతనాన్ని మరింత పెంచింది. ''...లుప్తమయిపోతున్న పత్రికా సత్సంప్రదాయాలూ, కొనప్రాణంతో ఉన్న వార్తా సంస్కృతీ 'సాక్షి'ద్వారా మళ్లీ జవజీవాలు పుంజుకుంటాయని మీరు నిశ్చయంగా ఆశించవచ్చు'' అని సాక్షి వ్యవస్థాపక అధ్యక్షుడిగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తొలి ప్రతిపై సంతకంతో ఇచ్చిన భరోసా ఇప్పటికీ, ఎప్పటికీ తెలుగువారికి లభిస్తూనే ఉంటుంది.

మొక్కవోని దీక్ష

ప్రజా సమస్య ఏదైనా నిర్భీతితో స్పందించి, నివేదించడం సాక్షి ప్రాథమిక లక్షణం. రాజకీయ కల్లోల పరిస్థితుల్లో కూడా ఈ నియతిని వీడలేదు. పత్రిక పుట్టిన తొలిరోజు ప్రతిలోనే ప్రకటించుకున్నట్టు ''.... అభిప్రాయాలు కలిగి ఉండే హక్కు అందరికీ ఉంటుందని మేము పూర్తిగా నమ్ముతాము. ఇతరుల అభిప్రాయాలతో విభేదించే హక్కును కూడా మేం గౌరవిస్తాం. ఒక వార్తా పత్రికగా మేము ప్రజాస్వామ్య బద్ధులం కాబట్టి, రాజ్యాంగ బద్ధులం కనుక, సెక్యులరిస్టు భావజాలం కలిగివున్న కారణాన వాటికి విరుద్ధంగా ఉన్న శక్తులను తప్పనిసరిగా వ్యతిరేకిస్తాం. అయితే వ్యతిరేకిస్తున్నాం కాబట్టి సత్యాలను చిత్రవధ చేయబోము. వార్తలను వక్రీకరించే పాడు పనికి ఒడికట్టబోమని పాఠకలోకానికి హామీ ఇస్తున్నాము''అన్న సంకల్పం సాక్షికి నేటికీ, ఎప్పటికీ శిరోధార్యమే! ఆ హామీని నిలబెట్టుకునే ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. అధికారంలో ఉన్నవాళ్లు, రాజకీయ ప్రత్యర్థులు కుమ్మక్కై సాక్షిని అడ్డదారుల్లో అణగదొక్కినపుడు కూడా పట్టు సడలనీయలేదు. పాత్రికేయ విలువలను వీడలేదు. సంబంధమే లేని వ్యవహారాన్ని అంటగట్టి పత్రికా కార్యాలయంలో సోదాలు చేసినపుడు, అకౌంట్లు స్తంభింపజేసినపుడు కించిత్ వెరవలేదు. సాక్షి ఉద్యోగులందరు కూడా ఒక్కతాటిపై నిలిచి సంఘీభావం ప్రకటించారు. సర్కారుకో, నచ్చిన రాజకీయ శక్తులకో కొమ్ముకాసే పచ్చ మీడియా 'ఇక సాక్షి పని అయిపోయింది..'ని విష ప్రచారం చేసినా, ఒక్కరంటే ఒక్క ఉద్యోగి కూడా ఆ భయంతో సాక్షిని వీడలేదు. ఇన్ని ఆర్థిక ఇబ్బందుల నడుమ కూడా ఉద్యోగుల జీతం డబ్బుల్ని ఏ నెలా యాజమాన్యం ఒక్క రోజు ఆలస్యం కానీలేదు. కుట్ర పన్నిన ప్రత్యర్థి పాలకశక్తులు ప్రత్యక్ష-పరోక్ష పద్ధతుల్లో పత్రికాస్వేచ్ఛను కాలరాయ జూసినపుడు సాక్షి పరివారమంతా ఉద్యమమై ఉవ్వెత్తున ఎగిసింది. ఎన్నో ప్రజా ఉద్యమాలను అద్దమై ప్రతిబింబించింది.

ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా...

ఎన్నెన్నో ప్రతికూల పరిస్థితుల మధ్య కూడా ఏది జనహితమని భావిస్తే ఆ సమాచారాన్ని అన్ని కోణాల్లో స్పృశించి, సమర్పించింది. రాష్ట్ర విభజన తర్వాత అనేకానేక ప్రజాహిత అంశాల్లో పిల్లిమొగ్గలు వేస్తూ పాలకపక్షాలు చేసిన దాష్టీకాలన్నింటినీ పరిశోధనాత్మక కథనాలతో జనం ముందు పరిచింది. పచ్చని పంటపొలాల్లో చిచ్చు పెట్టి జరిపిన భూసేకరణ-సమీకరణైనా, రాజధాని పేరిట రంగుల చిత్రం చూపుతూ సర్కారే ఓ పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఒడిగట్టినా, కనికట్టుతో భ్రమలు కల్పించిన పట్టిసీమ దోపిడీ అయినా, స్వప్రయోజనాల కోసం 'ప్రత్యేక హోదా'ను పణంగా పెట్టి రాజకీయావసరాల కోసం నాలుకను నాలుగు వంకర్లు తిప్పినా.... విశ్వసించదగ్గ సాక్ష్యాధారాలతోనే వార్తా కథనాల్ని ప్రచురించింది. తొలిరోజు సంకల్పంలో చెప్పినట్టు, ''.... మేము కచ్చితంగా ప్రజాహితమైన అంశాన్నే ఎంచుకొని దాన్ని నిర్మొహమాటంగా సమర్థిస్తాము... ప్రజల మనస్సాక్షిగా వ్యవహరిస్తూ మొత్తం సమాజంలో జరిగే సకల కార్యకలాపాలనూ ప్రజాకోటికి యథాతథంగా, ఉన్నది ఉన్నట్టు నివేదిస్తాం''అన్నదే సాక్షి అక్షరాలా పాటిస్తోంది. అందుకే ప్రజాదరణ చూరగొంది. ఇది వందేళ్లకు పైబడి నడిచే పత్రికగా నిలదొక్కుకోవాలని ప్రస్తుత చైర్‌పర్సన్ వై.ఎస్.భారతీరెడ్డి వ్యక్తం చేసిన అభిలాషకు దన్నుగా ఈ దశాబ్ది ప్రస్థానం ఓ బలమైన ముందడుగు.

ఈ–మెయిల్ : dileepreddy@sakshi.com

ప్రజా వ్యతిరేక బాటలో తపాలా

వేలాది కేసుల్లో సరిగ్గా సమాధానం ఇవ్వకుండా తమ ఖాతాదారులనే ఏడిపించడంలో తపాలా అధికారులు వారికి వారే సాటి. వారిని ఉద్యోగులనీ, ప్రజాసేవకులనీ, పబ్లిక్ సర్వెంట్‌లనీ అనడం పొరబాటవుతుంది.


విశ్లేషణ



మాడభూషి శ్రీధర్

రమణీ మోహన్ ఘోష్, ప్రొఫెసర్ కమలా ఘోష్ భార్యాభర్తలు. వారికి ఒక్కతే కూతురు– సంఘమిత్రా ముఖర్జీ. ఆ దంపతులు, తాము పొదుపుచేసిన సొమ్ము పోస్టాఫీసులోని వివిధ పథకాల్లో దాచుకున్నారు. నెలవారీ పొదుపు పథకం, రికరింగ్ డిపాజిట్, జాతీయ పొదుపు పత్రాలు, ఇతర ఖాతాల్లో డబ్బు పెట్టుబడి పెట్టుకున్నారు. వారు వృద్ధాప్యంలో మరణించారు. వారి పెట్టుబడులకు నామినీగా సంఘమిత్ర పేరునే పెట్టారు. ఆమె ఒక్కతే వారికి వారసురాలు. వారి మరణ ధృవపత్రాన్ని సమర్పించి ఆ డబ్బును తనకు ఇవ్వాలని ఆమె పోస్టాఫీసు చుట్టూ తిరుగుతూనే ఉంది. కనీసం వంద సార్లు. ''నా ఇంటిముందే పోస్టాఫీసు ఉంది. ప్రతిసారీ మళ్లీ రమ్మంటున్నారు. లేదా నన్ను గంటల కొద్దీ ఎదురుచూసేట్టు చేస్తున్నారు. కాగితాలు వెదుకుతున్నట్టు నటిస్తున్నారు. తర్వాత రమ్మంటున్నారు. ఏడిపిస్తున్నారు. ఇంకా ఏవేవో వివరాలు ఇమ్మంటున్నారు. నా దగ్గర ఉన్న వివరాలన్నీ ఇచ్చాను. ఒక్కపైసా కూడా ఇవ్వలేదు''. అని ఆమె వాపోయారు. ఆమె భర్త కూడా చనిపోయారు. ఆరోగ్యం కూడా సహకరించడంలేదని దీనంగా వివరించారు.

ఆమె ఆర్టీఐని ఆశ్రయించి తన తల్లిదండ్రుల అకౌంట్ వివరాలు ఇవ్వాలని వాటి ధృవప్రతులు ఇవ్వాలని, ఆ డబ్బు తీసుకోవడానికి ప్రక్రియ ఏమిటో తెలియజేయాలని అడిగారు. దానికి కూడా మీరే వివరాలు ఇవ్వాలని అంటూ వారు తిరస్కరించారు. ఈ నిర్ణయాన్ని మొదటి అప్పీలు అధికారి కూడా సమర్థించారు.



ఆమె విధిలేక కమిషన్ ముందు రెండో అప్పీలు దాఖలు చేశారు. డిసెంబర్ 2016 లో వేసిన రెండో అప్పీలు సమాచార కమిషన్ ముందుకు మార్చి 13న వచ్చింది. పోస్టాఫీసులో పీఐఓలు సమాచారం ఇవ్వకపోవడం వల్ల వేలాది కేసులు రెండో అప్పీళ్లుగా చేరుకుంటున్నాయి.

వేలాది కేసుల్లో సరిగ్గా సమాధానం ఇవ్వకుండా తమ ఖాతాదారులనే ఏడిపించడంలో తపాలా అధికారులు వారికి వారే సాటి. వారిని ఉద్యోగులనీ, ప్రజాసేవకులనీ, పబ్లిక్ సర్వెంట్‌లనీ అనడం పొరబాటవుతుంది. వారిని మహాఘనత వహించిన తపాలా రాజ్య చక్రవర్తులనీ, ప్రభువులనీ, ఏలిన వారనీ సంబోధించాలి. వారు దయఉంటే అడిగిన సమాచారం ఇస్తారు. వారు కరుణిస్తే తపాలా సేవలు అందించి మీడబ్బు మీరు ఖాతాల నుంచి తీసుకోవడానికి సహాయం చేస్తారు. లేదా కొంత వాటా ఇచ్చుకోవాలి. కనీసం విచారణ నోటీసు వచ్చిన తరువాత కూడా పోస్టాఫీసు అధికారుల వైఖరి మారలేదు. మొండిగా పాత వాదనలే వినిపించారు. మొత్తానికి ఆమె డబ్బు ఆమెకు ఇవ్వకుండా ఆలస్యం చేస్తున్నారు. సహాయ సూపరింటెండెంట్ సంజయ్ బిస్వాస్ ఏ సహాయమూ చేయలేదు. సీపీఐఓ దీనానాథ్ ప్రసాద్ ఆమెకు ఏ విధంగా సమాచారం నిరాకరించారో బిస్వాస్ వివరిస్తూ ఆమెకు చట్టపరంగా సమాచారం ఇవ్వడానికి వీల్లేదని సుదీర్ఘంగా వాదించారు. ఈ వ్యవహారంలో అపరాధులైన అధికారులెవరో కనిపెట్టి ఉన్నతాధికారులు శిక్షించవలసిన అవసరం ఉంది.

తపాలాకార్యాలయం బాధ్యతల్లో వినియోగదారులకు సేవచేయడం ప్రధానమైంది. మొత్తం అధికారులకు ఉద్యోగులకు వేతనాలు అందేది ఈ వినియోగదారుల డబ్బు డిపాజిట్‌ల వల్ల వచ్చే వడ్డీ సొమ్ముతోనే. సంఘమిత్ర తల్లిదండ్రుల వంటి మదుపుదార్లు డిపాజిట్ చేసిన డబ్బుకు తపాలాశాఖ ధర్మకర్తగా వ్యవహరించాలి. ఆ డబ్బు తమ దగ్గర డిపాజిట్ రూపంలో ఉండటం వల్ల వచ్చే వడ్డీని స్వీకరించి ఆ డబ్బు చెందవలసిన వారసులకు అడిగినప్పుడు ఇప్పించవలసిన బాధ్యత కలిగిన ధర్మకర్త తపాలా శాఖ అనే విషయం పూర్తిగా మరిచిపోయారు. వారసురాలిని వేధించి వెడలగొట్టి ఆ డబ్బును కాజేయాలనుకుంటున్నారనే అనుమానం వస్తున్నది. ఈ విధంగా వ్యవహరించడం ధర్మకర్తృత్వ బాధ్యతను భంగపరచడమే అవుతుంది.

డిపాజిట్ డబ్బును నియమాలను అనుసరించి తిరిగి వారసులకు ఇవ్వడం వారి బాధ్యత అని కాంట్రాక్టు చట్టం నిర్దేశిస్తుంది. ఆ ఒప్పందం ఉల్లంఘనకు పరిహారం చెల్లించవలసిన బాధ్యత కూడా ఉంటుంది. ఇది కాకుండా తపాలాశాఖ సొంత ప్రయోజనాల దృష్ట్యా కూడా వినియోగదారుడి పట్ల బాధ్యతగా వ్యవహరించాలి. ఇవన్నీ మరిచిపోయింది తపాలాశాఖ. పైగా ఆర్టీఐ దరఖాస్తును కూడా అసంబంధ్ధ కారణాలతో తపాలా వారు తిరస్కరించారు.

సంఘమిత్ర కోరిన సమాచారం మొత్తం ఇవ్వాలని, వాటికి సంబంధించిన అన్ని పత్రాలు ధృవీకరించి ఉచితంగా ఇవ్వాలని కమిషన్ ఆదేశించింది. ఆమె దరఖాస్తులో వ్యక్తమైన ఫిర్యాదును గుర్తించి, జరిగిన అన్యాయాన్ని సరిచేయాలని కూడా ఆదేశించింది. సమాచారం ఇవ్వకుండా వేధించినందుకు ఎందుకు నష్టపరిహారం ఇవ్వకూడదో చెప్పాలని, గరిష్ట జరిమానా ఎందుకు విధించకూడదో చెప్పాలని సీపీఐఓ దీనానాథ్ ప్రసాద్‌ను కమిషన్ ఆదేశించింది. (సంఘమిత్ర ముఖర్జీ వర్సెస్ పీఐఓ తపాలాశాఖ, CIC/POSTS/A/2017/10 0006 కేసులో 16 మార్చి 2018న ఇచ్చిన తీర్పు ఆధారంగా).

వ్యాసకర్త కేంద్ర సమాచార కమిషనర్
professorsridhar@gmail.com

సుదర్శన చక్రం



శ్రీమన్నారాయణుడి సుగుణ రూపం స్మరించుకొంటే మనో ఫలకంలో కనిపించేది శంఖ చక్రాలు ధరించిన చతుర్భుజ విగ్రహం. హరి పూరించే శంఖానికి పాంచజన్యం అని పేరు. హరి ధరించే చక్రాయుధం సుదర్శన చక్రం. వైష్ణవ భాగవతులకు సుదర్శన చక్రం కేవలం ఒక చక్రమూ, ఆయుధమూ కాదు. అది చక్రరూపంలో ఉన్న భగవానుడే. సుదర్శన చక్రాన్ని శివుడు శ్రీహరికి కానుక చేశాడని ఒక పురాణ కథ కనిపిస్తుంది. సూర్యుడి అపరిమితమైన తేజస్సువల్ల ఆయన భార్య సంధ్యా దేవికి కలుగుతున్న అసౌకర్యాన్ని తొలగించేందుకు దేవశిల్పి మయుడు సూర్య తేజస్సును కొంత తగ్గించేందుకు సహాయం చేశాడనీ, ఆ తరుగు తేజస్సుతో ఆయన నిర్మించిన వస్తువులలో సుదర్శన చక్రం ఒకటి అనీ పురాణ కథ.

జ్యోతిర్మయం

ఖాండవ వనాన్ని యథేచ్ఛగా దహించి భుజించుకొమ్మని కృష్ణా ర్జునులు అగ్నిదేవుడికి అభయం ఇచ్చిన సందర్భంలో, అగ్నిదేవుడు ఈ సుదర్శన చక్రాన్ని కృతజ్ఞతాపూర్వకంగా బహూకరించాడని మహాభారతం ఆది పర్వంలో ఒక ఉపాఖ్యానం చెప్తుంది. తనకు వరసకు మేనత్త కొడుకూ, చేది రాజు అయిన శిశుపాలుడు రాజసభలో తనను నిష్కారణంగా నిందిస్తుంటే, నూరు అపరాధాలు దాటే దాకా వేచి ఉన్న శ్రీకృష్ణుడు, తన సుదర్శనం ప్రయోగించి, అక్కడికక్కడే అతగాడి శిరస్సు ఖండించాడని సభాపర్వంలో కనిపిస్తుంది. భాగవత పురాణంలో, కరిని మకరి నుండి రక్షించి గజేంద్రమోక్షం కలిగించటానికి హరి వాడిన ఆయుధం సుదర్శనమే.

తిరుమల క్షేత్రంలో స్వామివారి చక్రాయుధం స్వామికి కుడిభుజంగా, ఆయన కుడిభుజం మీద దర్శనమిస్తుంది. తిరుమలకు వెళ్లే యాత్రికులను, ఇల్లు వదిలినప్పట్నుంచీ యాత్ర ముగించుకుని మళ్లీ ఇల్లు చేరేవరకూ సురక్షితంగా ఉంచే బాధ్యత సుదర్శన చక్రం నిర్వహిస్తుందట. బ్రహ్మోత్సవాలు జరిగే రోజులలో సుదర్శనుడి ఉత్సవమూర్తి ఊరేగి, ఏర్పాట్లన్నీ పర్య వేక్షించి, స్వామివారు రాబోతున్నారని బహుపరా కులూ, హెచ్చరికలూ వినిపించటం ఆనవాయితీ.

ఈ సేవలన్నింటికీ గుర్తింపుగా, బ్రహ్మోత్సవాల ముగింపు సమయంలో, వరాహస్వామి ఆలయ ప్రాంగణంలో తనకు జరిగే పన్నీటి స్నానాలకు, స్వామి సుదర్శనుడిని ప్రత్యేకంగా పిలిపించి, తనతోపాటు అభిషేకాలు జరిపిస్తారు. ఆ తరువాత, సుదర్శన చక్రత్తాళ్వారుకు మాత్రం స్వామి పుష్కరిణిలో స్నానం చేయిస్తారు. ఆ పుణ్య సమ యంలో దేవతాగణాలు కూడా ఆ పుష్కరిణిలోనే స్నానం చేసి పునీతమవుతాయట. చక్రస్నానవేళ, వేలాది భక్తులు కూడా పుష్కరిణిలో స్నానంచేసి ధన్యులవుతారు.

– ఎం. మారుతి శాస్త్రి

జాతి గుండెల్లో చెరగని స్మృతి

అది 1919 సంవత్సరం ఏప్రిల్ 13వ తేదీ. అమృత్‌సర్‌లోని జలియన్‌వాలాబాగ్‌లో 20వేల మందికిపైగా జనం గుమికూడి ఉన్నారు. వైశాఖి మేళా జరుపుకోవడానికి వాళ్లంతా గుమిగూడి ఉన్నప్పుడు జనరల్ డయ్యర్ అనే ఆంగ్లేయ అధికారి ఉత్తర్వు ప్రకారం ముందస్తు హెచ్చరికలు లేకుండా జరిపిన కాల్పుల్లో వందలాది మంది చనిపోయారు. ఆ మరునాడు, లాహోర్‌లో ఒక పన్నెండేళ్ల కుర్రవాడు బడికి వెళుతున్నానని చెప్పి, ఇంట్లోంచి బయటికి వెళ్లి తిన్నగా రైల్వేస్టేషన్‌కు వెళ్లి అమృత్‌సర్ రైలు ఎక్కాడు. ఆ కుర్రవాడు జలియన్‌వాలాబాగ్‌లోకి వెళ్లాడు. ఆ ప్రాంతంలో రక్తంలో తడిసిన మట్టిని తీసుకొని, బ్రిటీషు పాలకులపై ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేశాడు. ఆ పసిబాలుడే భగత్‌సింగ్. ఎనిమిదేళ్ల తర్వాత సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా లాహోర్‌లో జరిగిన ప్రదర్శనకు లాలా లజపతి రాయ్ నాయకత్వం వహించారు. పోలీసులు విరుచుకుపడి లాలా లజపతిరాయ్‌ని తీవ్రంగా కొట్టి చంపారు. ఆ ఘటన భగత్‌సింగ్‌ను పూర్తిగా కుదిపేసింది. దానికి ప్రతీకారం తీసుకోవాలని భావించాడు. దాని ప్రకారం భగత్‌సింగ్, రాజ్‌గురులు కలిసి మోటార్ సైకిల్‌పై వెళుతున్న సాండర్స్ అనే బ్రిటిష్ అధికారిని కాల్చి చంపారు. భారతీయులకు నిజమైన ప్రజాస్వామిక జీవితం కావాలని ఆనాడు ఢిల్లీ శాసన సభలో బాంబులు వేసి తమ నిరసనను వ్యక్తం చేశాడు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను చివరికి పట్టుకొని 1931 మార్చి 23న ఉరి తీశారు. 24 సంవత్సరాల నిండు యవ్వనంలో చిరునవ్వు నవ్వుతూ ఉరికంబం ఎక్కిన భగత్‌సింగ్ భరతమాత ముద్దుబిడ్డ. నేటి యువతరానికి ఆదర్శం. ఎంతోమంది విప్లవకారుల జీవితాలకు నిదర్శనంగా, ఆదర్శంగా ఉంది. 'ఇంక్విలాబ్ జిందాబాద్', 'విప్లవం వర్ధిల్లాలి' అని భగత్‌సింగ్ ఇచ్చిన నినాదం ఈరోజు దేశవ్యాప్తంగా మారుమోగుతుంది.



(నేడు భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా)

– చకిలం సోమేశ్వరరావు, విజయవాడ

తీవ్ర విషాదం


ఇన్ బాక్స్

ఇరాక్‌లో మోసుల్ పట్టణంలో ఐసిస్ తీవ్రవాదుల బందీలుగా ఉన్న 39 మంది అమాయక భారతీయులు ఊచకోతకు గురికాబడ్డారని తెలియరావడం జాతీయ విషాదం. భారత్ నుండి పొట్ట చేత బట్టుకొని ఆ పట్టణం చేరిన అభాగ్యులు 2014లో ఉగ్రవాదుల పాలబడ్డారని తెలిసినా, క్షేమంగానే ఉంటారన్న ఆశ ఇంతవరకూ ఉంది. అయితే కరుడు గట్టిన ముష్కరులకు ప్రాణం తియ్యడం తప్ప మరోటి చేతగాదని ఈ ఊచకోత ద్వారా మరోసారి నిరూపితమైంది. అభాగ్యుల కుటుంబాలకు ప్రభుత్వం, పౌరసమాజం అండగా నిలబడాల్సిన సమయమిది. 'తమ వారి మరణ వార్తని తెలియబర్చడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసిందని' వారి బంధువులు ఆక్షేపించడంలో తప్పు లేదు. దుర్వార్త తెలిసిన షాక్‌లో ఆవేదన చెందడం అర్థం చేసుకోదగ్గది. ఇంతటి పెను విషాదాన్ని మానవత్వపు కోణంలో తప్ప మరే కోణంలోనూ చూడరాదు.

– డా. డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం.

ఓబీసీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ యథాతథం

వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం



సాక్షి, అమరావతి: ఓబీసీ రిజర్వేషన్ల అమలులో క్రీమీలేయర్ నిబంధనలను ఎత్తివేసే ఆలోచన లేదని కేంద్ర మంత్రి కృష్ణపాల్ గుర్జర్ స్పష్టం చేశారు. ఓబీసీ క్రీమీలేయర్ వార్షిక ఆదాయ పరిమితిని రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షలకు పెంచాలని జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ సిఫార్సు చేసిందా? అని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు గురువారం రాజ్యసభలో కేంద్ర మంత్రి జవాబిచ్చారు. ఓబీసీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ నిర్ధారణ కోసం వినియోగదారుల ధరల సూచీని ప్రాతిపదికగా చేసుకుని 2013లో ఎలాగైతే ఆదాయ పరిమితిని రూ.6 లక్షలుగా నిర్ణయించారో.. అదే ప్రాతిపదికన ప్రస్తుత ఆదాయ పరిమితిని రూ.8 లక్షలకు పెంచినట్లు మంత్రి పేర్కొన్నారు. క్రీమీలేయర్ నిబంధనను తొలగించాలని ఓబీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని మంత్రి చెప్పారు. అయితే ఇందిరా సహానీ వర్సెస్ భారత ప్రభుత్వం మధ్య నడిచిన కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగానే క్రీమీలేయర్ విధానం అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. కాగా, అభయారణ్యాల్లో నివసించే ఆదివాసీలు, ఇతర అరణ్యవాసుల వివరాలేవీ కేంద్ర ప్రభుత్వం వద్ద అందుబాటులో లేవని కేంద్ర మంత్రి సుదర్శన్ భగత్ వెల్లడించారు. ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు గురువారం రాజ్యసభలో మంత్రి ఈ మేరకు జవాబిచ్చారు. అటవీ హక్కుల చట్టానికి విరుద్ధంగా ఆదివాసీలను బలవంతంగా అడవుల నుంచి తరిమేస్తున్న కేసులు ఏమైనా కేంద్రం దృష్టికి వచ్చాయా? అని ప్రశ్నించగా.. ఇప్పటివరకూ ఇలాంటి సమాచారం తమ దృష్టికి రాలేదని మంత్రి చెప్పారు.

29 నుంచి శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు

29, 31వ తేదీ వరకు పలు ఆర్జిత సేవలు రద్దు



సాక్షి, తిరుమల: తిరుమలలో ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలను నిర్వహించనున్నారు. ఆలయానికి నైరుతి దిశలోని వసంత మండపంలో చైత్రశుద్ధ త్రయోదశి మొదలు.. చైత్ర పూర్ణిమ వరకు మూడ్రోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహించటం సంప్రదాయం. తొలిరోజు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, శాస్త్రోక్త పూజలు నిర్వహిస్తారు. రెండోరోజు ఉదయం 8.00 నుంచి 9.00 గంటల మధ్య మలప్పస్వామివారు ఉభయ దేవేరులతో కలసి స్వర్ణరథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించనున్నారు. చివరి రోజు మలయప్పస్వామితోపాటు సీతారామ, లక్ష్మణ, ఆంజనేయుడు, రుక్మిణీ సమేత శ్రీ కృష్ణస్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవమూర్తులకు వట్టివేరు, కురులతో చేసిన అలంకరణలు, వసంతమంటపానికి ప్రకృతిని తలపించేలా సహజసిద్ధమైన అలంకరణలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 29వ తేదీన తిరుప్పావడసేవ, 30న తోమాల, అర్చన, నిజపాద దర్శన సేవలు రద్దు చేశారు. అలాగే సాలకట్ల వసంతోత్సవాలు జరిగే మూడ్రోజులపాటు కల్యాణోత్సవం, వసంతోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకారణ సేవలను కూడా టీటీడీ రద్దు చేసింది.

రాజకీయాల్లోకి ఐపీఎస్ లక్ష్మీనారాయణ!

- స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన సీబీఐ మాజీ జేడీ
- బీజేపీలో చేరవచ్చని భావిస్తున్న తోటి అధికారులు
- జనసేనలోకి వస్తాడని కొందరు.. కొత్త పార్టీ అంటున్న మరికొందరు..




సాక్షి, హైదరాబాద్: సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్, మహారాష్ట్ర అదనపు డీజీపీ లక్ష్మీనారాయణ రాజకీయాల్లోకి రాబోతున్నారా..? ఇందుకోసం తన ఉద్యోగం నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్‌ఎస్) చేయనున్నారా..? ఈ ప్రశ్నలకు ఔననే సమాధానాలే వస్తున్నాయి. లక్ష్మీనారాయణ స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకునేందుకు గురువారం మహారాష్ట్ర డీజీపీ నుంచి అనుమతి పొందినట్టు తెలిసింది. ఆయన తన పదవీ విరమణ లేఖను ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కూడా అందజేసినట్టు లక్ష్మీనారాయణ సన్నిహితులు చెబుతున్నారు. త్వరలోనే రాజకీయాల్లోకి వస్తారని పేర్కొంటున్నారు.

మహారాష్ట్ర కేడర్ నుంచి: ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు చెందిన లక్ష్మీనారాయణ 1990లో ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. మహారాష్ట్ర కేడర్‌కు చెందిన ఆయన ఆ రాష్ట్రంలో యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ ఎస్పీగా, సీబీఐ హైదరాబాద్ రేంజ్ జాయింట్ డైరెక్టర్‌గా, థానే జాయింట్ కమిషనర్‌గా పనిచేశారు. ప్రస్తుతం పదోన్నతి పొంది మహారాష్ట్ర పోలీసు శాఖ అదనపు డీజీపీగా పనిచేస్తున్నారు. తాజాగా ఈ హోదాలో వీఆర్‌ఎస్ తీసుకుంటున్నారు. అటు మహారాష్ట్ర కేడర్‌తోపాటు ఇటు ఏపీ, తెలంగాణ క్యాడర్లలో ఉన్న ఐపీఎస్‌లలో జరుగుతున్న చర్చను బట్టి... లక్ష్మీనారాయణ బీజేపీలోకి వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. లక్ష్మీనారాయణ స్నేహితులు కొందరు బీజేపీలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని చెబుతున్నారు. మరోవైపు ఏపీలోని ఆయన చిన్ననాటి స్నేహితులు.. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా లక్ష్మీనారాయణ కొత్త రాజకీయ పార్టీ పెడతారని అంటున్నారు. గుంటూరుకు చెందిన లక్ష్మీనారాయణ స్నేహితుడొకరు ఆయన ఏపీకి ప్రత్యేక హోదా కోసం పవన్ కల్యాణ్‌తో జతకడతారని, త్వరలోనే జనసేన పార్టీలో చేరే అవకాశాలున్నాయన్నారు. దీనిపై మీడియా వర్గాలు లక్ష్మీనారాయణను సంప్రదించగా... తాను వీఆర్‌ఎస్ తీసుకుంటున్నది నిజమేనని, తన భవిష్యత్ కార్యాచరణను త్వరలో వెల్లడిస్తానని పేర్కొన్నారు.

ఏపీ నిట్ డైరెక్టర్‌గా సీఎస్పీ రావు బాధ్యతలు

తాడేపల్లిగూడెం: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) తొలి డైరెక్టర్‌గా చిలకలపల్లి సూర్యప్రకాశరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. నిట్‌కు తాత్కాలిక వసతి సౌకర్యాన్ని కల్పించిన వాసవీ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యాన్ని మర్యాద పూర్వకంగా కలిశారు. పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావులతో వసతి, పరిశోధనాశాలలు తదితర సౌకర్యాల గురించి మాట్లాడారు. నిట్ బోధన, బోధనేతర సిబ్బందితో మాట్లాడిన అనంతరం విద్యార్థులతో మమేకమయ్యారు.

నైపుణ్య శిక్షణ రథం ప్రారంభించిన సీఎం



నైపుణ్య రథం వాహనాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ నైపుణ్య శిక్షణ రథంను గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. నైపుణ్య రథం నుంచి ప్రతి నైపుణ్య శిక్షణ కేంద్రంతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించే వీలుంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ వాహనం తిరుగుతుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కొన్ని శిక్షణ కేంద్రాల పనితీరును పరిశీలించారు.

టన్నెల్లో టన్నుల అవినీతి!

రెట్టింపు కంటే పెరిగిన వెలిగొండ సొరంగాల అంచనాలు

రూ.1,012.41 కోట్లకు పెంచుతూ సర్కారు ఉత్తర్వులు

అంచనాల పెంపులో అక్రమాల బాగోతాన్ని ముందే బహిర్గతం చేసిన 'సాక్షి'

సాక్షి, అమరావతి: వెలిగొండ ప్రాజెక్టు సొరంగాల పనుల్లో పాత కాంట్రాక్టర్ల నుంచి 60 సీ నిబంధన కింద తొలగించిన రూ.415.92 కోట్ల పనుల అంచనా వ్యయాన్ని రూ.1,012.41 కోట్లకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈపీసీ(ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో కాకుండా ఎల్‌ఎస్(లంప్సమ్)–ఓపెన్ విధానంలో టెండర్ల ద్వారా సొరంగాల పనులను కాంట్రాక్టర్లకు అప్పగించడానికి అనుమతిచ్చింది. అంచనా వ్యయం ఒకేసారి రూ.596.49 కోట్లు పెంచేయడంపై అధికారవర్గాలే నివ్వెరపోతున్నాయి. ఈ పనులను తన కోటరీలోని ఇద్దరు ప్రధాన కాంట్రాక్టర్లకు అప్పగించి రూ.200 కోట్లకుపైగా కమీషన్‌లు రాబట్టుకోవడానికి ముఖ్యనేత ఒప్పందం కుదుర్చుకున్నారనే ఆరోపణలు బలంగా వ్యక్తమవుతున్నాయి. ఈ బాగోతాన్ని 'యంత్రంలో అవినీతి తంత్రం' శీర్షికన ఈనెల 12న ప్రచురించిన కథనం ద్వారా 'సాక్షి' ముందే బయటపెట్టింది.

ఆర్థిక శాఖ అభ్యంతరాలు బేఖాతర్

వెలిగొండ సొరంగాల అంచనా పెంపు ప్రతిపాదనలపై ఆర్థిక శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సొరంగాల తవ్వకం కోసం ఉపయోగించే యంత్రాలు(టన్నెల్ బోరింగ్ మెషీన్–టీబీఎం) కొనుగోలుకు గతంలోనే నిధులు ఇచ్చినా మళ్లీ వాటినే కొనడానికి రూ.172.44 కోట్లు కాంట్రాక్టర్లకు ఇవ్వాలని ప్రతిపాదించడాన్ని తప్పుబట్టింది. మొదటి సొరంగం కాంట్రాక్టర్‌కు రూ.51.97 కోట్లు, రెండో సొరంగం కాంట్రాక్టర్‌కు రూ.120.47 కోట్లు ఇవ్వాలని



ప్రతిపాదించారు. ఇక టీబీఎంలకు కొత్త బుష్‌లు, కన్వేయర్ బెల్ట్ మార్చడానికి 2016 జూన్ 22నే రూ.68.44 కోట్లిచ్చినా మళ్లీ అవే కొనాలంటూ మొదటి సొరంగం కాంట్రాక్టర్‌కు రూ.26.26 కోట్లు, రెండో సొరంగం కాంట్రాక్టర్‌కు రూ.25.39 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదించడాన్ని తప్పుబట్టింది. అంటే ఉత్తినే అంచనా వ్యయం రూ.224.09 కోట్లు పెంచేసినట్లు స్పష్టమవుతోంది. బిల్లులు, పరిహారం చెల్లించకుండా 60సీ కింద పనులను తొలగించి కొత్త కాంట్రాక్టర్లకు అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై పాత కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందంటూ ఆర్థికశాఖ ఈ ప్రతిపాదనలను తిప్పిపంపింది. దీనిపై ముఖ్యనేత ఆగ్రహం వ్యక్తం చేయడంతో చేసేది లేక మొదటి సొరంగంలో మిగిలిన పనుల అంచనా వ్యయాన్ని రూ.292.15 కోట్లు, రెండో సొరంగంలో మిగిలిన పనుల అంచనా వ్యయాన్ని రూ.720.26 కోట్లకు పెంచడానికి అంగీకరించింది. ఆ మేరకు అంచనా వ్యయాన్ని సవరిస్తూ జలవనరుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

ఇద్దరికే దక్కే నిబంధనలతో టెండర్

పెంచిన అంచనాల మేరకు ఎల్‌ఎస్–ఓపెన్ విధానంలో కోటరీలోని ఇద్దరు ప్రధాన కాంట్రాక్టర్లకే టెండర్ దక్కేలా నిబంధనలు రూపొందించి నోటిఫికేషన్ జారీ చేయాలని అధికారులపై ముఖ్యనేత తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. రెండు మూడు రోజుల్లో టెండర్ నోటిఫికేషన్ జారీ కానుంది. కేవలం పది రోజుల్లోనే టెండర్ల ప్రక్రియను ముగించి ఎంపిక చేసిన కాంట్రాక్టర్లకు అప్పగించడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. ఆ వెంటనే రూ.వంద కోట్లకుపైగా మొబిలైజేషన్ అడ్వాన్సులు చెల్లించి వాటిని తొలి విడత కమీషన్‌గా స్వీకరించేందుకు ముఖ్యనేత ఎత్తుగడ వేశారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ధరలు తగ్గినా పెరిగిన అంచనాలు

ప్రకాశం జిల్లాలో వెలిగొండ సొరంగం నిర్మాణ పనులను కమీషన్‌లు ఇచ్చే వారికే అప్పగించేందుకే పాత కాంట్రాక్టర్లపై 60సీ నిబంధన కింద వేటు వేశారనే విమర్శలు ఆది నుంచి వినిపిస్తున్నాయి. మొదటి సొరంగంలో 60సీ కింద 15.200 కి.మీ. నుంచి 18.800 కి.మీ. వరకూ అంటే 3.6 కిలోమీటర్ల పనుల విలువను రూ.116.44 కోట్లుగా అంచనా వేశారు. రెండో సొరంగంలో 10.750 కి.మీ. నుంచి 18.787 కి.మీ. వరకూ 8.037 కి.మీ.ల పనుల విలువను రూ.299.48 కోట్లుగా స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ(ఎస్‌ఎల్‌ఎస్‌సీ) అంచనా వేసింది. స్టీలు, సిమెంటు, యంత్ర పరికరాల విడి భాగాల ధరలు తగ్గిన నేపథ్యంలో 2017–18 ఎస్‌ఎస్‌ఆర్‌ను వర్తింపజేసినా అంచనా వ్యయంలో పెద్దగా మార్పు ఉండదని అధికారవర్గాలు చెబుతున్నాయి. కానీ 'ముఖ్య'నేత ఒత్తిడితో మొదటి సొరంగంలో మిగిలిపోయిన పనుల అంచనా విలువను రూ.301.01 కోట్లకు, రెండో సొరంగంలో మిగిలిపోయిన పనుల అంచనా విలువను రూ.730.04 కోట్లకు పెంచేస్తూ ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపారు.

పనులు జరిగే క్రమంలో మరో రూ.వంద కోట్లు ముట్టచెప్పేలా కాంట్రాక్టర్లతో ఇప్పటికే అవగాహన కుదిరిందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

రహదారులన్నింటా..
ఆగ్రహోదాగ్ని


తిరుపతి రూరల్ తనపల్లి వద్ద రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ, వామపక్షాల నాయకులు

చిత్తూరు జిల్లాలో...

జిల్లావ్యాప్తంగా 8 ప్రధాన రహదారులపై రెండు గంటలపాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు రామానాయుడు, కుమార్‌రెడ్డి తిరుపతి రూరల్ తనపల్లి క్రాస్ దగ్గర ఆందోళన చేపట్టారు. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై పార్టీ జెండాలను చేతబట్టి రోడ్డుపై బైఠాయించారు. సీపీఐ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ శవయాత్ర నిర్వహించారు. రోడ్డుపై కబడ్డీ ఆడి వినూత్నంగా నిరసన తెలిపారు. పుంగనూరులోని చిత్తూరు–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆందోళకారులు బైఠాయించారు. యాదమర్రి మండలంలో జరిగిన నిరసనలో ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్, పుత్తూరులో జరిగిన ఆందోళనలో జీడీ నెల్లూరు ఎమ్మెల్యే కె.నారాయణస్వామి పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా పలుచోట్ల వైఎస్సార్‌సీపీ సీపీఐ, సీపీఎం, జనసేన, కాంగ్రెస్ కార్యకర్తలు నిరసనలో పాలుపంచుకున్నారు.

ప్రజలకు ధన్యవాదాలు

జాతీయ రహదారుల దిగ్బంధాన్ని విజయవంతం చేసిన ప్రజానీకానికి వైఎస్సార్‌సీపీ, వామపక్షాలు, ప్రత్యేక హోదా సాధన సమితి కృతజ్ఞతలు తెలిపాయి. ప్రజల ఆకాంక్షను రహదారుల దిగ్బంధం ప్రతిబింబించిందని, ప్రజాగ్రహం ముందు ఎంతటివారైనా తలవంచక తప్పదని వైఎస్సార్‌సీపీ పేర్కొంది. హోదా సాధించే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని తేల్చిచెప్పింది. రహదారుల దిగ్బంధానికి సహకరించిన ప్రజలకు, పార్టీలకు, వామపక్ష నేతలకు ధన్యవాదాలు తెలిపింది.

▶ మొదటి పేజీ తరువాయి
గుంటూరు నగర శివారులోని అంకిరెడ్డిపాలెం రహదారి వద్ద ఆందోళనలో పాల్గొన్నారు. గుంటూరు శివారులోని హైవేపై ఆందోళనకారులు బైఠాయించారు. వారికి వైఎస్ జగన్ సంఘీభావం తెలిపారు. ప్రత్యేక హోదా ప్లకార్డులు పట్టుకొని ధర్నాలో పాల్గొన్నారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ ఆయన నినదించారు.


విజయవాడ వారధి వద్ద జాతీయ రహదారుల దిగ్బంధం

కృష్ణా జిల్లాలో...

విజయవాడ కనకదుర్గ వారధి వద్ద జాతీయ రహదారిపై రెండు గంటలపాటు రాస్తారోకో నిర్వహించారు. రాష్ట్రాన్ని తాకట్టు పెట్టడానికి ఆంధ్రప్రదేశ్ ఏమైనా చంద్రబాబు అబ్బ సొత్తా? అని నేతలు నిలదీశారు. రెండు గంటల పాటు జాతీయ రహదారుల దిగ్బంధం శాంపిల్ మాత్రమేనని, ఇకపై 24 గంటల దీక్ష.. 48 గంటల దీక్షలు.. ఆఖరికి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని, బీజేపీ, టీడీపీ కాస్కోవాలని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నేత కొలుసు పార్థసారథి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత మల్లాది విష్ణు, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత వెల్లంపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ నేతలు నరహరశెట్టి నరసింహారావు, ఆకుల శ్రీనివాస్, సుంకర పద్మశ్రీ, సీపీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, సీహెచ్ బాబూరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సామినేని ఉదయభాను, తాతినేని పద్మావతి, బొప్పన భవకుమార్, జనసేన నాయకుడు పోతిన మహేష్, ఆప్ ఇతర పార్టీల కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూజివీడు–హనుమాన్ జంక్షన్ రోడ్డుపై రాస్తారోకో చేశారు.


రేపల్లెలోని 216 జాతీయ రహదారిపై బైఠాయింపు

గుంటూరు జిల్లాలో...

'ప్రత్యేక హోదా సాధన సమితి' పిలుపు మేరకు గుంటూరు జిల్లాలో నిర్వహించిన రహదారుల దిగ్బంధం విజయవంతమైంది. జిల్లాలోని జాతీయ, రాష్ట్ర రహదారులన్నీ స్తంభించాయి. వాహనాలు భారీగా నిలిచిపోయాయి. అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, పార్టీ సమన్వయకర్తలు, ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు, రాస్తారోకోలు జరిగాయి. పలుచోట్ల అఖిలపక్ష నేతలు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌లకు తరలించారు.

విశాఖ జిల్లాలో..

జాతీయ రహదారుల దిగ్బంధం కార్యక్రమం విశాఖ జిల్లాలో విజయవంతమైంది. పాయకరావుపేట నుంచి తగరపువలస వరకు ఉన్న జాతీయ రహదారి–16 పూర్తిగా స్తంభించిపోయింది. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎక్కడికక్కడ జనం స్వచ్ఛంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రోడ్లపైకి వచ్చి, నినాదాలతో హోరెత్తించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అనకాపల్లి వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి దిగ్బంధించారు. వేలాది మంది కార్యకర్తలు విశాఖ నగరంలోని ఎన్ఏడీ జంక్షన్‌లో బైఠాయించారు. రోడ్డుపైనే క్రికెట్ ఆడి నిరసన తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ రోడ్లపై నిరసన తెలిపారు.


విజయనగరం ఎత్తుబ్రిడ్జి వద్ద విపక్షాల మానవహారం

విజయనగరం జిల్లాలో...

జిల్లా కేంద్రమైన విజయనగరం పట్టణంతోపాటు సాలూరు, బొబ్బిలి పట్టణాల్లో చేపట్టిన రహదారుల దిగ్బంధంలో ప్రతిపక్షాలు పాల్గొన్నాయి. వివిధ రూపాల్లో నిరసన తెలిపాయి. 26వ నంబర్ జాతీయ రహదారిని నాయకులు దిగ్బంధించారు. వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. సాలూరు, బొబ్బిలి తదితర పట్టణాల్లో రహదారులను దిగ్బంధించారు.


ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వద్ద జాతీయ రహదారిపై బైఠాయించిన నేతలు

పశ్చిమ గోదావరి జిల్లా

జాతీయ రహదారుల దిగ్బంధం కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. జిల్లావ్యాప్తంగా జాతీయ, రాష్ట్రీయ రహదారులను దిగ్బంధించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులతోపాటు, ప్రత్యేక హోదా సాధన సమితి, వామపక్షాలు, జనసేన పార్టీ నేతలు జెండాలతో రహదారులపైకి వచ్చి నిరసన తెలిపారు. జిల్లా కేంద్రం ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వద్ద ఆళ్ల నాని ఆధ్వర్యంలో భారీ ఎత్తున రాస్తారోకో చేపట్టారు. ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో నరసాపురంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. 216 జాతీయ రహదారిని దిగ్బంధించి రాస్తారోకో చేశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తల ఆధ్వర్యంలో రహదారుల దిగ్బంధం కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి.


శ్రీకాకుళం రూరల్ మండలం పెదపాడు వద్ద రహదారి దిగ్బంధం

శ్రీకాకుళం జిల్లాలో...

శ్రీకాకుళం రూరల్ మండలం పెదపాడు వద్ద జరిగిన హైవే దిగ్బంధంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ ధర్మాన ప్రసాదరావు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వైఎస్ జగన్ ప్రత్యేక హోదా కోసం నిరంతరం పోరాటం చేస్తున్నారని చెప్పారు. ఆమదాలవలస, చిలకపాలెం, నరసన్నపేట, రాజాం, పాలకొండ, పాతపట్నం, పలాస, టెక్కలి, ఇచ్ఛాపురంలో రహదారులను ఆందోళనకారులు దిగ్బంధించారు.


నెల్లూరుకు సమీపంలోని బుజబుజనెల్లూరు వద్ద రాస్తారోకో..

నెల్లూరు జిల్లాలో...

ప్రత్యేక హోదా ఇచ్చే వరకూ పోరాటం ఆగదని వైఎస్సార్‌సీపీ, వామపక్ష నేతలు పేర్కొన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో రహదారులను దిగ్బంధించారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని సర్వేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద దిగ్బంధం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు జాతీయ రహదారి వద్ద నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు. కోవూరు నియోజకవర్గంలోని నార్తురాజుపాళెం వద్ద నిర్వహించిన ఆందోళనలో వైఎస్సార్‌సీపీ నేత నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా రహదారులపై బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు.


కర్నూలులో వైఎస్సార్‌సీపీ నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

కర్నూలు జిల్లాలో...

వైఎస్సార్‌సీపీ, వామపక్షాల ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలో జాతీయ రహదారుల దిగ్బంధం కార్యక్రమం విజయవంతమైంది. కర్నూలు సమీపంలోని 44వ జాతీయ రహదారిని దిగ్బంధించారు. ఎమ్మెల్యేలు ఐజయ్య, గౌరు చరితారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ ముఖ్యనేతలు శిల్పా చక్రపాణిరెడ్డి, బీవై రామయ్య, హాఫీజ్‌ఖాన్, మురళీకృష్ణ, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.షడ్రక్, జిల్లా కార్యదర్శి ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉద్యమకారులను పోలీసులు అరెస్టు చేసి, తాలూకా స్టేషన్‌కు తరలించారు. జిల్లావ్యాప్తంగా పలు పట్టణాల్లో నేతలు, కార్యకర్తలు జాతీయ రహదారులపై బైఠాయించారు.


44వ జాతీయ రహదారిపై ఉద్యమకారుల ఆందోళన

అనంతపురం జిల్లాలో...

అనంతపురం నగర శివారులోని 44వ జాతీయ రహదారిని వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు దిగ్బంధించారు. ఉదయం 9.30 గంటలకే జాతీయ రహదారిపైకి చేరుకుని బైఠాయించారు. నరేంద్ర మోదీ, చంద్రబాబులకు వ్యతిరేకంగా నినదించారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా బైఠాయించారు.

వైఎస్సార్ జిల్లాలో...

ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ జనం రోడ్డెక్కారు. రహదారులను దిగ్బంధించారు. జిల్లాలోని జాతీయ రహదారులైన చిత్తూరు–కర్నూలు, కడప–రేణిగుంట, బళ్లారి–కడప రోడ్లతోపాటు ప్రధాన రహదారులపై పెద్ద ఎత్తున బైఠాయించారు. వైఎస్సార్‌సీపీతోపాటు వామపక్షాలు, కాంగ్రెస్, ఇతర పార్టీల శ్రేణులు ఆందోళనలో పాలుపంచుకున్నాయి. రహదారుల దిగ్బంధంతో ఎక్కడకక్కడ వాహనాలు నిలిచిపోయాయి. కడపలో రాజంపేట హైవేపై బైఠాయించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో రోడ్లను దిగ్బంధించారు.


రాజంపేట తిరుపతి హైవేపై నేతల బైఠాయింపు

ప్రకాశం జిల్లాలో..

ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్‌సీపీ, వామపక్షాలు, ప్రజాసంఘాలు చేపట్టిన ఉద్యమం ఉధృతరూపం దాల్చింది. ప్రకాశం జిల్లాలో ఉదయం నుంచే నేతలు, కార్యకర్తలు, ప్రజలు రోడ్లపైకి వచ్చి బైఠాయించాయి. ఒంగోలు, అద్దంకి, పర్చూరు తదితర ప్రాంతాల్లో ఎన్‌హెచ్–5 జాతీయ రహదారితో పాటు రాష్ట్రీయ, జిల్లా రహదారులపై కూడా నేతలు బైఠాయించి ఆందోళనకు దిగారు. ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. మార్కాపురంలో ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి ఆధ్వర్యంలో హైవే దిగ్బంధం జరిగింది.


ఒంగోలులోని జాతీయ రహదారిపై బైఠాయించిన నేతలు

తూర్పు గోదావరి జిల్లాలో...

రాజమహేంద్రవరం మోరంపూడి సెంటర్ వద్ద వైఎస్సార్ సీపీ,. కాంగ్రెస్, జనసేన, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్, వామపక్షాల నేతలు జాతీయ రహదారిని దిగ్బంధించారు. 10 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వైఎస్సార్‌సీపీ నేతలు జక్కంపూడి విజయలక్ష్మి, కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు నేతృత్వం వహించారు. కాకినాడ రూరల్ అచ్చంపేట జాతీయ రహదారిపై వివిధ రాజకీయ పార్టీలు బైఠాయించారు. వైఎస్సార్‌సీపీ కాకినాడ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, డీసీసీ అధ్యక్షుడు పంతం నానాజీతో సహా వివిధ రాజకీయ పార్టీలు, వామపక్షాలకు చెందిన 200 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.


రావులపాలెంలో జాతీయ రహదారి దిగ్బంధంలో నేతలు

శివాజీ చెప్పిన సినిమా స్టోరీ!!

కొత్త నాయకుడితో ఓ జాతీయ పార్టీ రాజకీయం చేయబోతుందన్న సినీ నటుడు శివాజీ

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ఓ జాతీయ పార్టీ 'ఆపరేషన్ గరుడ' చేపట్టబోతోందని సినీ నటుడు శివాజీ తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలు లక్ష్యంగా చేపట్టిన 'ఆపరేషన్ ద్రవిడ'లో ఇదొక భాగమన్నారు. ఏపీ, తెలంగాణకు సంబంధించి 'ఆపరేషన్ గరుడ'.. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో 'ఆపరేషన్ రావణ'.. కర్నాటకలో 'ఆపరేషన్ కుమార'ను ఆ జాతీయ పార్టీ చేపట్టబోతోందని ఆయన పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌కు అనుసంధానకర్తగా ఓ రాజ్యాంగ శక్తి వ్యవహరిస్తోందన్నారు. ఫలితంగా ఆయన పదవీ కాలం పొడగించబోతున్నారని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌ను విజయవంతం చేసేందుకు రూ.4,800 కోట్లు కేటాయించారని, ఇందులో సగం ఇప్పటికే పంపిణీ చేశారని చెప్పుకొచ్చారు. గురువారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఓ జాతీయ పార్టీ అనుబంధ విభాగంలో పనిచేస్తున్న తన సన్నిహితుడు ఈ విషయాలను తనకు వివరించారని శివాజీ చెప్పుకొచ్చారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఓ కొత్త నాయకుడు.. మరో కొత్త పార్టీని కలుపుకుని జాతీయ పార్టీ ఏవిధంగా రాష్ట్రంపై ఆధిపత్యం చెలాయించబోతోందో అన్ని వివరాలు తన వద్ద ఉన్నాయని చెప్పారు. 'ఓ కొత్త నాయకుడు ప్రత్యేక హోదా ఉద్యమం చేస్తాడు. ఉద్యమానికి భయపడి జాతీయ పార్టీ రాష్ట్రానికి కావాల్సినవన్నీ ఇచ్చేస్తుంది. ప్రత్యేక హోదా కోసం ఆమరణ దీక్ష చేసే సందర్భంలో రాష్ట్రంలో అల్లర్లు జరుగుతాయి. అవి తట్టుకోలేక ఏపీ ప్రజల కోరికను.. ఆ నాయకుడి ద్వారా జాతీయ పార్టీ నెరవేరుస్తుంది. ఈ మేరకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధమయ్యాయి..' అని శివాజీ చెప్పారు. ఈ విషయాన్ని తాను గతంలోనే సీనియర్ జర్నలిస్టు తెలకపల్లి రవి వద్ద ప్రస్తావించినట్లు వెల్లడించారు. ఈ విషయాలన్నీ తన వ్యక్తిగతమని.. ఇందులో ఏ పార్టీకి గానీ ప్రత్యేక హోదా సాధన సమితికి గానీ ఎలాంటి సంబంధం లేదన్నారు. కాగా, అవిశ్వాస తీర్మానంపై శుక్రవారం చర్చ జరగనుందని శివాజీ జోస్యం చెప్పారు. ఆరుగురు ఎంపీలను కేంద్రం సిద్ధం చేసిందని వారితో హడావుడిగా చర్చ జరిపించి.. ఆంధ్రప్రదేశ్ చెప్పేవన్నీ అబద్ధాలేనని తేల్చేస్తారని చెప్పుకొచ్చారు. కాగా, రాజధానితో పాటు పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ ఎత్తిపోతల పథకాల్లో సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ తదితర టీడీపీ నేతలు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారంటూ విమర్శలు చెలరేగుతున్న సమయంలో నటుడు శివాజీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

డీఎస్సీ నోటిఫికేషన్లు లేనేలేవు

▶ మొదటి పేజీ తరువాయి
సుముఖంగా లేదు. పోస్టుల్లో కోత పెట్టేలా నివేదికను తెప్పించింది. ఇటీవల జిల్లాల నుంచి విద్యాశాఖ తెప్పించిన సమాచారంలో కేవలం 10,603 పోస్టులు ఉన్నట్లుగా చూపారు. 2014లో డీఎస్సీ ప్రకటించినప్పుడు 10,313 పోస్టులు భర్తీచేశారు. ఆతరువాత సర్వశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) నిధులకోసం కేంద్రానికి పంపిన నివేదికల్లో రాష్ట్రంలో తొలుత 19,468 అని, ఆ తరువాత 14,194 ఖాళీలు ఉన్నట్లు చూపించారు. టీచర్ పోస్టుల భర్తీపై సుప్రీంకోర్టులో దాఖలైన కేసుకు సంబంధించిన కౌంటర్ అఫిడవిట్లోనూ ఇదే సంఖ్యను చూపారు. ఈ పోస్టుల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లు 5,655, స్కూల్ అసిస్టెంట్లు 3,119, ఎల్పీలు 260, పీఈటీలు 1,115, మ్యూజిక్ 77, మోడల్ స్కూలు 938, ఐఈడీఎస్ఎస్ 860, మున్సిపల్ 1,147, కంప్యూటర్ టీచర్లు 1,023 పోస్టులు ఉన్నట్లు చూపించారు. 2014 డీఎస్సీ తరువాత మళ్లీ నోటిఫికేషన్ రానందున రిటైరయిన వారి పోస్టులను కూడా కలుపుకుంటే పోస్టుల సంఖ్య పెరగాలి కానీ తగ్గినట్లు చూపడం విడ్డూరం. రాష్ట్రంలో 22,814 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీ చేస్తామని గత ఏడాది చివర్లో మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. తరువాత ఆ సంఖ్యను ప్రభుత్వం తగ్గిస్తూ 14,300 భర్తీ చేయాలని పేర్కొంది. ఈ పోస్టుల్లో మోడల్ స్కూల్ టీచర్లు 988, మున్సిపల్ టీచర్ పోస్టులు 1,447, పాఠశాల విద్యాశాఖ పరిధిలో సెకండరీ గ్రేడ్ టీచర్లు 5,900, స్కూల్ అసిస్టెంటు టీచర్లు 3,419, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు 1,100, ఐటీ టీచర్లు 1,020, మ్యూజిక్ టీచర్లు 77, ఇతర టీచర్ పోస్టులు 349 గుర్తించారు. ఈ పోస్టుల్లో ఆర్థిక పరమైన మంజూరు ఉన్నవి 10,603 మాత్రమేనని, తక్కిన వాటికి ప్రభుత్వం అనుమతించాల్సి ఉందని తేల్చారు. ఆర్థిక అనుమతులు లేని పోస్టుల విషయంలో నాలుగు నెలల క్రితం ప్రభుత్వానికి విద్యాశాఖ నివేదించినా ఇప్పటివరకు నిర్ణయం తీసుకోలేదు. ఆర్థిక శాఖ అనుమతులు వస్తేనే కానీ ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం లేదని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఒకేసారి పోస్టులన్నీ భర్తీ చేసే బదులు రెండు విడతలుగా భర్తీ చేస్తే.. రెండు ఏళ్లు వరుసగా నోటిఫికేషన్లు ఇచ్చినట్లు భ్రమింపచేయవచ్చు అన్నట్లు ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు అనుగుణంగా పోస్టులను తగ్గించి ప్రస్తుత డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలనుకుంటున్నట్లు సమాచారం. అదే అయితే పోస్టుల సంఖ్య సగానికి సగం తగ్గిపోతాయని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

పాఠశాల విద్యాశాఖ జిల్లాల వారీగా రప్పించిన ఖాళీల జాబితా

జిల్లా	ఎస్ఏ	ఎల్పీ	పీఈటీ	ఎస్జీటీ	మొత్తం
శ్రీకాకుళం	220	103	21	375	719
విజయనగరం	104	33	07	218	362
విశాఖపట్నం	307	59	28	793	1,187
తూ.గోదావరి	192	120	19	884	1,215
ప.గోదావరి	123	84	00	394	601
కృష్ణా	104	49	13	213	379
గుంటూరు	159	43	23	682	907
ప్రకాశం	79	16	21	723	839
నెల్లూరు	57	42	10	307	416
చిత్తూరు	221	182	09	1,194	1,606
వైఎస్సార్	104	40	06	206	356
అనంతపురం	57	106	15	1,108	1,286
కర్నూలు	122	98	13	497	730
మొత్తం	1,849	975	185	7,594	10,603

ఉడుకెక్కనున్న రాయలసీమ!

- 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు
- హెచ్చరించిన వాతావరణ శాఖ

సాక్షి, విశాఖపట్నం: రాయలసీమ ఉడుకెక్కనుంది. ఉష్ణ తీవ్రత అధికం కానుంది. కోస్తాంధ్రకంటే అక్కడ అధిక ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) గురువారం రాత్రి వెల్లడించింది. ఇప్పటికే రెండ్రోజులుగా రాయలసీమలో కొన్నిచోట్ల 38–40 డిగ్రీల మధ్య పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పుడు మరింతగా ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. ప్రస్తుతం బిహార్ నుంచి తమిళనాడు వరకు ఆగ్నేయ ఉత్తర ప్రదేశ్, తూర్పు మధ్యప్రదేశ్, విదర్భ, తెలంగాణ, రాయలసీమల మీదుగా అల్పపీడనద్రోణి పయనిస్తోంది. అదే సమయంలో రాష్ట్రం వైపు నైరుతి గాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో కోస్తాంధ్రలో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలలోపు నమోదు కానున్నాయి. కానీ రాయలసీమపై పొడి గాలులు వీయడం వల్ల కొన్ని ప్రాంతాల్లో 40–41 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు రికార్డవుతాయని ఐఎండీ తెలిపింది. ద్రోణి ప్రభావంతో గురువారం పలు జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములతో కూడిన జల్లులు కురిశాయి. శుక్ర, శనివారాల్లోనూ కోస్తాంధ్రలో తేలిక పాటి జల్లులకు ఆస్కారముందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు 'సాక్షి'కి తెలిపారు.



పాదయాత్రలో జగన్‌ను చూసి ఆనందంతో ఈల వేస్తున్న ఓ సోదరి

ప్రజాసంకల్ప యాత్ర
118వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం
1,572.2 కి.మీ

118వ రోజు నడిచిన దూరం
6.8 కిలో మీటర్లు

ప్రారంభం: ఉ. 7.30 గంటలకు పోలిరెడ్డిపాలెం శివారు

ముగింపు: కావూరు

ముఖ్యాంశాలు

- పోలిరెడ్డిపాలెం శివారు, లింగంగుంట్ల, అప్పాపురం క్రాస్, కావూరులో జనంతో మమేకం
- దారిపొడవునా సమస్యలు విన్నవించిన జనం


కొండ్రుపాడు వద్ద టెన్త్ విద్యార్థినులకు ఆల్‌ది బెస్ట్ చెబుతున్న జగన్


గుంటూరు జిల్లా కావూరులో వైఎస్ జగన్ వెంట అడుగులో అడుగు వేస్తున్న అశేష ప్రజానీకం


జగన్‌కు స్వాగతం పలికేందుకు వేచి ఉన్న అక్కచెల్లెమ్మలు (ఇన్‌సెట్‌లో) బస్సులోంచి జగన్‌తో కరచాలనం చేస్తున్న ఓ సోదరి

హోదానే ఊపిరి.. జగనన్నే సారథి

- పాదయాత్రలో నినదించిన యువజనులు
- బస్సుల్లోంచే విద్యార్థుల నినాదాలు, కరచాలనాలు
- ఊరూవాడా ప్రత్యేక హోదా సెగ
- అడుగడుగునా కష్టాలు చెప్పుకున్న వివిధ వర్గాల ప్రజలు
- అందరి సమస్యలు ఓపికగా విని ధైర్యం చెప్పిన ప్రతిపక్ష నేత

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

'హోదానే ఊపిరి. దానిని సాధించడమే లక్ష్యం. అందుకోసం పోరాటం సాగిస్తున్న మీ వెంటే నడుస్తాం. మీ సంకల్పానికి అండగా నిలుస్తాం. అడుగులో అడుగు లేస్తాం' అంటూ యువతీ యువకులు, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, విద్యార్థులు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులో అడుగు వేశారు. అడుగడుగునా ప్రత్యేక హోదా నినాదంతో హోరెత్తించారు. గురువారం చిలకలూరిపేట శివారు మొదలుకొని పోలిరెడ్డిపాలెం, వైఎస్సార్ కాలనీ, కొండ్రుపాడు, లింగంగుంట్ల, అప్పాపురం క్రాస్ మీదుగా కావూరు వరకు జగన్ 118వ రోజు ప్రజా సంకల్ప యాత్ర సాగింది. ఈ సందర్భంగా అడుగడుగునా ప్రత్యేక హోదా సెగ కనిపించింది. జనం తండోపతండాలుగా తరలివచ్చారు. అభిమాన నేతను కలిసి, హోదా కోసం ఆయన చేస్తున్న ఉద్యమానికి మద్దతు తెలిపారు. అలుపెరగని పోరాటం చేస్తామని చెప్పారు. 'వెన్ను చూపని మీ ఉద్యమమే భావితరాలకు శ్రీరామ రక్ష' అంటూ నినదించారు. హోదా కోసం సాగే పోరులో విజయం సాధించాలని వృద్ధులు, మహిళలు ఆశీర్వదించారు. ప్లకార్డులతో స్వాగతం పలికారు. మరోవైపు తాడిత పీడిత జనం సమస్యలను జననేత ఓపికగా విన్నారు. చెదిరిన గుండెల్లో ధైర్యం నింపారు.

అవిశ్రాంత పోరాటమే లక్ష్యం

అంకిరెడ్డిపాలెం వద్దకు జగన్ రాగానే.. ప్రత్యేక హోదా కోసం జాతీయ రహదారులను దిగ్బంధం చేస్తున్న ఉద్యమకారులు పరుగు పరుగున వచ్చారు. ప్లకార్డులతో ఆయన్ను చుట్టుముట్టారు. నిప్పుకణాల్లా రగిలిపోతున్న వారిని జననేత పలకరించారు. భావోద్వేగాలను తెలుసుకున్నారు. 'అన్నా.. ప్రత్యేక హోదాను చంద్రబాబు రాజకీయం చేస్తున్నారు. కోట్లాది మంది జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. కేసుల కోసం కేంద్రానికి అమ్ముడు పోయారు. మేం మీ వెంటే ఉంటాం. ఉద్యమిద్దాం. హోదా వచ్చే వరకూ పోరాడదాం' అంటూ ఆందోళన కారులు జగన్‌తో అన్నారు. హోదా ప్లకార్డును చేత పట్టుకుని జగన్ వారిలో మరింత ఉత్సాహం నింపారు. చిలకలూరిపేట నుంచి కావూరు వరకూ సింగిల్ రోడ్డు. ఆ ప్రాంతంలో ఉన్న ఇంజినీరింగ్ కాలేజీలకు వెళ్తున్న బస్సుల్లోంచే విద్యార్థులు జగన్‌ను చూసి నినాదాలు చేశారు. కిటికీల్లోంచే అభిమాన నేతతో కరచాలనం చేసేందుకు పోటీపడ్డారు. 'హోదా కోసం ఉద్యమిస్తాం అన్నా... మీ పోరాటానికి మద్దతు ఇస్తామన్నా..' అంటూ వారు పెద్ద పెట్టున నినాదాలు చేయడం కనిపించింది. కొంతమంది విద్యార్థులు 'హోదా ఆంధ్రుల హక్కు.. అన్న పోరాటంతోనే అది సాధ్యం' అంటూ నినాదాలు చేశారు. వైఎస్సార్ కాలనీలో 60 ఏళ్ల మాణిక్యమ్మ, పోలిరెడ్డిగూడెంలో 80 ఏళ్ల సుందర రామయ్య, లింగంగుంట్ల వద్ద 25 ఏళ్ల ఈశ్వర్... ఇలా ఎంతోమంది ప్రత్యేక హోదా కోసం జగన్‌తో కలిసి నడుస్తామని తెలిపారు. ఆయన పోరాటం తమ గ్రామాల్లోని ప్రజల్లో చైతన్యం తెస్తోందని చెప్పారు. అందుకే ఊళ్లకు ఊళ్లు తరలి వస్తున్నాయని తెలిపారు. కావూరు వచ్చే సరికి దాదాపు 15 గ్రామాలకు చెందిన ప్రజలు జగన్‌ను చూసేందుకు వచ్చారు. కిలోమీటర్ పొడవునా పూల బాట పరిచారు. వేల గొంతుకలు ఒక్కటై జై జగన్.. హోదానే ఊపిరి అంటూ నినదించడం కనిపించింది.


కావూరు వద్ద కేరింతలతో జననేతకు స్వాగతం పలుకుతున్న యువకులు

జన్మభూమి కమిటీలు వేధిస్తున్నాయన్నా..

జగన్‌తో జనం ఎన్నో బాధలు చెప్పుకున్నారు. కన్నీళ్లు పెట్టుకున్నారు. చిలకలూరిపేట శివార్లలో కొండ్రుపాడు నుంచి వచ్చిన 15 మంది మహిళా కూలీల వెతలు విన్న జగన్ చలించిపోయారు. నాగరత్నమ్మ, గోవిందమ్మ, శేషమ్మ, భారతి, శ్యామలమ్మ... ఒక్కొక్కరిదీ ఒక్కో గాథ. పొద్దంతా కష్టపడ్డా ఇచ్చే కూలి పొట్టపోసుకోడానికే సరిపోవడం లేదన్నారు. వయసు మీద పడ్డా పెన్షన్లు ఇవ్వడం లేదని చెప్పారు. జన్మభూమి కమిటీలు చుక్కలు చూపిస్తున్నాయని, లంచాల కోసం పీడిస్తున్నాయని కన్నీరు పెట్టారు. టీడీపీకి ఓటు వేయలేదని, 65 ఏళ్లు దాటినా పెన్షన్ ఇవ్వలేదని ఆవుల బాలమ్మ అనే వృద్ధురాలు కన్నీటిపర్యంతమైంది. ఎప్పుడో మంజూరైన పెన్షన్‌నూ పచ్చచొక్కా వాళ్లు పగబట్టి తీసేశారని శౌరమ్మ లబోదిబోమంది. చంద్రబాబు మాటలతో మోసపోయామని డ్వాక్రా మహిళలు వాపోయారు. బ్యాంకుల్లో బంగారం వేలం వేస్తున్నారని కంట నీరు పెట్టుకున్నారు. చెయ్యిలేని ఓ వ్యక్తి అంత జనంలోనూ కష్టపడుతూ జగన్ వద్దకొచ్చాడు. 'ఆయనతో మాట్లాడాను.. ఇప్పుడు నాకు కొండంత ధైర్యం వచ్చింది' అని జననేతను కలిశాక చెప్పాడు. లింగంగుంట్ల వద్ద ఓ వృద్ధురాలు జగన్‌ను కలిసి బావురుమంది. ఎనిమిది మందికి పెన్షన్ తీసేశారని, మరో పది మందికి అర్హత ఉన్నా పచ్చచొక్కా నేతలు శనిగ్రహాల్లా అడ్డుపడుతున్నారని చెప్పారు. ఇదెక్కడి దారుణమయ్యా? అంటూ చెమ్మగిల్లిన కళ్లతో ప్రశ్నించారు. జననేత ఎదుట వైఎస్సార్ కాలనీ వాసులు తమ కన్నీటి గాథను వినిపించారు. దివంగత నేత కట్టించిన తమ కాలనీలో ఇప్పటికీ ఓ స్కూలు లేదని, కనీసం రోడ్డు కూడా వేయలేదని, వైద్యం అందుబాటులో లేదని తెలిపారు. 'మేమంటే వారికి ఎందుకింత కక్ష అన్నా..' అని ప్రశ్నించారు. అందరి సమస్యలూ విన్న జగన్.. బాధితులందరికీ ధైర్యం చెబుతూ ముందుకు సాగారు.



లింగంగుంట్ల వద్ద అక్కచెల్లెమ్మలతో ఆప్యాయంగా మాట్లాడుతున్న జననేత

స్వదేశీ సీకర్‌తో ‘బ్రహ్మోస్’ పరీక్ష సక్సెస్

అభివృద్ధి చేసిన డీఆర్‌డీవో శాస్త్రవేత్తలు

- అభినందనలు తెలిపిన రక్షణమంత్రి సీతారామన్



సాక్షి, హైదరాబాద్/పోఖ్రాన్/న్యూఢిల్లీ: రక్షణ రంగంలో స్వావలంబన దిశగా భారత్ మరో ముందడుగు వేసింది. అత్యాధునిక బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులకు అనువైన ఆర్‌ఎఫ్ సీకర్ల తయారీలో భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) శాస్త్రవేత్తలు విజయం సాధించారు. రాజస్తాన్‌లోని పోఖ్రాన్ టెస్ట్‌రేంజ్‌లో గురువారం ఉదయం ఈ సీకర్లను అమర్చిన బ్రహ్మోస్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించారు. క్షిపణులు తమ లక్ష్యాన్ని కచ్చితత్వంతో గుర్తించడంలో ఈ సీకర్లు అత్యంత కీలకమైనవి. హైదరాబాద్ శివార్లలో ఉన్న డీఆర్‌డీవో కేంద్రంలో తయారైన ఈ సీకర్లను గురువారం తొలిసారి బ్రహ్మోస్ క్షిపణిలో ప్రయోగించి మంచి ఫలితాలు రాబట్టారు. మూడు నెలల క్రితం ఈ క్షిపణులను సుఖోయ్ -30 యుద్ధవిమానాల ద్వారా విజయవంతంగా పరీక్షించిన విషయం తెలిసిందే. 2.5 టన్నుల బరువుతో 8.4 మీటర్ల పొడవుండే బ్రహ్మోస్ 300 కేజీల వార్‌హెడ్లను మోసుకుపోగలదు. భూమి, సముద్రం, ఆకాశం నుంచి ప్రయోగించగల ఈ క్షిపణి 290 కి.మీ పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలదు. గంటకు 3457.44 కి.మీ(2.8 మ్యాక్) వేగంతో దూసుకెళ్లే ఈ క్షిపణిని గంటకు 6,174 కి.మీ(5 మ్యాక్) వేగంతో వెళ్లేలా ఇటీవల అప్‌గ్రేడ్ చేశారు. గతేడాది భారత్ మిసైల్ టెక్నాలజీ కంట్రోల్ రెజీమ్(ఎంటీసీఆర్)లో చేరిన నేపథ్యంలో బ్రహ్మోస్ పరిధిని 400 కిలోమీటర్లకు పెంచడంపై శాస్త్రవేత్తలు ప్రస్తుతం దృష్టి సారించారు.

స్వావలంబన దిశగా..

రక్షణ రంగంలో స్వావలంబన అన్నది భారత్ చిరకాల వాంఛ. పోఖ్రాన్‌లో అణు పరీక్షలు నిర్వహించడంతో అగ్రరాజ్యాలు భారత్‌కు సాంకేతిక బదిలీపై ఆంక్షలు విధించాయి. దీంతో దేశరక్షణకు సంబంధించి పరిజ్ఞానాన్ని సొంతంగా అభివృద్ధి చేసుకోవాలని భారత్ నిర్ణయించింది. ఈ దిశగా ప్రయత్నాలు ప్రారంభించినప్పటికీ అవి పూర్తిస్థాయిలో సత్ఫలితాలు ఇవ్వలేదు. ఇప్పటికీ మనం క్షిపణులకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని, విడిభాగాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ఈ నేపథ్యంలో స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన ఆర్‌ఎఫ్ సీకర్ల ద్వారా బ్రహ్మోస్ క్షిపణులను ప్రయోగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సరిహద్దులో పాకిస్తాన్, చైనాలు కయ్యానికి కాలు దువ్వుతున్న నేపథ్యంలో బ్రహ్మోస్ క్షిపణుల్ని సుఖోయ్-30 యుద్ధవిమానాలకు అమర్చడం సరైన నిర్ణయమేనని రక్షణ రంగ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు స్వదేశీ సీకర్ అమర్చిన బ్రహ్మోస్ పరీక్ష విజయవంతం కావడంపై రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ డీఆర్‌డీవో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

పాక్‌కు ‘పవర్‌ఫుల్’ క్షిపణి

చైనా నుంచి కొనుగోలు

- బహుళ వార్‌హెడ్ల మిసైల్స్ అభివృద్ధికి ఊతం
- హాంకాంగ్ పత్రిక కథనం



బీజింగ్: శత్రు దేశాల క్షిపణులను గుర్తించి ధ్వంసం చేసేందుకు పాకిస్తాన్ చైనా నుంచి అత్యంత శక్తిమంతమైన క్షిపణి వ్యవస్థను కొనుగోలు చేసినట్లు తెలిసింది. బహుళ వార్‌హెడ్లను మోసుకెళ్లే క్షిపణుల అభివృద్ధికి నాలుగు టెలిస్కోపులతో కూడిన అత్యాధునికమైన ఈ వ్యవస్థ దోహదపడుతుందని భావిస్తున్నారు. కొత్త క్షిపణులను పరీక్షించేందుకు, అభివృద్ధి చేసేందుకు పాకిస్తాన్ ఇప్పటికే దీన్ని రహస్య ప్రదేశంలో వినియోగంలోకి తెచ్చినట్లు వెల్లడైంది. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (సీఏఎస్) పరిశోధకుడు ఒకరిని ఉటంకిస్తూ హాంకాంగ్ కేంద్రంగా పనిచేస్తున్న సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ గురువారం ఈ విషయాలను కథనం రూపంలో ప్రచురించింది. అయితే పాకిస్తాన్ ఈ కొనుగోలు ఒప్పందానికి ఎంత వెచ్చించిందో వెల్లడించలేదు. అత్యాధునిక క్షిపణి నిఘా వ్యవస్థను పాకిస్తాన్‌కు చైనా అమ్మినట్లు సీఏఎస్ పరిశోధకుడు జెంగ్ మెంగ్వెయ్ ధ్రువీకరించినట్లు ఆ పత్రిక పేర్కొంది. పాకిస్తాన్‌కు అంతటి శక్తివంతమైన ఆయుధాన్ని సమకూర్చిన తొలి దేశం చైనాయేనని సీఏఎస్ వెబ్‌సైట్‌లో సమాచారం ఉంది. భారత్ ఇటీవల అగ్ని–5 క్షిపణిని విజయవంతంగా పరీక్షించిన నేపథ్యంలోనే పాక్‌కు చైనా ఈ ఆయుధాన్ని అమ్మిందని భావిస్తున్నట్లు పేర్కొంది. సాధారణంగా క్షిపణి నిఘా వ్యవస్థలకు రెండు టెలిస్కోపులు ఉంటాయని.. కానీ, పాక్ కొనుగోలు చేసిన వ్యవస్థకు నాలుగు టెలిస్కోపులు ఉన్నాయంది. దీంతో ఏకకాలంలో వేర్వేరు దిక్కుల నుంచి వస్తున్న క్షిపణులను గుర్తించడం సులభమవుతుందని పేర్కొంది.



గురువారం కోల్‌కతాలోని కాళీఘాట్ వద్ద అత్యంత కలుషితమైన హుగ్లీ నదీజలాలనే క్యూ కట్టి మరీ తీసుకెళ్తున్న స్థానికులు. ‘అందరికీ అందుబాటులో సురక్షిత నీరు’పై మరింత అవగాహన పెంచేందుకు అన్ని దేశాల్లో ప్రతీ ఏటా మార్చి 22న ‘ప్రపంచ నీటి దినోత్సవం’ పాటిస్తున్న సంగతి తెల్సిందే.

నేడే రాజ్యసభ ఎన్నికలు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాల్లో శుక్రవారం రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 25 సీట్లకోసం యూపీ, పశ్చిమబెంగాల్, కర్ణాటక, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, కేరళల్లో ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికలు పూర్తయిన గంట తర్వాత సాయంత్రం 5 గంటలకు కౌంటింగ్ మొదలవుతుంది. ఇందులో పది సీట్లు ఒక్క ఉత్తరప్రదేశ్ నుంచే ఉన్నాయి. యూపీలో 10 సీట్లకు ఎన్నికలు జరగనుండగా బీజేపీ 8, ఎస్పీ ఒక స్థానంలో సులభంగా గెలిచేందుకు అవకాశం ఉంది. అయితే పదో స్థానం కోసం బీజేపీ అదనంగా బరిలో దించిన అభ్యర్థికి, బీఎస్పీ మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. ఎస్పీ వద్ద అదనంగా ఉన్న ఎమ్మెల్యేల మద్దతుతో బీఎస్పీ గెలుస్తుందని భావించినా.. ఇండిపెండెంట్లతోపాటు ఎస్పీలోని శివ్‌పాల్ వర్గం ఎమ్మెల్యేలు బీజేపీకి మద్దతు ఇవ్వొచ్చని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో యూపీ ఎన్నిక రసవత్తరంగా మారింది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, బీజేపీ అధికార ప్రతినిధి జీవీఎల్ నర్సింహారావు బరిలో ఉన్నారు. మొత్తం 10 రాష్ట్రాల్లో 58 రాజ్యసభ స్థానాలు ఖాళీ అవగా.. నాలుగు రాష్ట్రాల్లోని 33 సీట్లు ఏకగ్రీవం కావటంతో మిగిలిన 25 సీట్లకే శుక్రవారం ఎన్నికలు జరుగుతాయి.

హుందాగా డ్రెస్ చేసుకోండి: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: న్యాయస్థానాల్లో కేసుల సందర్భంగా హాజరయ్యే అధికారుల వస్త్రధారణ హుందాగా ఉండాలని సుప్రీంకోర్టు తెలిపింది. రాజస్తాన్ పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ అదనపు చీఫ్ సెక్రటరీ మంజిత్ సింగ్ బుధవారం ఓ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టుకు సాధారణ దుస్తుల్లోనే హాజరయ్యారు. దీంతో జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్‌లతో కూడిన బెంచ్ ఆయన్ను మందలించింది. ఈ కేసు విచారణ గురువారం కూడా కొనసాగింది. నీలం రంగు సూట్‌తో కోర్టుకు హాజరైన మంజిత్ సింగ్.. బుధవారం సాధారణ దుస్తుల్లో వచ్చినందుకు న్యాయస్థానానికి క్షమాపణలు చెప్పారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. నిబంధనలు ఉన్నా లేకున్నా ప్రభుత్వ అధికారులు కోర్టులకు వచ్చేటప్పుడు హుందాగా, మర్యాదపూర్వకంగా ఉండే వస్త్రాలనే ధరించాలని తెలిపింది. అధికారుల హోదాకు, బాధ్యతలకు దుస్తులు ప్రతీకలుగా నిలుస్తాయని వ్యాఖ్యానించింది.

బీజేపీకి వ్యతిరేకంగా మహాకూటమి



లక్నో: మతతత్వ బీజేపీకి వ్యతిరేకంగా 2019 సాధారణ ఎన్నికలకు ముందే మహాకూటమి ఏర్పాటవుతుందని జేడీయూ మాజీ ఎంపీ శరద్‌యాదవ్ విశ్వాసం వ్యక్తం చేశారు. సామాజిక న్యాయకోసం చేసే ఈ పోరాటంలో ఒంటరిగా ముందుకు వెళ్లడం సాధ్యం కాదని, బీజేపీ విస్తరించిన మతతత్వాన్ని అడ్డుకోవాలంటే మహాకూటమిగా ఏర్పడాలని అభిప్రాయపడ్డారు. ‘ప్రస్తుతం దేశంలో జరుగుతున్న అతిపెద్ద పోరాటం సామాజిక న్యాయం కోసమే. బీజేపీ విస్తరించిన మతతత్వ వాదానికి అడ్డుకట్ట వేస్తేనే ఇది సాధ్యపడుతుంది. 2019 ఎన్నికలకు ముందే బీజేపీకి వ్యతిరేకంగా మహాకూటమి ఏర్పాటవుతుందనే నమ్మకం ఉంది’ అని పేర్కొన్నారు. ప్రస్తుతం రాజకీయ సమీకరణాలు మారిపోయాయని, సమాజంలోని ఏ వర్గం బీజేపీపై సంతోషంగా లేరని, ఈసారి బీజేపీ హిందూ–ముస్లిం అజెండా పనిచేయబోదని చెప్పారు.

రెండేళ్ల గరిష్ట స్థాయికి సహజ వాయువు ధర?

న్యూఢిల్లీ: దేశీయ సహజ వాయువు ధరను పెంచేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. వచ్చే వారమే కేంద్రం ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఒకవేళ అదే జరిగితే రెండేళ్లలో ఇదే గరిష్ట పెంపు కానుంది. దీని వల్ల సీఎన్‌జీ, విద్యుత్, యూరియా తదితరాల ధరలు పెరుగుతాయి. స్వదేశంలో ఉత్పత్తి అయ్యే మిలియన్ బ్రిటిష్ థర్మల్ యూనిట్(ఎంబీటీయూ) సహజ వాయువు ధర ఏప్రిల్ 1 నుంచి ప్రస్తుతమున్న 2.89 డాలర్ల(సుమారు రూ.189) నుంచి 3.06 డాలర్ల(రూ.199)కు పెరిగే అవకాశాలున్నాయి.

కేసీఆర్ ఫ్రంట్ సక్సెస్ కాదు: కారత్



న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలంటే రాష్ట్రాల వారీగా ఆ పార్టీ వ్యతిరేక ఓట్లను ఏకం చేయాలని, బీజేపీ, కాంగ్రెసేతర ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు ప్రయత్నాలు ఫలించబోవని సీపీఎం మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్ అన్నారు. పార్టీ పత్రిక పీపుల్స్ డెమొక్రసీలో ఆయన సంపాదకీయం రాస్తూ.. ‘ తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రతిపాదించిన బీజేపీ, కాంగ్రెసేతర ఫ్రంట్ ఏర్పాటు ప్రయత్నాలు విఫలమవుతాయి. డీఎంకే, ఆర్జేడీ వంటి కొన్ని ప్రాంతీయ పార్టీలు సొంత రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో కొనసాగుతున్నాయి. విధానాలు, స్థానిక ప్రయోజనాల దృష్ట్యా ప్రాంతీయ పార్టీల మధ్య అనేక వైరుధ్యాలు ఉండడం ఫ్రంట్ ఏర్పాటుకు అడ్డంకిగా మారనున్నాయి. అందువల్ల యూపీలో అనుసరించినట్లు బీజేపీ వ్యతిరేక ఓట్లను ఏకం చేస్తేనే ఆ పార్టీని ఓడించగలం’ అని పేర్కొన్నారు.

క్షయని నోటిఫై చేయకుంటే జైలు శిక్ష

న్యూఢిల్లీ: క్షయ కేసుల వివరాలను వైద్యులు ఇకపై తప్పనిసరిగా సంబంధిత జిల్లా అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. అలా చేయని పక్షంలో వారికి రెండేళ్ల వరకు జైలు శిక్ష విధించనున్నారు. ఔషధ విక్రేతలకు కూడా ఇది వర్తిస్తుంది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ విషయాలతో గెజిట్ ప్రకటన జారీచేసింది. వైద్యులు, ఫార్మసీలు తప్పకుండా క్షయ వ్యాధి కేసులను నోటిఫై చేయాలని ఆ నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. జైలుశిక్షతో పాటు జరిమానా కూడా విధిస్తారు.

ఫేస్‌బుక్‌కు మరింత భద్రత

భారత్, బ్రెజిల్ ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం

- కృత్రిమ మేధస్సుతో ఫేక్ అకౌంట్లు.. అసత్యవార్తలకు కళ్లెం
- అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికలపై అదృశ్య హస్తం.. దీన్ని ఎదుర్కొంటాం
- పొరపాటుకు చింతిస్తున్నాం.. క్షమించండి: ఫేస్‌బుక్ సీఈవో జుకర్‌బర్గ్



వాషింగ్టన్: భారత్‌లో వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని దేశ ఎన్నికల వ్యవస్థ సమగ్రతకు గౌరవమివ్వటంతోపాటు ఫేస్‌బుక్‌లో వినియోగదారుల భద్రతను పటిష్టం చేస్తున్నట్లు ఆ సంస్థ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ స్పష్టం చేశారు. వినియోగదారుల భద్రతతో ఆయాదేశాల సమగ్రతను కాపాడేందుకు నిర్ణయించినట్లు..ఆయన గురువారం వెల్లడించారు. భారత్, బ్రెజిల్ తదితర దేశాల్లో ఎన్నికలు జరగనున్నందున.. ఫేస్‌బుక్ భద్రతను పటిష్టపరచనున్నట్లు జుకర్‌బర్గ్ తెలిపారు. ఇందుకోసం కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ – ఏఐ) టూల్స్ ద్వారా ఫేక్ అకౌంట్లను గుర్తించటం, ఎన్నికలను ప్రభావితం చేసే యాప్‌లను తొలగించే పని ప్రారంభమైందన్నారు. తాజా గందరగోళం నేపథ్యంలో తొలిసారిగా బహిరంగంగా ప్రజల ముందుకు వచ్చిన జుకర్‌బర్గ్.. వినియోగదారుల విశ్వాసానికి భంగం కలిగించినందుకు క్షమాపణలు కోరారు. ఇకపై ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరిస్తామని వెల్లడించారు.

కృత్రిమ మేధస్సుతో నిరంతర సమీక్ష

‘2016 ఎన్నికల తర్వాత మేం రూపొందించిన ఏఐ టూల్స్ ద్వారా ఈ ఎన్నికలను ప్రభావితం చేసేందుకు సృష్టించిన 30వేల (రష్యాకు చెందినవిగా భావిస్తున్న) ఫేక్ అకౌంట్లను తొలగించాం. ఫ్రాన్స్ ఎన్నికల్లో అలాంటి బయటి శక్తుల ప్రభావం ఉండకుండా జాగ్రత్తపడ్డాం. 2017 అలబామా ఎన్నికల్లోనూ కొత్తగా రూపొందించిన ఏఐ కారణంగా, ఫేక్ అకౌంట్లు, తప్పుడు వార్తలను అడ్డుకోగలిగాం. అమెరికాలో 2018లో జరగనున్న మిడ్‌టర్మ్ ఎన్నికలతోపాటు, భారత్, బ్రెజిల్‌లలో జరగనున్న ఎన్నికల్లోనూ ఇలాంటి భద్రతాపరమైన చర్యలు తీసుకోవటంపై దృష్టిపెడతాం. భారత్‌లో ఈ ఏడాది చాలా పెద్ద ఎన్నిక జరగనుంది. అందుకే వారి ఎన్నికల వ్యవస్థ సమగ్రతను గౌరవిస్తూ.. ఫేస్‌బుక్‌ను భద్రంగా మారుస్తాం’ అని జుకర్‌బర్గ్ పేర్కొన్నారు. వివిధ దేశాల ఎన్నికల్లో రష్యా వంటి దేశాల ప్రభావం ఉండకుండా ఫేస్‌బుక్ మరింత కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. డేటా భద్రతపై ప్రస్తుతం పనిచేస్తున్న నిపుణుల సంఖ్యను రెట్టింపుచేయనున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది చివరికల్లా 20వేల మంది కేవలం భద్రతపైనే పనిచేస్తారన్నారు. ఫేస్‌బుక్ డేటా లీకేజీపై భారత ప్రభుత్వం సీరియస్‌గా స్పందిస్తూ.. ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని, జుకర్‌బర్గ్‌ను భారత్‌కు పిలిపించి విచారణ జరపాల్సి ఉంటుందని హెచ్చరించిన సంగతి తెలిసిందే.

అమెరికా ఎన్నికలపై అదృశ్య హస్తం!

ఫేస్‌బుక్ వివరాల ద్వారా అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ఎవరో ప్రయత్నిస్తున్నారని జుకర్‌బర్గ్ వెల్లడించారు. 2016 ఎన్నికల్లో రష్యా ప్రయత్నించినట్లుగానే.. ‘వర్షన్ 2’తో కుటిలయత్నాలు జరుగుతున్నాయి. కొత్త వ్యూహాలతో జరుగుతున్న ఈ ప్రయత్నాలను గుర్తించి వాటిని ఎదుర్కొనాల్సిన అవసరం ఉంది’ అని తెలిపారు.

నన్ను క్షమించండి

ప్రపంచవ్యాప్తంగా 5కోట్ల వినియోగదారుల వివరాల లీకేజీపై ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఫేస్‌బుక్ సీఈవో జుకర్‌బర్గ్ క్షమాపణలు తెలిపారు. వినియోగదారుల విశ్వాసానికి భంగం కలిగిందని, తమవైపు నుంచి తప్పు జరిగిందని.. ఇకపై అలా జరగకుండా డేటా వివరాలను మరింత భద్రంగా చూసుకుంటామన్నారు. ‘నేను ఫేస్‌బుక్‌ను ప్రారంభించాను. ఈ వేదిక ద్వారా ఏం జరిగినా దానికి నేనే బాధ్యుడిని. నన్ను క్షమించండి. మన సమాజ సమాచారాన్ని భద్రంగా ఉంచేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నాం. ఇకపై ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకుంటాం’ అని కేంబ్రిడ్జ్ అనలిటికా వివాదం అనంతరం తొలిసారిగా జుకర్‌బర్గ్ ప్రకటన చేశారు. ‘నేను యువకుడిగా, సరైన అనుభవం లేనప్పుడు సంస్థను ప్రారంభించాను. సాంకేతికతంగా,వాణిజ్యపరంగా తప్పులు దొర్లాయి. చాలా సందర్భాల్లో తప్పుడు వ్యక్తులను ఉద్యోగంలోకి తీసుకున్నాను. అదే నా పొరపాటు’ అని అన్నారు.

20 లక్షల గ్రాట్యుటీకి పన్ను నో

పన్ను మినహాయింపు సవరణలకు పార్లమెంటు ఆమోదం



న్యూఢిల్లీ: ఉద్యోగుల గ్రాట్యుటీపై రూ. 20 లక్షల వరకూ పన్ను మినహాయింపునిచ్చే గ్రాట్యుటీ బిల్లు(సవరణ)ను పార్లమెంటు ఆమోదించింది. ఈ బిల్లును కేంద్ర కార్మిక మంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్ గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టగా ఎలాంటి చర్చా లేకుండా మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. మార్చి 15నే ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. రాష్ట్రపతి సంతకం అనంతరం బిల్లులోని సవరణలు అధికారికంగా అమల్లోకి వస్తాయి. కేంద్ర ఉద్యోగులకు ఏడో వేతనసంఘం సిఫార్సుల అమలు నేపథ్యంలో.. పన్ను భారం లేని గ్రాట్యుటీ గరిష్ట పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచడంతో తాజా మార్పులు అవసరమయ్యాయి. కేంద్ర సివిల్ సర్వీస్ నిబంధనలు(1972) వర్తించని ప్రైవేటు రంగంలోని సిబ్బందికి ఈ సవరణలతో ప్రయోజనం చేకూరనుంది. చివరి నెల జీతంలోని మూల వేతనాన్ని పరిగణనలోకి తీసుకుని సంస్థలో పనిచేసిన కాలం ఆధారంగా వారి గ్రాట్యుటీని లెక్కిస్తారు.

బిల్లులోని ముఖ్యాంశాలు

ఉద్యోగుల గ్రాట్యుటీపై గరిష్ట పన్ను పరిమితిని రూ.10 లక్షల నుంచి 20 లక్షలకు పెంచడానికి బిల్లు ప్రభుత్వానికి అవకాశం కల్పిస్తుంది. ఇకపై గ్రాట్యుటీ పరిమితిలో అధికారిక ఉత్తర్వుల ద్వారానే కేంద్రం మార్పులు చేర్పులు చేయవచ్చు. ఎన్ని ప్రసూతి సెలవుల్ని సర్వీసులో భాగంగా పరిగణించాలన్న అధికారం కూడా ప్రభుత్వానికి లభిస్తుంది. ప్రసూతి సెలవుల కాలాన్ని కూడా అధికారిక ఉత్తర్వుల ద్వారానే కేంద్రం నిర్ణయిస్తుంది. ప్రసూతి సెలవు చట్టాన్ని గతేడాది సవరించి గరిష్ట సెలవులను 12 వారాల నుంచి 26 వారాలకు పెంచారు. దీంతో గ్రాట్యుటీ చెల్లింపు చట్టంలో ప్రసూతి సెలవులపైనా సవరణలు చేశారు.


ఆధార్ వ్యవస్థ పటిష్టం!

- ఆన్‌లైన్లో ఎప్పుడైనా ధ్రువీకరించుకునే సౌలభ్యం
- సుప్రీంకోర్టులో యూఐడీఏఐ సీఈఓ ప్రజెంటేషన్

న్యూఢిల్లీ: ఆధార్ కార్డు లేకపోవడం వల్ల ఎంత మంది ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమయ్యారో తమ వద్ద అధికారిక సమాచారం లేదని ఆధార్ ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) సుప్రీంకోర్టుకు తెలిపింది. ఆధార్ వల్ల పౌరులకు పటిష్టమైన, జీవితాంతం ఆన్‌లైన్‌లో ధ్రువీకరించుకోగల గుర్తింపుకార్డు లభించిందని ఉద్ఘాటించింది. ఆధార్ నమోదుకు వ్యక్తి ఫొటో, వేలి ముద్రలు, కంటి పాపకు సంబంధించిన వివరాలు మినహా కులం, మతం, భాష లాంటి సమాచారం కోరడం లేదంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ముందు యూఐడీఏఐ సీఈఓ అజయ్ పాండే ఆధార్ నిర్వహణ, అమలు తీరుతెన్నులను వివరిస్తూ గురువారం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమాచార భద్రత, ఆధార్ సాకుతో ప్రజలకు ప్రభుత్వ పథకాల నిరాకరణ వంటి అంశాలపై బెంచ్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఆధార్‌తో జరిపే లావాదేవీలపై యూఐడీఏఐ నిఘా పెట్టదని పేర్కొన్నారు. ప్రామాణిక ఎన్‌క్రిప్షన్ రేటు 256 కాగా, ఆధార్ వ్యవస్థ నిర్వహణకు 2048 బిట్ల ఎన్‌క్రిప్షన్‌ను వినియోగిస్తున్నట్లు చెప్పారు. అసంపూర్తిగా ముగిసిన ఈ ప్రజెంటేషన్ ఈనెల 27న కొనసాగుతుంది.

రైతులకు పరిహారం రూ.5

తమిళనాడులో బీమా కంపెనీల మాయాజాలం



చెన్నై: వాతావరణం సహకరించక పంట దెబ్బతిని నష్టపోయిన తమిళనాడు రైతులకు బీమా కంపెనీలు షాకిచ్చాయి. దిండిగల్, నాగపట్నం జిల్లాల్లో పంట నష్టపోయిన రైతులకు రూ.10, రూ.5, రూ.4, రూ.2 చొప్పున నష్టపరిహారాన్ని విడుదల చేశాయి. ఈ మొత్తాన్ని దిండిగల్ కేంద్ర సహకార బ్యాంక్ రైతులకు చెక్కుల రూపంలో ఫిబ్రవరిలో అందించింది. ఈ విషయంపై తమిళనాడు శాసనసభ గురువారం దద్దరిల్లింది. మాజీ మంత్రి, డీఎంకే నేత కె.పిచండి ఈ చెక్కులను సభలో ప్రదర్శించారు. ‘కరుపసామి రూ.102 ప్రీమియం కట్టినప్పటికీ ఆయనకు రూ.10 మాత్రమే నష్టపరిహారంగా అందింది. తిరుమలైసామి అనే మరో రైతు రూ.50 ప్రీమియం కట్టగా, ఆయనకు కేవలం రూ.5 నష్టపరిహారం ఇచ్చారు. ఈ చెక్కుల్ని మార్చుకోవాలంటే బ్యాంకుకు వెళ్లి రూ.500తో ఖాతాను తెరవాలి. మరి వీటితో ఉపయోగం ఏముంది?’ అని ధ్వజమెత్తారు.

జయ వార్డులో సీసీ కెమెరాలు ఆపేశాం

అపోలో అధినేత ప్రతాప్ సి. రెడ్డి వెల్లడి



టీ.నగర్ (చెన్నై): దివంగత తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత అనారోగ్యంతో చికిత్స పొందిన సమయంలో.. ఒక ఐసీయూ యూనిట్ మొత్తాన్ని ఆమెకే కేటాయించామని, ముందు జాగ్రత్తగా ఆమె వార్డులోని సీసీ కెమెరాలను ఆపేశామని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ప్రతాప్ సి. రెడ్డి వెల్లడించారు. సంబంధం లేని వ్యక్తులు చూడకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కొలొరెక్టల్ సర్జరీ, యూఎస్‌ఏ క్లీవ్‌ల్యాండ్ క్లినిక్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 24, 25న నిర్వహించనున్న సదస్సు గురించి మీడియాతో మాట్లాడుతూ.. జయకు అందించిన చికిత్స వివరాల్ని వెల్లడించారు. ‘24 గదుల ఐసీయూ యూనిట్ మొత్తాన్ని జయకే కేటాయించినా.. ఒక గదిని మాత్రమే ఉపయోగించాం. చికిత్స పొందిన 75 రోజులు అన్ని సీసీటీవీల్ని ఆపుచేశాం. మిగతా రోగుల్ని వేరే ఐసీయూలోకి మార్చాం’ అని చెప్పారు. కొద్దికాలం సన్నిహిత బంధువులు తప్ప ఎవరినీ ఐసీయూలోకి అనుమతించలేదని, ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పుడు డ్యూటీలో ఉన్న వైద్యుడి సమ్మతి మేరకే అనుమతించేవారిమని తెలిపారు. జయలలితకు ఆస్పత్రిలో అత్యుత్తమ వైద్య చికిత్స అందించామని, విదేశీ వైద్యులు కూడా సాయపడ్డారని, ఆమె పూర్తిగా కోలుకున్నారని భావించిన తరుణంలో తీవ్ర గుండెపోటు రావడంతో ఎంత ప్రయత్నించినా కాపాడలేకపోయామన్నారు.

‘డేటా బేస్డ్’ వ్యూహాలే!

పార్టీల ఎన్నికల ప్రణాళికలకు ఓటర్ల వివరాలే ఆధారం



వివిధ దేశాల్లో ఎన్నికల వ్యూహాల తయారీకి ఫేస్‌బుక్ యూజర్ల వ్యక్తిగత సమాచారాన్ని కేంబ్రిడ్జ్ అనలిటికా (సీఏ) సంస్థ దుర్వినియోగం చేసిన నేపథ్యంలో.. భారత్‌లో ఎన్నికల సందర్భంగా ప్రచార వ్యూహాలు ఏ విధంగా రూపొందిస్తారు? ఇందుకు ప్రజల నుంచి సమాచారాన్ని ఎలా సేకరిస్తారు? దీన్ని సమీక్షించి ప్రచారరూపాలుగా మళ్లీ ప్రజల్లోకి పార్టీలు ఎలా తీసుకెళ్తున్నాయనేది ఆసక్తికరంగా మారింది. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరగనుండడంతో ప్రధాన పార్టీలవ్యూహాలపై చర్చ మొదలైంది.

డేటాదే కీలక పాత్ర

సామాజిక మాధ్యమాలతోపాటు వివిధ రూపాల్లో ప్రజల నుంచి సమాచారాన్ని సేకరించి, ఎన్నికల సందర్భంగా చర్చకు వచ్చే అంశాలు, సమస్యలు, ఓటర్ల మొగ్గును బట్టి కొన్ని సంస్థలు పార్టీల కోసం ప్రచార వ్యూహాలు రూపొందిస్తాయి. భారత్‌లోనూ సామాజిక మాధ్యమాల విస్తృతి పెరిగిన నేపథ్యంలో ప్రజల నుంచి సేకరించే వివరాలను ఏ విధంగా ఉపయోగిస్తారనేది కీలకం. ప్రధానంగా పార్టీలు, సంస్థలు భారత జనాభా లెక్కల సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. ఈ డేటా విషయంలో ఎన్నికల సంఘం విడుదల చేసే వార్డు స్థాయిలో వివిధ పార్టీలకు పడిన ఓట్ల వివరాలు ముఖ్య భూమికను పోషిస్తున్నాయి. వీటి ఆధారంగా ఓటర్ల మనోభావాలు, ఎన్నికల అంశాలు వెల్లడవుతాయి.

బీజేపీకి సొంత టీమ్

పార్టీ ఎన్నికల వ్యూహానికి సంబంధించి, ఓటర్ల డేటాను విశ్లేషించేందుకు బీజేపీ సొంతంగా తన బృందాన్ని వినియోగిస్తోంది. ఈ జాతీయ సమాచార, సాంకేతిక విభాగానికి అమిత్ మాలవీయ నేతృత్వం వహిస్తున్నారు. అంకెల రూపంలోని ఓటర్ల సమాచారంతో పోలింగ్‌బూత్ స్థాయిలో తమ బృందం పనిచేస్తుందని, దీనిపై విశ్లేషణ కుదిరాక పార్టీ రాజకీయ వ్యూహం ఖరారు చేస్తుందని మాలవీయ చెప్పారు. గత ఎన్నికల్లో ఇలాంటి విశ్లేషణతో వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా 543 నియోజకవర్గాల్లోని 11.36 లక్షల పోలింగ్ బూత్‌లలో 81 కోట్ల ఓటర్లు లక్ష్యంగా ప్రచారం చేశారు.

కాంగ్రెస్‌కి కూడా..: కాంగ్రెస్‌కూ జాతీయ స్థాయిలో ఎన్నికల ప్రక్రియ, డేటా పర్యవేక్షణ, విశ్లేషణకూ ఓ టీం ఉంది. పొలిటికల్ ఎకానమిస్ట్ ప్రవీణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో డేటా విశ్లేషణ విభాగాన్ని నియమించారు. ఎన్నికల సమాచారంతో పాటు పార్టీ కార్యకర్తలు సేకరించిన వివరాలు, పబ్లిక్ డేటాను తమ బృందం విశ్లేషిస్తుందని ప్రవీణ్ పేర్కొన్నారు. –సాక్షి నాలెడ్జ్ సెంటర్

బహిరంగ సమాచారమూ ముఖ్యమే

2019 ఎన్నికల్లో 90 కోట్లకు పైగా ఓటర్లు పాలుపంచుకోనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్, జనాభా లెక్కలు, జాతీయ శాంపిల్ సర్వే సంస్థ సేకరించి, విడుదల చేసిన సమాచారానికి అనుగుణంగానే విశ్లేషణ చేపడుతున్నట్లు ఆక్సిస్ సంస్థ వ్యవస్థాపకుడు అశ్వినీ సింగ్లా చెప్పారు. ఒక్కో ఓటరు ఆలోచనా ధోరణి, అభిప్రాయాలతో ఉండడంతో పాటు భాషా, కులం, సామాజిక, ఆర్థిక స్థాయిల్లో అంతరాలు వంటి అంశాలతో భారత్‌లో పరిస్థితి సంక్లిష్టంగా మారిందని.. తమ బృందం సేకరించిన డేటా ఆధారంగా పంచాయతీ నుంచి సాధారణ ఎన్నికల వరకు సరళిని అంచనా వేస్తున్నామన్నారు. గత ఎన్నికల్లో మోదీ విజయానికి కృషి చేసినట్టు పేర్కొన్నారు.

టీడీపీ కుతంత్రాలను తిప్పికొడతాం

రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు పూడి తిరుపతిరావు



విజయనగరం అర్బన్: ప్రజా వ్యతిరేకతను బీజేపీపై నెట్టడానికి టీడీపీ కుతంత్రాలు పన్నుతోందని, దీన్ని గ్రామస్థాయిలో తిప్పికొడతామని రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు పూడి తిరుపతిరావు పేర్కొన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పార్టీ రాష్ట్ర కమిటీ పదాధికారుల ఉత్తరాంధ్ర సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో పొత్తు పెట్టుకున్నామని, అయితే టీడీపీ అవినీతి, అక్రమాలే లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. జన్మభూమి కమిటీ సభ్యుల నుంచి ఎంపీల వరకు కేంద్ర ప్రభుత్వ నిధులను అవినీతి పాలు చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ అవినీతి, అక్రమాలను మిత్రపక్ష అంతర్గత సమావేశాల్లో నాలుగేళ్లుగా చెబుతూ వస్తున్నామని తెలిపారు. అయితే ఆ హెచ్చరికలను పెడచెవిన పెట్టిన టీడీపీ.. మరింత రెచ్చిపోయి నిధులు దుర్వినియోగం చేయడం వల్లే ప్రజల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వచ్చిందని విమర్శించారు.

గొర్రెలు, మేకల పెంపకందారులకు 5 వేల కోట్లు ఇవ్వాలి: జీఎంపీఎస్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమానికి రూ. 5 వేల కోట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం(జీఎంపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రామకృష్ణ డిమాండ్ చేశారు. గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీఎంపీఎస్ ఆధ్వర్యంలో విజయవాడలో గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా గొర్రెలకాపరికి 75 శాతం సబ్సిడీతో యూనిట్‌కు రూ. 2 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో గొర్రెలు, మేకల మేత కోసం 5 నుంచి 20 ఎకరాల ప్రభుత్వ భూములు కేటాయించాలన్నారు. వేసవిలో వలసల నివారణకు ప్రత్యేక కార్యచరణ చేపట్టాలని కోరారు. ప్రమాదవశాత్తు చనిపోయిన గొర్రెల పెంపకందారులకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ గాబ్రియేల్ పాల్గొని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు



ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం విజయవాడలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని ఎన్నికల ముందు మాట ఇచ్చిన బీజేపీ, టీడీపీలు అధికారంలోకి వచ్చాక మాట తప్పాయన్నారు. అసెంబ్లీ స్థానాల పెంపుపై శ్రద్ధ చూపుతున్న చంద్రబాబు.. మాదిగల చిరకాల కోరిక అయిన వర్గీకరణను మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఎంత అవసరమో మాదిగలకు వర్గీకరణ అంతే అవసరమని చెప్పారు.

బీసీలకు 33 శాతం టికెట్లు కేటాయించాలి

సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరయ్య డిమాండ్

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 33 శాతం టికెట్లు కేటాయించాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య డిమాండ్ చేశారు. విశాఖలోని ఓ హోటల్లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో తెలుగుదేశం ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. బీసీలు ఎంతో వెనుకబడి ఉన్నందున రూ.30 వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ నుంచి బీసీలను మినహాయించాలని, అదే యాక్ట్ బీసీలకు కూడా రూపొందించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని కోరారు. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 50 శాతం కోటా ఇవ్వాలన్నారు.

త్వరలో 16 కొత్త రెవెన్యూ డివిజన్లు

సాక్షి, అమరావతి: పరిపాలనా సౌలభ్యం కోసం మరికొన్ని రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగానే జిల్లా కలెక్టర్లను కోరగా 16 కొత్త డివిజన్ల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు వచ్చాయని ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో పాతపట్నం, విజయనగరం జిల్లాలో చీపురుపల్లి, బొబ్బిలి, విశాఖ జిల్లాలో చోడవరం, చింతపల్లి, పశ్చిమ గోదావరి జిల్లాలో భీమవరం, కృష్ణా జిల్లాలో నందిగామ, గుంటూరు జిల్లాలో బాపట్ల, ప్రకాశం జిల్లాలో మార్టూరు, దర్శి, చిత్తూరు జిల్లాలో శ్రీకాళహస్తి, కుప్పం, వైఎస్సార్ జిల్లాలో బద్వేల్, కర్నూలు జిల్లాలో పత్తికొండ, ఆత్మకూరు, అనంతపురం జిల్లాలో గుంతకల్ రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు కోసం జిల్లా కలెక్టర్ల నుంచి ప్రతిపాదనలు వచ్చాయని, ప్రభుత్వం వీటికి ఆమోదం తెలపాల్సి ఉందని రెవెన్యూ వ్యవహారాలు చూస్తున్న కేఈ కృష్ణమూర్తి తెలిపారు. వీటి ఏర్పాటుకు ముందుగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసి నిబంధనల ప్రకారం ప్రజల నుంచి సూచనలు స్వీకరించి తదుపరి తుది నిర్ణయం తీసుకుంటామని వివరించారు. తూర్పుగోదావరి జిల్లాలో కూడా అదనపు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలు కోరుతున్నారని, జిల్లా కలెక్టరు నుంచి ప్రతిపాదనలు తెప్పిస్తామని తెలిపారు.

హోదాపై 25న ఉపాధ్యాయ సంఘాల భేటీ

సాక్షి, అమరావతి: ప్రత్యేక హోదా సాధన ఉద్యమంలో ఉపాధ్యాయుల భవిష్యత్ కార్యాచరణపై 25న విజయవాడలో సమావేశం నిర్వహించనున్నట్లు పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కమలాకర్ రావు, శ్రీధర్‌రెడ్డిలు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ రామకృష్ణ, వివిధ సంఘాల నాయకులు పాల్గొననున్నారని తెలిపారు. పీఆర్టీయూ కార్యవర్గానికి తనను అధ్యక్షునిగా కొనసాగించాలని కోరుతూ వేసిన వ్యాజ్యాన్ని కృష్ణా జిల్లా కోర్టు విచారణకు స్వీకరించి ప్రతివాదులకు నోటీసులు జారీచేసిందని కమలాకర్‌రావు తెలిపారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గడ్డం నారాయణరావు, కొండూరు శ్రీనివాసరాజుల ఎన్నిక చెల్లదన్నారు.

రాష్ట్రంలో బీజేపీ పప్పులుడకవు..

బీజేపీపై విరుచుకుపడ్డ టీడీపీ ఎమ్మెల్యేలు

సాక్షి, అమరావతి: బీజేపీపై టీడీపీ ఎమ్మెల్యేలు విరుచుకుపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో గురువారం బీజేపీపై, ఆ పార్టీ శాసనసభా పక్ష నేత విష్ణుకుమార్‌రాజుపై తీవ్ర విమర్శలు చేశారు. టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ పప్పులుడకవని, బీజేపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని రాష్ట్ర ప్రజలు నమ్మరని అన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన చేసిన కాంగ్రెస్‌కు రాష్ట్ర ప్రజలు డిపాజిట్లు లేకుండా చేశారని, ఇప్పుడు రాష్ట్రానికి నిధులు రానీయకుండా చేస్తున్న బీజేపీకి అదే గతి పడుతుందని అన్నారు. మరో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర మాట్లాడుతూ మొన్నటి వరకు పట్టిసీమ ప్రాజెక్టును పొగడటమే కాకుండా కాంట్రాక్టర్లకు సన్మానం చేయాలన్న విష్ణుకుమార్‌రాజు బుధవారం అసెంబ్లీలో తమపై అవినీతి ఆరోపణలు చేయడం బీజేపీ కుటిల నీతిని తెలియచేస్తోందంటూ విమర్శించారు.

46 అంతస్తులతో సీఎం టవర్..

- రాజధానిలో సచివాలయం తుది ఆకృతులు
- సీఆర్‌డీఏ సమావేశంలో 'ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్' ప్రజెంటేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర రాజధాని అమరావతిలో 46 అంతస్తులతో సీఎం టవర్, అందులో సీఎం కార్యాలయం, సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ఉండేలా డిజైన్ రూపొందించారు. గురువారం సీఆర్‌డీఏ సమావేశంలో సీఎం చంద్రబాబుకు 'ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్' ప్రతినిధులు సచివాలయం తుది ఆకృతులపై ప్రజెంటేషన్ ఇచ్చారు. సీఎం టవర్ పైభాగాన హెలీప్యాడ్ ఉండేలా డిజైన్ చేశారు. ఈ టవర్ చెంతనే సీఎస్ టవర్ ఉండేలా డిజైన్లు ఇచ్చారు. ఐదు టవర్లుగా నిర్మించనున్న సచివాలయం భవంతులు పాలవాగుకు రెండువైపులా ఉండేలా డిజైన్లు రూపొందించారు. ఒక్కొక్క టవర్ 40 అంతస్తులు ఉండనుంది. ఇందులో మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతుల కార్యాలయాలు ఉంటాయి. 5 టవర్లకు చెంతనే ఫుడ్ ప్లాజాలు, స్పోర్ట్స్ ఏరియా, ఇతర సౌకర్యాల కోసం విడిగా నిర్మాణాలను రెండంతస్తులుగా నిర్మించనున్నారు. అన్ని టవర్లను కలుపుతూ 600 మీటర్ల మేర అంతర్గత మార్గం ఉండేలా డిజైన్ రూపొందించారు. ఏప్రిల్ 10, 11, 12 తేదీల్లో అమరావతిలో జరిగే సంతోష నగరాల సదస్సు ఏర్పాట్లపై సీఆర్‌డీఏ సమావేశంలో సీఎం సమీక్షించారు.



సచివాలయంలో నమూనాలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, అధికారులు

ప్రత్యేకహోదా కోసం వెంకయ్య రాజీనామా చేయాలి

హెచ్ఆర్‌పీసీ రాష్ట్ర అధ్యక్షుడు బాబూఖాన్ డిమాండ్



గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న హెచ్ఆర్‌పీసీ సభ్యులు

గుంటూరు వెస్ట్: రాష్ట్రం దిక్కుతోచని స్థితిలో ఉంటే ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఏమీ పట్టనట్టు ఉండడం సరికాదని మానవహక్కుల పరిరక్షణ కమిటీ (హెచ్ఆర్‌పీసీ) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.బాబూఖాన్ అన్నారు. విభజన సమయంలో పార్లమెంట్‌లో గొంతెత్తి మాట్లాడిన వెంకయ్యనాయుడు ఇప్పుడు కూడా తన పదవికి రాజీనామా చేసి ప్రత్యేక హోదా ఉద్యమంలోకి రావాలని కోరారు. ఐదు కోట్ల మంది ఆవేదనను, ఆకాంక్షను ఎన్‌డీఏ ప్రభుత్వం విస్మరించడం అన్యాయమన్నారు. గురువారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట హెచ్ఆర్‌పీసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూఖాన్ మాటాడుతూ.. రాజకీయ స్వార్థం కోసం కొందరు నాయకులు ఆడిన నాటకాలకు రాష్ట్ర ప్రజలు మూల్యం చెల్లించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏఎన్‌యూ బడ్జెట్‌కు పాలకమండలి ఆమోదం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 2018–19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌కు పాలకమండలి ఆమోదం తెలిపింది. వీసీ ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో గురువారం ఏఎన్‌యూ పాలకమండలి సమావేశం జరిగింది. ఏఎన్‌యూ బడ్జెట్‌లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఖర్చులు రూ.462,72,07,642 కాగా ఆదాయం రూ.460,64,43,161గా ప్రతిపాదించారు. వచ్చే ఏడాదిలో రూ.2,07,64,481 లోటుగా పేర్కొన్నారు.

3 నెలల్లో మున్సిపాలిటీల్లో పైపులైన్ల మార్పు

పురపాలక శాఖ మంత్రి నారాయణ

నగరంపాలెం(గుంటూరు): రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో సైడుకాల్వల నుంచి వెళ్తున్న మంచి నీటి పైపులైన్లు, శిథిలమైన పైపులైన్లను మూడు నెలల్లో పూర్తిస్థాయిలో మార్చేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పి.నారాయణ తెలిపారు. గుంటూరు ఆనందపేటలో నూతన పైపులైన్ల ఏర్పాటు పనులను మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, నగరపాలక సంస్థ కమిషనర్‌తో కలిసి గురువారం మంత్రి నారాయణ పరిశీలించారు. బాధిత ప్రాంతాల్లో పరిస్థితి అదుపులో ఉన్నా, ముందస్తు చర్యలుగా వైద్యశిబిరాలు కొనసాగిస్తున్నామన్నారు.

అట్రాసిటీ చట్టంపై తీర్పును పునఃసమీక్షించాలి

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు

సాక్షి, అమరావతి: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై సుప్రీం కోర్టు తీర్పును పునఃసమీక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు డిమాండ్ చేశారు. అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదైతే నిందితులెవ్వరినీ తక్షణమే అరెస్టు చేయరాదని, డీఎస్పీ స్థాయి అధికారి విచారణ జరిపి నిజానిజాలు తెలుసుకున్న తర్వాతనే అరెస్టు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే చట్టం అమలులో అధికార పక్షం వారు అడుగడుగునా అడ్డుపడుతున్నారని, కోర్టు ఇచ్చిన తీర్పుతో వారు మరింత రెచ్చిపోయే ప్రమాదం ఉందని సుబ్బారావు ఆందోళన వ్యక్తం చేశారు.

వేతన పెంపు జీవో తక్షణమే విడుదల చేయాలి

ఏపీ గ్రామ సహాయకుల సంఘం డిమాండ్



అలంకార్ ధర్నాచౌక్ వద్ద మహాధర్నాకి హాజరైన వీఆర్‌ఏలు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): గ్రామ రెవెన్యూ సహాయకుల వేతన పెంపు జీవోను తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.పెద్దన్న, ఎం.బాలకాశి డిమాండ్ చేశారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించారు. తొలుత రైల్వే స్టేషన్ నుంచి ధర్నాచౌక్ వరకు వీఆర్‌ఏలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అలంకార్ సెంటర్‌లోని ధర్నాచౌక్‌లో ఏర్పాటు చేసిన సభలో పెద్దన్న, బాలకాశి మాట్లాడారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారం కోసం నాలుగేళ్లుగా అనేక రూపాల్లో ఉద్యమాలు చేశామని చెప్పారు. వేతన పెంపు ప్రతిపాదనల ఫైల్ ముఖ్యమంత్రికి చేరి మూడు నెలలు కావస్తున్నా జీవో జారీ చేయలేదన్నారు.

నిర్దేశిత లక్ష్యాల కోసమే భూ వినియోగం జరగాలి

విశాఖ జిల్లా యండాడలో భూములపై ఏపీ సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: విశాఖపట్నం జిల్లా యండాడ గ్రామంలో అనాథలు, వృద్ధులకు ఆశ్రమం ఏర్పాటు కోసం శ్రీ హయగ్రీవ ఫారమ్స్ డెవలపర్ సంస్థ చేసుకునే దరఖాస్తును పరిశీలించి చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఉమ్మడి హైకోర్టు ఆదేశించింది. ఆశ్రమాన్ని నిర్మించేందుకు గతంలో ప్రభుత్వం కేటాయించిన భూమిని సదరు సంస్థ విక్రయించడంగానీ, లీజుకు ఇవ్వడంగానీ చేయరాదని ఆ సంస్థకు హైకోర్టు తేల్చి చెప్పింది. ఈ మేరకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ కొంగర విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆశ్రమం నిర్మాణం కోసం విశాఖరూరల్ మండలం, యండాడ గ్రామంలో 12.51 ఎకరాలను మార్కెట్ ధర ఎకరా రూ.45 లక్షల చొప్పున శ్రీ హయగ్రీవ ఫారమ్స్‌కు ప్రభుత్వం 2008లో కేటాయించింది. హక్కులన్నింటినీ బదలాయించి 2010లో ఆ భూమిని హయగ్రీవ ఫారమ్స్‌కు స్వాధీనం చేసింది. దీంతో ఆ సంస్థ లే ఔట్ కోసం జీవీఎంసీ, వుడాలకు దరఖాస్తు చేసుకుంది. ఇదిలా ఉండగానే, శ్రీహయగ్రీవ ఫారమ్స్‌కు కేటాయించిన భూమి చాలా విలువైందని, అయితే ఆ భూమికి నిర్ణయించిన మార్కెట్ ధర చాలా తక్కువని, అందువల్ల కేటాయింపులు రద్దయ్యేలా చూడాలని ఏపీ అసెంబ్లీ ప్రజా పద్దుల కమిటీ అభిప్రాయపడింది. దీంతో జిల్లా కలెక్టర్ జీవీఎంసీ, వుడాలకు 2012లో లేఖ రాస్తూ శ్రీహయగ్రీవ ఫారమ్స్‌కి లేఔట్, భవన నిర్మాణ అనుమతులు ఇవ్వొద్దని స్పష్టం చేయడాన్ని గతంలో సింగిల్ జడ్జి జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు వెలువరించిన తీర్పులో తప్పుబట్టారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసిన భూమిని రేటు పెరిగిందని చెప్పి తర్వాత భూకేటాయింపును రద్దు చేయడం చెల్లదన్నారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఏపీ రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, విశాఖ జిల్లా కలెక్టర్లు అప్పీల్ చేశారు. వాదనల అనంతరం శ్రీహయగ్రీవ సంస్థ ఆశ్రమం నిర్మాణానికి చేసుకున్న దరఖాస్తుపై చట్ట ప్రకారం ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించింది.

పరస్పర సహకారంతో నేరాల నియంత్రణ

రాష్ట్ర అటవీ దళాల అధిపతి మల్లిఖార్జునరావు వెల్లడి

సాక్షి, అమరావతి: అన్ని శాఖలు పరస్పరం సహకరించుకుంటూ, సమాచారం ఇచ్చిపుచ్చుకుంటూ సమన్వయంతో పనిచేయడం ద్వారా నేరాలను నిరోధించవచ్చని రాష్ట్ర అటవీ దళాల అధిపతి పి.మల్లిఖార్జునరావు చెప్పారు. విజయవాడలో గురువారం దక్షిణాది రాష్ట్రాల అటవీ, పోలీసు, కస్టమ్స్, రైల్వే పోలీసు, సీఐడీ, ఈడీ, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరాల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందన్నారు. రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణా ద్వారా స్మగ్లర్లు సంపాదించిన ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలను టాస్క్‌ఫోర్సు డీజీపీ కాంతారావు ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వన్యప్రాణుల సంరక్షణకు, సింహం, పులి, ఏనుగు దంతాల స్మగ్లింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు అడవుల్లో నివసించే చెంచుల సహకారం తీసుకోవాలని అధికారులు పేర్కొన్నారు.

అవిలాల చెరువులో శ్రీవారి సొమ్ములు!



అవిలాల చెరువు

- మళ్లీ తెరపైకి సుందరీకరణ పనులు
- రూ.9.77 కోట్లతో టెండర్లు పిలిచిన టీటీడీ
- గతంలోనే రూ.85 లక్షల టీటీడీ నిధులతో పనులు
- చేసిన పనులకే మళ్లీ మళ్లీ నిధుల కేటాయింపు
- చెరువు ఇరిగేషన్‌ది... నిధులు టీటీడీవి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: దేవుడి సొమ్ము సంతర్పణ జరుగుతుంటే అడ్డుకోవాల్సిన వారే గుడ్లప్పగించి చూస్తున్నారు! అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వానికి దాసోహం అంటున్న టీటీడీ (తిరుమల తిరుపతి దేవస్థానం) శ్రీవారి సొమ్ములను దుబారా చేస్తోంది. తిరుమల వెంకన్నపై భక్తిప్రపత్తులతో భక్తులు ఇచ్చిన విరాళాలను ఎక్కడ పడితే అక్కడ మంచినీళ్లలా వాడేస్తోంది. ధర్మకర్తల మండలి లేకపోవడంతో అడిగేవారు లేరన్న ధీమాతో ఇష్టారాజ్యంగా నిధులను వెచ్చిస్తోంది. టీటీడీకి ఏ విధంగానూ సంబంధం లేని కట్టడాలు, చెరువుల అభివృద్ధి కోసమంటూ కోట్లకు కోట్లు ధారపోస్తోంది. ఈ అడ్డగోలు నిర్ణయాలను ప్రశ్నిస్తున్న భక్తులు వెంకన్న ఆస్తుల పరిరక్షణ కోసం అవిశ్రాంతంగా పోరాటాలు చేస్తూనే ఉన్నారు.

భక్తులు కోర్టుకు వెళ్లటంతో గతంలో ఆగిన పనులు..

తిరుపతికి సమీపంలోని అవిలాల చెరువుకు టీటీడీ ఇప్పటికే రూ.55 లక్షల ఖర్చుతో ఫెన్సింగ్ మరో రూ.30 లక్షలతో వాకింగ్ ట్రాక్‌ను నిర్మించింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చెరువును ఎకో పార్కుగా తీర్చిదిద్దుతామంటూ నిధుల కోసం టీటీడీకి లేఖ రాసింది. ఈవో సాంబశివరావు హయాంలో చెరువు సుందరీకరణ కోసం కోట్లల్లో నిధులు కేటాయించేందుకు సన్నాహాలు జరిగాయి. దేవుడి సొమ్ము దుబారా చేస్తున్నారని కొందరు భక్తులు కోర్టును ఆశ్రయించటంతో ఈ పనులు నిలిచిపోయాయి.



టీటీడీ జారీ చేసిన అవిలాల చెరువు టెండర్

శ్రీవారి సొమ్ముపై టీటీడీ చట్టంలో మార్గదర్శకాలున్నా..

టీటీడీ 111 యాక్టు ప్రకారం శ్రీవారి సొమ్ములను ఏ పనులకు ఖర్చు పెట్టాలి? వేటి కోసం ఖర్చు చేయకూడదో మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయి. వీటిని పట్టించుకోని టీటీడీ ఇంజనీర్లు, కొందరు అధికారులు కమీషన్ల కోసం మళ్లీ చెరువు అభివృద్ధి, బ్యూటిఫికేషన్ అంటూ రూ.9.77 కోట్లతో టెండర్లు పిలిచారు. మార్చి 23వతేదీ లోగా టెండర్లు దాఖలు చేయాలని పేర్కొన్నారు.

గతంలోనే పనులు జరిగినా....

వాస్తవానికి గతంలోనే రూ.85 లక్షల టీటీడీ నిధులతో చెరువు వద్ద వాకింగ్ ట్రాక్, ఫెన్సింగ్ పనులు పూర్తయ్యాయి. తాజాగా ప్రతిపాదనలకు మహా అయితే ఒకటి లేదా రెండు కోట్ల రూపాయలు సరిపోతాయి. కానీ చెరువును ఎకో పార్కుగా మలచాలంటూ రూ.9 కోట్లకు పైనే కేటాయించారు. దీని వెనుక పెద్ద నాయకులు ఉన్నట్లు సమాచారం. చెరువు సుందరీకరణ పనులు, నిధుల కేటాయింపుల వివరాల కోసం ప్రయత్నించిన 'సాక్షి'తో మాట్లాడేందుకు ఎస్ఈ రమేష్‌రెడ్డి నిరాకరించారు. వాస్తవానికి టెండర్లు పిలిచింది ఆయనే అయినప్పటికీ వివరాలు వెల్లడించేందుకు తనకు సీఈ నుంచి అనుమతి లేదంటూ నిరాకరించటం గమనార్హం.

సివిల్ వర్క్స్ మాత్రమే మావి: టీటీడీ సీఈ

అవిలాల చెరువు అభివృద్ధి, బ్యూటిఫికేషన్ పేరిట రూ.9.77 కోట్లతో టెండర్లు పిలిచిన మాట వాస్తవమేనని టీటీడీ సీఈ చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. దీనికి కేటాయించిన నిధులు టీటీడీవేనన్నారు. ఏపీ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డిజైన్లు ఇచ్చిందని, కేవలం సివిల్ వర్క్స్ మాత్రమే టీటీడీ చేపడుతోందన్నారు. ఇరిగేషన్ అధికారులు చెరువు నిర్వహణను టీటీడీకి అప్పగించారని, అందువల్ల సుందరీకరణ పనులు చేపట్టాల్సి వచ్చిందని సీఈ వివరణ ఇచ్చారు.

ఇరిగేషన్ పనులకు టీటీడీ నిధులు

టీటీడీ నిధులు సంబంధిత ఆస్తుల అభివృద్ధికే ఖర్చు చేయాలి. కానీ ఇక్కడ అభివృద్ధికి ఉద్దేశించిన చెరువు జలవనరులశాఖది. ఇరిగేషన్ చెరువుల అభివృద్ధి, సుందరీకరణకు వాస్తవంగా ప్రభుత్వ నిధులను వెచ్చించాలి. టీటీడీ నిధులను వాడకూడదు.

➠ ఎలాంటి పనులకు టీటీడీ నిధులు ఇస్తారంటే..
హిందూ ధార్మిక అవసరాలు, భక్తుల మౌలిక సదుపాయాలు, అనుబంధ ఆలయాల పునర్నిర్మాణం, మరమ్మతుల కోసం మాత్రమే టీటీడీ నిధులు వాడాలి.

➠ అవిలాల చెరువుకు ఇప్పటికే రూ.85 లక్షలిచ్చిన టీటీడీ
గతంలోనే అవిలాల చెరువు ఫెన్సింగ్ పనుల కోసం రూ.50 లక్షలు , వాకింగ్ ట్రాక్ కోసం రూ.30 లక్షల టీటీడీ నిధులు ఖర్చు చేశారు.

➠ టీటీడీ నిధులతో చేస్తామంటున్న పనులు
క్లియరింగ్ అండ్ గ్రబ్బింగ్ రోడ్ ల్యాండ్, ఎక్స్‌కేవేషన్ ఫర్ రోడ్ వే, ట్రిమ్మింగ్ బాటమ్, సాయిల్ ఎక్స్‌కవేషన్, ఎర్త్‌వర్క్, గ్రావెల్ వర్క్, సిమెంట్ కాంక్రీట్ పనులను టీటీడీ నిధులతో ప్రస్తుతం ప్రతిపాదించారు.

➠ కొందరికే అందుబాటులో టెండర్
ఈనెల 8న టెండరు పిలిచారు. కేవలం ఈ ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో మాత్రమే టెండర్ల వివరాలు పొందుపరిచారు. టెండరు దాఖలుకు ఈనెల 23 చివరి తేదీ.

సీబీఐ విచారణ ఎదుర్కొనే దమ్ముందా?

- ముఖ్యమంత్రి చంద్రబాబుకు వైఎస్సార్‌సీపీ నేత పార్థసారథి సవాల్
- ఓ పక్క ఉద్యమాన్ని అణిచేస్తూ.. మరోపక్క అవిశ్వాసం డ్రామాలు
- తాత్కాలిక ప్రాజెక్టులతో భారీ అవినీతి: ఎమ్మెల్యే సురేశ్



మాట్లాడుతున్న పార్థసారథి, చిత్రంలో ఎమ్మెల్యే సురేశ్ తదితరులు

విజయవాడ సిటీ: సీఎం చంద్రబాబుకు తన హయాంలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ చేయించుకునే దమ్ముందా? అని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి సవాల్ విసిరారు. 40 ఏళ్ల అనుభవం ఉన్న చంద్రబాబుకు ప్రత్యేక హోదా వల్ల కలిగే ప్రయోజనాలు తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. హోదా కోసం రోడ్డెక్కిన ఉద్యమకారులను బలవంతంగా అరెస్టు చేయించడం దుర్మార్గమన్నారు. గురువారం విజయవాడలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన ఎమ్మెల్యే ఆదిమూలపు సురేశ్‌తో కలసి విలేకరులతో మాట్లాడారు. ఒక వైపు హోదా ఉద్యమంపై ఉక్కుపాదం మోపుతూ.. చంద్రబాబు మరో వైపు కేంద్రంపై అవిశ్వాస తీర్మానం పెడుతున్నామంటే ప్రజలు నమ్మరన్నారు. రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, ప్రజలు ప్రత్యేక హోదా సాధించాలనే కాంక్షతో జాతీయ రహదారుల దిగ్బంధాన్ని విజయవంతం చేశారన్నారు. వారందరికి వైఎస్సార్ సీపీ ధన్యవాదాలు తెలిపినట్లు చెప్పారు. విజయసాయిరెడ్డి ఎక్కడ తిరుగుతున్నారు, వైఎస్ జగన్ ఎవరితో మాట్లాడుతున్నారన్న విషయాలపై చంద్రబాబు దృష్టి పెడుతున్నారే కానీ, హోదా సాధించేందుకు చిత్తశుద్ధితో పని చేయడంలేదని మండిపడ్డారు. లోకేశ్‌పై పత్రికలు కూడా ఆరోపణలు చేశాయని, దమ్ముంటే, వాటిపై సీబీఐ విచారణకు అంగీకరించాలని సవాల్ విసిరారు.

తాత్కాలిక ప్రాజెక్టులతో అవినీతి: ఎమ్మెల్యే సురేశ్

పట్టిసీమ ప్రాజెక్టులో రూ. వందల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందని ఎమ్మెల్యే ఆదిమూలపు సురేశ్ ధ్వజమెత్తారు. ఇష్టారాజ్యంగా అంచనాలు పెంచి కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని, ఆ విషయాలను కాగ్ నివేదికలో పేర్కొందని తెలిపారు. ప్రజాపద్దుల కమిటీలో వైఎస్సార్‌సీపీ ఒక్కటే ఉండదని, మిగతా పార్టీలు కూడా ఉంటాయన్నారు. ప్రజా పద్దుల కమిటీకి విశ్వసనీయత ఉందని, ఈ విషయాన్ని టీడీపీ మంత్రులు తెలుసుకోవాలని సూచించారు. పట్టిసీమ డీపీఆర్ రిపోర్టులో ప్రాజెక్టు లైఫ్ టైమ్ 20 సంవత్సరాలు అని పేర్కొన్నారని, కానీ పోలవరం పూర్తయ్యాక అది వృథా అనేది కూడా ప్రభుత్వ డాక్యుమెంట్లలో కూడా స్పష్టంగా ఉందన్నారు.

కేంద్రం వైఖరికి నిరసనగానే ప్రజలు రోడ్డుమీదికొచ్చారు..

- శాసనమండలిలో పలువురు ఎమ్మెల్సీలు
- బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ వ్యాఖ్యలపై అభ్యంతరం

సాక్షి, అమరావతి: ప్రత్యేక హోదాను డిమాండ్ చేస్తూ రాష్ట్రంలో రహదారుల దిగ్బంధం కార్యక్రమం చేపట్టడంపై బీజేపీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ చేసిన కొన్ని వ్యాఖ్యలు గురువారం శాసన మండలిలో గందరగోళానికి దారితీశాయి. రాష్ట్రంలో సాగు నీటి ప్రాజెక్టుల స్థితిగతులపై శాసనమండలిలో సీఎం సమాధానం చెబుతూ ఒక సందర్భంలో రాష్ట్రంలో గురువారం జాతీయ రహదారుల దిగ్బంధం అంశాన్ని ప్రస్తావిస్తూ 'అందరూ రోడ్లపైకొచ్చారు. నేను చాలా బాధపడుతున్నాను' అంటూ వ్యాఖ్యలు చేయగా.. అంతలోనే ముఖ్యమంత్రి ప్రసంగానికి మాధవ్ అడ్డుతగిలారు. జాతీయ రహదారుల దిగ్బంధం పేరుతో ప్రజలను రోడ్డు మీదకు తెచ్చారంటూ మాధవ్ వ్యాఖ్యానించడంతో పలువురు ఎమ్మెల్సీలు మాధవ్ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ప్రజలే స్వచ్ఛందంగా రోడ్డుపైకి వచ్చారంటూ టీచర్, పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీలతో పాటు టీడీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ఒకేసారి ఆయా సభ్యులు లేచి నిలబడి మాట్లాడుతుండటంతో సభలో కొద్ది సేపు గందరగోళం కొనసాగింది. ఈ సందర్భంగా శాసనమండలి చైర్మన్ ఫరూక్ జోక్యం చేసుకుని టీచర్, పట్టభద్రుల ఎమ్మెల్సీలు బాలసుబ్రమణ్యం, వై.శ్రీనివాసరెడ్డి, కత్తి నరసింహారెడ్డి, గాదె శ్రీనివాసులునాయుడు, టీడీపీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డితో పాటు మాధవ్‌కు కూడా మాట్లాడేందుకు అనుమతిచ్చారు. విభజన చట్టంలో పేర్కొన్న హామీలను కేంద్రం నాలుగేళ్లు అయినా అమలు చేయకపోవడం వల్లే ప్రజల కడుపు మండి రోడ్డుపైకి వచ్చారని, ప్రజలను అవమానించేలా మాధవ్ మాట్లాడుతున్నారంటూ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మాధవ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఏ రాష్ట్రంలోనూ ప్రత్యేక హోదా పేరుతో రాయితీలు కొనసాగుతున్న దాఖలాల్లేవని, ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక హోదా పేరుతో కాకుండా అందుకు సంబంధించిన రాయితీలే కేంద్రం అందజేస్తోందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు కూడా కేంద్రం ఈశాన్య రాష్ట్రాలకిస్తున్న 90–10 శాతం నిధుల కేటాయింపులిచ్చేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సభలో గందరగోళం జరుగుతున్న సమయంలోనే ఎమ్మెల్సీ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా అంశంపై విశాఖలో ప్రజా బ్యాలెట్ నిర్వహణకు సిద్ధమా అంటూ మాధవ్‌ను ప్రశ్నించారు.

పరిశుభ్రత పాఠం కాదు జీవన విధానం

- మంత్రి గంటా శ్రీనివాసరావు
- స్వచ్ఛ విద్యాలయ పురస్కారాల గ్రహీతలకు సన్మానం

సాక్షి, అమరావతి: స్వచ్ఛత, పరిశుభ్రత అనేది పాఠ్యాంశం కాదని, అదో జీవన విధానమని మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను, స్వచ్ఛతను తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు స్వచ్ఛ విద్యాలయ అవార్డులు దక్కించుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఉన్నతమైన సమాజాన్ని నిర్మించగలుగుతామని చెప్పారు. గురువారం ఆయన అమరావతి కన్వెన్షన్ సెంటర్‌లో స్వచ్ఛ విద్యాలయాల పురస్కారాలకు ఎంపికైన ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమని చెప్పారు. రాష్ట్రాన్ని నాలెడ్జ్ సెంటర్‌గా, ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన అలవాట్లను విద్యార్థి దశ నుంచే అలవరచుకోవాలని సూచించారు. గతేడాది జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయాలకు 21 పాఠశాలలు ఎంపికవగా, ఈ సారి 40 పాఠశాలలు ఎంపికయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామకృష్ణ, పాఠశాల విద్య కమిషనర్ సంధ్యారాణి, సర్వశిక్షా అభియాన్ ఎస్పీడీ జి.శ్రీనివాసులు, యూనిసెఫ్ ప్రతినిధి వెంకటేష్, ఈక్విటీ కన్సల్టెంట్ గీత, వివిధ జిల్లాల డిఈవోలు, ఎస్ఎస్ఏ పీవోలు పాల్గొన్నారు.

ఆర్టీసీ అకౌంట్లు సీజ్!

- రూ.18 కోట్ల సేవా పన్ను చెల్లించకపోవడంతో ఖాతాల అటాచ్‌మెంట్
- నోటీసులకు స్పందించకపోవడంతో కోర్టును ఆశ్రయించిన సెంట్రల్ ఎక్సైజ్

సాక్షి, అమరావతి: ఏపీఎస్‌ఆర్టీసీ నిర్వహిస్తున్న వ్యాపారాలకు గాను సర్వీసు ట్యాక్స్ చెల్లించకపోవడంతో సంస్థ అకౌంట్లను సీజ్ చేశారు. పలు మార్లు నోటీసులు జారీ చేసినా ఆర్టీసీ అధికారులు స్పందించకపోవడం, పన్ను చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సెంట్రల్ ఎక్సైజ్ అధికారులు కోర్టును ఆశ్రయించారు. ఆర్టీసీ అకౌంట్లను అటాచ్ చేయాల్సిందిగా న్యాయస్థానం తాజాగా ఉత్తర్వులిచ్చింది. దీంతో ఆర్టీసీ అకౌంట్లు మొత్తం సీజ్ చేశారు. ఈ ఖాతాల్లో రూ.8 కోట్ల వరకూ ఉన్నట్లు సమాచారం. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపడం, కంపెనీలకు, వివాహాలకు బస్సులను సమకూర్చడం లాంటి వ్యాపారాలు నిర్వహిస్తోంది. దీనికి గాను సెంట్రల్ ఎక్సైజ్ విభాగానికి సేవా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ పన్ను చెల్లించకుండా ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

చెల్లించాల్సిన పన్ను రూ.18 కోట్లు

సెంట్రల్ ఎక్సైజ్ విభాగానికి సేవా పన్ను కింద ఆర్టీసీ రూ.18 కోట్లు చెల్లించాల్సి ఉంది. అది ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు కట్టాల్సిన సర్వీస్ ట్యాక్స్ అని, ఇప్పుడు రెండు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు ఈ పన్ను చెల్లించాలని ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. తెలంగాణ ఆర్టీసీ మాత్రం తమకు సంబంధం లేదని చెబుతోందని, ఆర్టీసీ విభజన జరగనందున, ఏపీఎస్‌ఆర్టీసీ అకౌంట్లను సీజ్ చేసినట్లు అధికారులు వివరణ ఇస్తున్నారు.

లీగల్ విభాగం పనితీరుపై ఆరా

ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం చివరి విడత నిధులు రూ.45 కోట్లను జమ చేయాల్సి ఉంది. సెంట్రల్ ఎక్సైజ్ విభాగం సీజ్ చేసిన ఖాతాకు ఈ నిధులను జమ చేయొద్దని ఆర్టీసీ అధికారులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.మరోవైపు ఆర్టీసీ లీగల్ విభాగం పనితీరుపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. సర్వీస్ ట్యాక్స్ నోటీసులపై లీగల్ విభాగం ముందే హెచ్చరించి ఉంటే, అకౌంట్ల సీజ్ జరిగుండేది కాదని ఆర్టీసీ వర్గాలు అంటున్నాయి.

సినీ ఎడిటర్ శేఖర్ కన్నుమూత



తమిళసినిమా (చెన్నై): సీనియర్ సినీ ఎడిటర్ శేఖర్ (81) గురువారం ఉదయం తమిళనాడు తిరుచ్చి సమీపంలోని తెన్నూర్‌లో కన్నుమూశారు. దక్షిణాది భాషల్లో 50 ఏళ్లలో 200కు పైగా చిత్రాలకు ఎడిటర్‌గా పనిచేసిన శేఖర్.. దర్శకులు ఫాజిల్, సిద్దిక్‌లకు ఆస్థాన ఎడిటర్‌గా పేరొందారు. దక్షిణాదిలో తొలి సినిమాస్కోప్ (తస్సోలి అంబు) చిత్రానికి, తొలి 70ఎంఎం (పడైయోట్టం) చిత్రానికి, అదే విధంగా తొలి భారతీయ (మైడియర్ కుట్టిసాత్తాన్) 3డీ చిత్రానికి పనిచేసిన ఎడిటర్‌గా శేఖర్ ఖ్యాతి గడించారు. వరుషం 16 చిత్రానికి గానూ శేఖర్ తమిళనాడు ప్రభుత్వం నుంచి ఉత్తమ ఎడిటర్ అవార్డును, '0 మొదల్ 1 వరై' అనే మలయాళ చిత్రానికి కేరళ రాష్ట్రం నుంచి ఉత్తమ ఎడిటర్ అవార్డు అందుకున్నారు. ఈయన చివరి తమిళ చిత్రం సాదుమిరండా. అనంతరం ఆయన తన స్వగ్రామంలో స్థిరపడ్డారు. గుండెపోటుతో ఆస్పత్రిలో చేరిన శేఖర్ చికిత్స పొందుతూ గురువారం ఉదయం 5 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఈయనకు భార్య సుందరి, కుమార్తెలు దీపలక్ష్మి, తిలకవతి, నిత్యా ఉన్నారు.

నీటి సమస్యలు సంక్లిష్టమవుతున్నాయి

ఎన్‌జీఆర్‌ఐ సంచాలకులు ఆచార్య తివారి ఆందోళన

ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): నీటి సమస్యలు సంక్లిష్టంగా మారుతున్నాయని నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌జీఆర్‌ఐ) సంచాలకులు ఆచార్య వి.ఎం.తివారి ఆందోళన వ్యక్తం చేశారు. ఏయూ జియో ఫిజిక్స్, జియాలజీ, అసోసియేషన్ ఆఫ్ హైడ్రాలజిస్ట్స్ ఆఫ్ ఇండియా(ఏహెచ్ఐ) సంయుక్తంగా నిర్వహిస్తున్న 'నీటి సవాళ్లకు ప్రకృతి ఆధారిత పరిష్కారాలు' జాతీయ సదస్సును గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జల కాలుష్యం ప్రధాన సమస్యగా పరిణమిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి ఆవశ్యకతపై యువతను చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి.వినోదరావు మాట్లాడుతూ.. వర్షపు నీటిని ఒడిసి పట్టడం ఎంతో అవసరమన్నారు. నీటి నిర్వహణపై ప్రజలకు సరైన అవగాహన లేదని చెప్పారు. ఏహెచ్ఐ అధ్యక్షుడు ఆచార్య జగన్నాథ శర్మ రచించిన ' రెయిన్‌ఫాల్ కేరక్టరిస్టిక్స్ ఆఫ్ కోస్టల్ ఆంధ్రప్రదేశ్' పుస్తకాన్ని తివారి ఆవిష్కరించారు. ఎన్‌జీఆర్‌ఐ–ఏహెచ్ఐ వార్షిక అవార్డుల కార్యక్రమంలో నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, బ్రహ్మ ప్రకాష్ ప్రొ. జె.ఆర్ శర్మకు జీవన సాఫల్య పురస్కారాన్ని, ఎస్ఐఆర్–ఎన్‌జీఆర్ఐ చీఫ్ సైంటిస్ట్ డా.షకీల్ అహ్మద్‌కు హైడ్రాలజీ లెక్చర్ అవార్డును రెక్టార్ ఆచార్య కె.గాయత్రిదేవి ప్రదానం చేశారు.



డాక్టర్ జె.ఆర్. శర్మకు జీవన సాఫల్య పురస్కారం అందిస్తున్న రెక్టార్ గాయత్రి దేవి, ఎన్‌జీఆర్‌ఐ సంచాలకులు తివారి తదితరులు

● తెలంగాణ

బ్యాంకులకు మరో కంపెనీ టోకరా

సాక్షి, హైదరాబాద్: విజయ్ మాల్యా, నీరవ్ మోదీ మోసాలు మరిచిపోకముందే హైదరాబాద్‌లోని మరో కంపెనీ బ్యాంకులకు కుచ్చుటోపి పెట్టింది. బంజారాహిల్స్ కేంద్రంగా కార్యాలయం ఏర్పాటు చేసి.. రోడ్డు నిర్మాణాలు, నీటి పారుదల ప్రాజెక్టులు, భవన నిర్మాణాల పనులు చేసే ఓ ప్రైవేట్ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ.313 కోట్లు టోకరా పెట్టింది. ఈ వ్యవహారంపై ఆ బ్యాంక్ సీబీఐకి ఫిర్యాదు చేసింది. అధికారులు కేసు నమోదు చేసి సోదాలు చేస్తుండటంతో కళ్లు బైర్లు కమ్మే వాస్తవాలు వెలుగులోకి వచ్చినట్టు తెలిసింది. కేవలం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకే కాకుండా మరో 8 బ్యాంకుల నుంచి కూడా ఆ కంపెనీ రూ.1,394 కోట్ల రుణాలుగా తీసుకొని చెల్లించలేదన్న సంగతి బయటపడింది. 2012 జూన్ నుంచి ఈ బ్యాంకులకు రుణాలు చెల్లించకుండా.. కొన్ని ప్రైవేట్ బ్యాంకుల ద్వారా లావాదేవీలు సాగిస్తున్నట్టు సీబీఐ విచారణలో బయటపడింది.

నేడు తెలంగాణలో రాజ్యసభ ఎన్నికలు

సాక్షి, హైదరాబాద్: రాజ్యసభ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఇక్కడి శాసనసభలోని కమిటీ హాల్ నంబర్–1లో శుక్రవారం ఉదయం 9 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. ఈ మేరకు తెలంగాణ శాసనసభ సచివాలయం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. 117 మంది ఓటర్లు ఉన్నట్టు అధికారికంగా ప్రకటించారు. మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నిక జరుగుతుండగా.. నలుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. టీఆర్ఎస్ అభ్యర్థులుగా జోగినపల్లి సంతోష్‌కుమార్, బండా ప్రకాశ్, బడుగుల లింగయ్యయాదవ్ బరిలో ఉండగా.. కాంగ్రెస్ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి పి.బలరాంనాయక్ పోటీ చేస్తున్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుంది. సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. సుమారు ఆరు గంటల సమయంలో ఫలితాలను అధికారికంగా ప్రకటించే అవకాశముంది.

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా

సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

వాట్ ఆఫ్టర్ ఇంటర్..
అత్యున్నత ప్రవేశ పరీక్షలు

ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తిచేసుకున్న విద్యార్థుల ముంగిట ఎన్నో కోర్సులు! దేశవ్యాప్తంగా మరెన్నో యూనివర్సిటీలు/ఇన్‌స్టిట్యూట్‌లు.. వాటిలో ప్రవేశానికి రకరకాల ఎంట్రన్స్ టెస్ట్‌లు!! ప్రతిష్టాత్మక ఐఐటీలు, నిట్‌ల్లో ఇంజనీరింగ్ మొదలు.. ఎంబీబీఎస్, అగ్రికల్చర్, ఆర్కిటెక్చర్, సైన్సెస్, ఫ్యాషన్, డిజైన్ వరకూ.. అందుబాటులో వందల విద్యాసంస్థలు. ఇంటర్మీడియెట్ పరీక్షలు ముగిసిన నేపథ్యంలో ఇంటర్ అర్హతతో అందుబాటులో ఉన్న పలు బెస్ట్ ఎంట్రన్స్ టెస్ట్‌ల వివరాలు..



1 జేఈఈ మెయిన్

- జేఈఈ మెయిన్.. పరిచయం అక్కర్లేని ఎంట్రన్స్ టెస్ట్. ఇంటర్ ఎంపీసీ విద్యార్థులు అర్హులు. దేశవ్యాప్తంగా ఐఐటీల్లో ప్రవేశానికి వీలు కల్పించే జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత పరీక్ష.. జేఈఈ మెయిన్. అంతేకాకుండా.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లు, ట్రిపుల్ ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో బీటెక్, ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంటెక్‌లో జేఈఈ మెయిన్ ర్యాంకు ద్వారా ప్రవేశం కల్పిస్తారు.
- మొత్తం మూడు విభాగాల్లో (ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ) 360 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. ఒక్కో సబ్జెక్టు నుంచి 30 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు 4 మార్కులు.
- బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సుల్లో ప్రవేశానికి పేపర్-2 పేరిట ప్రత్యేక పరీక్ష ఉంటుంది. ఇందులో మ్యాథమెటిక్స్; ఆప్టిట్యూడ్ టెస్ట్, డ్రాయింగ్ టెస్ట్ విభాగాల్లో నైపుణ్యాలను పరీక్షిస్తారు. ఈ పరీక్ష పూర్తిగా ఆఫ్‌లైన్ విధానంలో జరుగుతుంది.

జేఈఈ మెయిన్-2018 సమాచారం

- **ఆఫ్‌లైన్ (పెన్-పేపర్ విధానం) టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 8, 2018. ■ **ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 15, 16, 2018. ■ ఏటా పరీక్ష షెడ్యూల్ నవంబర్‌లో విడుదలవుతుంది.
- **వెబ్‌సైట్: https://jeemain.nic.in**

2 జేఈఈ-అడ్వాన్స్‌డ్

- ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష జేఈఈ అడ్వాన్స్‌డ్. జేఈఈ-మెయిన్ పేపర్-1లో ప్రతిభ ఆధారంగా 2.24 లక్షల మందిని జేఈఈ-అడ్వాన్స్‌డ్ రాసేందుకు అనుమతిస్తారు. ఈ పరీక్ష రెండు పేపర్లలో ఉంటుంది. ఒక్కో పేపర్ పరీక్ష సమయం మూడు గంటలు. ఈ ఏడాది నుంచి ఈ పరీక్షను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు.
- మెయిన్ ఫలితాల ఆధారంగా.. 2.24 లక్షల మందిని అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేస్తారు. వీరు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశం కల్పిస్తారు.

అర్హత

- ఇంటర్మీడియెట్ బోర్డ్ పరీక్షల్లో టాప్-20 పర్సంటైల్‌లో నిలవాలి. లేదా ఇంటర్మీడియెట్ బోర్డ్ పరీక్షల్లో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 65 శాతం మార్కులు సాధిస్తే సరిపోతుంది).

ముఖ్య తేదీలు

- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్: మే 2, 2018 – మే 7, 2018.
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్: మే 14, 2018 – మే 20, 2018 వరకు.
- ఆన్‌లైన్ టెస్ట్ తేదీ: మే 20, 2018.
- వెబ్‌సైట్: **www.jeeadv.ac.in**

3 ఎంసెట్

తెలుగు రాష్ట్రాల్లోని ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ తదితర ప్రొఫెషనల్ కోర్సుల్లో ఎంసెట్‌లో ర్యాంకు ద్వారా ప్రవేశం కల్పిస్తారు. రెండు రాష్ట్రాల్లోనూ వేర్వేరుగా ఎంసెట్ నోటిఫికేషన్లు విడుదలయ్యాయి.



ఇంజనీరింగ్ స్ట్రీమ్

- **అర్హత:** ఇంటర్మీడియట్ ఎంపీసీ ఉత్తీర్ణత/ఫైనలియర్ విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు.
- **కోర్సులు:** బీఈ/బీటెక్/బీటెక్ (అగ్రికల్చర్ ఇంజనీరింగ్)/బీటెక్ (డెయిరీ టెక్నాలజీ)/బీటెక్ (ఫుడ్‌టెక్నాలజీ)/బీటెక్ (బయోటెక్నాలజీ)/బీఫార్మసీ (ఎంపీసీ)/ఫార్మ్-డీ (ఎంపీసీ).

అగ్రికల్చర్, మెడికల్ స్ట్రీమ్

- **అర్హత:** బైపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత/ఫైనల్ పరీక్షలు రాసిన అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ■ **కోర్సులు:** బీఎస్సీ (అగ్రికల్చర్)/బీఎస్సీ (హార్టికల్చర్)/బీఎస్సీ (ఫారెస్ట్రీ)/బీవీఎస్సీ అండ్‌ఏహెచ్/బీఎఫ్ఎస్సీ/బీటెక్ (ఫుడ్‌టెక్నాలజీ); బీఫార్మసీ/బీటెక్ (బయోటెక్నాలజీ) (బైపీసీ); ఫార్మ్-డి (బైపీసీ).

పరీక్ష

- ఇంజనీరింగ్ స్ట్రీమ్, అగ్రికల్చర్ అండ్ మెడికల్ స్ట్రీమ్ రెండు స్ట్రీమ్‌ల్లోనూ 160 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి ప్రశ్నలుంటాయి. అగ్రికల్చర్ అండ్ మెడికల్ స్ట్రీమ్‌లో బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి.

ఏపీ ఎంసెట్-2018 సమాచారం

- ఆన్‌లైన్ అప్లికేషన్ తేదీలు: ఫిబ్రవరి 28–మార్చి 29, 2018.
- హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం: 2018, ఏప్రిల్ 18 నుంచి.
- **ఆన్‌లైన్ టెస్ట్ తేదీలు:**
- ఇంజనీరింగ్ స్ట్రీమ్- ఏప్రిల్ 22–25.
- అగ్రికల్చర్ అండ్ మెడికల్ స్ట్రీమ్- ఏప్రిల్ 25, 26. ■ **వెబ్‌సైట్: www.sche.ap.gov.in/EAMCET**

తెలంగాణ ఎంసెట్ - 2018 సమాచారం

- ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: 2018, మార్చి 4 -ఏప్రిల్ 4, 2018. ■ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం: ఏప్రిల్ 20– మే 1, 2018.
- **పరీక్ష తేదీలు:** ఇంజనీరింగ్ స్ట్రీమ్: మే 4, 5, 7 తేదీల్లో. అగ్రికల్చర్ అండ్ మెడికల్ స్ట్రీమ్: మే 2, 3 తేదీల్లో. ■ **వెబ్‌సైట్: http://eamcet.tsche.ac.in/TSEAMCET/EAMCET_HomePage.aspx**

4 బిట్‌శాట్

ఇంజనీరింగ్ విద్యలో మంచి పేరున్న ద బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్-పిలానీ) బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తుంది. దీనిద్వారా బిట్స్ పిలానీ, గోవా, హైదరాబాద్ క్యాంపస్‌లలో బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్, బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు.

- **అర్హత:** ఇంటర్మీడియెట్‌లో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత. అంతేకాకుండా ఇంజనీరింగ్ ఔత్సాహికులు ఎంపీసీ గ్రూప్ సబ్జెక్టుల్లో, బీఫార్మసీ ఔత్సాహికులు బైపీసీ గ్రూప్ సబ్జెక్ట్‌లలో 60 శాతం మార్కులు తప్పనిసరిగా పొందాలి.
- పరీక్ష విధానం: ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది.
- బిట్‌శాట్ నాలుగు విభాగాల్లో ఉంటుంది. అవి.. ఫిజిక్స్; కెమిస్ట్రీ; ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ, లాజికల్ రీజనింగ్; మ్యాథమెటిక్స్ (ఇంజనీరింగ్ ఔత్సాహికులకు); బయాలజీ (బీఫార్మసీ ఔత్సాహికులకు). మొత్తం 150 ప్రశ్నలు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు ఉంటాయి. పరీక్ష వ్యవధి మూడు గంటలు.

బిట్‌శాట్-2018 సమాచారం

- ఆన్‌లైన్ టెస్ట్ స్లాట్ రిజర్వేషన్ సదుపాయం: మార్చి 23 నుంచి ఏప్రిల్ 5 వరకు.
- హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం: ఏప్రిల్ 12 నుంచి మే 10 వరకు.
- ఆన్‌లైన్ టెస్ట్ తేదీలు: మే 16 నుంచి మే 31 వరకు.
- ఫలితాల వెల్లడి: జూన్ 20, 2018
- వెబ్‌సైట్: **www.bitsadmission.com**

5 నీట్-యూజీ



జాతీయ స్థాయిలో ఎంబీబీఎస్, బీడీఎస్, తదితర కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష.. నీట్. ఈ పరీక్షను సీబీఎస్‌ఈ నిర్వహిస్తుంది. ఇందులో పొందిన మెరిట్ ఆధారంగా రాష్ట్రాల స్థాయిలో కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు ఖరారు చేస్తారు.

- **అర్హత:** బైపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత (ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాస్తున్న విద్యార్థులూ అర్హులే). ■ **పరీక్ష విధానం:** బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల్లో మొత్తం 180 ప్రశ్నలతో పరీక్ష ఉంటుంది.

నీట్-2018 సమాచారం

- ఆన్‌లైన్ అప్లికేషన్‌కు గడువు ముగిసింది.
- అడ్మిట్ కార్డ్ సదుపాయం: ఏప్రిల్ రెండో వారం నుంచి
- నీట్ పరీక్ష తేదీ: మే 6, 2018. ■ వెబ్‌సైట్: **https://cbseneet.nic.in**

6 ఎయిమ్స్ ఎంట్రన్స్ టెస్ట్

వైద్య విద్యలో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సంస్థ.. ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్-న్యూఢిల్లీ. ఈ ఇన్‌స్టిట్యూట్ ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశానికి ప్రత్యేకంగా ఎంట్రన్స్ నిర్వహిస్తుంది. దీనిలో ర్యాంకు ద్వారా ఎయిమ్స్-ఢిల్లీతోపాటు పాట్నా, భోపాల్, జోధ్‌పూర్, భువనేశ్వర్, రిషికేశ్, రాయ్‌పూర్, గుంటూరు, నాగపూర్‌ల్లో ఎయిమ్స్ క్యాంపస్‌ల్లోనూ సీటు పొందొచ్చు. మొత్తం అన్ని క్యాంపస్‌లలో కలిపి అందుబాటులో ఉన్న సీట్లు 807.

- **అర్హత:** 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ (బైపీసీ ఉత్తీర్ణత).
- **పరీక్ష విధానం:** మొత్తం 200 ప్రశ్నలతో పరీక్ష ఉంటుంది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ (బోటనీ, జువాలజీ) నుంచి 60 ప్రశ్నల చొప్పున; జనరల్ నాలెడ్జ్, ఆప్టిట్యూడ్ అండ్ లాజికల్ థింకింగ్ నుంచి 10 ప్రశ్నలు చొప్పున ఉంటాయి.




నోటిఫికేషన్ సమాచారం

- ఏటా జనవరిలో నోటిఫికేషన్ వెలువడుతుంది. ఈ ఏడాదికి దరఖాస్తు ప్రక్రియ ముగిసింది.
- మే 26, 27 తేదీల్లో రోజుకు రెండు సెషన్లుగా ఆన్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుంది.
- వెబ్‌సైట్: **mbbs.aiimsexams.org**

7 జిప్‌మర్ ఎంబీబీఎస్ ఎంట్రన్స్



ఎంబీబీఎస్ ఔత్సాహిక అభ్యర్థులకు అందుబాటులో ఉన్న మరో ప్రతిష్టాత్మక ఎంట్రన్స్.. జిప్‌మర్ ఎంబీబీఎస్. పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ క్యాంపస్‌లో, అదే విధంగా జిప్‌మర్-కరైకల్ క్యాంపస్‌లో ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశానికి ఈ ఎంట్రన్స్‌ను నిర్వహిస్తుంది. జిప్‌మర్-పుదుచ్చేరిలో 150 సీట్లు, కరైకల్‌లో 50 సీట్లు అందుబాటులో ఉంటాయి. ■ **అర్హత:** ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బయోటెక్నాలజీ సబ్జెక్ట్‌లలో తప్పనిసరిగా 60 శాతం మార్కులు పొందాలి. ■ **పరీక్ష విధానం:** పరీక్ష ఆన్‌లైన్ విధానంలో 200 మార్కులకు ఉంటుంది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ నుంచి 60 ప్రశ్నలు చొప్పున 180 ప్రశ్నలు అడుగుతారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రెహెన్షన్ నుంచి 10 ప్రశ్నలు; లాజికల్ అండ్ క్వాంటిటేటివ్ రీజనింగ్ నుంచి 10 ప్రశ్నలు ఉంటాయి.



ముఖ్య తేదీలు

- ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: మార్చి 7, 2018 నుంచి ఏప్రిల్ 13, 2018 వరకు.
- హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం: మే 21, 2018 నుంచి జూన్ 3, 2018 వరకు.
- జిప్‌మర్ ఎంట్రన్స్ తేదీ: జూన్ 3, 2018
- వెబ్‌సైట్: **www.jipmer.puducherry.gov.in**

8 ఐసీఏఆర్-ఏఐఈఈఏ

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ సంస్థ.. జాతీయ స్థాయిలోని అగ్రికల్చర్ ఇన్‌స్టిట్యూట్స్‌లో బ్యాచిలర్ ఆఫ్ అగ్రికల్చర్, హార్టికల్చర్, డెయిరీ టెక్నాలజీ తదితర బ్యాచిలర్ స్థాయి కోర్సుల్లో 15 శాతం సీట్ల భర్తీకి నిర్వహించే పరీక్ష.. ఆలిండియా ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ ఫర్ అడ్మిషన్. ఈ పరీక్షకు 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/ అగ్రికల్చర్/మ్యాథమెటిక్స్) ఉత్తీర్ణత సాధించాలి.

- **పరీక్ష విధానం:** ఐసీఏఆర్-ఏఐఈఈఏ రెండు స్ట్రీమ్‌ల్లో ఉంటుంది. స్ట్రీమ్-ఎలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, అగ్రికల్చర్/బయాలజీ నుంచి 60 ప్రశ్నల చొప్పున ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు. స్ట్రీమ్-బీలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్‌ల నుంచి 60 ప్రశ్నల చొప్పున ఉంటాయి. అభ్యర్థులు తాము బ్యాచిలర్ స్థాయిలో చేరదలచుకున్న కోర్సుకు అనుగుణంగా ఏదో ఒక స్ట్రీమ్‌ను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

ఐసీఏఆర్-ఏఐఈఈఏ - 2018 సమాచారం

- **పరీక్ష తేదీ:** మే 12, 2018.
- **వెబ్‌సైట్: www.icar.org**

9 నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్

జాతీయ స్థాయిలో కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ గుర్తింపు పొందిన కళాశాలల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్) కోర్సులో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష.. నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్ (నాటా). దీనికి ఏటా జనవరిలో నోటిఫికేషన్ వెలువడుతుంది.

- **అర్హత:** మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్‌తో 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత లేదా 50 శాతం మార్కులతో డిప్లొమా ఉత్తీర్ణత.
- **పరీక్ష విధానం:** నాటా రెండు విభాగాల్లో (పార్ట్-ఎ, పార్ట్-బి) నిర్వహించనున్నారు. పార్ట్-ఎ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో 120 మార్కులకు ఉంటుంది. ఇందులో మ్యాథమెటిక్స్, జనరల్ ఆప్టిట్యూడ్ అంశాల నుంచి 60 ప్రశ్నలుంటాయి. మొత్తం మార్కులు 120. **పార్ట్-బి:** ఇది డ్రాయింగ్ టెస్ట్. దీనికి కేటాయించిన మార్కులు 80. ■ **దరఖాస్తులకు చివరి తేదీ:** మార్చి 30, 2018. ఈ ఏడాది నాటా ఆన్‌లైన్ టెస్ట్ ఏప్రిల్ 29న జరగనుంది.



- వెబ్‌సైట్: **www.nata.in**

గమనిక: మరికొన్ని ముఖ్య ఎంట్రన్స్ టెస్టుల వివరాలు తదుపరి సంచికల్లో..

సాక్షి బిజినెస్

శుక్రవారం 23-3-2018

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 10.30కి)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
130 ▼	41 ▼
33,006	10,115

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	7,281	▼ 65
డోజోన్స్	24,434	▼ 249
ఎఫ్‌టీఎస్ఈ 100	6,953	▼ 86
డాక్స్	12,100	▼ 209
షాంఘై	3,264	▼ 17
నికాయ్	21,592	▲ 211

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.35	65.98
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	90.73	93.69
€	యూరో	ఎస్‌బీఐ	79.15	81.82
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	60.60	62.69
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.55	51.30
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	48.84	50.46
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.76	18.67
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	16.13	18.85
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.29	11.83

దివాలా చట్టంతో ఫలితాలొస్తాయ్

- భారీ ఎన్‌పీఏ కేసుల్లో 40 శాతం వరకు రికవరీ
- ప్రభుత్వ బ్యాంకులు ఎక్కువ అవసరం లేదు
- విలీనాలకు ఇది సరైన తరుణం కాదు
- ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్‌కుమార్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: దివాలా పరిష్కార ప్రక్రియకు సంబంధించి నూతన చట్టంతో ఎదురయ్యే సవాళ్లు లక్ష్యానికి అడ్డంకి కాబోవని ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్ చెప్పారు. ఇది కొత్త చట్టమని, ఫలితాలు రావాల్సి ఉందని చెప్పిన రజనీష్... ఇది నిరాశపరచ బోదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. తుది నిర్ణయం మాత్రం జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీ ఎల్‌టీ) పరిధిలోనే ఉందన్నారు. భారీ రుణ ఎగవేత కేసులను ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (ఐబీసీ) కింద పరిష్కరించడానికి ఎన్‌సీఎల్‌టీకి ప్రతిపాదించించేందుకు ఆర్‌బీఐ గతేడాది అనుమతించిన విషయం తెలిసిందే. ఐబీసీ కింద రుణదాతల కమిటీ ఆమోదించిన పరిష్కార ప్రణాళికే తుది నిర్ణయం కాదన్న రజనీష్‌కుమార్... అంతిమంగా ఇది న్యాయపరమైన ప్రక్రియగా పేర్కొన్నారు. ఆర్‌బీఐ రెండు జాబితాల్లో చర్యల కోసం సూచించిన కేసుల నుంచి 40 శాతం బకాయిలు వసూలు కావచ్చని చెప్పారు. వసూళ్లకు సంబంధించి కచ్చితమైన అంచనాలేవీ ఉండవన్నారు. రూ.8 లక్షల కోట్లకు పైగా మొండి బకాయిల భారాన్ని దేశీయ బ్యాంకులు మోస్తున్న విషయం తెలిసిందే. దీంతో సమస్యాత్మక రుణాన్ని 180 రోజుల్లోగా పరిష్కరించుకోని పక్షంలో ఎన్‌సీఎల్‌టీకి ప్రతిపాదించాలని ఆర్‌బీఐ గత నెలలోనే బ్యాంకులను ఆదేశించింది.

విద్యుత్ రంగానికి పునర్వైభవం...

విద్యుత్ రంగానికి ఇచ్చిన రుణాల వసూళ్లలో ఆర్‌బీఐ మార్గదర్శకాలను అనుసరిస్తామని రజనీష్ కుమార్ చెప్పారు. సమస్యలను పరిష్కరించుకునేందుకు రుణదాతలు సమష్టిగా వ్యవహరిస్తారని చెప్పారు. వచ్చే రెండేళ్ల కాలంలో విద్యుత్‌కు కొరత ఏర్పడుతుందని, దీంతో ఉన్న ప్లాంట్లకు మెరుగైన విలువ సమకూరుతుందని పేర్కొన్నారు. తద్వారా విద్యుత్ రంగానికి ఇచ్చిన రుణాలు సమస్యాత్మకం కాబోవన్న సంకేతమిచ్చారు. మార్చి త్రైమాసికంలో ఎన్‌పీఏలు డిసెంబర్ క్వార్టర్ కంటే తక్కువే ఉంటాయని చెప్పారు. ప్రభుత్వరంగంలో ఎక్కువ బ్యాంకులు అవసరం లేదన్న దానితో ఏకీభవిస్తున్నట్టు రజనీష్ కుమార్ చెప్పారు. ప్రభుత్వరంగ బ్యాంకుల సంఖ్య తగ్గితే వినియోగదారులకు నష్టం జరగదంటూనే... ప్రభుత్వరంగ బ్యాంకుల మధ్య స్థిరీకరణకు ఇది సరైన తరుణం కాదని అభిప్రాయపడ్డారు. ఎందుకంటే చాలా వరకు ప్రభుత్వరంగ బ్యాంకుల ఆర్థిక పరిస్థితి అంత బలంగా లేదని గుర్తు చేశారు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో కస్టమర్ల సేవల అనుభవం, పరిపాలన మెరుగుపడేందుకు ఎంతో అవకాశం ఉందని చెప్పారు.



వొడాఫోన్-ఐడియా విలీన సంస్థకు
చైర్మన్‌గా కేఎం బిర్లా

న్యూఢిల్లీ: త్వరలో విలీనం కాబోయే వొడాఫోన్-ఐడియా సంస్థకు నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా కుమార్ మంగళం బిర్లా బాధ్యతలు చేపడతారు. ఈ మేరకు ఐడియా ఒక రెగ్యులేటరీ ఫైలింగ్‌ను దాఖలు చేసింది. దీనిప్రకారం, బాలేశ్ శర్మ కొత్త సంస్థ సీఈఓగా ఉంటారు. శర్మ ప్రస్తుతం వొడాఫోన్ ఇండియా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ రెండు సంస్థల విలీనంతో దేశంలో దాదాపు 23 బిలియన్ డాలర్ల విలువైన అతిపెద్ద టెలికం సంస్థ ఆవిర్భావం జరగనుంది. దీని మార్కెట్ వాటా దాదాపు 35 శాతం ఉంటుంది.

సుప్రీంలో ఆర్‌కామ్‌కు చుక్కెదురు!

ఆస్తుల విక్రయంపై స్టే కొనసాగింపు



న్యూఢిల్లీ: అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఆస్తుల విక్రయ ప్రయత్నాలకు గండిపడింది. తీవ్ర రుణ భారంతో ఉన్న ఆర్‌కామ్, తనకున్న టెలికం ఆస్తులను విక్రయించి అప్పులు తీరుద్దామనే ప్రణాళికతో ఉంది. అయితే, ఆస్తుల విక్రయంపై బోంబే హైకోర్టు విధించిన స్టేను ఎత్తివేయడానికి జస్టిస్ ఆదర్శ్ గోయెల్, జస్టిస్ ఆర్‌ఎఫ్ నారిమన్, జస్టిస్ యూయూ లలిత్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం నిరాకరించింది. యథాతథ స్థితి కొనసాగుతుందని స్పష్టం చేస్తూ ఆర్‌కామ్, ఆ సంస్థకు రుణాలిచ్చిన ఎస్‌బీఐ ఆధ్వర్యంలోని బ్యాంకుల కూటమి దాఖలు చేసిన పిటిషన్లపై తుది విచారణను ఏప్రిల్ 5న నిర్వహిస్తామని పేర్కొంది. ఆర్‌కామ్ బ్యాంకులకు రూ.42,000 కోట్లు బకాయి పడి ఉంది. ఎస్‌బీఐ, 24 ఇతర దేశీయ రుణ దాతలు ఆర్‌కామ్‌కు రుణాలివ్వడంతో అవన్నీ కూటమిగా ఏర్పడి ఆర్‌కామ్ కన్సాలిడేటెడ్ ఆస్తులను విక్రయించే ప్రక్రియను చేపట్టాయి. ఆర్‌కామ్‌కు చెందిన స్పెక్ట్రం, సెల్ టవర్లు, ఇతర సదుపాయాలను కొనుగోలు చేస్తానని రిలయన్స్ జియో ఆసక్తి చూపింది. ఇంతలోనే ఎరిక్సన్ సంస్థ ఆర్‌కామ్ రూ.1,150 కోట్లు బకాయి చెల్లించాల్సి ఉందని, ఆస్తుల విక్రయాలు జరగకుండా నిరోధించాలంటూ ఆర్బిట్రల్ ట్రిబ్యునల్‌కు వెళ్లి స్టే తెచ్చుకుంది. ఆ తర్వాత బోంబే హైకోర్టు స్టే ఆదేశాలను సమర్థించింది. దీంతో ఆర్‌కామ్, బ్యాంకుల కూటమి సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. రుణదాతల తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, బ్యాంకులు ఇచ్చింది సెక్యూర్డ్ రుణాలు కనుక వారి క్లెయిమ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఎరిక్సన్ తరఫు న్యాయవాది మాత్రం స్టే ఎత్తివేస్తే తాము బకాయిలు వసూలు చేసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని కోర్టుకు తెలిపారు. దీంతో ఇది చాలా పెద్ద అంశం అయినందున, వాదనలు వినాల్సి ఉందని, అప్పటి వరకు యథాతథ స్థితి కొనసాగుతుందని ధర్మాసనం పేర్కొంది.

ఆస్తుల విక్రయాన్ని వేగంగా పూర్తి చేస్తాం: ఆర్‌కామ్

సుప్రీంకోర్టులో తక్షణ ఉపశమనం లభించకపోయినప్పటికీ, ఆస్తుల విక్రయాన్ని వేగవంతం చేస్తామని ఆర్‌కామ్ తెలిపింది. ఆర్‌బీఐ నిర్దేశించినట్టు ఆగస్ట్ 31లోపు తమ ఆస్తుల విక్రయాన్ని పూర్తి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేసింది.

రిటైల్‌లో దక్షిణాది బ్రాండ్ల హవా!!

మొబైల్ చైన్స్‌లో అత్యధికం ఇక్కడి నుంచే

- పరిశ్రమలో 20 శాతం వాటా కైవసం
- ఈ-కామర్స్ కంపెనీలకు గట్టి పోటీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మొబైల్ ఫోన్ల విక్రయాల్లో ఆన్‌లైన్ వాటా మెల్లగా పెరుగుతున్నట్లు కనిపిస్తున్నా... మల్టీ బ్రాండ్ రిటైల్ చైన్ల అమ్మకాలు అంతకన్నా వేగంగా పెరుగుతున్నాయి. దీంతో వీటి విస్తరణ కూడా యమ స్పీడుగా జరుగుతోంది. మొత్తం పరిశ్రమలో వ్యాపార పరంగా ఇవి ఏకంగా 20 శాతం వాటాను కైవసం చేసుకున్నాయి. కస్టమర్లకు వినూత్న ఎక్స్‌పీరియెన్స్ అందిస్తూ ఈ-కామర్స్ కంపెనీలకూ పోటీనిస్తున్నాయి. ఆన్‌లైన్ సంస్థలకు పోటాపోటీ ధరల్లో అన్ని ప్రముఖ బ్రాండ్ల ఫోన్లను విక్రయిస్తున్న ఈ మల్టీ బ్రాండ్ మొబైల్ రిటైల్ చైన్లలో... దక్షిణాదికి చెందిన కంపెనీలే ఎక్కువగా ఉండడం విశేషం.

20 శాతం వాటాతో..

మొబైల్స్ మార్కెట్లో వ్యాపారం పరంగా సంప్రదాయ రిటైల్ స్టోర్ల వాటా 60 శాతం ఉండగా... ఆన్‌లైన్ 20 శాతం చేజిక్కించుకుంది. మిగిలిన వాటాను మల్టీ బ్రాండ్ మొబైల్స్ రిటైల్ చైన్లు కైవసం చేసుకున్నాయి. 50 ఆపైన స్టోర్లు కలిగి ఉన్న రిటైల్ చైన్లు దేశంలో 20 దాకా ఉంటాయని సమాచారం. ఇందులో అత్యధికం దక్షిణాది రాష్ట్రాలకు చెందినవే. సంగీత, పూర్వికా, బిగ్ సి, లాట్, సెల్ పాయింట్, బీ న్యూ, చెన్నై మొబైల్స్ వంటివి వీటిలో ఉన్నాయి.

విస్తరణ బాటలో..

తెలుగు రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న 'బిగ్ సి' సంస్థ ప్రస్తుతం 195 స్టోర్లను నిర్వహిస్తోంది. డిసెంబర్‌లోగా ఈ సంఖ్య 300కు చేరుతుందని సంస్థ సీఎండీ ఎం.బాలు చౌదరి 'సాక్షి' బిజినెస్ బ్యూరో ప్రతినిధితో చెప్పారు. త్వరలోనే కర్ణాటకలో అడుగు పెడతామన్నారు. మరో రిటైల్ చైన్ లాట్ మొబైల్స్‌కు 160 కేంద్రాలున్నాయి. ఈ ఏడాది మరో 50 స్టోర్లు జోడించనుంది. బీ న్యూ మొబైల్స్‌కు 50 స్టోర్లుండగా... ఈ ఏడాది మరో 85 స్టోర్స్‌ను ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుతం 85 స్టోర్లను నిర్వహిస్తున్న సెల్ పాయింట్ మరో 30 ఔట్‌లెట్లను జోడిస్తోంది. ఆరు రాష్ట్రాల్లో విస్తరించిన సంగీత మొబైల్స్ ఖాతాలో ఇప్పటికే 333 స్టోర్లున్నాయి. ప్రధాన మార్కెట్లలో కొత్త ఔట్‌లెట్లనూ ప్రారంభిస్తోంది.

రంగంలోకి కొత్త బ్రాండ్స్..

పోటీ ఉన్నా వ్యాపార వృద్ధికి ఢోకా లేకపోవటంతో మల్టీ బ్రాండ్ మొబైల్స్ రిటైల్‌లోకి తెలుగు రాష్ట్రాల నుంచి మరిన్ని కొత్త బ్రాండ్లు ప్రవేశం చేస్తున్నాయి. తాజాగా హ్యాపీ మొబైల్స్ తొలి స్టోర్‌ను అనంతపూర్‌లో ప్రారంభించింది. ఏడాదిలో 200 స్టోర్లను తెరుస్తామని హ్యాపీ మొబైల్స్ ఎండీ కృష్ణ పవన్ చెప్పారు. రూ.200 కోట్లతో 500 స్టోర్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు సెలెక్ట్ మొబైల్స్ ఎండీ వై.గురు ప్రకటించారు. ఈ రెండు బ్రాండ్లూ తెలంగాణ, ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల్లో అడుగుపెట్టనున్నాయి.

పెరిగిన ఈఎంఐల వాటా..

స్మార్ట్‌ఫోన్ సగటు విక్రయ ధర రెండేళ్ల క్రితం రూ.4,000. ఇప్పుడది రూ.9,000 చేరిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గ్రామాల్లో ఇది రూ.8,000గా ఉంది. వాయిదాల్లో ఫోన్లు కొంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గతేడాది 10 శాతం ఉంటే, ఇప్పుడీ వాటా ఏకంగా రెండింతలవడం గమనార్హం. మొత్తంగా మొబైల్ పరిశ్రమను చూస్తే... దేశంలో నెలకు 2 కోట్ల మొబైల్ ఫోన్లు అమ్ముడవుతున్నాయి. ఇందులో 40 శాతం స్మార్ట్ ఫోన్లు, 60 శాతం బేసిక్ మోడళ్లు. ప్రతి నెలా రూ.10,000 కోట్ల వ్యాపారం జరుగుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో నెలకు 12 లక్షల ఫోన్లు అమ్ముడవుతుండగా వీటిలో స్మార్ట్‌ఫోన్ల వాటా 50 శాతం. విలువ పరంగా ఏపీ, తెలంగాణలో తలా రూ.300 కోట్ల వ్యాపారం జరుగుతోంది. కాకపోతే దీన్లో హైదరాబాద్ వాటా రూ.150 కోట్లు.



దివాలా అంశాలపై
ఈ నెల్లోనే నివేదిక



న్యూఢిల్లీ: దివాలా పరిష్కార చట్టానికి సంబంధించిన అంశాలపై సమీక్షకు ఏర్పాటైన అత్యున్నత స్థాయి ప్యానెల్ ఈ నెల చివరిలోగా నివేదిక సిద్ధం చేయనుంది. ఈ చట్టానికి సంబంధించి సవరణలను ప్యానెల్ ప్రభుత్వానికి సిఫారసు చేయనుందని అధికార వర్గాలు తెలిపాయి. భారీ రుణ ఎగవేత కేసులను ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (ఐబీసీ) కింద పరిష్కార చర్యల కోసం చేపట్టిన విషయం తెలిసిందే. ఈ చట్టం అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, పరిష్కార మార్గాలను సూచించేందుకు ప్రభుత్వం 14 మంది సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఇప్పటికే ముసాయిదా నివేదికను సభ్యులకు అందించగా, ఈ నెల చివరిలోగా తుది నివేదిక సిద్ధం చేయనున్నట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ నివేదికలోని అంశాలను పరిశీలించిన తర్వాత కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఐబీసీ చట్టంలో సవరణలకు ఉద్దేశించిన బిల్లును రూపొందిస్తుంది.



డిష్ టీవీలో వీడియోకాన్ డీ2హెచ్ విలీనం పూర్తి

డీటీహెచ్ రంగంలో ఇదే పెద్ద కంపెనీ!

న్యూఢిల్లీ: ఎట్టకేలకు డిష్ టీవీ ఇండియాలో వీడియోకాన్ డీ2హెచ్ విలీనం పూర్తయింది. దీంతో డైరెక్ట్ టు హోమ్(డీటీహెచ్) రంగంలో అతి పెద్ద సంస్థగా 2.8 కోట్ల మంది చందాదారులతో జీ గ్రూప్‌కు చెందిన డిష్ టీవీ ఇండియా అవతరించనుంది. ఈ విలీనానికి 2016 నవంబర్‌లోనే ఇరు కంపెనీల బోర్డులూ ఆమోదం తెలిపాయి. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ), కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) తదితర సంస్థల నుంచి ఆమోదాలు పొందే ప్రక్రియ కారణంగా విలీనానికి ఇంత సమయం పట్టింది. మరో వైపు వీడియోకాన్ గ్రూప్ కంపెనీలు దివాలా ప్రక్రియలో ఉండటంతో వీడియోకాన్ డీ2హెచ్ విలీనంపై ఏమైనా ప్రభావం ఉంటుందేమోనన్న ఉద్దేశంతో డిష్ టీవీ తాత్కాలికంగా వెనక్కు తగ్గడం కూడా జాప్యానికి కారణమైంది. మొత్తం మీద గురువారం నుంచి వీడియోకాన్ డీ2హెచ్, డిష్ టీవీలు ఒక్క సంస్థగా కలిసిపోయాయని డిష్ టీవీ ఇండియా సీఎండీ జవహర్ గోయల్ చెప్పారు. డిష్ టీవీకి 1.55 కోట్ల మంది, వీడియోకాన్ డీ2హెచ్‌కు 1.22 కోట్ల మంది చందాదారులున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో డిష్ టీవీ రూ.6,086 కోట్ల ఐబిటాను, వీడియోకాన్ డీ2హెచ్ రూ.1,909 కోట్ల ఐబిటాను ఆర్జించాయి. విలీనం పూర్తయిందన్న వార్తల నేపథ్యంలో బీఎస్ఈలో డిష్ టీవీ 1.6% లాభపడి రూ.67 వద్ద ముగిసింది.

ప్రభుత్వ బ్యాంకులపై పునరాలోచన అవసరం

ప్రధాని ఆర్థిక సలహాదారు సుబ్రమణియన్



న్యూఢిల్లీ: బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మక సంస్కరణల అవసరమని ప్రధానమంత్రి ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ అన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకుల యాజమాన్యం విషయంలో పునరాలోచనకు సమయం ఆసన్నమైందన్నారు. ఇటీవలి పీఎన్‌బీ సహా పలు ప్రభుత్వరంగ బ్యాంకుల్లో (పీఎస్‌బీ) మోసాలు వెలుగు చూడడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరిష్కార యత్నాలకు విఘాతం కలిగించాయన్నారు. పీఎస్‌బీల్లో ఈ మోసాలు భవిష్యత్తులో చోటు చేసుకోకూడదంటే విప్లవాత్మక అజెండా అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. ''ప్రభుత్వం ట్విన్ బ్యాలన్స్ షీటు (రుణాలు తీసుకున్న సంస్థలు, ఇచ్చిన బ్యాంకులు సమస్యలను ఎదుర్కోవడం) సవాలును పరిష్కరించేందుకు దివాలా పరిష్కార చట్టం (ఐబీసీ), బ్యాంకులకు రీక్యాపిటలైజేషన్ అనే రెండు కీలక చర్యలు చేపట్టింది. నిజాయితీగా చెప్పాలంటే ఆ ప్రయత్నాలన్నింటికీ బ్యాంకుల్లో మోసాలు గండికొట్టాయి'' అని సుబ్రమణియన్ అన్నారు. ట్విన్ బ్యాలన్స్ షీటు సమస్య నుంచి బయటపడేందుకు తాజా చర్యలు అవసరమని సూచించారు. ప్రఖ్యాత నోబెల్ గ్రహీత ఆర్థిక వేత్త పాల్‌క్రుగ్‌మ్యాన్ భారత్‌లో తయారీ ఉద్యోగాలు లోపించాయనడం నిజమేనని సుబ్రమణియన్ అంగీకరించారు. తయారీ రంగంలో అవకాశాలను భారత్ 25–30 ఏళ్ల క్రితమే చేజార్చుకుందన్నారు. అయితే, భవిష్యత్తులోనూ తయారీ రంగం ఇదే స్థాయిలో ఉద్యోగాలు కల్పిస్తుందన్న నమ్మకం లేదని, నిర్మాణం, వ్యవసాయం, సేవల రంగాలు మరింత ఉద్యోగాలు కల్పించగలవని అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశీయ డిమాండ్‌పైనే భారత్ ఎదగడం సాధ్యం కాదన్నారు.

మహీంద్రా, ఫోర్డ్‌ల ఎస్‌యూవీ!

ఎలక్ట్రిక్ వెహికల్ కూడా



న్యూఢిల్లీ: మహీంద్రా గ్రూప్ ఫోర్డ్ మోటార్‌తో కలిసి కొత్త ఎస్‌యూవీలను అభివృద్ధి చేయనున్నది. అంతేకాకుండా ఒక చిన్న ఎలక్ట్రిక్ వెహికల్‌ను కూడా అందుబాటులోకి తేనున్నది. గత ఏడాది ఇరు కంపెనీల మధ్య కుదిరిన వ్యూహాత్మక ఒప్పందాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే ప్రక్రియలో భాగమే ఇదంతా అని మహీంద్రా అండ్ మహీంద్రా ఎమ్‌డీ పవన్ గోయెంకా పేర్కొన్నారు. దీంట్లో భాగంగానే ఇరు కంపెనీలు తాజాగా ఐదు ఒప్పందాలను కుదుర్చుకున్నాయని తెలిపారు. దీంట్లో భాగంగా ఇరు సంస్థలు కలసి మిడ్‌సైజ్ స్పోర్ట్స్ యుటిలిటి వెహికల్‌ను అందుబాటులోకి తేనున్నాయని వివరించారు. ఈ ఎస్‌యూవీని మహీంద్రా ప్లాట్‌ఫార్మ్‌పై తయారు చేస్తామని, ఇరు కంపెనీలు వేర్వేరు బ్రాండ్ల కింద ఈ ఎస్‌యూవీలను సొంతంగా విక్రయిస్తాయని తెలిపారు. ఇరు కంపెనీల ఉద్యోగుల మధ్య సహకారం కొనసాగుతుందని, మూడేళ్ల పాటు కలసి పనిచేస్తామని గోయెంకా తెలిపారు. యుటిలిటి వెహికల్స్, ఎలక్ట్రిక్ వెహికల్స్ దృష్టిపెట్టాల్సిన కీలక అంశాలని ఫోర్డ్ ఎగ్జిక్యూటివ్ వైస్-ప్రెసిడెంట్ జిమ్ ఫార్లే పేర్కొన్నారు. వినియోగదారుల అభిరుచులు, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని వాహనాలను అందిస్తామని వివరించారు.

పీఎఫ్‌సీకి మొండిబాకీల సెగ!!

ఎన్‌సీఎల్‌టీ ముంగిట 14వేల మె.వా. ప్రాజెక్టులు

- రుణాల విలువ సుమారు రూ. 30,000కోట్లు
- దాదాపు సగం రైటాఫ్ చేయాల్సిన పరిస్థితి

న్యూఢిల్లీ: విద్యుదుత్పత్తి కంపెనీలకు రుణాలు సమకూర్చే ప్రభుత్వ రంగ దిగ్గజం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ)కి మొండిబాకీల సెగ భారీగా తగిలే అవకాశాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. భారీగా రుణాలు పొందిన కొన్ని విద్యుత్ ప్రాజెక్టులు దివాలా చట్టం కింద చర్యలు ఎదుర్కొనాల్సి రానుండటమే ఇందుకు కారణం. మొత్తం రుణాల్లో వీటి పరిమాణం సుమారు 11.4 శాతంగా ఉండొచ్చని పీఎఫ్‌సీ అంచనా వేస్తోంది. దాదాపు 14,115 మెగావాట్ల (మె.వా) సామర్థ్యం గల ప్రాజెక్టులు దివాలా చట్టం చర్యలు ఎదుర్కొనాల్సి రావచ్చని భావిస్తోంది. వీటికిచ్చిన రుణాల పరిమాణం దాదాపు రూ. 30,000 కోట్లు ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. పలు థర్మల్ పవర్ ప్రాజెక్టులతో పాటు విద్యుదుత్పత్తిలో జాప్యం అవుతున్న గ్యాస్, హైడ్రో పవర్ ప్రాజెక్టులూ ఈ జాబితాలో ఉన్నాయి. పీఎఫ్‌సీ, ఇతరత్రా బ్యాంకులు.. బకాయిలను రాబట్టుకునేందుకు ఇప్పటికే 3,255 మె.వా. ప్రాజెక్టులపై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)ని ఆశ్రయించాయి. ఇక మరో 10,000 మె.వా. ప్రాజెక్టులకు సంబంధించిన రుణబకాయిల సమస్య పరిష్కారానికి 6 నెలల గడువుంది. అయితే, విద్యుదుత్పత్తి.. నియంత్రణపరమైన అడ్డంకులు తదితర సమస్యల కారణంగా అంతిమంగా ఈ ప్రాజెక్టులన్నీ ఎన్‌సీఎల్‌టీ ముందుకొచ్చే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. కొత్త దివాలా చట్టం (ఐబీసీ) కింద ఇప్పటికే సుమారు ఆరు ప్రాజెక్టులు ఎన్‌సీఎల్‌టీకి చేరాయి. కోనసీమ గ్యాస్ పవర్ ప్లాంటు(445 మె.వా. సామర్థ్యం), ఈస్ట్ కోస్ట్ పవర్ (1,320 మె.వా.), కేవీకే నీలాంచల్(350 మె.వా), ఇండ్ భారత్ మద్రాస్ (660 మె.వా.), కృష్ణా గోదావరి(360 మె.వా.), సిక్కింలోని జేఏఎల్ హైడ్రో పవర్ (120 మె.వా) వీటిలో ఉన్నాయి.

నిబంధనలతో చిక్కు..

మొండిబాకీల వర్గీకరణకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ కొత్తగా ఇచ్చిన ఆదేశాలతో పీఎఫ్‌సీకి చిక్కొచ్చి పడింది. ఆర్‌బీఐ నోటిఫికేషన్ ప్రకారం.. ఒక్క వడ్డీ చెల్లించడంలో ఒక్క రోజు ఆలస్యమైనా కూడా సదరు రుణాన్ని డిఫాల్ట్ కింద బ్యాంకులు వర్గీకరించాల్సి వస్తోంది. రుణ ఒత్తిడిలో ఉన్న సదరు ఖాతాదారుల నుంచి బకాయిలు రాబట్టుకునే ప్రక్రియ 180 రోజుల్లోగా పూర్తి చేయాల్సి ఉంటోంది. ప్రధానంగా ఈ ఆదేశాలు బ్యాంకులకు ఉద్దేశించినవే. పీఎఫ్‌సీ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్సింగ్ కంపెనీ కేటగిరీకి చెందినది అయినప్పటికీ ఇది కొన్ని బ్యాంకుల కన్సార్షియంలతో కలిసి రుణాలివ్వడంతో ఆయా అసెట్స్‌కి కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయి. దీంతో మిగతా బ్యాంకులు సదరు ఖాతాలను డిఫాల్ట్‌గా వర్గీకరించిన పక్షంలో ఆ ప్రభావం పీఎఫ్‌సీపై కూడా పడనుంది. ప్రస్తుతం దివాలా అంచున ఉన్న ప్లాంట్లలో జీఎంఆర్ ఛత్తీస్‌గఢ్, లాంకో అమర్‌కాంతక్, ఎస్సార్ మహాన్, మహేశ్వర్ హైడ్రో, రతన్ ఇండియా, ఉత్కళ్ తదితర ప్రాజెక్టులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. జీఎంఆర్ ఛత్తీసగఢ్ ప్లాంటుకు సంబంధించి లీడ్ బ్యాంకరుగా వ్యవహరిస్తున్న యాక్సిస్ బ్యాంక్ ఇప్పటికే కొనుగోలుదారుల నుంచి బిడ్లు ఆహ్వానించింది. అదానీ పవర్, టోరెంట్ పవర్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ సంస్థలు బిడ్లు వేసినప్పటికి ఫిబ్రవరి 28 డెడ్‌లైన్‌లోగా డీల్ పూర్తి కాలేదు. దీంతో గడువు పొడిగించేందుకు అనుమతించాలంటూ నియంత్రణ సంస్థను యాక్సిస్ బ్యాంక్ కోరింది. ఒకవేళ జీఎంఆర్ ఛత్తీస్‌గఢ్ విక్రయం కుదరకపోయిన పక్షంలో అది కూడా ఎన్‌సీఎల్‌టీకి చేరే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. మిగతా ప్రాజెక్టుల విషయంలోనూ ఆర్‌బీఐ నిబంధనలతో పరిస్థితి సంక్లిష్టంగా మారిందని పేర్కొన్నాయి. ఈ అసెట్స్ అన్నింటిపైనా దివాలా చట్టం కింద చర్యలు ప్రయోగించిన పక్షంలో పీఎఫ్‌సీతో పాటు ఇతర బ్యాంకర్లు కూడా దాదాపు సగభాగం రుణాలను రైటాఫ్ చేయాల్సి రావొచ్చని అంచనా.



ప్రాజెక్టులకు నియంత్రణ సమస్యలు ..

విద్యుదుత్పత్తి ప్రాజెక్టుల విక్రయానికి నియంత్రణలపరమైన పలు అవరోధాలు.. సమస్యాత్మకంగా ఉంటున్నాయి. దాదాపు నాలుగేళ్ల పాటు ఏ ప్రభుత్వం కూడా దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందం కుదుర్చుకోకపోవడంతో ఉత్పత్తి ప్రాజెక్టుల ఆదాయాలపై ప్రతికూల ప్రభావం పడింది. బొగ్గు సరఫరా సమస్య కొంత పరిష్కారమైనప్పటికీ.. పూర్తి స్థాయిలో విద్యుదుత్పత్తి పెరుగుదల కనిపించాల్సి ఉంది. అలాగే, వివిధ నియంత్రణ సంస్థల కమిషన్స్, న్యాయస్థానాల్లో ఏళ్ల తరబడి పలు ప్రాజెక్టులపై కేసులు నడుస్తుండటం కూడా వీటి విక్రయాలకు తీవ్ర ప్రతిబంధకంగా ఉంటోంది. ఐబీసీ పరిధిలోకి రాకపోయినా 25,000 మెగావాట్ల సామర్థ్యంగల థర్మల్ ప్రాజెక్టులు ఇలా అమ్మకానికి ఉన్నప్పటికీ... కొనుగోలుదారులు లేకపోవడం దీనికి నిదర్శనంగా పరిశ్రమవర్గాలు చెబుతున్నాయి.


హైదరాబాద్‌లో హెచ్‌సీఏహెచ్ సేవలు

ఇంట్లోనే ఐసీయూ; క్రిటినెక్స్‌తో ఒప్పందం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంటి దగ్గరికే వైద్య సేవలందించే (హోమ్ హెల్త్ కేర్) మరో సంస్థ హైదరాబాద్‌లో ఆరంభమైంది. హెల్త్‌కేర్ ఎట్ హోమ్ (హెచ్‌సీఏహెచ్) గురువారం అధికారికంగా సేవలను ప్రారంభించింది. సీనియర్ వైద్యులు, ఆధునిక వైద్య పరికరాలు, నైపుణ్యమున్న వైద్య సిబ్బందితో పాటు ప్రత్యేకంగా ఇంటి దగ్గరే ఐసీయూ సేవలందించేందుకు క్రిటినెక్స్ సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లు హెచ్‌సీఏహెచ్ కో–ఫౌండర్ అండ్ సీఈఓ వివేక్ శ్రీవాస్తవ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజియోథెరపీ, నర్సింగ్, కీమోథెరపీ, డయాగ్నోస్టిక్స్, మెడికల్ డెలివరీ, సర్జికల్ కేర్ వంటి అన్ని సేవలూ అందిస్తామన్నారు. డాబర్, యూకేలోని హెల్త్‌కేర్ ఎట్ హోమ్ (హెచ్‌యూహెచ్) ప్రమోటర్లయిన బర్మన్ కుటుంబీకులు దీన్లో పెట్టుబడులు పెట్టారు. హెల్త్‌కేర్ ప్రైవేట్ ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ క్వాడ్రియా క్యాపిటల్ నుంచి పీఈ నిధులను సమీకరించింది.

సీఐఐ ఐడబ్ల్యూఎన్ తెలంగాణ చైర్‌పర్సన్‌గా శోభ

వైస్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ నందితా సేథి


శోభా దీక్షిత్



నందితా సేథి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ (ఐడబ్ల్యూఎన్) తెలంగాణ చైర్మపర్సన్‌గా ఎంఎస్ శోభా దీక్షిత్, వైస్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ నందితా సేథి నియమితులయ్యారు. 2018–19 సంవత్సరాదీ వీళ్లు ఈ పదవిలో కొనసాగుతారని సీఐఐ ఐడబ్ల్యూఎన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం శోభా దీక్షిత్ ప్లాస్టిక్ ప్యాకేజింగ్ సొల్యూషన్ సంస్థ ఏఎల్‌పీఎల్‌ఏ ప్రైవేట్ లిమిటెడ్‌కు, నందితా సేథి స్కిల్ డెవలప్‌మెంట్ కంపెనీ జెన్ స్కిల్‌ప్రాక్ విభాగమైన ఎంటర్‌ప్రెన్యూర్ జోన్‌కు నేతృత్వం వహిస్తున్నారు.

బ్యాంకింగ్ మోసాలతో వృద్ధికి విఘాతం: డీఅండ్ బీ

న్యూఢిల్లీ: బ్యాంకింగ్ రంగంలో మోసాలు, జీఎస్టీ వసూళ్లు స్తబ్దుగా ఉండటం, అమెరికా రక్షణాత్మక విధానాలు ఇవన్నీ కూడా భారత వృద్ధి రేటుకు విఘాతం కలిగించే చర్యలుగా డీఅండ్‌బీ ఆర్థిక సర్వే నివేదిక 2018 పేర్కొంది. వృద్ధి రేటు కొనసాగేలా చూడటమన్న సవాలును ప్రభుత్వం ఎదుర్కొంటున్నట్టు తెలిపింది. దేశంలో పెట్టుబడుల తీరు నిలకడగా పుంజుకోవాల్సి ఉందని పేర్కొంది.

వాణిజ్య యుద్ధ భయాలతో నష్టాలు



ఆరు వారాల గరిష్టానికి చమురు ధరలు
130 పాయింట్ల నష్టంతో 33,006కు సెన్సెక్స్
41 పాయింట్లు పతనమై 10,115కు నిఫ్టీ

ముంబై: అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయాల కారణంగా ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ చేయడంతో గురువారం స్టాక్ మార్కెట్ నష్టపోయింది. యూరప్ మార్కెట్లు బలహీనంగా ఆరంభం కావడం, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఆరు వారాల గరిష్టానికి చేరడంతో రెండు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. ఆద్యంతం ఒడిదుడుకులమయంగా సాగిన బీఎస్ఈ సెన్సెక్స్ 130 పాయింట్లు నష్టపోయి 33,006 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 41 పాయింట్ల నష్టంతో 10,115 పాయింట్ల వద్ద ముగిశాయి. రియల్టీ, క్యాపిటల్ గూడ్స్, టెక్నాలజీ, వాహన, బ్యాంక్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. లోహ షేర్ల సూచీ మినహా మిగిలిన అన్ని రంగాల సూచీలు నష్టాల్లోనే ముగిశాయి.

చైనాపై ఆంక్షలు..!

మేధోపరమైన హక్కులు, టెక్నాలజీ బదిలీలకు సంబంధించిన నియమ నిబంధనలను చైనా ఉల్లంఘిస్తోందని అమెరికా పేర్కొంది. చైనాపై నేడు(శుక్రవారం) అమెరికా ఆంక్షలు విధించే అవకాశాలున్నాయని సమాచారం. అయితే తమ ప్రయోజనాలు, హక్కుల రక్షణ కోసం తగిన చర్యలు తీసుకుంటామని చైనా వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో వాణిజ్య యుద్ధ భయాల ఆందోళన ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైంది. అంచనాలకు తగ్గట్లుగానే ఫెడ్ రేట్ల పెంపు ఉండటంతో కొనుగోళ్ల జోరుతో ఇంట్రాడేలో 146 పాయింట్లు లాభంతో 33,282 పాయింట్ల గరిష్ట స్థాయిని తాకింది. యూరప్ మార్కెట్లు బలహీనంగా ప్రారంభం కావడం, వాణిజ్య యుద్ధ భయాలతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ చేయడంతో నష్టాల్లోకి జారిపోయింది. ఇంట్రాడేలో 173 పాయింట్లు నష్టపోయింది. మొత్తం మీద 319 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఇక నిఫ్టీ ఒక దశలో 53 పాయింట్లు లాభపడగా, మరో దశలో 50 పాయింట్లు పతనమైంది.

ఏడాది కనిష్టానికి ఎస్‌బీఐ..

ఎన్ఎస్ఈ బ్యాంక్ నిఫ్టీ వీక్లీ డెరివేటివ్స్ ముగింపు, చెన్నైకు చెందిన కనిష్క్ గోల్డ్ రూ.824 కోట్ల మేర మోసాలకు పాల్పడిందన్న వార్తల కారణంగా బ్యాంక్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ఎస్‌బీఐ ఇంట్రాడేలో 3 శాతం నష్టంతో తాజా ఏడాది కనిష్ట స్థాయి, రూ.241ను తాకింది. చివరకు 2.4 శాతం నష్టంతో రూ.242 వద్ద ముగిసింది.

ఓఎన్‌జీసీ 2 శాతం అప్...

అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఆరు వారాల గరిష్టానికి చేరడంతో చమురు ఉత్పత్తి సంస్థలు–ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా, అబన్ ఆఫ్‌షోర్ తదితర షేర్లు లాభపడ్డాయి. ఓఎన్‌జీసీ 1.8 శాతం లాభంతో రూ.178 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా పెరిగిన షేర్ ఇదే.



స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	3,509
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	27,479
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	13,65,419
ఎఫ్ఐఐ	161
డీఐఐ	410

ఐదేళ్లలో రూ.5 వేల కోట్ల పెట్టుబడులు

- వచ్చే ఏడాది విపణిలోకి తొలి కారు
- ఎంజీ మోటార్స్ ఇండియా లక్ష్యం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మోరీస్ గ్యారేజెస్ (ఎంజీ) మోటార్స్ ఇండియా వచ్చే ఐదేళ్లలో దేశీయ మార్కెట్లో రూ.5 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. గుజరాత్‌లోని హలోల్‌లో ప్లాంట్‌లో కొత్త అసెంబ్లింగ్ లైన్లు, ప్రెస్‌షాప్ వంటి ఇతర వసతుల మీద ఈ పెట్టుబడులుంటాయని ఎంజీ మోటార్స్ ఇండియా ప్రెసిడెంట్ అండ్ ఎండీ రాజీవ్ చాబా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది రెండో త్రైమాసికంలో తొలి కారును విపణిలోకి విడుదల చేయాలని లక్ష్యించినట్లు ఆయన పేర్కొన్నారు. చైనాకు చెందిన ఎస్ఏఐసీ మోటార్ కార్పొరేషన్ అనుబంధ సంస్థే ఈ ఎంజీ మోటార్స్ ఇండియా.

మూడు రెట్లు పెరగనున్న కరెంటు లోటు

2017–18లో 46–48 బిలియన్ డాలర్లు: ఇక్రా



ముంబై: కరెంటు ఖాతా లోటు (సీఏడీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (జనవరి–మార్చి)లో 10–12 బిలియన్ డాలర్లకు పెరిగే అవకాశం ఉందని రేటింగ్ సంస్థ ఇక్రా పేర్కొంది. కరెంటు ఖాతా లోటు మూడో క్వార్టర్లో (డిసెంబర్)నూ 13.5 బిలియన్ డాలర్లకు పెరగొచ్చని లేదా జీడీపీలో 2 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. ''2017–18 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో కరెంటు ఖాతా లోటు అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఉన్న 3.4 బిలియన్ డాలర్ల నుంచి 10–12 బిలియన్ డాలర్లకు విస్తరిస్తుందని అంచనా వేస్తున్నాం. సేవల ద్వారా వచ్చే మిగులుకన్నా సరుకుల వాణిజ్యలోటు పెరగడం వల్ల ఈ అంచనా వేస్తున్నాం'' అని ఇక్రా తెలిపింది. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద కరెంటు ఖాతా లోటు 46–48 బిలియన్ డాలర్ల మధ్య లేదా జీడీపీలో 1.8 శాతంగా ఉండొచ్చని తెలిపింది.

స్కిల్ సాఫ్ట్ హైసియా సీఎస్ఆర్ అవార్డు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ స్కిల్ సాఫ్ట్, దీని అనుబంధ సంస్థ సమ్ టోటల్ సిస్టమ్‌లకు హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రెజెస్ అసోసియేషన్ (హైసియా) 3వ వార్షిక కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) అవార్డులు దక్కాయి. విద్యా, పర్యావరణ రంగాల్లో నూతన ఆవిష్కరణలు, ప్రయోగాత్మక కార్యక్రమాలకు ఈ గుర్తింపు ఇచ్చినట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎమ్‌సీఎక్స్‌లో ఇత్తడి ఫ్యూచర్స్

- ప్రపంచంలో ఇదే తొలి ఫ్యూచర్స్ ట్రేడింగ్
- ఈ నెల 26 నుంచి 3 నెలల కాంట్రాక్టులు

ముంబై: మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్ (ఎమ్‌సీఎక్స్) ఇత్తడి లోహంలో ఫ్యూచర్స్ ట్రేడింగ్‌ను ప్రారంభించనుంది. ఇత్తడి లోహంలో ఫ్యూచర్స్ ట్రేడింగ్ జరగడం ప్రపంచంలో ఇదే తొలిసారి. ఈ నెల 26 నుంచి ఏప్రిల్, మే, జూన్ నెల కాంట్రాక్టులను ఆఫర్ చేస్తామని ఎమ్‌సీఎక్స్ తెలిపింది. లాట్ సైజ్ ఒక టన్ను అని ఎమ్‌సీఎక్స్ ఎండీ, సీఈఓ మృగాంక్ పరాంజపే తెలిపారు. ఇత్తడి ఫ్యూచర్స్... ఇత్తడి లోహానికి వ్యవస్థీకృత ధరను నిర్ణయించే ప్లాట్‌ఫామ్‌గానే కాకుండా జాతీయ స్థాయి ప్రమాణ ధరగా కూడా ఉపయోగపడుతుందని వివరించారు. ధరలకు సంబంధించి నష్ట భయాన్ని హెడ్జింగ్ చేసుకోవడానికి కూడా ఈ ఇత్తడి ఫ్యూచర్స్ ఉపయోగపడతాయన్నారు. ఐరన్ కాకుండా తప్పనిసరి డెలివరీ ఆప్షన్ ఉన్న తొలి ఫ్యూచర్స్ కూడా ఇదేనని తెలిపారు. డెలివరీ సెంటర్ అయిన జామ్‌నగర్ వేర్‌హౌస్ ధర కోట్ అవుతుందని, అన్ని ట్యాక్స్‌లు, సుంకాలు దీంట్లో కలిసి ఉంటాయని, జీఎస్‌టీ అధికమని వెల్లడించారు.

హెడ్జింగ్‌కు వీలు: ఇత్తడికి మంచి ధర వచ్చేలా ఈ ఇత్తడి ఫ్యూచర్స్ తోడ్పడుతాయని, ఇది ఈ లోహ సంబంధిత దిగుమతిదారులు, ఎగుమతిదారులు, తయారీదారులు, రిఫైనరీ, ప్రాసెసింగ్ చేసే వ్యక్తులకు ప్రయోజనకరమని పరాంజపే తెలిపారు. ఇత్తడి తయారీకి కావలసిన మొత్తం స్క్రాప్‌ను దాదాపు దిగుమతి చేసుకుంటున్నామని జామ్‌నగర్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తుల్సీభాయ్ గజేరా చెప్పారు. ఈ షిప్‌మెంట్స్ భారత్‌లోకి వచ్చేదాకా వాటి ధరల వివరాలు నిర్ణయం కావన్నారు. ఎమ్‌సీఎక్స్ ఇత్తడి ఫ్యూచర్స్ వల్ల దిగుమతిదారులు తమ నష్ట భయాన్ని హెడ్జింగ్ చేసుకునే వీలు కలుగుతుందని వెల్లడించారు.

రుణాల జారీ ప్రక్రియ మరింత కఠినం

- ఎన్‌పీఏలు, మోసాలపై పర్యవేక్షణకు యంత్రాంగం
- పంజాబ్ నేషనల్ బ్యాంకు నిర్ణయం




న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు రూ.13,000 కోట్ల రూపాయల నీరవ్‌మోదీ మోసం నేపథ్యంలో రుణాల జారీ ప్రక్రియను మరింత మెరుగ్గా మార్చాలని నిర్ణయించింది. అలాగే, రుణాలు మొండి బకాయిలుగా మారకుండా, మోసాల నివారణకు గాను పర్యవేక్షణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయనుంది. ఇందు కోసం రుణాల జారీకి ముందు ప్రత్యేక మదింపు, రుణాల జారీ తర్వాత పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేసే ఆలోచనతో ఉన్నట్టు బ్యాంకు అధికార వర్గాలు తెలిపాయి. రుణాలు తీసుకున్న సంస్థలు ప్రాజెక్టుల ద్వారా వస్తున్న నిధులను తిరిగి చెల్లింపులకు వినియోగిస్తున్నదీ, లేనిదీ పర్యవేక్షించనున్నట్టు పేర్కొన్నాయి. ఎన్‌పీఏల వసూలుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించాయి. తొలుత కొన్ని శాఖల్లో ప్రయోగాత్మకంగా పరీక్షించి వచ్చే ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా ఈ విధానాన్ని ఆచరణలో పెట్టనున్నట్టు అధికార వర్గాల సమాచారం. ఇదంతా మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగమేనని పేర్కొన్నాయి. కస్టమర్ల సమస్యలకు సకాలంలో పరిష్కారం చూపించడం, సేవలపై వారి అభిప్రాయాలు తెలుసుకునేందుకు బ్యాంకు ఆటోమేషన్ ప్రక్రియను కూడా అమలు చేయాలని నిర్ణయించింది.

2011 నుంచి 41,178 ఎల్‌ఓయూలు

పీఎన్‌బీ 2011 నుంచి 41,178 లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్ఓయూ)లను జారీ చేయగా, ఇందులో 1,590 నీరవ్‌మోదీ, మెహుల్‌చోక్సీ, వారి భాగస్వాములకు ఇచ్చినవి అని ఆర్థిక శాఖ పార్లమెంటుకు వెల్లడించింది. 2011 నుంచి 2014 మే వరకు పీఎన్‌బీ జారీ చేసిన ఎల్‌వోయూలపై పూర్తి సమాచారం తమ దగ్గర లేదని ఆర్‌బీఐ పేర్కొన్నట్టు ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ సభకు తెలిపారు.

ఆయుష్మాన్ భారత్‌తో ఆరోగ్య బీమా ధీమా

క్రిసిల్ నివేదిక వెల్లడి



ముంబై: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త జాతీయ ఆరోగ్య సంరక్షణ స్కీమ్ కారణంగా ఆరోగ్య బీమా 50 శాతానికి పైగా విస్తరిస్తుందని క్రిసిల్ తాజా నివేదిక పేర్కొంది. 11 కోట్ల పేద కుటుంబాలకు నేషనల్ హెల్త్ ప్రొటెక్షన్ మిషన్ కింద ఆరోగ్య బీమానందించే ఆయుష్మాన్ భారత్ స్కీమ్‌కు కేంద్ర కేబినెట్ బుధవారం లాంఛనంగా ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. అంతే కాకుండా ఈ స్కీమ్‌కు కేంద్రం వాటాగా రానున్న రెండు ఆర్థిక సంవత్సరాల కోసం రూ.85,200 కోట్ల నిధుల కేటాయింపులకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. 11 కోట్ల కుటుంబాలకు ఏడాది పాటు రూ.5 లక్షల ఆరోగ్య బీమాను ఈ స్కీమ్ కింద అందించనున్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రకటించిన ఈ స్కీమ్‌లో ఇప్పటివరకూ ఉన్న కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన, సీనియర్ సిటిజన్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్‌లు విలీనమవుతాయి. ప్రస్తుతం ఆరోగ్య బీమా విస్తరణ 33 శాతంగా ఉందని, ఈ ఆయుష్మాన్ భారత్ స్కీమ్ కారణంగా ఈ బీమా విస్తరణ 50 శాతానికి పైగా పెరుగుతుందని క్రిసిల్ నివేదిక వివరించింది. ప్రస్తుతం ఆరోగ్య బీమా కవరేజ్ 43.8 కోట్లమందికి ఉందని, ఈ స్కీమ్‌తో అది 65 కోట్ల మందికి పెరుగుతుందని పేర్కొంది.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,675	▲	225
బంగారం (99.5, 10గ్రా)	30,525	▲	225
వెండి (కిలో)	38,480	▲	480
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		–
బంగారం (22 క్యారెట్లు)	29,230	▲	240
వెండి (కిలో)	– –		–
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,670	▲	280
బంగారం (22 క్యారెట్లు)	29,210	▲	270
వెండి (కిలో)	41,500	▲	500
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	31,350	▲	100
బంగారం (22 క్యారెట్లు)	29,070	▲	130
వెండి (కిలో)	39,600	▲	500
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	31,230	▲	280
బంగారం (22 క్యారెట్లు)	29,210	▲	270
వెండి (కిలో)	41,000		0
విజయవాడ (బుధవారం రేట్లు)			
బంగారం (24 క్యారెట్లు)	31,400		0
బంగారం (22 క్యారెట్లు)	29,000		0
వెండి(కిలో)	39,300	▲	300
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,600	▲	260
బంగారం (22 క్యారెట్లు)	29,230	▲	240
వెండి (కిలో)	39,600	▲	500

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	64.44 (రాత్రి 11.00కు)	$65.17 (బుధవారం ముగింపు)
బ్రెంట్	68.51 (రాత్రి 11.00కు)	$69.47 (బుధవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 23-3-2018

విశాఖ	325–00
చిత్తూరు	363–00
వరంగల్	317–00
ముంబై	355–00
చెన్నై	370–00
విజయవాడ	315–00
గోదావరి	315–00
నమక్కల్	360–00
22–3–2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	315–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	3.75
బెంగళూరు	365–00
కోల్‌కతా	360–00
ఢిల్లీ	310–00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	358.25	363.7
AMBUJA CEME	228.25	229.85
ASIAN PAINT	1107.1	1103.55
AXIS BANK L	518.2	526.3
BAJAJ AUTO	2834.95	2851.8
BAJAJ FINAN	1695.6	1704.55
[illegible]	[illegible]	[illegible]

A B C D

3M INDIA LI	19530.35	19530.95
63 MOONS TE	97.3	102.8
8K MILES SO	692.45	690.45
AARTI DRUGS	526.05	527.4
AARTI INDUS	1090.3	1106
AARVI ENCON	75.25	76.7
ABAN OFFSHO	164.55	161.25
ABBOTT INDI	5405.6	5449.55
ACCEL FRONT	54.4	55.3
[illegible]	[illegible]	[illegible]
BEARDSELL L	50.45	51.7
BEML LIMITE	1079.6	1100.15
BERGER PAIN	243.8	242.95
BETA DRUGS	137.55	142
BF INVESTME	277.45	285.15
BF UTILITIE	381	392.95
BGR ENERGY	102.45	107.05
BHAGERIA IN	275.15	278.95
BHANSALI EN	166.4	169.8
BHARAT BIJL	1458.4	1493.65
BHARAT FIN	1088.15	1078.45
BHARAT FORG	698.65	703.55
[illegible]	[illegible]	[illegible]
DIXON TECHN	3291.4	3307.95
DOLLAR INDU	411.05	419.05
DOLPHIN OFF	84.55	82.15
DONEAR IND.	50.1	51
DR. LAL PAT	870.6	880.7
DYNAMATIC T	1664	1686.65
DYNEMIC PRO	185.55	190.6

E F G H

ECE INDUSTR	302.45	317.35
ECLERX SERV	1198.6	1200.65
[illegible]	[illegible]	[illegible]
GUJ. APOLLO	201.45	203.7
GUJARAT ALK	705.15	697.2
GUJARAT AMB	252.8	261.45
GUJARAT FLU	771.85	784.5
GUJARAT GAS	833	826.55
GUJARAT MIN	125.95	125.95
GUJARAT PIP	135.15	132.05
GUJARAT STA	180.1	178.05
GULF OIL LU	920	924.55
GULSHAN POL	68.15	69.7
H.G.INFRA E	295.4	297.35
HARITA SEAT	992.7	991.1
[illegible]	[illegible]	[illegible]

I J K L

JBM AUTO LI	406	412.2
JET AIRWAYS	641.9	668.35
JET FREIGHT	87	87.5
JET KNITWEA	101.5	100
JHS SVEND.	58	59.5
JIND POL IN	55.45	58.55
JINDAL DRIL	165.2	151.35
JINDAL PHOT	55.95	56.35
JINDAL POLY	332.15	337.9
JINDAL SAW	120.2	123.2
JINDAL STAI	85.7	89
JINDAL STAI	165.4	175.15
JINDAL STEE	224.9	230.6
[illegible]	[illegible]	[illegible]
MANAKSIA LT	50.6	50.55
MANAPPURAM	102.95	104.2
MANG.CHEM.F	62.45	63.3
MANGALAM CE	306.65	308.75
MANGALAM DR	167.15	170.3
MANPASAND B	366.75	361.05
MARATHON NX	407.8	410.2
MAS FINANCI	565.6	561.05
MASTEK LTD	560.55	579.8
MATRIMONY.C	794.4	810.1
MAWANA SUGA	51.6	53.75
MAX FINANCI	439.15	435.5
MAX INDIA L	88.15	88.35
[illegible]	[illegible]	[illegible]

M N O P

PG ELECTROP	237.2	240.6
PHILIPS CAR	1015.45	1039.75
PI INDUSTRI	823.25	822.55
PIONEER DIS	176.9	176.1
PLASTIBLEND	199.1	200.6
PNB HOUSING	1156.05	1176.75
PNC INFRATE	159.05	160.2
PODDAR HOUS	1040.1	1055.55
PODDAR PIGM	281	277.15
POKARNA LIM	198.1	194.5
POLY MEDICU	249.6	250.1
POLYPLEX CO	478.7	485.75
PONNIE SUGA	153.65	152.6
[illegible]	[illegible]	[illegible]

R S T U

SHALBY LIMI	202.55	206.6
SHALIM PAIN	145.55	148.25
SHANKARA BL	1716.15	1720.75
SHANTHI GEA	129.45	132.2
SHARDA CROP	380.25	377
SHARDA MOTO	1808.85	1860.95
SHEELA FOAM	1489.8	1486.05
SHEMAROO EN	469.65	483.5
SHILPA MEDI	493.6	495.35
SHIPPING CO	67.8	67.45
SHIRPUR GOL	132.5	138.75
SHIVA MILLS	49.1	50.8
SHIVA TEXYA	470	468.3
[illegible]	[illegible]	[illegible]
THE INDIAN	129.25	128.65
THE MANDHAN	113.6	116
THE NEW IND	676.2	692.55
THE PHOENIX	602.05	607.45
THE RAMCO C	736.05	734.3
THE RUBY MI	300.9	300.25
THE STATE T	141.75	146.45
THE TINPLAT	197.65	204.3
THEMIS MEDI	562.15	575
THERMAX LTD	1162.8	1153.95
THIRUMALAI	1785.65	1838.35
THOMAS COOK	268.4	270.55
THYROCARE T	590.9	592.2
[illegible]	[illegible]	[illegible]

V W X Z

[illegible]	[illegible]	[illegible]

నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ

[illegible]	[illegible]	[illegible]

బీఎస్ఈలో స్మాల్‌క్యాప్ షేర్లు

కంపెనీ పేరు	ధర	ముగింపు
[illegible]	[illegible]	[illegible]

సీఎం ఇచ్చిన హామీలకే దిక్కులేదు..

అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యుల ఆవేదన

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలే అమలు కావడం లేదని, దీనిపై ఎవరికి చెప్పుకోవాలని సభ్యులు ప్రశ్నించారు. గురువారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు మాట్లాడారు. ధర్మవరం ఆస్పత్రికి వేలాది మంది పేషెంట్లు వస్తుంటే నలుగురే వైద్యులున్నారని, స్వయానా ముఖ్యమంత్రే వచ్చి ఈ ఆస్పత్రిని 50 పడకల నుంచి 100 పడకల ఆస్పత్రిగా చేస్తానని చెప్పినా ఇప్పటి వరకూ అమలు జరగలేదని ధర్మవరం ఎమ్మెల్యే వరదాపురం సూరి అన్నారు. పెనుగొండ నియోజకవర్గంలో ఆస్పత్రుల ఉన్నతీకరణ అవసరమని, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పార్థసారథి చెప్పగా.. కదిరి ఆస్పత్రిలో ప్రసూతి వైద్యుల్లేక రోగులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి కాన్పులు చేయించుకుంటున్నారని ఎమ్మెల్యే చాంద్‌బాషా అన్నారు. కొన్నిచోట్ల పీహెచ్‌సీలు కట్టినా వాటి నిర్వహణ చేయకపోవడంతో అసాంఘిక శక్తులకు నిలయాలుగా ఉన్నాయని, సిబ్బంది కొరతతో రోగులు అల్లాడుతున్నారని బీసీ జనార్దనరెడ్డి తెలిపారు. రాజమండ్రిలో జనాభా పెరుగుతున్నా అందుకు తగ్గట్టు వైద్యులు లేరని బుచ్చయ్యచౌదరి అన్నారు. ఆస్పత్రుల్లో చాలా సమస్యలున్నాయని, అందుకే ఈ ఏడాది బడ్జెట్‌లో కూడా రూ.8,500 కోట్లు పెట్టామని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు సమాధానమిచ్చారు. పలువురు సభ్యులు తమ నియోజకవర్గాల్లో జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై మంత్రి గంటా శ్రీనివాసరావు సమాధానమిస్తూ.. ప్రస్తుతం 59 జూనియర్ కళాశాలలకు సంబంధించి ప్రతిపాదనలొచ్చాయని, అందులో 44 కళాశాలలకు అర్హత ఉందని, ప్రతి మండలంలోనూ ఒక జూనియర్ కళాశాల ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు.

ఐదో రోజూ చర్చకు నిరాకరణ

- ఓ..ఓ.. అంటూ ఏఐఏడీఎంకే ఆందోళన
- స్పీకర్‌కు అడ్డంగా టీఆర్‌ఎస్ ప్లకార్డులు
- ఐదోసారీ అనుమతి నిరాకరించిన సభాపతి
- ఆరోసారి నోటీసులిచ్చిన ఎంపీలు వైవీ, తోట



స్పీకర్ సభలోకి రాగానే ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న ఏఐఏడీఎంకే, టీఆర్‌ఎస్ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ

పార్లమెంట్‌లో అవిశ్వాసం ప్రస్తావనకు రాగానే వెల్‌లో ఉన్న ఏఐఏడీఎంకే, టీఆర్‌ఎస్ ఎంపీలు ఆందోళనను రెట్టింపు చేయడంతో వరుసగా గురువారం ఐదోసారి కూడా తీర్మానాలు ప్రవేశపెట్టకుండానే లోక్‌సభ వాయిదాపడింది. వైఎస్సార్ సీపీ, టీడీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలను సభ సజావుగా లేదన్న కారణంగా స్పీకర్ సుమిత్రా మహాజన్ అనుమతించలేదు. అవిశ్వాస తీర్మానాన్ని సభా కార్యక్రమాల జాబితాలో చేర్చాలంటూ వైఎస్సార్ సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, టీడీపీ ఎంపీ తోట నరసింహం బుధవారం సెక్రటరీ జనరల్ స్నేహలతా శ్రీవాస్తవకు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే.

సభాపతికి అడ్డంగా ప్లకార్డులు

లోక్‌సభ ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగానే వెల్‌లోకి వెళ్లిన ఏఐఏడీఎంకే, టీఆర్‌ఎస్ ఎంపీలు ఆందోళనకు దిగటంతో అప్పటికే ప్రశ్నోత్తరాలను ప్రారంభించిన స్పీకర్ కొద్దిక్షణాల్లోనే వాయిదా వేశారు. తిరిగి 12 గంటలకు సభ పునఃప్రారంభం కాగానే వివిధ శాఖలకు సంబంధించిన పత్రాలను మంత్రులు పార్లమెంట్‌కు సమర్పించారు. సభ్యులంతా తమ స్థానాల్లోకి వెళ్లాలని, అవిశ్వాస తీర్మానం సహా అన్ని అంశాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సమయంలో ఏఐఏడీఎంకే, టీఆర్‌ఎస్ సభ్యులు వెల్‌లోనే ఉన్నారు. 12.06 గంటలకు సభాపతి అవిశ్వాస తీర్మానం నోటీసులను ప్రస్తావించగానే ఏఐఏడీఎంకే సభ్యులు రెట్టింపు గొడవతో ఓ.. ఓ.. అంటూ శబ్దాలు చేశారు. టీఆర్‌ఎస్ సభ్యులు కూడా సభాపతికి అడ్డంగా నిలుచుని ప్లకార్డులు ప్రదర్శించారు. పరిస్థితి ఇలా ఉండగానే సభాపతి తీర్మానాన్ని ప్రస్తావించారు. 'కేంద్ర మంత్రి మండలిపై అవిశ్వాసం తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు వైవీ సుబ్బారెడ్డి, తోట నరసింహం నుంచి నోటీసులు అందాయి. వీటిని సభ ముందుంచడం నా బాధ్యత. తీర్మానం ప్రవేశపెట్టేందుకు అవసరమైన 50 మంది సభ్యులు వారి స్థానాల్లో నిలుచుంటే లెక్కించేందుకు వీలుగా సభ సజావుగా నడవాలి. అప్పుడే లెక్కించి తీర్మానం ప్రవేశపెట్టేందుకు అనుమతి ఇవ్వాలో లేదో నిర్ణయించగలను. సభ్యులు తమ స్థానాల్లోకి వెళ్లి కూర్చోవాలి..' అని పేర్కొన్నారు.

మద్దతుగా నిలుచున్న విపక్ష ఎంపీలు

అవిశ్వాస తీర్మానం ప్రస్తావన రాగానే విపక్ష సభ్యులంతా మద్దతుగా నిలుచున్నారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, సమాజ్‌వాదీ, ఆర్జేడీ, ఎన్సీపీ, జేఎంఎం, ఎంఐఎం, ఆమ్ ఆద్మీ, తదితర విపక్షాలకు చెందిన సభ్యులంతా అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా లేచి నిలుచున్నారు. అయితే తానేదీ చూడలేకపోతున్నానని, సభ సజావుగా లేనందున అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టేందుకు అనుమతిని తోసిపుచ్చుతున్నట్లు పేర్కొంటూ స్పీకర్ లోక్‌సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

హోదాపై చర్చకు అవకాశం ఇవ్వాలి: విజయసాయిరెడ్డి

ప్రత్యేక హోదాపై సభలో చర్చకు అవకాశం ఇవ్వాలని రాజ్యసభ చైర్మన్‌ను కోరుతూ వైఎస్సార్ సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి తన స్థానంలో నిలుచుని పదేపదే అభ్యర్థించారు. అయితే వెల్‌లో వివిధ పక్షాల ఆందోళనతో కొద్ది క్షణాల్లోనే సభను రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్య నాయుడు శుక్రవారానికి వాయిదావేశారు.

ఆరోసారి అవిశ్వాసం నోటీసులు

కేంద్రంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, టీడీపీ ఎంపీ తోట నరసింహం గురువారం లోక్‌సభ సెక్రటరీ జనరల్ స్నేహలతా శ్రీవాస్తవకు ఆరోసారి నోటీసులను అందజేశారు.

పార్లమెంట్ వద్ద ఎంపీల ధర్నా

అంతకుముందు ఉదయం 10.30 గంటలకు వైఎస్సార్‌సీపీ ఎంపీలు పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేశారు. ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వి.విజయసాయిరెడ్డి, వెలగపల్లి వరప్రసాదరావు, వై.ఎస్.అవినాష్‌రెడ్డి, పి.వి.మిథున్‌రెడ్డి ధర్నాలో పాల్గొన్నారు.

సీబీఐ విచారణ ఎదుర్కోండి

- సీఎం చంద్రబాబు విచారణకు సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ ఎంపీల డిమాండ్
- విచారణ జరిపించుకోకుంటే అవినీతిని సీఎం అంగీకరించినట్లే

సాక్షి, న్యూఢిల్లీ: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు తానుగా సీబీఐ విచారణకు సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ డిమాండ్ చేసింది. పోలవరం, పట్టిసీమ, రాజధాని నిర్మాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడు నారా లోకేష్ భారీ అవినీతికి పాల్పడినట్లు బీజేపీ, జనసేన చేసిన ఆరోపణలపై చంద్రబాబు ప్రజలకు సమాధానం చెప్పాలని పేర్కొంది. గురువారం లోక్‌సభ వాయిదా పడిన అనంతరం వైఎస్సార్ సీపీ ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, వరప్రసాదరావు, మిథున్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల్లో బీజేపీ, జనసేన ఓట్లతో గెలిచిన చంద్రబాబుకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే సీబీఐ విచారణ జరిపించుకొని తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని విజయసాయిరెడ్డి సూచించారు. వారం రోజుల్లోగా సీబీఐ విచారణకు ఆదేశించకుంటే చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారని ఒప్పుకున్నట్టే అవుతుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో హైదరాబాద్ ఔటర్‌రింగ్ రోడ్డు, పరిటాల రవి హత్య కేసు, వోక్స్ వ్యాగన్ కేసులో ఆరోపణలు వచ్చినప్పుడు ఆయన స్వయంగా సీబీఐ విచారణకు ఆదేశించి విచారణ జరిపించిన గొప్ప వ్యక్తన్నారు. బీజేపీ, జనసేన పార్టీలు బలపర్చడం వల్లే చంద్రబాబు అధికారంలోకి వచ్చారని, ఇప్పుడు అవే పార్టీలు చంద్రబాబు, లోకేష్ రూ. 1.50 లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డినట్లు ఆరోపిస్తున్న నేపథ్యంలో విచారణకు సిద్ధం కావాలన్నారు.



పార్లమెంట్ వద్ద ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీలు

మళ్లీ యూ టర్న్ తీసుకునైనా హామీలు నెరవేర్చండి: మేకపాటి

బీజేపీ, టీడీపీ మళ్లీ కలిసిపోయినా సరే ఏపీకి ఇచ్చిన హామీలను అమలు చేయించాలని ఎంపీ మేకపాటి పేర్కొన్నారు. పోలవరానికి ఇటీవల రూ. 1,400 కోట్లు ఇచ్చామని, మిగతావి కూడా అమలు చేస్తాం ఇక కలహమెందుకని టీడీపీ ఎంపీలకి ఓ కేంద్ర మంత్రి సూచించినట్లు వచ్చిన వార్తలపై మేకపాటి స్పందించారు. యూ టర్న్ అంకుల్‌గా పేరు తెచ్చుకున్న చంద్రబాబు మళ్లీ యూ టర్న్ తీసుకొని బీజేపీతో కలిసిపోయినా తమకు అభ్యంతరం లేదని, హామీలను అమలు చేయిస్తే అంతా అభినందిస్తారని చెప్పారు. తెలుగు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ఎన్ని విన్యాసాలు చేసినా టీడీపీ, బీజేపీలను క్షమించే పరిస్థితి లేదన్నారు. అవిశ్వాసంపై చర్చ జరపకుండా ఐదో రోజు కూడా వాయిదాల పర్వం కొనసాగడం విచారకరమన్నారు. ఇది పార్లమెంట్ చరిత్రలో ఒక మచ్చగా మిగిలిపోతుందన్నారు.

రోజుకో మాట.. పూటకో నిర్ణయం: వైవీ సుబ్బారెడ్డి

కేంద్ర ప్రభుత్వంతో ఎవరు లాలూచీ పడ్డారో ప్రజలే గమనిస్తున్నారని ఎంపీ వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేకతతో రోజుకో మాట, పూటకో నిర్ణయం తీసుకుంటూ చంద్రబాబు తన అనుకూల మీడియాలో లీకుల ద్వారా పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. అవిశ్వాసంపై చర్చ జరపకుండా ఏపీని కేంద్రం మోసం చేస్తోందన్నారు. ముడుపుల కోసం ప్యాకేజీకి అంగీకరించిన చంద్రబాబు ఇప్పుడు ఎన్నికల భయంతో హోదా అంటున్నారని ధ్వజమెత్తారు. పార్లమెంట్ సాక్షిగా చేస్తున్న అన్యాయంపై ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారని చెప్పారు. జాతీయ రహదారుల దిగ్బంధం విజయవంతం కావటమే దీనికి నిదర్శనమన్నారు. ఏపీకి హోదా సాధించే వరకు పోరాటం చేస్తూనే ఉంటామని, అప్పటికీ కేంద్రం దిగిరాకపోతే రాజీనామాలు చేసి ప్రజల్లోకి వెళ్తామని సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. కేంద్రం తీరు చూస్తుంటే హోదా ఇవ్వకూడదని నిర్ణయించుకున్నట్టు ఉందని ఎంపీ వరప్రసాదరావు పేర్కొన్నారు.

'ఎస్సీ, బీసీలకు ప్రాధాన్యం ఇవ్వలేం'

సాక్షి, అమరావతి: హోంగార్డు పోస్టుల ఎంపికలో ఎస్సీ, బీసీలకు ప్రాధాన్యం ఇవ్వలేమని ఉప ముఖ్యమంత్రి (హోం) నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. శాసన మండలిలో గురువారం సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ.. హోంగార్డుల ఎంపికలో ప్రస్తుతం ఎస్టీలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. క్లోరినేషన్ చేశాకే బోరు బావుల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి లోకేశ్ చెప్పగా.. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న నీటిని ఎక్కడా క్లోరినేషన్ చేయడంలేదని బలరాం కృష్ణమూర్తి తెలిపారు. జంఝావతి ప్రాజెక్టు కాలువ పనుల పురోగతి మందకొడిగా సాగుతున్న మాట వాస్తవమేనని జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు.. సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా బోడవారిపల్లిలో ఘటన



దుత్తలూరు: ప్రకృతి కన్నెర్రతో ఎండిపోయిన పంటలు ఒకవైపు.. చెమటోడ్చి పండించిన అరకొరపంటకూ గిట్టుబాటుధర రానిపరిస్థితి మరోవైపు.. ఈ క్రమంలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలంలోని బోడవారిపల్లిలో గురువారం జరిగింది. కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బోడవారిపల్లికి చెందిన రామిరెడ్డి ఓబుల్‌రెడ్డి (45) తనకున్న రెండెకరాల్లో నిమ్మతోట వేశాడు. గతేడాది నుంచి తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో నిమ్మతోట పూర్తిగా ఎండిపోయింది. ఈ క్రమంలో మరో ఎనిమిదెకరాలు కౌలుకు తీసుకుని ఈ ఏడాది మూడెకరాల్లో వరి, ఐదెకరాల్లో పచ్చిశనగ పంటలు సాగుచేశారు. సాగు ఖర్చుల కోసం దుత్తలూరు ఆంధ్రా బ్యాంక్‌లో రూ. 2.5 లక్షలు అప్పుచేశాడు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ. 2 వడ్డీకి రూ. 4.5 లక్షలు అప్పు తీసుకున్నాడు. వర్షాభావ పరిస్థితుల్లో బోర్లలో నీరు అడుగంటడంతో వరిపంట కూడా ఎండిపోయింది. శనగపంట కూడా సరిగా దిగుబడి రాకపోగా ధరలు కూడా ఒక్కసారి పడిపోయాయి. పెట్టుబడి కూడా రాని పరిస్థితిలో తీవ్ర మనస్థాపానికి గురైన ఓబుల్‌రెడ్డి ఎండిపోయిన తన నిమ్మతోటలోనే పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పొలంలో ఉన్న భర్తకు భోజనం తీసుకెళ్లిన భార్య రత్నమ్మ అచేతనంగా పడిఉన్న భర్తను చూసి పెద్దగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారు గమనించి 108కు సమాచారం అందించారు. అపస్మారక స్థితిలో ఉన్న ఓబుల్‌రెడ్డిని చికిత్స నిమిత్తం 108 సిబ్బంది ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు కొద్దిరోజుల క్రితమే వివాహమైంది. పెద్ద కుమారుడు ప్రశాంత్ డిగ్రీ చదివి వాటర్ ప్యాకెట్ల తయారీ వ్యాపారం చేస్తున్నాడు. చిన్న కుమారుడు ప్రతాప్ ఇంటర్మీడియట్ వరకు చదివి ఇంట్లోనే ఉంటున్నాడు.

ఏఐఏడీఎంకే, టీఆర్‌ఎస్‌ల మద్దతు కోరడం లేదు

టీడీపీ ఎంపీ సుజనా చౌదరి

సాక్షి, న్యూఢిల్లీ: అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగనీయకుండా లోక్‌సభలో నిరసన తెలుపుతున్న ఏఐఏడీఎంకే, టీఆర్‌ఎస్‌ల మద్దతు తామేమీ కోరడం లేదని, తాము చేస్తున్నది సబబని వారు భావిస్తే మద్దతు ఇవ్వొచ్చని టీడీపీ ఎంపీ సుజనా చౌదరి అన్నారు. గురువారం పార్టీ ఎంపీలతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. సభలో నిరసన తెలుపుతున్న వారిని స్పీకర్ సస్పెండ్ చేసి అవిశ్వాసంపై చర్చ చేపట్టవచ్చని, అలాగని వారిని సస్పెండ్ చేయాలని తాము సూచించట్లేదన్నారు. హోదా విషయంలో కేంద్రం దిగిరాకపోతే రాజీనామాలు చేస్తామని వైఎస్సార్‌సీపీ ప్రకటించిన నేపథ్యంలో టీడీపీ కార్యాచరణ ఏవిధంగా ఉంటుందని మీడియా ప్రశ్నించగా.. రాజీనామా నిర్ణయాలు హాస్యాస్పదం అంటూ వ్యాఖ్యానించారు.

24 వేళ్ల అబ్బాయి

చౌడేపల్లె(చిత్తూరు): సాధారణంగా మనుషులకు కాళ్లు, చేతులకు కలిపి 20 వేళ్లు ఉంటాయి. కానీ ఈ ఆరేళ్ల అబ్బాయి 24 వేళ్లతో ఆశ్చర్యపరుస్తున్నాడు. చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం పందిళ్లపల్లె పంచాయతీ తామరాకుల ఒడ్డుకు చెందిన బీరప్ప, ఆదెమ్మ కుమారుడైన దొరస్వామికి చేతులకు 12, కాళ్లకు 12 వేళ్లు ఉన్నాయి. ఇతను మేకలచిన్నేపల్లె ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు.



వేళ్లను చూపుతున్న దొరస్వామి

'సినీ పరిశ్రమపై చేసిన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకుంటున్నా'

సాక్షి, అమరావతి: సినీ పరిశ్రమపై తాను చేసిన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకుంటున్నట్లు ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం అసెంబ్లీలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. సినిమావాళ్లు కూడా ప్రత్యేక హోదా ఉద్యమంలోకి వస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందనే ఉద్దేశంతోనే అలా మాట్లాడానని తెలిపారు. వైవీబీ వ్యాఖ్యలపై సినీ వర్గాలు తీవ్ర స్థాయిలో విమర్శలు చేసిన విషయం తెలిసిందే. టీడీపీ ఎంపీ, సినీ నటుడు మురళీమోహన్ ఈ విషయాన్ని చంద్రబాబుకు చెప్పడంతో ఆయన వైవీబీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు చెప్పారు.

అన్ని శాఖల పద్దులకు ఆమోదం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం 2018-19 బడ్జెట్‌లో వివిధ శాఖలకు కేటాయించిన పద్దులను శాసనసభ ఆమోదించింది. గురువారం శాసనసభలో ఎమ్మెల్యేలు లేవనెత్తిన అంశాలపై శాఖల వారీగా మంత్రులు వివరణ ఇచ్చి.. పద్దులను ఆమోదించాలని కోరారు. ఈ సందర్భంగా వైద్యారోగ్య శాఖ తరఫున ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రస్తుత బడ్జెట్‌లో రూ.12,200 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. విద్యుత్‌శాఖ మంత్రి కళా వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని 8370 మెగావాట్ల నుంచి 17,520 మెగావాట్లకు పెంచినట్లు తెలిపారు. జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు మాట్లాడుతూ గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి నదులను అనుసంధానం చేయడం.. 52 ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా రాష్ట్రాన్ని సుభిక్షం చేస్తామన్నారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ బీసీలకు ఈ బడ్జెట్‌లో రూ.12,867 కోట్లు కేటాయించినట్లు చెప్పగా, వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం వ్యవసాయంలో సుస్థిరమైన అభివృద్ధి సాధిస్తోందని చెప్పారు. సాంఘిక్ష సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌లకు కేటాయించిన నిధులు సక్రమంగా ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. గృహనిర్మాణ శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ జనవరి, 2019 నాటికి పది లక్షల ఇళ్లు కట్టిస్తామని చెప్పారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ మాట్లాడుతూ 2021 నాటికి రాష్ట్రంలో పెరగనున్న పట్టణ జనాభా 35 శాతానికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పౌరసరఫరాలశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ రాష్ట్రంలో 1.44 లక్షల రేషన్ కార్డుల ద్వారా 4.10 కోట్ల మందికి నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. మంత్రులు వివరణ ఇచ్చాక మూజువాణి ఓటు ద్వారా పద్దులను ఆమోదిస్తున్నట్లు స్పీకర్ కోడెల శివప్రసాదరావు ప్రకటించారు.

వరల్డ్ కప్‌కు జింబాబ్వే దూరం

టెస్టు హోదా ఉన్న జింబాబ్వే 2019 వన్డే ప్రపంచకప్‌కు అర్హత సాధించలేకపోయింది. క్వాలిఫయింగ్ టోర్నీలో వర్షం బారిన పడిన చివరి మ్యాచ్‌లో జింబాబ్వే 3 పరుగుల తేడాతో యూఏఈ చేతిలో ఓడింది. యూఏఈ 235 పరుగులు సాధించగా... విజయానికి 230 పరుగులు (డక్‌వర్త్ లూయిస్ ప్రకారం) చేయాల్సిన స్థితిలో జింబాబ్వే 226 పరుగులకే పరిమితమైంది. 1979 తర్వాత జింబాబ్వే ప్రపంచ కప్‌కు దూరం కావడం ఇదే తొలిసారి. శుక్రవారం అఫ్గానిస్తాన్, ఐర్లాండ్‌ల మధ్య జరిగే మ్యాచ్ విజేత వరల్డ్‌కప్‌కు అర్హత సాధిస్తుంది. ఈ మ్యాచ్ రద్దయితే రన్‌రేట్ ప్రకారం ఐర్లాండ్ ముందుకు వెళుతుంది.

ఇంగ్లండ్ బొక్కబోర్లా


బౌల్ట్

58 పరుగులకే ఆలౌట్ • నిప్పులు చెరిగిన బౌల్ట్ (6/32) • న్యూజిలాండ్‌తో తొలి టెస్టు

ఆక్లాండ్: ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో చిత్తుగా ఓడిన ఇంగ్లండ్ చెత్త ప్రదర్శన ఇంకా కొనసాగుతోంది. న్యూజిలాండ్‌తో ప్రారంభమైన మొదటి టెస్ట్‌లో ఆడుతోంది టెస్ట్ మ్యాచా లేక టి20నా అనే అనుమానం వచ్చేలా తొలి రోజు తొలి సెషన్ కూడా పూర్తి కాకముందే ఆ జట్టు ఆలౌటైంది. సుదీర్ఘ ఇన్నింగ్స్‌లకు పెట్టింది పేరైన ఇంగ్లీష్ జట్టు... కివీస్ పేసర్ ట్రెంట్ బౌల్ట్ (6/32) ధాటికి కేవలం 20.4 ఓవర్లలో 58 పరుగులకే కుప్పకూలింది. ఒవర్టన్ (25 బంతుల్లో 33 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) చివర్లో ధాటిగా ఆడటంతో ఆ మాత్రం స్కోరైనా సాధించింది. కెరీర్‌లో అత్యుత్తమ గణాంకాలు నమోదు చేసిన బౌల్ట్‌కు తోడు టిమ్ సౌథీ (4/25) నిప్పులు చెరగడంతో ఐదుగురు ఇంగ్లీష్ బ్యాట్స్‌మెన్ ఖాతా తెరవకుండానే వెనుదిరిగారు. కివీస్‌పై ఇంగ్లండ్‌కు ఇదే అత్యల్ప స్కోరు. ఓవరాల్‌గా టెస్ట్ క్రికెట్‌లో ఇంగ్లండ్‌కు ఇది ఆరో అత్యల్పం. ఈడెన్ పార్క్ (ఆక్లాండ్) వేదికగా గురువారం ప్రారంభమైన డే–నైట్ టెస్టులో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 94 నిమిషాల్లోనే ముగిసింది. కివీస్ పేసర్లు బౌల్ట్, సౌథీ ఇంగ్లండ్ పతనాన్ని శాసించారు. వీరిద్దరి ధాటికి ఓ దశలో 27 పరుగులకే 9 వికెట్లు కోల్పోయిన ఆ జట్టు టెస్టు చరిత్రలో అత్యల్ప స్కోరు నమోదు చేసేలా కనిపించినా... చివరి వికెట్‌కు ఒవర్టన్, అండర్సన్ 31 పరుగులు జోడించి కాస్త పరువు నిలిపారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కివీస్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్లు కోల్పోయి 175 పరుగులు చేసి... తొలి ఇన్నింగ్స్‌లో 117 పరుగుల ఆధిక్యం సాధించింది. కెప్టెన్ కేన్ విలియమ్సన్ (91 బ్యాటింగ్; 10 ఫోర్లు, 1 సిక్స్) ఇన్నింగ్స్‌ను ముందుండి నడిపించాడు. అతనితో పాటు నికోల్స్ (24 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు. ప్రత్యర్థి బౌలర్లలో అండర్సన్ 2, బ్రాడ్ ఓ వికెట్ పడగొట్టారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 6 పరుగుల వద్ద సీనియర్ బ్యాట్స్‌మన్ అలిస్టర్ కుక్ (5) వికెట్ కోల్పోయింది. అక్కడి నుంచి ప్రారంభమైన వికెట్ల పతనం ఏ దశలోనూ ఆగలేదు. ఆ తర్వాత కెప్టెన్ జో రూట్ (0)ఖాతా తెరవకుండానే వెనుదిరగగా... మలాన్ (2), స్టోన్‌మన్ (11) అతన్ని అనుసరించారు. ఆరు నెలల తర్వాత టెస్టు క్రికెట్‌లో పునరాగమనం చేసిన ఆల్‌రౌండర్ స్టోక్స్ (0), వికెట్ కీపర్ బెయిర్‌స్టో (0), మొయిన్ అలీ (0)లు కూడా ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరారు. టెయిలెండర్లు వోక్స్ (5), బ్రాడ్ (0) అవుటైనా... అండర్సన్ (1)తో కలిసి ఒవర్టన్ జట్టు స్కోరు 50 పరుగులు దాటించాడు.


రూట్ క్లీన్‌బౌల్డ్

ఇద్దరు బౌలర్లు మాత్రమే బౌలింగ్ చేసి ప్రత్యర్థిని ఆలౌట్ చేయడం 1994 (లంకపై అక్రమ్, వకార్) తర్వాత ఇదే తొలిసారి. న్యూజిలాండ్ తరఫున ఇదే మొదటి సారి.

6/32 బౌల్ట్ కెరీర్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన.

400 వికెట్ల క్లబ్‌లో బ్రాడ్....

టెస్ట్ క్రికెట్ చరిత్రలో 400 వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో ఇంగ్లండ్ పేసర్ స్టువర్ట్ బ్రాడ్ స్థానం దక్కించుకున్నాడు. 115వ టెస్ట్ ఆడుతోన్న ఈ ఇంగ్లీష్ బౌలర్ కివీస్ బ్యాట్స్‌మన్ టామ్ లాథమ్ వికెట్ పడగొట్టి అందరికంటే పిన్న వయసు (31 ఏళ్ల 271 రోజులు)లో ఈ ఘనత సాధించిన ఆటగాడిగా నిలిచాడు. అండర్సన్ (525) తర్వాత 400 వికెట్ల మైలురాయిని దాటిన రెండో ఇంగ్లండ్ బౌలర్‌గా గుర్తింపు పొందిన బ్రాడ్...ఓవరాల్‌గా ఈ జాబితాలో 15వ బౌలర్.



ఇంగ్లండ్ టెస్టు చరిత్రలో ఇది (58) ఆరో అత్యల్ప స్కోరు కాగా, ఆ జట్టు ఇన్నింగ్స్‌లో ఐదుగురు బ్యాట్స్‌మెన్ డకౌట్ కావడం 1976 తర్వాత ఇదే మొదటిసారి కావడం విశేషం. ఎదుర్కొన్న ఓవర్ల ప్రకారం చూస్తే ఈ ఇన్నింగ్స్ (20.4 ఓవర్లు) ఇంగ్లండ్‌కు మూడో అతి చెత్త ప్రదర్శన. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో మొదటి 9 వికెట్లకు 27 పరుగులు జోడిస్తే... చివరి వికెట్‌కు 31 పరుగులు జత చేసింది.

షమీకి ఊరట

అనుకూలంగా ఏసీయూ నివేదిక • బీసీసీఐ కాంట్రాక్ట్‌లో చోటు



ముంబై: భారత పేస్ బౌలర్ మొహమ్మద్ షమీకి ఎట్టకేలకు కాస్త సాంత్వన దక్కింది. భార్య చేసిన గృహ హింస ఆరోపణలు, క్రిమినల్ కేసులు, కాంట్రాక్ట్ నిలిపివేతలతో పాటు ఫిక్సింగ్ తరహా వివాదంతో గత రెండు వారాలుగా ఉక్కిరిబిక్కిరవుతున్న అతనికి కొంత ఊపిరి పీల్చుకునే అవకాశం లభించింది. షమీని వార్షిక కాంట్రాక్ట్ జాబితాలో చేర్చాలని బీసీసీఐ గురువారం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బోర్డు ఒక ప్రకటన చేసింది. దీనికి తోడు బీసీసీఐ అవినీతి వ్యతిరేక విభాగం (ఏసీయూ) హెడ్ నీరజ్ కుమార్ కూడా తన విచారణలో షమీకి అనుకూలంగా నివేదిక ఇచ్చారు. షమీ భార్య హసీన్ జహాన్ చేసిన ఆరోపణల ప్రకారం షమీ దుబాయ్‌లో రెండు రోజులు గడపడం... పాక్ మహిళ అలీష్బా, ఇంగ్లండ్‌కు చెందిన మొహమ్మద్ భాయ్‌లతో ఉన్న సంబంధం గురించి తేల్చాలంటూ క్రికెట్ పరిపాలకుల కమిటీ (సీఓఏ) నీరజ్‌ను కోరిన విషయం తెలిసిందే. ఈ విషయంలో షమీని అనుమానించేందుకు ఏమీ లేదని నివేదికలో ఉన్నట్లు సమాచారం. 'బీసీసీఐ యాంటీ కరప్షన్ కోడ్ ప్రకారం ఇక ముందు షమీపై ఎలాంటి చర్య తీసుకోరాదని సీఓఏ భావిస్తోంది. ఇదే కారణంగా బోర్డు షమీకి కాంట్రాక్ట్ అందజేస్తోంది' అని బీసీసీఐ స్పష్టం చేసింది. షమీకి గ్రేడ్ 'బి' కాంట్రాక్ట్ దక్కింది. దీని ప్రకారం అతనికి ఏడాదికి రూ. 3 కోట్లు లభిస్తాయి. తాజా పరిణామంతో షమీ ఐపీఎల్ ఆడేందుకు మార్గం సుగమమైంది. ఆటపరంగా అతనికి ప్రస్తుతానికి సమస్య తప్పినా... మరో వైపు భార్య ఫిర్యాదుపై నమోదు చేసిన కేసుల విచారణ మాత్రం కొనసాగుతుంది.

> ఇది నాకో గొప్ప విజయం. మిగతా ఆరోపణల నుంచి కూడా నిర్దోషిగా బయటపడతా. నా వ్యక్తిత్వం, దేశభక్తిని శంకించడంతో వేదనకు గురయ్యా. బీసీసీఐ విచారణపై పూర్తి నమ్మకముంచా. 10–15 రోజులుగా తీవ్ర ఒత్తిడి అనుభవించా. నిర్దోషిగా ప్రకటించడంతో స్థైర్యం పెరిగింది. మళ్లీ మైదానంలో దిగేందుకు ప్రేరణగా నిలిచింది. నా కోపాన్నంతా సానుకూల ధోరణితో ఆటలో చూపిస్తా. ఇకపై నా బౌలింగ్ గురించే మాట్లాడుకునేలా చేస్తా. నేనే తప్పు చేయలేదని తెలుసు. బీసీసీఐకి ఎంత కృతజ్ఞతలు చెప్పినా తక్కువే
>
> – మొహమ్మద్ షమీ



'సూపర్‌కింగ్స్' బ్యాక్

రెండేళ్ల నిషేధం ముగిసిన తర్వాత చెన్నై సూపర్‌కింగ్స్ మళ్లీ ఐపీఎల్ బరిలోకి దిగుతోంది. జట్టు తొలి ప్రాక్టీస్ సెషన్ గురువారం జరిగింది. ఇందులో విదేశీ క్రికెటర్లు మినహా కీలక ఆటగాళ్లంతా హాజరయ్యారు. ఏప్రిల్ 10న సొంతగడ్డపై చెన్నై తొలిమ్యాచ్ కోల్‌కతాతో ఆడుతుంది. ప్రాక్టీస్ సందర్భంగా జట్టు యజమాని ఎన్.శ్రీనివాసన్‌తో ముచ్చటిస్తున్న కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని.

మళ్లీ ఓడిన భారత మహిళలు

- తొలి టి20లో 6 వికెట్లతో ఆసీస్ గెలుపు
- స్మృతి వేగవంతమైన అర్ధశతకం వృథా

ముంబై: ఫార్మాట్ మారినా భారత మహిళా క్రికెట్ జట్టు రాత మారలేదు. ఆస్ట్రేలియా చేతిలో వన్డేల్లో 0–3తో చిత్తయిన మన జట్టు... ఇప్పుడు టి20 ముక్కోణపు టోర్నీని కూడా పరాజయంతో ప్రారంభించింది. గురువారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 6 వికెట్లతో భారత్‌పై సునాయాసంగా గెలుపొందింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేయగా, ఆస్ట్రేలియా 18.1 ఓవర్లలో 4 వికెట్లకు 156 పరుగులు చేసి విజయాన్నందుకుంది. ఓపెనర్లు స్మృతి మంధాన (41 బంతుల్లో 67; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు), మిథాలీ రాజ్ (18) శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు వీరు 9.3 ఓవర్లలోనే 72 పరుగులు జోడించారు. ముఖ్యంగా మైదానం నలువైపులా షాట్లు కొట్టిన స్మృతిమంధాన 30 బంతుల్లోనే అర్ధశతకం అందుకుంది. మరో ఎండ్‌లో మిథాలీ అవుటైనా ఆమె జోరు కొనసాగించింది. టి20ల్లో భారత్ తరపున వేగవంతమైన అర్ధశతకం, అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన మంధాన 13వ ఓవర్లో గార్డ్‌నర్ (2/21) బౌలింగ్‌లో అవుటైంది. తర్వాత వచ్చిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (13), జెమీమా (1) విఫలమవడంతో రన్‌రేట్‌పై ప్రభావం పడింది. వేదా కృష్ణమూర్తి (10 బంతుల్లో 15; 1 ఫోర్, 1 సిక్స్), అనూజ పాటిల్ (21 బంతుల్లో 35; 6 ఫోర్లు, 1 సిక్స్) చివర్లో బ్యాట్ ఝళిపించారు. లక్ష్య ఛేదనలో భారత పేసర్ జులన్ గోస్వామి (3/30) ధాటికి ఆసీస్ 29 పరుగులకే ఓపెనర్ అలీసా హీలీ (4), గార్డ్‌నర్ (15)ల వికెట్లు కోల్పోయింది. అయితే మరో ఓపెనర్ మూనీ (32 బంతుల్లో 45; 8 ఫోర్లు), విలానీ (33 బంతుల్లో 39; 4 ఫోర్లు) మూడో వికెట్‌కు 79 పరుగులు జోడించి ఆదుకున్నారు. లానింగ్ (25 బంతుల్లో 35 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆసీస్ మరో 11 బంతులు ఉండగానే విజయం సాధించింది. శుక్రవారం జరిగే మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఇంగ్లండ్‌తో తలపడుతుంది.


స్మృతి

ఎల్గర్ అజేయ శతకం

రాణించిన డివిలియర్స్ • దక్షిణాఫ్రికా 266/8



కేప్‌టౌన్: ఆధిపత్యం చేతులు మారుతూ దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్ల మధ్య మూడో టెస్టు గురువారం ఆసక్తికరంగా ప్రారంభమైంది. ఇక్కడి న్యూలాండ్స్ మైదానంలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సఫారీ జట్టు... ఓపెనర్ డీన్ ఎల్గర్ (253 బంతుల్లో 121 బ్యాటింగ్; 17 ఫోర్లు, 1 సిక్స్) శతకం, స్టార్ బ్యాట్స్‌మన్ ఏబీ డివిలియర్స్ (95 బంతుల్లో 64; 10 ఫోర్లు) అర్ధ శతకాలతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి 266/8తో నిలిచింది. మరో ఓపెనర్ మార్క్‌రమ్ (0) ఖాతా తెరవకుండానే వెనుదిరిగినా... హషీమ్ ఆమ్లా (31) తోడుగా రెండో వికెట్‌కు 86 పరుగులు, 3వ వికెట్‌కు డివిలియర్స్‌తో కలిసి 128 పరుగులు జత చేశాడు. దీంతో ప్రొటీస్ ఒక దశలో 220/2తో పటిష్ట స్థితిలో నిలిచింది. అయితే... డివిలియర్స్ సహా కెప్టెన్ డు ప్లెసిస్ (5), బవుమా (1), డికాక్ (3) వికెట్లు పడగొట్టిన పేసర్ కమిన్స్ (4/64) ప్రత్యర్థిని కట్టడి చేశాడు. ప్రస్తుతం ఎల్గర్‌కు తోడుగా రబడ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. హాజల్‌వుడ్ (2/72)కు రెండు వికెట్లు దక్కాయి.

తిరువనంతపురంలోనే వన్డే

తిరువనంతపురం: కొచ్చిలోని నెహ్రూ అంతర్జాతీయ స్టేడియంలో వన్డే నిర్వహణపై తలెత్తిన వివాదం ముగిసింది. భారత్, వెస్టిండీస్‌ల మధ్య నవంబర్ 1న జరగాల్సిన వన్డేను తిరువనంతపురంలోని కేరళ క్రికెట్ సంఘం (కేసీఏ) స్టేడియంలోనే నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు కేసీఏ ఉన్నతాధికారులతో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి ఎ.సి.మొయిదీన్ సమావేశమై వివాదాన్ని ముగించారు.

తొలి రౌండ్‌లోనే సెరెనా ఔట్

మయామి: అమెరికన్ టెన్నిస్ స్టార్ సెరెనా విలియమ్స్‌కు మయామి ఓపెన్ టోర్నీ తొలిరౌండ్‌లో చుక్కెదురైంది. జపాన్ క్రీడాకారిణి నవోమి ఒసాక 6–3, 6–2తో సెరెనాపై విజయం సాధించింది. ఒసాక కేవలం గంటా 17 నిమిషాల్లో సెరెనా ఆటకట్టించింది. అమెరికా హార్డ్‌కోర్ట్ చాంపియన్‌షిప్‌లలో సెరెనా మొదటి రౌండ్లోనే ఓడటం 21 ఏళ్లలో ఇదే తొలిసారి.

సౌమ్యజిత్‌పై అత్యాచార ఆరోపణలు!

- ఫిర్యాదు చేసిన 18 ఏళ్ల బాలిక
- కామన్వెల్త్ గేమ్స్ నుంచి ఔట్



కోల్‌కతా: ప్రముఖ టేబుల్ టెన్నిస్ ఆటగాడు, ఒలింపియన్ సౌమ్యజిత్ ఘోష్ పెను వివాదంలో చిక్కుకున్నాడు. మూడేళ్ల క్రితం తనపై ఘోష్ అత్యాచారానికి పాల్పడ్డాడని 18 ఏళ్ల అమ్మాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పట్లో తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికదాడికి పాల్పడ్డాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. పెళ్లిపై ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో విసుగెత్తి పోలీసులను ఆశ్రయించినట్లు బాధితురాలు చెప్పింది. సౌమ్యజిత్ ఘోష్‌పై అత్యాచారం (ఐపీసీ 376 సెక్షన్), మోసం (417 సెక్షన్), మహిళ అనుమతి లేకుండా గర్భస్రావం చేయించడం (313 సెక్షన్), మైనర్లపై లైంగికదాడి కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ సౌమ్యజిత్‌ను కామన్వెల్త్‌కు వెళ్లే బృందం నుంచి తప్పించింది.

బెంగాల్‌కు చెందిన 24 ఏళ్ల సౌమ్యజిత్ 2013లో జాతీయ చాంపియన్‌గా నిలిచాడు. అదే ఏడాది బ్రెజిల్ ఓపెన్ నెగ్గిన అతను 2014 గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో సింగిల్స్, డబుల్స్‌లో క్వార్టర్స్ చేరాడు. రెండు సార్లు (2012, 2016) ఒలింపిక్స్‌లో పాల్గొన్నాడు. సౌమ్యజిత్‌కు అర్జున అవార్డు కూడా దక్కింది.

ప్రస్తుతం జర్మనీలో శిక్షణ పొందుతున్న సౌమ్యజిత్ ఈ ఆరోపణల్ని కొట్టిపారేశాడు. 'ఆమె నాకు బాగా తెలుసు. ఆ అమ్మాయి తల్లిదండ్రులతోనూ నాకు సత్సంబంధాలున్నాయి. మేమిద్దరం కలిసున్నాం. అయితే కెరీర్ కోసం ఆమె నుంచి దూరమవుతున్నట్లు చెప్పా. కానీ ఏడాదిన్నరగా ఆమె బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతోందని' సౌమ్యజిత్ వివరణ ఇచ్చాడు.

సింగపూర్ కన్సార్టియంతో ఒప్పందం వద్దు

ముఖ్యమంత్రికి ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ లేఖాస్త్రం



సాక్షి, అమరావతి: అమరావతి స్టార్టప్ ఏరియా అభివృద్ధికి సింగపూర్ కన్సార్టియంతో సీఆర్‌డీఏ ఒప్పందం చేసుకుంటే న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. సింగపూర్ కన్సార్టియంతో సీఆర్‌డీఏ ఒప్పందం చేసుకున్నప్పటికీ నిర్మాణాలు చేపట్టడానికి న్యాయపరంగా వీలుకాదని, దీంతో సింగపూర్ సంస్థ భారీగా నష్ట పరిహారం డిమాండ్ చేసే ప్రమాదం ఉందని, దీనివల్ల రాష్ట్రం దారుణంగా నష్టపోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ ఒప్పందం వల్ల న్యాయపరంగా ఎదురుకానున్న సమస్యలను మీ దృష్టికి తెస్తున్నానని సీఎంకు రాసిన లేఖలో ఐవైఆర్ కృష్ణారావు పేర్కొన్నారు. ''రాజధాని స్టార్టప్ ఏరియా అభివృద్ధికి సింగపూర్–అమరావతి ఇన్వెస్ట్‌మెంట్స్ హోల్డింగ్స్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకోవడానికి సీఆర్‌డీఏకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే, సీఆర్‌డీఏ రూపొందించిన స్టార్టప్ ఏరియా అభివృద్ధి మాస్టర్ ప్లాన్ జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ), రాష్ట్రస్థాయి పర్యావరణ ప్రభావ మదింపు సంస్థ (ఎస్‌ఈఐఏఏ) ఆదేశాలకు పూర్తి విరుద్ధంగా ఉంది. అందువల్ల సింగపూర్–అమరావతి ఇన్వెస్ట్‌మెంట్స్ హోల్డింగ్స్ లిమిటెడ్‌తో సీఆర్‌డీఏ ఎంవోయూ చేసుకున్నప్పటికీ ఈ మాస్టర్ ప్లాన్ ప్రకారం స్టార్టప్ ఏరియా అభివృద్ధి కింద నిర్మాణాలు చేపట్టడానికి చట్టపరంగా వీలు కాదు. అందువల్ల అనుమతులు ఇవ్వడంలో విఫలమైందనే సాకుతో సింగపూర్ కన్సార్టియం భారీగా నష్టపరిహారాన్ని డిమాండ్ చేసే ప్రమాదం ఉంది.

ఎన్‌జీటీ చెప్పిందేమిటంటే: కృష్ణా నది కరకట్ట లోపలంతా వరద ప్రభావిత ప్రాంతమే. ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ఎన్‌జీటీ స్పష్టం చేసింది. అయితే, సీఆర్‌డీఏ రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో కృష్ణా నది కరకట్ట లోపల కూడా సీడ్ క్యాపిటల్ ఏరియా పెట్టారు. ఎన్‌జీటీ నిబంధనల ప్రకారం ఇక్కడ నిర్మాణాలు చేపట్టడానికి వీల్లేదు. సీడ్ క్యాపిటల్ అభివృద్ధికి సింగపూర్ కన్సార్టియంతో ఒప్పందం చేసుకున్నా ఇది కాగితాలకే పరిమితమవుతుంది.

ఎస్‌ఈఐఏఏ ఆదేశం ప్రకారం: కృష్ణా నది కరకట్ట వెలుపల 100 మీటర్ల వరకూ ఎలాంటి కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్‌ఈఐఏఏ పేర్కొంది. తదుపరి 2, 3 కిలోమీటర్ల వరకూ గ్రీన్ అండ్ బ్లూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసుకోవచ్చని సూచించింది. అంటే ఈ ప్రాంతంలో ఎలాంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టరాదు. కృష్ణా నది కరకట్టకు 3 కిలోమీటర్ల పరిధిలోనే సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్టు ఏర్పాటు చేస్తున్నట్లు మాస్టర్‌ప్లాన్‌లో స్పష్టంగా ఉంది. దీన్నిబట్టే స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు నిబంధనలకు పూర్తి భిన్నంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ప్రాంతంలో నిర్మాణాల పేరుతో సింగపూర్ కన్సార్టియంతో ఒప్పందం చేసుకోవడం న్యాయ వివాదానికి అవకాశం కల్పించినట్లవుతుంది. సింగపూర్ కన్సార్టియం లండన్‌లో వివాద పరిష్కార ట్రిబ్యునల్‌కు రాష్ట్ర ప్రభుత్వాన్ని లాగి, నష్ట పరిహారాన్ని డిమాండ్ చేస్తుంది. దీనివల్ల రాష్ట్ర ప్రజలు పన్నులుగా చెల్లించిన భారీ మొత్తాన్ని నష్టపరిహారం రూపంలో సింగపూర్‌కు చెల్లించక తప్పని ఏర్పడుతుంది. కాబట్టి సింగపూర్ కన్సార్టియంతో ఒప్పందం విషయంలో ముందుకు వెళ్లవద్దని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను'' అని సీఎంకు రాసిన లేఖలో ఐవైఆర్ కృష్ణారావు పేర్కొన్నారు.

ఐటీఐల్లో ఔట్ సోర్సింగ్ సిబ్బందికి జీతాల పెంపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందికి 50 శాతం వేతనాల పెంపుదలకు రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి పితాని సత్యనారాయణ గురువారం ఆమోదం తెలిపారు. పెరిగిన వేతనాలు ఏప్రిల్ 1నుంచి అమలు కానున్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో పనిచేస్తున్న అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, ఆఫీస్ సబార్డినేట్స్, వాచ్‌మెన్‌లు కలిపి మొత్తం 665 మంది సిబ్బందికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు.

అసెంబ్లీ బందోబస్తు పోలీసులకు అభినందనలు

ప్రశంసాపత్రాలు అందించిన స్పీకర్ కోడెల




పోలీస్ కంట్రోల్ రూమ్‌లో పోలీస్ అధికారులతో స్పీకర్ కోడెల

సాక్షి, అమరావతి: అసెంబ్లీ సమావేశాలకు బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులకు స్పీకర్ కోడెల శివప్రసాద్ అభినందనలు తెలిపారు. అసెంబ్లీ, సచివాలయం ప్రాంత భద్రత కోసం ఏర్పాటు చేసిన గరుడ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను గురువారం స్పీకర్ సందర్శించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన పోలీసులకు ప్రశంసాపత్రాలు అందించారు. కంట్రోల్ రూమ్ పరిధిలో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన ఆయన ఈ వ్యవస్థ రాష్ట్రవ్యాప్తంగా ఉంటే అసాంఘిక కార్యకలాపాలకు తావు ఉండదన్నారు. డ్రోన్ కెమెరాల పనితీరు బాగుందని, శాటిలైట్‌ను ఉపయోగించుకుంటే మరింత నాణ్యమైన సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్పీ వెంకట అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.

సాక్షి
ఫ్యామిలీ
విజయవాడ
శుక్రవారం, 23-3-2018



● కెప్టెన్ హర్భజన్ సింగ్

సైన్యానికే సైనికుడు

సమర వీరుడు భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఓ అమర వీరుడి జ్ఞాపకాలు.

అది సిక్కిం రాష్ట్రంలోని నాథులా కనుమ. ఇండో–చైనా సరిహద్దులో ఉన్న నాలుగు మీటింగ్ పాయింట్‌లలో ఒకటి. రెండు దేశాల సైనికులు జాతీయ జెండాలను గౌరవించే ఫ్లాగ్‌మీట్‌లో రెండు దేశాల సైనికులు, అధికారులు ఉన్నారు. భారత్ వైపు ఒక ఖాళీ కుర్చీ కూడా ఉంది. ఆ కుర్చీలో అధికారి ఉన్నట్లే, సైనిక వందనం చేస్తున్నారు. అది గౌరవ కెప్టెన్ హర్భజన్ సింగ్‌ది. హర్భజన్ జనం మధ్య లేడు, కానీ జనం మనసులో ఉన్నాడు. సైనికులు రోజూ హర్భజన్ బూట్లు పాలిష్ చేస్తారు, బెడ్ షీట్ మారుస్తారు. కెప్టెన్ గది బయట సెంట్రీగా ఒక సిపాయి డ్యూటీ చేస్తాడు. జానపద కథలా ఉన్నప్పటికీ ఇది నిజం. ఈ క్రమం 1968 నుంచి అతడి నార్మల్ రిటైర్‌మెంట్ వయసు వరకు జరిగింది. ఇంతకీ కెప్టెన్ హర్భజన్ సింగ్ ఎవరు?

యువరక్తం ఉరుకులు

హర్భజన్ సింగ్‌ది పంజాబ్, కపుర్తలా జిల్లాలోని బ్రౌన్‌దాల్ గ్రామం. సైన్యంలో ఉద్యోగం అంటే ఉత్తేజం, దేశం కోసం పనిచేయడాన్ని హీరోయిజం గా భావించేవాడు. 1956లో పంజాబ్ రెజిమెంట్ 23వ బెటాలియన్‌లో చేరాడు. సిక్కుల ధైర్యంతోపాటు హర్భజన్‌కి దేశభక్తీ ఎక్కువే. చైనా సరిహద్దు అప్పట్లో సెన్సిటివ్ జోన్ కావడం కూడా అతడి అంకిత భావానికి ఒక కారణం కావచ్చు. 'దేశం కోసమే బతుకుతాను, దేశం కోసమే చస్తాను. వీర మరణమే సైనికుడికి గౌరవం' అనేవాడు. క్లిష్టమైన బాధ్యతలను ఇష్టంగా తలకెత్తుకునేవాడు. అప్పటికి అతడికి 27 ఏళ్లు. ఇరుదేశాల సైనికుల మధ్య చిన్నపాటి ఘర్షణ తలెత్తింది. ఏ క్షణమైనా యుద్ధం మొదలయ్యేలా ఉంది! చెదురుమదురు సంఘటనలు జరుగుతున్నాయి.

యుద్ధానికి పరుగులు

పర్వత సానువుల్లో ఇరుకైన రాళ్లబాటలో యుద్ధ సామగ్రి, ఆహారాన్ని తరలించడం అంటే మాటలు కాదు. యుద్ధం చేయడం కంటే కష్టం. సైనికులు వార్‌మూడ్‌లోకి వచ్చేశారు. బృందాలుగా విడిపోయి ఒక్కొక్క పాయింట్‌లో మాటు వేశారు. కెప్టెన్ అన్ని స్థావరాలనూ పర్యవేక్షిస్తున్నాడు. ఎక్కడో సందేహం. ఈ సామగ్రితో యుద్ధానికి దిగగలమా? వాకీటాకీలో బేస్ క్యాంపుకు లైన్ కలిపాడు. అక్కడ సామగ్రి ఉంది, అది చేరడానికి అనువైన వాతావరణం లేదు. రాళ్లలో వాహనం ఎక్కడ ఆగిపోతుందో ఊహించలేం. టుకు కనుమ నుంచి డోంగ్‌చుయి కనుమకు చేర్చాలి సామగ్రిని. ''నేను చేరుస్తాను'' ముందుకొచ్చాడు హర్భజన్.

అంతుచిక్కని జాడలు

మిలటరీ వెహికల్ పది కిలోమీటర్ల దూరం వెళ్లేటప్పటికి వాకీటాకీలో 'వాహనం నడిచే చప్పుడు వినిపిస్తోంది. శత్రువుకి సంకేతాలందే ప్రమాదం ఉంది' అని అలర్ట్ వచ్చింది. అంతే... వాహనం నుంచి వస్తువులను దించాడు. మ్యూల్స్ (హిమాలయాల సానువుల్లో ఉండే పొట్టి గుర్రాలు)ను తోలుకొచ్చి వాటి మీద పేర్చాడు. దాదాపుగా ఏడాదంతా మంచుతో కప్పేసి ఉండే ఆ నేల, కాలు పెడితే జారడానికి సిద్ధంగా ఉంటుంది. అది అక్టోబర్ నెల. వర్షం కురిసిన నేల చిత్తడిగా ఉంది. హిమాలయాలలో కురిసిన వర్షంతో నదిపాయలు నిండుగా హోరెత్తుతూ ప్రవహిస్తున్నాయి. హర్భజన్ కాలు పట్టుతప్పి జారిందో, లేక అతడే నీళ్లను అంచనా వేయలేకపోయాడో.. చెప్పడానికి అతడి పక్కన అప్పుడు ఎవరూ లేరు. హర్భజన్ మాత్రం గమ్యం చేరలేదు. అతడి కోసం మూడు రోజులు గాలించిన తరవాత దేహం దొరికింది. 'దేశం కోసం మరణించడమే సైనికుడికి గౌరవం' అతడి మాటలు అందరికీ చెవుల్లో వినిపిస్తున్నాయి. సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు తోటి సైనికులు.


● హర్భజన్ సింగ్ స్మారక మందిరం


● స్మారక మందిరం ఉన్న నాథులా కనుమ

గర్వించే జ్ఞాపకాలు

కెప్టెన్ హర్భజన్ సింగ్ స్మారక భవనాన్ని సైనికులు దేవాలయంగా భావిస్తారు. నాథులా పాస్‌లో పోస్టింగ్ వచ్చిన వాళ్లు, అక్కడికి వెళ్లిన వెంటనే పై అధికారులకు రిపోర్ట్ చేయడానికంటే ముందు హర్భజన్ స్మారక మందిరానికి వెళ్లి సెల్యూట్ చేస్తారు. హర్భజన్‌తో కలిసి పని చేసిన వాళ్లకు అవి గర్వించే జ్ఞాపకాలు. వాళ్లు తమ తర్వాతి తరానికి ఆ జ్ఞాపకాలను అందిస్తూ వచ్చారు. సింగ్ భౌతికంగా లేకపోయినా తమ మధ్యే ఉన్నాడనే విశ్వాసం సైనికులకు ఉత్సాహాన్నిస్తోంది. అది నిజమా అబద్ధమా, తమ భ్రాంతి మాత్రమేనా అనే తర్కాన్ని పక్కన పెట్టి, దేశభక్తిని పెంపొందించే శక్తిగా హర్భజన్ సింగ్ స్మారకాన్ని గౌరవిస్తున్నారిప్పటికీ.

డ్యూటీలో హర్భజన్ ఆత్మ!

హర్భజన్ జ్ఞాపకాలతోనే నిద్రపోవడంతోనో ఏమో అతడే కనిపిస్తున్నాడు తోటి సైనికులకు! మొదట్లో సింగ్ మీదున్న అభిమానం అనుకున్నారు. 'రాత్రి కలలో కనిపించి తనకు ఇష్టమైన ప్రదేశం నాథులా పాస్ నుంచి ఎక్కడికీ పోను, ఇక్కడే సమాధి కట్టమన్నాడ'ని ఓ రోజు ఒక మిత్రుడు చెప్పాడు. మరో రోజు.. హఠాత్తుగా మెలకువ వచ్చి లేచారు బెటాలియన్ టీమ్. సింగ్ నిద్రలేపాడని, చైనా సరిహద్దు వెంట పెట్రోలింగ్ చేయమంటున్నాడని చెప్పారు. నిద్రలో చెప్పిన మాట పట్టుకుని పెట్రోలింగ్ చేయడం హాస్యాస్పదం అని తెలుసు. అయినా సరే, ఓ సారి వెళ్లొచ్చేద్దాం అనుకున్నారు.

కాకతాళీయమే కావచ్చు అది నిజంగా పెట్రోలింగ్ అవసరమైన సందర్భమే. సరిగ్గా అప్పుడే చైనా ఆర్మీ రెక్కీ నిర్వహించినట్లు ఆధారాలు దొరికాయి. సింగ్ ఇంకా డ్యూటీ చేస్తూనే ఉన్నాడనే అభిప్రాయం బలపడుతోంది అందరిలో. అవును, సింగ్ ఇంకా డ్యూటీ చేస్తూనే ఉన్నాడు... అని నమ్మింది ఇండియన్ ఆర్మీ. అతడు కోరినట్లే సింగ్ జ్ఞాపకార్థం సమాధిని, ఆ తర్వాత ఓ స్మారక మందిరాన్ని కూడా కట్టారు. అతడి జీతంగా చిన్న మొత్తాన్ని అతడి తల్లికి నెలా నెలా పంపించేవారు.

యూనిఫామ్‌కు బెర్త్ బుకింగ్!

సైనికులకు ఏటా రెండు నెలలు సెలవు ఉంటుంది. అలా అతడి సెలవుకు సొంతూరికి వెళ్లడానికి ఏటా సెప్టెంబర్ 11వ తేదీ దిబ్రూఘర్ ఎక్స్‌ప్రెస్‌లో సింగ్ పేరుతో బెర్త్ బుక్కయ్యేది, 13వ తేదీకి సొంతూరు చేరేవి అతడి యూనిఫామ్, ఇతర వస్తువులు. వాటిని ఇద్దరు సైనికులు తీసుకెళ్లేవారు. సింగ్ వచ్చే రోజు (అతడి జ్ఞాపకాలు, వస్తువులు) ఆ ఊరిలో ఘనస్వాగతం పలికేవారు గ్రామస్థులు. రెండు నెలల తర్వాత సైనికులు వచ్చి సింగ్ ఫొటో, వస్తువులను తీసుకుని తిరిగి నాథులా పాస్‌కు వెళ్లేవారు. ప్రభుత్వం అతడికి ఇంతటి ప్రేమను పంచడంతోపాటు గౌరవపూర్వకంగా కెప్టెన్ హోదాను కూడా ఇచ్చింది. సిపాయిగా ఉన్నప్పుడు మరణించిన హర్భజన్ సింగ్ కెప్టెన్‌గా రిటైరయ్యాడు.

- మంజీర

పునర్దర్శనం

ఆయ్ హాయ్.. ఆయ్ హోయ్

ఏప్రిల్ ఆరున విడుదలౌతున్న బాలీవుడ్ చిత్రం 'బ్లాక్‌మెయిల్'లో ఊర్మిళ కనిపించబోతున్నారు. అయితే, సుమారు పదేళ్ల తర్వాత స్క్రీన్ మీదకు వస్తున్న ఊర్మిళ ఆ చిత్రంలోని ఒక ఐటమ్ సాంగ్‌కు మాత్రమే పరిమితం అవుతున్నారు! మనసు చివుక్కుమనిపించే విషయమే ఇది. 'ఆయ్ హాయ్, ఆయ్ హోయ్..' అంటూ పావనీ పాండే గొంతులోంచి ప్రారంభమయ్యే ఈ పాటలో ఊర్మిళ అచ్చు.. సినిమా ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో ఎలాగైతే ఉన్నారో, అలాగే ఉన్నారు! ఆ కళ్లు, హొయలు, అభినయం ఏ మాత్రం ఛేంజ్ కాలేదు. 'బ్లాక్ మెయిల్' చిత్రాన్ని అభినయ్ దేవ్ డైరెక్ట్ చేస్తున్నారు. ఈ ఐటమ్ సాంగ్‌కు ఊర్మిళనే ఎంచుకోడానికి ఆయన స్క్రీన్‌ప్లే ఆయనకుంది. పదేళ్ల అజ్ఞాతం తర్వాత దర్శనం ఇచ్చే ఒక స్టార్ క్యారెక్టర్ ఈ మూవీలో ఉంటుంది. ఊర్మిళ తప్ప ఇంకెవరూ ఈ పాత్రకు సరిపోరని దేవ్ ముందే డిసైడ్ అయిపోయి, ఆమెను ఒప్పించారట. రామ్‌గోపాల్‌వర్మ 'రంగీలా'తో వెలుగులోకి వచ్చిన ఊర్మిళ తొంభైలలో పెద్ద స్టార్. ఇప్పుడీ చిత్రంతో ఆమె మళ్లీ తన పూర్వపు అభిమానుల హృదయాలను ఊపిరితో నింపబోతున్నారు. 'బ్లాక్‌మెయిల్' చిత్రంలో ఇర్ఫాన్ ఖాన్, కీర్తీ కుల్హరి నటిస్తున్నారు. ఇదొక క్వర్కీ కామెడీ. కడుపు చెక్కలే. ఆ చెక్కల మధ్య బ్రేక్‌గా ఊర్మిళ వచ్చి పోతారు.


● ఊర్మిళ

చెట్టు నీడ

దొంగతనం చేయని సొమ్ము

'మర్యాదగా సొమ్ములు ఎక్కడున్నాయో చెప్పు' అని కత్తి తీశాడు దొంగ. 'నా చదువుకు అంతరాయం కలిగించకు, అక్కడ పెట్టెలో ఉన్నాయి చూడు' ఏమాత్రం ఉద్వేగపడకుండా చెప్పాడు సాధువు.

ఒక సాధువు ఇంట్లో కూర్చుని మంత్రాలు ఏవో పఠిస్తున్నాడు. అప్పటికే బాగా రాత్రయింది. అయినా సాధువు లోతుగా పఠనంలో మునిగివున్నాడు. ఆ సమయంలో ఒక దొంగ ఆ ఇంట్లోకి ప్రవేశించాడు. ఆ అలికిడికి సాధువు ఏకాగ్రత చెదిరింది. 'మర్యాదగా సొమ్ములు ఎక్కడున్నాయో చెప్పు' అని కత్తి తీశాడు దొంగ. 'నా చదువుకు అంతరాయం కలిగించకు, అక్కడ పెట్టెలో ఉన్నాయి చూడు' ఏమాత్రం ఉద్వేగపడకుండా చెప్పాడు సాధువు. సాధువు చెప్పినట్టే దొంగ పెట్టె దగ్గరికి వెళ్లాడు. 'అందులో కొన్ని నాకోసం ఉంచు, రేపు కొన్ని అవసరాలున్నాయి' అన్నాడు సాధువు. సాధువు చెప్పినట్టే కొన్ని ఉంచి, మరికొన్ని సొమ్ములు తీసుకుని బయటికి వెళ్లబోయాడు దొంగ. 'కనీసం సొమ్ములు తీసుకున్నందుకు ధన్యవాదాలు చెప్పే మర్యాదైనా పాటించవయ్యా' అన్నాడు సాధువు. దొంగ సిగ్గుపడ్డాడు. సాధువు చెప్పినట్టే 'కృతజ్ఞతలు' చెప్పి వెళ్లిపోయాడు. అయితే, ఆ రాత్రే ఆ దొంగను గస్తీ తిరుగుతున్న రక్షక భటులు పట్టుకున్నారు. తెల్లారి సాక్ష్యం తీసుకోవడం కోసం సాధువును పిలిపించారు. 'లేదు, ఈయన నా సొమ్ములు దొంగతనం చేయలేదు. ఆయన కొన్ని కావాలన్నాడు, నేను ఇచ్చాను. దానికి బదులుగా కృతజ్ఞతలు కూడా చెప్పాడు' అన్నాడు సాధువు. దాంతో, రక్షక భటులు దొంగను వదిలేశారు. ఆ తర్వాత ఆ దొంగ కూడా దొంగతనాన్ని వదిలేశాడు.

గుడ్ ఫుడ్

బీపీకీ, షుగర్‌కీ

కీరదోసకాయను మనమందరమూ సలాడ్‌లాగా వాడతాం. పైగా ఇప్పుడు వేసవి కావడంతో దీని ఉపయోగం మరింత ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా దీన్ని సలాడ్‌లా వాడుకుంటారుగానీ నిజానికి కీరదోసతో చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వాటిలో ఇవి కొన్ని.

- కీరదోసలో 90 శాతం నీరే ఉంటుంది. దాంతోపాటు ఖనిజలవణాలు కూడా చాలా ఎక్కువ. అందుకే ఒంట్లో నీటిపాళ్లు తగ్గి డీ–హైడ్రేషన్‌కు గురైనప్పుడు వాటిని తక్షణం భర్తీ చేయడానికి కీరదోస ముక్కలు తినడం ఉత్తమమైన మార్గం.
- కీరదోసలో పొటాషియమ్ పాళ్లు చాలా ఎక్కువ. హైబీపీ ఉన్నవారు క్రమం తప్పకుండా దీన్ని తీసుకుంటే అది రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది.
- కీరదోసలో పీచు పాళ్లు చాలా ఎక్కువగా ఉండటం వల్ల అది దేహంలోకి చక్కెరను ఆలస్యంగా, నెమ్మదిగా విడుదలయ్యేలా చేస్తుంది. కాబట్టి డయాబెటిస్ రోగులకు మేలుచేస్తుంది.
- కీరదోసలో పీచుపదార్థాలు పుష్కలంగా ఉండటం వల్ల జీర్ణవ్యవస్థను శుభ్రపరచడంతో పాటు జీర్ణశక్తికి దోహదపడుతుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది.
- కీరదోసలో మేనిని నిగనిగలాడేలా చేసేందుకు ఉపయోగపడే మెగ్నీషియమ్ వంటి పోషకాలు చాలా ఎక్కువ. అందుకే దీన్ని సౌందర్యసాధనంగా కూడా వాడతారు.
- కీరదోసలోని యాంటీఆక్సిడెంట్స్ అనేక రకాల క్యాన్సర్లను నివారిస్తాయి. కీరదోస ముఖ్యంగా మహిళల్లో రొమ్ముక్యాన్సర్లు, పురుషుల్లో ప్రోస్టేట్ క్యాన్సర్లను నివారిస్తుంది.
- కీరదోసను మంచి డీ–టాక్సిఫైయింగ్ ఏజెంట్‌గా పేర్కొనవచ్చు. అది ఒంట్లోని అనేక విషపదార్థాలను బయటకు పంపుతుంది. కాలేయాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుతుంది. మూత్రపిండాలపై పడే అదనపు భారాన్ని తొలగిస్తుంది.
- రక్తంలోని కొలెస్ట్రాల్ పాళ్లను అదుపులో ఉంచి, గుండెజబ్బులను నివారిస్తుంది.




న్యూస్



పరిమళం తగ్గుతోంది!

ఇదివరకటి కాలంలో వసంతం వచ్చిందంటే చాలు, పూల వనాలు పరిసరాలను పరిమళ భరితం చేసేవి. ఇప్పటి కాలంలో వసంతమైతే వస్తోంది గాని, పూల వనాలు ఇదివరకటి స్థాయిలో పరిమళించడం లేదు. ప్రకృతి ధర్మసూత్రాలకు లోబడి వసంతంలో మొక్కలకు ఆకులు చిగురించి, పూలు పూస్తూనే ఉన్నా, పూల పరిమళంలోని గాఢత మాత్రం క్షీణిస్తూ వస్తోందని యూనివర్సిటీ ఆఫ్ రీడింగ్‌కు చెందిన బ్రిటిష్ శాస్త్రవేత్త డాక్టర్ రాబర్ట్ గర్లింగ్ చెబుతున్నారు. డీజిల్‌తో నడిచే వాహనాల నుంచి వెలువడే వాయువుల ప్రభావం వల్ల పూలలో పరిమళం తగ్గిపోతోందని ఆయన వెల్లడిస్తున్నారు. రాయల్ హార్టికల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశోధనలో వాయు కాలుష్యం ఫలితంగా పూల పరిమళం గణనీయంగా తగ్గిపోతున్నట్లు తేలింది. లావెండర్, డఫోడిల్స్, మల్లెలు, గులాబీలు వంటి పూల పరిమళం ఇదివరకటి కాలంలో చాలా దూరం నుంచే నాసికకు తెలిసేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ఈ పరిశోధనలో వెల్లడైంది. ఈ పరిశోధన వివరాలను 'న్యూ సైంటిస్ట్' జర్నల్‌లో ప్రచురించారు.

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా..! నేను సాయి అనే అబ్బాయిని లవ్ చేస్తున్నా. తను నాకంటే టూ ఇయర్స్ పెద్దవాడు. మొదట తనే ప్రపోజ్ చేశాడు. నేనంటే తనకి ప్రాణం. నాకోసం ఏమైనా చేస్తాడు. తనంటే నాకు చాలా ఇష్టం. కానీ మా నేపథ్యాలు వేరు. చిన్నప్పుడే మా డాడీ చనిపోయారు. మా మమ్మీ నన్ను చాలా కష్టపడి పెంచింది. ఆమెకు చెప్పకుండా నేను ఏ పనీ చేయను. అందుకే మా లవ్ మేటర్ మా మమ్మీకి చెప్పేశాను. మొదట్లో బాగా భయపడింది. కానీ సాయి నా మీద చూపించే కేరింగ్ చూశాక చాలా సంతోషించింది. కానీ ఇప్పుడు.. సాయి వాళ్ల పేరెంట్స్ మమ్మల్ని విడగొడతారేమోనని భయంగా ఉంది. అదే మాట సాయితో అంటే... 'అలా ఏం కాదు' అంటున్నాడు. 'ఆ అమ్మాయిని వదిలెయ్యకపోతే.. మేం చచ్చిపోతాం' అని వాళ్ల పేరెంట్స్ భయపెడితే పరిస్థితి ఏంటి అన్నయ్యా? సాయి లేకపోతే నేను బతకలేను. ఈ ఆలోచనలతో నిద్ర కూడా పట్టడం లేదు. సాయి మాత్రం 'అలా ఏం కాదు' అంటున్నాడు కానీ, ఒకవేళ అలానే జరిగితే ఏం చేస్తాడో చెప్పడంలేదు. చాలా భయమేస్తోంది అన్నయ్యా. మంచి సలహా ఇవ్వండి ప్లీజ్.

– సౌమ్య

నీ పేరే సౌమ్య.

సౌమ్యంగా ఉండు. వినయం.. సౌందర్యం.. ఉన్న నా బంగారు చెల్లెలివి.

'సార్, అమ్మాయిని చూడకుండానే.. పేరు చూసి, ఓ కోతలు కోస్తున్నారేంటి సార్?'

నీలూ.... నీకు బాహ్య సౌందర్యం ఒక్కటే కనబడుతుందా...?

'సార్ తెలుగులో మాట్లాడండి. బా.. హ్.. యా.. సౌ.. అం.. దర్.. యం.. అని పెద్ద పెద్ద తెలుగు పదాలు వాడి లవర్స్‌ని కన్ఫ్యూజ్ చేస్తున్నారెందుకు సార్?'

నీకర్థమైందా నీలూ..?

'ఎస్.. నాకు తెలుసు సార్, బాహ్య సౌందర్యమంటే ఔట్‌సైడ్ బ్యూటీ. అంటే మనసుకు ఉన్న అందాన్ని గమనించకపోవడం. అర్థం చేసుకోకపోవడం. సౌమ్యమును మించిన అందం ఉండదు. దాన్ని మించిన మంచి మనసు ఉండదు. ఇదంతా మన లవ్ డాక్టర్... డిగ్రీ లేని మన లవ్ డాక్టర్.. అమ్మాయి మాటల్లో పసిగట్టి, మన దగ్గర మార్కులు కొట్టేస్తున్నారు. కదా సార్?'

అబ్బా..! యు ఆర్ వెరీ స్మార్ట్ నీలాంబరి. సౌమ్య..! నీలోని అందాన్ని చూసి ప్రేమించిన వాడు.. నిన్ను ఎప్పటికీ మోసం చేయడు. నిన్ను పోగొట్టుకుంటే, లైఫ్లో బిగ్గెస్ట్ మిస్టేక్ చేసిన వాడవుతాడు. సో బీ బ్రేవ్..!!

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

ఆర్.. ఆర్.. ఆర్... ఈజ్ ఆన్

కొంతకాలంగా ఆర్ ఆర్ ఆర్‌లు ముగ్గురూ కలిసి ఓ భారీ మల్టీ స్టారర్ సినిమా చేయబోతున్నారు అని ఇండస్ట్రీలో వార్తలు వినిపించాయి. సినిమాలో లుక్ టెస్ట్ కోసం లాస్ ఏంజెల్స్ కుడా వెళ్లారు. కానీ అఫీషియల్‌గా చెప్పట్లేదు.



● రామ్‌చరణ్, రాజమౌళి, ఎన్టీఆర్

ఫైనల్లీ ఈ సినిమా గురించి ఓ అఫీషియల్ ప్రకటన విడుదల చేశారు. ఇంతకీ ఈ ముగ్గురు 'ఆర్'లు ఎవరో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. రాజమౌళి, రామారావు (ఎన్టీఆర్), రామ్‌చరణ్. 'బాహుబలి' తర్వాత రాజమౌళి నెక్ట్స్ సినిమా ఏంటా? అని తెలుగు అభిమానులతో పాటు మొత్తం ఇండియన్ సినిమా అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఎవరూ ఊహించని విధంగా ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లతో క్రేజీ మల్టీస్టారర్‌కి శ్రీకారం చుట్టారు రాజమౌళి. ఈ భారీ ప్రాజెక్ట్‌ను డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య నిర్మించనున్నారు. ఇంతకీ 'ఆర్ ఆర్ ఆర్' అన్నది సినిమా టైటిలా లేక వర్కింగ్ టైటిలా తెలియాల్సి ఉంది.' 'ఏ అనౌన్స్‌మెంట్ కోసమైతే నవంబర్ 2017 నుంచి మీరంతా ఎదురు చూస్తున్నారో అది అఫీషియల్‌గా ప్రకటిస్తున్నాం. మాసీవ్ మల్టీస్టారర్ ఈజ్ ఆన్'' 'ఆర్ ఆర్ ఆర్ ఇది టైటిల్ మాత్రమే కాదు ది టైటాన్స్ కమింగ్ టుగెదర్'' అంటూ వీడియోను రిలీజ్ చేశారు. ఈ సినిమాలో ఎన్టీఆర్, చరణ్.. ఇద్దరూ బాక్సర్స్‌గా, అన్నదమ్ముల పాత్రల్లో కనిపిస్తార ని సమాచారం. అక్టోబర్‌లో ఈ చిత్రం సెట్స్ పైకి వెళ్లనుందట. వచ్చే ఏడాది సమ్మర్‌కు రిలీజ్ అవుతుందని సమాచారం.

ఒక్క సినిమా చేసి వెనక్కి వెళ్లిపోదామనుకున్నా

"కల్యాణ్ రామ్‌తో పదేళ్ల కిందట 'లక్ష్మీ కళ్యాణం' సినిమా చేశా. 'ఎంఎల్‌ఏ' చిత్రంలో మళ్లీ తనతో నటించడం నా పాత స్నేహితుణ్ని కలిసినట్లు అనిపించింది. ఎవరి వ్యక్తిగత జీవితాలు, సినిమాలతో బిజీగా ఉన్నాం. ఈ పదేళ్లలో ఓ పబ్లిక్ ఫంక్షన్‌లో ఇద్దరం కలిశామంతే. మధ్యలో ఎప్పుడూ కలవలేదు" అని కాజల్ అగర్వాల్ అన్నారు. కల్యాణ్ రామ్, కాజల్ జంటగా ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఎంఎల్‌ఏ'. టి.జి.విశ్వప్రసాద్ సమర్పణలో కిరణ్ రెడ్డి, భరత్ చౌదరి నిర్మించిన ఈ సినిమా ఈ రోజు విడుదలవుతోంది. ఈ సందర్భంగా కాజల్ పంచుకున్న విశేషాలు...



● కాజల్

● ఆసక్తికరమైన సినిమాలు చూడాలని ప్రేక్షకులు కోరుకుంటారు. అందుకే.. ఓ నటిగా విభిన్నమైన పాత్రలు చేయాలనుకున్నా. కమర్షియల్ సినిమాలు, కొత్త తరహా సినిమాలను బ్యాలెన్స్ చేస్తూ వస్తున్నా. ● 'ఎంఎల్‌ఏ'లో నాది ఎన్నారై అమ్మాయి పాత్ర. స్ట్రాంగ్ క్యారెక్టర్. నా పాత్రలో ఓ షేడ్ ఉంటుంది. నేనెందుకు అలా చేస్తుంటాననే విషయం ఇంటర్వెల్ వరకూ తెలియదు. దానికి కారణాలేంటి? అన్నది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. ● ఎంటర్‌టైనింగ్‌తో పాటు మంచి మెసేజ్ ఉన్న చిత్రమిది. కొత్తదనం ఉన్న సినిమాలు చేయడానికి ప్రయత్నిస్తూనే ఉన్నా. నా పాత్రలకు న్యాయం చేయడానికి సిన్సియర్‌గా కృషి చేస్తున్నాను. నేను చేస్తున్న సినిమాలు, పాత్రల పట్ల చాలా సంతోషంగా ఉన్నా. ● 'లక్ష్మీ కల్యాణం' చేసేటప్పుడు 'ఒక సినిమా చేస్తే చాలు.. మానేసి వెనక్కి వెళ్లిపోయి ఎంబీఏ చదువుకుందామనిపించింది'. కానీ.. జీవితం వేరేలా ఉంటుంది కదా! ఈ ప్రయాణం హ్యాపీగా ఉంది. ఇంత మంచి లైఫ్ ఇచ్చి, వారి ఫ్యామిలీలో నన్ను ఒకరిగా భావించిన తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ● తెలుగు చిత్ర పరిశ్రమలోనే 'నాకు లైఫ్' అని ఐదు సినిమాలు చేసిన తర్వాత అనిపించింది. 'మగధీర' సినిమా చేసేటప్పుడు 'వందశాతం ఇదే నా లైఫ్' అని అర్థమైంది. ప్రస్తుతం 'క్వీన్' రీమేక్ 'ప్యారిస్ ప్యారిస్'లో నటిస్తున్నా. బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌తో ఓ సినిమా చేస్తున్నా.

'పక్కా లోకల్' తర్వాత ఐటమ్ సాంగ్స్‌లో కనిపించడం లేదేంటని అడుగుతున్నారు. అది ఎప్పుడో ఒకసారి సరదాకి అలా చేస్తుంటాను అంతే. హిందీ సినిమా చేశామంటే ఏదో ఒక హిందీ సినిమా చేయటానికి వెళ్లినట్టు ఉండకూడదు. మంచి రోల్ ఉంటేనే చేస్తాను. నా పాత సినిమాల్ని చూసి ఎప్పుడూ సిగ్గుపడను. అరే ఆ సీన్ ఇలా చేశానేంటి? దాని బదులు ఇంకోలా చేసుంటే బావుండేది కదా అని ఫీల్ అవుతాను.. అంతే. ఆ హీరో ఈ హీరోతో అని కాదు ఇండస్ట్రీలో అందరితో యాక్ట్ చేయాలని ఉంది. చేసిన వాళ్లతో మళ్లీ మళ్లీ యాక్ట్ చేయాలనుంది. కల్యాణ్ రామ్ ఎంత మంచి 'ఎంఎల్‌ఏ' (మంచి లక్షణాలున్న అబ్బాయి) అంటే నేను పదికి ఎనిమిదిన్నర మార్కులు ఇస్తాను. పక్కా ఫ్యామిలీ మ్యాన్.

ఇక షురూ!



● తమన్, అఖిల్, వెంకీ అట్లూరి

ఈ ఏడాది ఉగాది రోజున స్పెషల్ సర్‌ప్రైజ్ ఇచ్చారు యంగ్ హీరో అఖిల్. తన తర్వాతి చిత్రాన్ని 'తొలిప్రేమ' ఫేమ్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో చేయబోతున్నట్లు వెల్లడించారు. శ్రీ వెంకటేశ్వర సినీచిత్ర పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ చిత్రానికి తమన్ స్వరాలు సమకూర్చనున్నారు. ఈ సినిమా వర్క్ షురూ అయ్యింది. ''న్యూ బిగినింగ్స్. ఫ్రెండ్స్ వెంకీ అట్లూరి, తమన్‌ని కలిశాను. వాళ్ల గురించి పూర్తిగా తెలుసుకుంటాను. మేమంతా మంచి టీమ్ వర్క్ చేసి బెస్ట్ అవుట్‌పుట్ రావడానికి కష్టపడతాం'' అన్నారు అఖిల్. ''మంచి ఎనర్జీతో, మంచి ఆలోచనలతో కొత్త సినిమా పని ప్రారంభించాం'' అన్నారు వెంకీ అట్లూరి. లవ్‌స్టోరీ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కబోయే ఈ సినిమా షూటింగ్ ఎక్కువ శాతం బ్యాంకాంక్‌లో జరుగుతుందని సమాచారం.

మహానటిని వదల్లేక!



● కీర్తీ సురేశ్

సావిత్రిలా నడవటం, చూడటం. పెదవి విరవడం, డ్యాన్స్ చేయడం... ఇలా కొన్ని నెలలుగా కీర్తీ సురేశ్ తనను తాను సావిత్రిలా ఊహించుకున్నారు. అందుకే ఇక ఆమెలా అభినయించే అవకాశం లేదని ఫీలయ్యారు. 'మహానటి' షూటింగ్ చివరి రోజున కీర్తీ సురేశ్ ఎమోషన్ అయ్యారు. సావిత్రి చిత్రపటం దగ్గర దీపం వెలిగించారు. చెమర్చిన కళ్లతో చిత్ర బృందం నుంచి వీడ్కోలు తీసుకున్నారామె. అలనాటి అందాల అభినేత్రి సావిత్రి జీవితం ఆధారంగా నాగ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మహానటి'. వైజయంతీ మూవీస్, స్వప్న సినిమాస్ పతాకాలపై ప్రియాంకా దత్ నిర్మించారు. సావిత్రి పాత్రలో కథానాయిక కీర్తీ సురేశ్ నటించారు. ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. నిర్మాత ప్రియాంకా దత్ మాట్లాడుతూ – ''మహానటి' లాంటి అద్భుతమైన చిత్రాన్ని నిర్మించినందుకు గర్వపడుతున్నాం. కీలక పాత్రలు చేసిన మోహన్‌బాబుగారు, రాజేంద్ర ప్రసాద్‌గారు స్ట్రాంగ్ సపోర్ట్‌గా నిలబడ్డారు. కీర్తీ సురేష్, సమంత, దుల్కర్ సల్మాన్, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్ ఇలా భారీ తారాగణంతో మా బ్యానర్‌లో వర్క్ చేయడం ఆనందంగా ఉంది. ఏయన్నార్ పాత్రలో నటించిన అక్కినేని నాగచైతన్యకు రుణపడి ఉంటాం. మే 9న చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు.

13 రోజుల్లో పూర్తి

1983లో జరిగిన వాస్తవ సంఘటన ఆధారంగా రూపొందిన చిత్రం 'మర్లపులి'. డి.నరసింహా సమర్పణలో సుధాకర్ ఇంపెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నిర్మించింది. వరుణ్ సందేశ్ ప్రత్యేక పాత్రలో, అర్చన ముఖ్య పాత్రలో నటించిన ఈ చిత్ర గీతాలను మరో హీరోయిన్ భాను చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత, సంగీత దర్శకుడు బి.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ – ''మా చిత్రదర్శకుడు రామకృష్ణ సినిమాను చాలా చక్కగా తెరకెక్కించారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా చిత్రం రూపొందింది. నా సంగీతంలో విడుదలవుతున్న ఈ చిత్రం పాటలు మంచి ప్రజాదరణ పొందుతాయని ఆశిస్తున్నా'' అన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ – ''13 రోజుల్లో షూటింగ్ పూర్తి చేశాం. తక్కువ సమయంలో అయినా మంచి క్వాలిటీతో తీశాం'' అన్నారు. ''వరుణ్‌సందేశ్ పక్కన లీడ్ రోల్‌లో నటించినందుకు ఆనందంగా ఉంది'' అన్నారు భాను. పోసాని కృష్ణమురళి, తాగుబోతు రమేశ్ నటించిన ఈ చిత్రానికి కెమెరా: యం.మురళీకృష్ణ. నిర్మాతలు: భీరం సుధాకర్ రెడ్డి, బి.భవానీ శంకర్, ఖమ్మం శ్రీను.



● వరుణ్ సందేశ్

జాకీ పంపిన జాకెట్



● సోనూకి జాకీ పంపించిన జాకెట్

బహుమతులు ఎవరికైనా ప్రత్యేకమే. అసలు కానుకలు ఇష్టపడని వారెవరుంటారు చెప్పండి. ఇప్పుడు బాలీవుడ్ నటుడు సోనూ సూద్‌కి కూడా ఒక స్పెషల్ గిఫ్ట్ వచ్చింది. దాంతో చెప్పలేనంత సంతోషంలో మునిగి తేలుతున్నాడు. ఏంటా గిఫ్ట్? ఎవరు పంపిందంటే.. స్పెషల్ లిమిటెడ్ ఎడిషన్ జాకెట్. ఇంటర్నేషనల్ యాక్షన్ హీరో జాకీ చాన్ పంపించారు. వీళ్లిద్దరికీ స్నేహం ఎలా కుదిరిందబ్బా? అంటే గతేడాది వచ్చిన 'కుంగ్‌ఫూ యోగా' సినిమాలో వీళ్లిద్దరూ కలిసి యాక్ట్ చేశారు. అప్పటి నుంచి వీళ్ల ఇండో– చైనీస్ మైత్రీ కుదిరింది. గిఫ్ట్‌తో పాటు సోనూసూద్‌కు ఒక లెటర్ కుడా రాశారు జాకీ చాన్. ఆ లేఖ సారాంశం ఏంటంటే...

''మై డియర్ సోనూ..., ఈ జాకెట్ 'జేసి స్టంట్ టీమ్' 40వ వార్షికోత్సవం సందర్భంగా తయారు చేసిన స్పెషల్ ఎడిషన్ లిమిటెడ్ జాకెట్. ఈ జాకెట్ కోసం వాడిన లెదర్‌ని స్వయంగా సెలెక్ట్ చేసి, బెస్ట్ తయారీదారుడి దగ్గర నా అభిరుచికి తగ్గటు డిజైన్ చేయించాను. ఈ జాకెట్‌ని నువ్వు తీక్షణంగా పరిశీలిస్తే అందులో కనిపించే ప్రతీ డీటైల్‌లోనూ, డిజైనింగ్‌లోనూ నేనే స్వయంగా కనిపిస్తాను. ఈ జాకెట్ వెల ఎంతో చెప్పలేను కానీ విలువ మాత్రం నిజాయితీగా చెప్పాలంటే అందులో నా ఆలోచనలు ప్రతిబింబిస్తాయి. నాతో పాటు నా జర్నీలో కష్ట సుఖాల్లో నడిచిన నా సోదరులకు మాత్రమే కాకుండా నీలాంటి ఆప్తులకు ఇవ్వాలనుకున్నాను. ఈ చిరు కానుక నీకు చలికాలంలో వెచ్చదనాన్ని ఇస్తుందని ఆశిస్తున్నాను. ఇంకో ముఖ్య విషయం ఏంటంటే దాన్ని చూసినప్పుడల్లా నా గురించి ఆలోచిస్తావు, దాన్ని ధరించినప్పుడల్లా నన్ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నట్టు ఉంటుంది'' అని ఆ లేఖలో పేర్కొన్నారు.

ఈ సినిమా కొనాలనుకున్నా - శర్వానంద్



● కృష్ణ విజయ్, నారా రోహిత్, సురేష్ బొబ్బిలి, శర్వానంద్, శ్రీ విష్ణు, వేణు ఊడుగుల

''నీది నాది ఒకే కథ' ట్రైలర్ చూడగానే మార్నింగ్ షో చూడాలనిపించింది. ఈ సినిమాను నేను కొనుక్కుంటే బావుంటుందనిపించి విజయ్‌కి కాల్ చేస్తే, అప్పటికే బిజినెస్ పూర్తయ్యింది. మంచి సినిమాను మిస్ చేసుకున్నానే అనిపిస్తోంది'' అన్నారు హీరో శర్వానంద్. శ్రీ విష్ణు, సాట్నా టైటస్ జంటగా వేణు ఊడుగుల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నీది నాది ఒకే కథ'. ప్రశాంతి, కృష్ణ విజయ్, అట్లూరి నారాయణ రావు నిర్మించిన ఈ సినిమా ఈరోజు విడుదలవుతోంది. ప్రీ–రిలీజ్ ఫంక్షన్‌లో దర్శకుడు దేవీ ప్రసాద్ మాట్లాడుతూ– ''చాలామంది అడిగినా నటించలేదు. ఈ కథ నచ్చి, చేశా. హీరో తర్వాత అంత ఎమోషన్స్ ఉన్న క్యారెక్టర్ నాదే'' అన్నారు. ''కథ విన్నప్పుడు 'ఏంట్రా ఇదేదో నా స్టోరీలాగే ఉందే' అనిపించింది. నా జీవితాన్ని ఎప్పుడైనా సినిమాగా చూసుకోవాలంటే ఈ చిత్రం చూసుకోవచ్చని చేశా. ఒక అమ్మాయి వెంటపడి ప్రేమ కోసం ఒప్పించేటప్పుడు.. జీవితం కోసం ఎంత ఒప్పించాలని చెప్పేదే ఈ సినిమా'' అన్నారు శ్రీ విష్ణు. ''ఈ చిత్రం ట్రైలర్ చూడగానే పెద్ద హిట్ అవుతుందనే వైబ్రేషన్ కలిగింది. 'ఆకలిరాజ్యం' సినిమాలో తండ్రీ కొడుకుల మధ్య జరిగే సంఘర్షణ గుర్తుండిపోయింది. మరోసారి ఆ చిత్రాన్ని గుర్తుకు తెచ్చిన సినిమా ఇది'' అని దర్శకుడు జి.నాగేశ్వర రెడ్డి అన్నారు. నారా రోహిత్ మాట్లాడుతూ – ''ఇంటర్ చదివే రోజుల్లో నా ఫ్రెండ్ బాస్కెట్ బాల్ ప్లేయర్ అవ్వాలనుకుంటే ఇంట్లో ఒప్పుకోలేదు. దాంతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయ్యాడు. అలాంటివాళ్ల గురించి చెప్పే చిత్రమిది'' అన్నారు.

ఖానుకో సుడోకు

	1			6		4		7
		9		7				
5	4					6	2	8
	6		7	3				2
		4	2		1	7		
2				5	6		3	
7	5	2					1	4
				2		5		
1		8		4			7	

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

2	9	6	8	5	1	7	3	4
4	1	8	3	7	6	9	2	5
5	3	7	4	9	2	8	6	1
6	7	9	2	1	8	4	5	3
1	8	4	6	3	5	2	7	9
3	2	5	7	4	9	1	8	6
9	6	2	1	8	3	5	4	7
8	4	1	5	6	7	3	9	2
7	5	3	9	2	4	6	1	8

ఈ పాటకు ట్యూన్ తెలుసా? - శ్రీరామనవమి స్పెషల్



శ్రీనగజా తనయం సహృదయం (2)
చింతయామి సదయం త్రిజగన్మహోదయం ॥ శ్రీనగజా తనయం ॥
శ్రీరామభక్తులారా ... ఇది సీతాకల్యాణ సత్కథ
నలభై రోజుల నుంచి చెప్పిన కథ చెప్పిన చోట
చెప్పకుండా చెప్పుకొస్తున్నాను
అంచేత కించిత్తు గాత్ర సౌలభ్యానికి అభ్యంతరం ఏర్పడినట్లు తోస్తోంది
నాయనా! కాస్త పాలు మిరియాలు... చిత్తం... సిద్ధం...
భక్తులారా! సీతామహాదేవి స్వయంవరానికి ముల్లోకాల నుంచి విచ్చేసిన
వీరాధివీరులలో.. అందరినీ ఆకర్షించిన ఒకే ఒక్క దివ్య సుందరమూర్తి
ఆహా! అతడెవరయ్యా అంటే–
రఘురాముడు రమణీయ వినీల ఘనశ్యాముడు
రమణీయ వినీల ఘనశ్యాముడు
వాడు నెలరేడు సరిజోడు మొనగాడు
వాని కనులు మగ మీలమేలురా వాని నగవు రతనాల జాలురా (2)
వాని చూచి మగవారలైన మైమరచి
మరుల్కొనెడు మరోమరుడు మనోహరుడు ॥ రఘురాముడు॥
ఆ ప్రకారంబుగా విజయం చేస్తున్న శ్రీరామచంద్రమూర్తిని
అంతఃపుర గవాక్షం నుండి సీతాదేవి ఓరకంట చూచినదై
చెంగటనున్న చెలికత్తెతో...
ఎంత సొగసుగాడే మనసింతలోనె దోచినాడే
మోము కలువరేడే నా నోము ఫలము వీడే
శ్యామలాభిరాముని చూడగ నా మది వివశమాయె నేడే
ఎంత సొగసుగాడే...
ఇక్కడ సీతాదేవి ఇలా పరవశయైయుండగా...
అక్కడ స్వయంవర సభామంటపంలో
జనక మహీపతి, సభాసదులను చూచి –
అనియెనిట్లు ఓయనఘులార నాయనుగుపుత్రి సీత
వినయాధిక సద్గుణవ్రాత ముఖవిజిత లలిత జలజాత
ముక్కంటి వింటినెక్కిడి దాలిన ఎక్కటి జోదును నేడు
మక్కువ మీరగ వరించి మల్లెలమాల వైచి పెండ్లాడు
అని ఈ ప్రకారం జనకమహారాజు
ప్రకటించగానే
సభలోనివారందరూ ఎక్కడివారక్కడ
చల్లబడిపోయారట,
మహావీరుడైన రావణాసురుడు కూడా
''హా! ఇది నా ఆరాధ్యదైవమగు పరమేశ్వరుని చాపము!
దీనిని స్పృశించుటయే మహాపాపము' అని అనుకొనినవాడై
వెనుతిరిగిపోయాడట....
తదనంతరంబున –
ఇనకుల తిలకుడు నిలకడ గల క్రొక్కారు మెరుపు వలె నిల్చి
తన గురువగు విశ్వామిత్రుని ఆశీర్వాదము తలదాల్చి
సదమల మద గజ గమనము తోడ స్వయంవర వేదిక చెంత
మదన విరోధి శరాసనమును తన కరమున బూనినయంత

ఫెళ్లుమనె విల్లు గంటలు ఘల్లుమనె, గుభిల్లుమనె గుండె నృపులకు
ఝల్లుమనియె జానకి దేహము
ఒక నిమేషమ్మునందె నయము జయము భయము విస్మయము గదురా
శ్రీమద్రమారమణ గోవిందో హరి
భక్తులందరూ చాలా నిద్రావస్థలో ఉన్నట్టుగా ఉంది
మరొక్కసారి... జై శ్రీమద్రమారమణ గోవిందో హరి
భక్తులారా! ఆ విధంగా శ్రీరామచంద్రమూర్తి
శివధనుర్భంగము కావించినాడు...
అంతట –
భూతలనాథుడు రాముడు ప్రీతుండై పెండ్లియాడె
పృధుగుణమణి సంఘాతన్ భాగ్యోపేతన్ సీతన్
॥ భూతలనాథుడు రాముడు ॥
శ్రీమద్రమారమణ గోవిందో హరి!

చిత్రం: వాగ్దానం ; రచన: శ్రీశ్రీ ;
సంగీతం: పెండ్యాల ; గానం: ఘంటసాల

కట్‌చేయ్...దాచేయ్...

ప్యాచ్ మంత్ర

అందం అతికినట్టుండాలి.
అతికించడం కూడా ఇప్పుడో అందం.
మ్యాచ్ అయ్యేలా ప్యాచ్ వేస్తే
కన్ను చటుక్కున క్యాచ్ చేస్తుంది.
అవును... కన్ను అతుక్కుపోతుంది.
అది కూడా మంత్రం వేసినట్టుగా!
మీరూ ప్యాచ్ ఫ్యాషన్‌ను
టచ్ చేయండి.
ప్యాచ్‌తో మంత్రముగ్ధులను చేయండి.

ఫ్యాషన్


కొంగున కలంకారీ ఫ్యాబ్రిక్‌తో చేసిన ప్యాచ్‌వర్క్!


బ్లౌజ్ మీద పక్షుల జంట


సీతాకోక చిలుకల ప్యాచ్‌వర్క్


కొంగు నిండుగా పురివిప్పిన నెమలి



చీరమీద నెమలి పింఛాలు


ప్యాచ్‌వర్క్ దుపట్టా!


లాంగ్ గౌన్‌కి అంచుగా!

డిజైనర్ ప్యాచ్




ప్లెయిన్ చీరల మీద అందమైన ప్యాచ్‌లు

సమ్మర్ ప్యాచ్

వేసవిలో కాటన్ దుస్తులకే అధిక ప్రాధాన్యత. అవి చీరలైనా, డ్రెస్సులైనా. ప్లెయిన్‌గా ఉంటే కళ్లకు, ఒంటికి మరింత హాయి. అయితే, మరీ సాదాసీదాగా ఉండటం అలంకరణకు అన్నివేళలా నప్పని విషయం. అందుకని 'ప్యాచ్'తో దుస్తులకు ముచ్చటైన కళను జతచేయడానికి సిద్ధమవుతున్నారు డిజైనర్లు.

మనవైన చేనేతలు

నేత చీరలు వేసవిలో చమటను పీల్చుకుంటాయి కాబట్టి మేనికి హాయినిస్తాయి. వీటికి కొత్త హంగులు అద్దాలంటే కలంకారీ ఫ్యాబ్రిక్ ప్యాచ్‌లతో పాటు ఇతర రంగు రంగుల కాటన్ ఫ్యాబ్రిక్‌తోనూ డిజైన్‌గా రూపొందించుకోవచ్చు.

కేరళ కసవు

బంగారు రంగు అంచుతో అచ్చమైన హ్యాండ్లూమ్‌గా వన్నెలుపోయే కేరళ కసవు చీర ఎండ వేడిని నిరోధిస్తుంది. పాలమీగడలా ఉండే ఈ రంగు చీరల మీద పూర్తి కాంట్రాస్ట్ కలర్ ఫ్యాబ్రిక్ డిజైన్‌ని ప్యాచ్‌గా వేస్తే చాలు ఇలా అందమైన హొయలు పోవడానికి సిద్ధమైపోతాయి. సింపుల్‌గానూ ఉంటాయి. వేడుకలకు ప్రత్యేక కళను తీసుకువస్తాయి.

డిజైనర్ దుస్తులు

టస్సర్, మల్‌మల్, కోరా, ఖాదీ.. వంటి చేనేతలను లాంగ్, అనార్కలీ గౌన్లు, లెహంగాలుగా రూపొందించుకోవచ్చు. వాటికి మరో కలర్ లేదా థ్రెడ్ ఎంబ్రాయిడరీ చేసిన అంచును జత చేస్తే సంప్రదాయ వేడుకలకే కాదు ఇండో వెస్ట్రన్ పార్టీలకూ అచ్చమైన డిజైనరీ డ్రెస్సులుగా వెలిగిపోతాయి.

తక్కువ ధరకే ఎక్కువ హంగులు

పూర్తి కాంట్రాస్ట్ ఫ్యాబ్రిక్‌పై పెయింట్ లేదా ఎంబ్రాయిడరీ చేసి ఎవరికి వారు ప్యాచ్‌లను సిద్ధం చేసుకోవచ్చు. లేదంటే రెడీమేడ్‌గానూ ప్యాచ్‌లు మార్కెట్‌లో లభిస్తున్నాయి. ఒక్కో డిజైన్ ప్యాచ్ రూ.20 నుంచి వందల రూపాయల్లో లభ్యమవుతున్నాయి. రూ.400-500 ఖర్చుపెడితే ఆకర్షణీయమైన శారీని ఎవరికి వారు డిజైన్ చేసుకోవచ్చు.

ఐదు వేల ఏళ్ల క్రితమే ప్యాచ్

రంగు రంగు గుడ్డ ముక్కలను కావల్సిన పరిమాణంలో కట్ చేసుకొని, ఒకదాని తర్వాత ఒకటి జత చేస్తూ కుట్టడాన్ని ప్యాచ్ వర్క్ అన్నారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో సైనికులు కప్పుకోవడానికి ప్యాచ్‌వర్క్ చేసిన రగ్గులను ఉపయోగించేవారు. ఆ తర్వాత చలినుంచి తట్టుకోవడానికి అనువుగా ఓవర్‌కోటును డిజైన్ చేశారు. అలాగే వాల్ హ్యాంగింగ్స్, కుషన్ కవర్స్, స్కర్ట్ డిజైన్లకూ ప్యాచ్‌వర్క్ పరిపాటి అయ్యింది. ఆ తర్వాత కాలంలో రకరకాల డ్రెస్‌ల మీదకు ప్యాచ్‌వర్క్ వచ్చేసి ఎంబ్రాయిడరీ కళలో ఒక భాగమైపోయింది. ఈజిప్షియన్ పిరమిడ్స్ కంటే ముందే ఈ కళ ఉందని తెలుస్తుంది. 11–13 శతాబ్దిలో ప్యాచ్‌వర్క్ కళలో చాలా పద్ధతులు వచ్చాయి. గుడ్డముక్కలతో పువ్వులను రూపొందించడం, వాటిని దుస్తుల మీద కుట్టడం మొదలైంది. అమెరికాకు అతిథులుగా వచ్చే యాత్రికులకు ఇలా రూపొందించిన పువ్వులను కానుకగా ఇవ్వడం సంప్రదాయంగా ఉండేది. ఆసియాలో మందంగా ఉన్న రకరకాల క్లాత్‌లను చేర్చి బొంతలుగా కుట్టి, చంటిపిల్లలున్నవారికి కానుకగా ఇవ్వడమూ వాడుకలో ఉండేది. కర్ణాటకలో ఈ కళకే అంకితమైన కుటుంబాలు ఉన్నాయి. ఈ కళను వారక్కడ 'కవుడీ' అంటారు.

మీ ఇంట్లోనే బ్యూటీషియన్



అందాన్ని, ఆరోగ్యాన్ని పెంచే 'వేప'ను కాదని చర్మసంరక్షణకు బ్యూటీ ప్రొడక్టులు వాడుతూ, పైసలు వసూలు చేసే పార్లర్ల వెంట తిరుగుతూ ఉంటారు. సౌందర్య ఉత్పత్తులలో వేప ఆకులను, వేళ్లను ఉపయోగించడం వెనుక ఉన్న చరిత్ర ఈ నాటిది కాదు 4,000 ఏళ్ళ క్రితం నాటిది.

గుప్పెడు వేపాకులు

గుప్పెడు వేపాకులు శుభ్రంగా కడిగి, రెండు లీటర్ల నీటిలో వేసి మరిగించాలి. ఎంతవరకు అంటే ఆకులు మెత్తగా అయ్యి నీళ్ల రంగు మారాలి. ఈ నీటిని చల్లార్చి గాజు బాటిల్లో పోసి ఉంచాలి. బకెట్ నీళ్లలో ఒక కప్పు వేపనీళ్లు కలిపి రోజూ స్నానం చేస్తే చర్మసంబంధమైన ఇన్ఫెక్షన్లు, యాక్నె వంటివి మెల్ల మెల్లగా తగ్గిపోతాయి.

మృదువైన స్కిన్ టోనర్

స్కిన్ టోనర్‌కి మార్కెట్‌లో దొరికే ప్రొడక్ట్‌ని తెచ్చి వాడేస్తుంటారు. కానీ, వేప నీళ్లలో ఒక దూది ఉండను ముంచి, రోజూ రాత్రి పడుకునేముందు ముఖమంతా తుడిచేయండి. స్వేదరంధ్రాలలోని మలినాలు తొలగిపోయి చర్మకాంతి పెరుగుతుంది. చర్మం శుభ్రపడటం వల్ల యాక్నె, స్కార్స్, పిగ్మెంటేషన్, బ్లాక్ హెడ్స్ .. మెల్లగా తగ్గిపోతుంటాయి.

మిలమిలలు పెంచే ఫేస్‌ప్యాక్

పది వేపాకులను మెత్తగా నూరి కప్పు నీటిలో వేసి మరిగించాలి. చల్లారిన తర్వాత ఈ నీళ్లలో కొద్దిగా తేనె, పెరుగు, సోయా పాలు కలిపి మిశ్రమం తయారుచేసుకోవాలి. దీన్ని వారానికి మూడుసార్లు ముఖానికి పట్టించి, చల్లటి నీళ్లతో కడిగేస్తే వైట్ హెడ్స్, బ్లాక్ హెడ్స్, యాక్నె నుంచి విముక్తి లభిస్తుంది. పోర్స్‌లో మలినాలు శుభ్రపడతాయి.

కేశాలకు కండిషనర్

వేపాకులను మరిగించిన నీళ్లతో తలస్నానం చేసిన తర్వాత జుట్టు కడుక్కోండి. ఇలా తరచూ చేస్తే చుండ్రు తగ్గడమే కాదు వెంట్రుకలూ మృదువుగా అవుతాయి. అంటే కేశాలకు వేపాకులు సహజసిద్ధమైన కండిషనర్ అన్నమాట.

చెవులకు కఫ్స్



చెవి బుట్టలు, రింగులు, హ్యాంగింగ్స్‌లో వచ్చిన ఎన్నో డిజైన్లు తెలిసినవే. చెవి మొత్తాన్ని సింగారిస్తూ, చూడగానే ఆకట్టుకునే ఇయర్ కఫ్స్ నేటితరాన్ని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. జుంకీలుగా వేలాడుతూ.. చెవి అంచుల వరకు ఉండేవి కొన్ని. మరికొన్ని దుద్దుల్లా చెవి భాగాన్ని పై వరకు పట్టి ఉంచుతాయి. ఈ కఫ్ ఇయర్ రింగ్స్ చెవినుండి పక్కకి పడిపోకుండా పోగు పైభాగంలో చిన్న కొక్కెం ఉంటుంది. రంధ్రం అక్కర్లేకుండా దాన్ని చెవికి పట్టి ఉంచేలా నొక్కితే సరిపోతుంది. డిజైన్స్ విషయానికి వస్తే లతలూ, పువ్వులూ, చేపలూ, జంతువుల బొమ్మలతో పాటు ఎన్నో ఫంకీ డిజైన్లు వీటిలో వస్తున్నాయి. బంగారమే కాదు బ్రాస్, స్టీల్.. ఇతర లోహాలతోనూ ఇయర్ కఫ్స్ ఆకట్టుకుంటున్నాయి. వీటిని సందర్భాన్ని బట్టి ధరించవచ్చు.

నిర్వహణ
ఎన్.ఆర్.

పరి పరిశోధన

కారు ముద్రించిన పాలీమేకర్



త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీతో బోలెడన్ని చిన్న చిన్న వస్తువులను మాత్రమే కాదు. ఏకంగా కార్లనే ప్రింట్ చేసేయవచ్చు అంటోంది చైనీస్ కంపెనీ పాలీమేకర్. అనడం మాత్రమే కాదు.. ఇటలీ కంపెనీ ఎక్స్‌ఈవీ సాయంతో ఫొటోలో కనిపిస్తున్న కారును ప్రింట్ చేసేసింది కూడా. చూసేందుకు చిన్నగా అనిపిస్తున్నా దీని ప్రత్యేకతలు బోలెడు. పూర్తిగా విద్యుత్తుతో నడవడం వీటిల్లో ఒక్కటి మాత్రమే. ఒకసారి ఛార్జ్ చేస్తే దాదాపు 140 కిలోమీటర్ల దూరం వరకూ గంటకు 70 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించవచ్చు. కారు మొత్తాన్ని ప్రింట్ చేసేందుకు మూడు రోజుల వరకూ సమయం పడుతుందని, ప్రత్యేకమైన ప్లాస్టిక్‌తో పాటు కొన్ని ఇతర పదార్థాలను ఇందులో వాడామని అంటున్నారు పాలీమేకర్ సీఈవో డాక్టర్ లూ షిఫాన్. త్రీడీ ప్రింటింగ్ కారణంగా కారులో ఉండాల్సిన విడి ప్లాస్టిక్ భాగాల సంఖ్య రెండు వేల నుంచి ఏభై ఏడుకు తగ్గిపోయిందని, ఫలితంగా మామూలు వాటితో పోలిస్తే చాలా తేలికగా ఉంటుందని లూ తెలిపారు. ఇంకో ఏడాదిలోపు అందుబాటులోకి వచ్చే ఈ కారు కోసం ఇప్పటికే తాము ఏడు వేల ఆర్డర్లు అందుకున్నామని చెప్పారు. త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ తయారీ రంగంలో మరింత విస్తృత స్థాయిలో అందుబాటులోకి వచ్చేందుకు ఎక్స్‌ఈవీ దోహదపడుతుందని తాము అంచనా వేస్తున్నామని తెలిపారు. ఇంతకీ ఈ బుల్లి కారు ఖరీదెంతో తెలుసా? దాదాపు 3.5 లక్షలు!

జలుబు మంచిదే...



జలుబు చేసి తుమ్మితే.. ''శతమానం భవతి'' అని పెద్దవాళ్లు దీవించేవారు గుర్తుందా? ఏదో పెద్దల చాదస్తం అని అనుకునేవారు. అందులో ఎంతో కొంత నిజం లేకపోలేదు అంటున్నారు యూనివర్సిటీ ఆఫ్ నాటింగ్‌హామ్ శాస్త్రవేత్తలు. జలుబు చేసినప్పుడు శరీరం లోపల ఉష్ణోగ్రతలు తగ్గిపోయి కణస్థాయిలో మంచి కొవ్వు ఉత్పత్తి వేగం అందుకుంటుందని వీరు అంటున్నారు. శరీరంలో కొవ్వు తయారీ ముందుగా నిర్దేశించిన ప్రకారం కాకుండా పరిస్థితికి తగ్గట్టుగా జరుగుతుందని తమ అధ్యయనం చెబుతోందని, మధుమేహం తదితర వ్యాధులను మరింత మెరుగ్గా నియంత్రించేందుకు ఇది ఉపయోగపడుతుందని డాక్టర్ వర్జినీ సొటిల్ తెలిపారు. ఏ రకమైన కొవ్వు ఉత్పత్తి చేయాలో శరీరం ఎలా నిర్ణయిస్తుందో తెలుసుకునేందుకు తాము అధ్యయనం చేపట్టామని చెప్పారు. ఎముక మజ్జ తాలూకూ మూల కణాలతో తాము ప్రయోగాలు చేయగా.. పరిసరాల్లోని ఉష్ణోగ్రతలు 32 డిగ్రీల కంటే తక్కువైనప్పుడు మంచి కొవ్వు ఉత్పత్తి మొదలైనట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. కణాల్లో ఉష్ణోగ్రతలకు స్పందించే వ్యవస్థ ఏమిటో గుర్తించగలిగితే దాని ఆధారంగా భవిష్యత్తులో మధుమేహానికి సరికొత్త మందులు తయారు చేయడం వీలవుతుందని సొటిల్ తెలిపారు. ఈ మందులు వేసుకుంటే మంచి కొలెస్ట్రాల్ ఎక్కువవుతుందని, తద్వారా రక్తంలో కొలెస్ట్రాల్ మోతాదులను కూడా నియంత్రించవచ్చునని సొటిల్ తెలిపారు.

హోమియో కౌన్సెలింగ్స్

ఫ్యామిలీ డాక్టర్

పీసీఓడీ తగ్గుతుందా?

నా భార్య వయసు 32 ఏళ్లు. ఇటీవల ఆమె శరీరంపై వెంట్రుకలు ఎక్కువగా పెరుగుతుంటే డాక్టర్‌కు చూపించాం. ఆమె పీసీఓడీతో బాధపడుతున్నట్లు చెప్పారు. దీనికి హోమియోలో చికిత్స ఉందా?

- భద్రారెడ్డి, చిత్తూరు

గర్భాశయానికి ఇరువైపులా అండాశయాలు ఉంటాయి. ఈ అండాశయాల్లో నీటిబుడగల వంటివి ఉండటాన్ని పాలిసిస్టిక్ ఓవేరియన్ డిసీజ్ (పీసీఓడీ) అంటారు. రుతుక్రమం సవ్యంగా ఉన్న మహిళల్లో నెలసరి అయిన 11–18 రోజుల మధ్యకాలంలో రెండు అండాశయాల్లోని ఏదో ఒకదాని నుంచి అండం విడుదల అవుతుంది. అయితే ఈ పీసీఓడీ సమస్య ఉన్నవారిలో అండాశయం నుంచి అండం విడుదల కాకుండా, అపరిపక్వమైన అనేక అండాలు నీటిబుడగల్లా అండాశయపు గోడలపై ఉండిపోతాయి. చూడటానికి ఇవి ముత్యాల్లా కనిపిస్తుంటాయి. ఇలా రెండువైపులా కనిపిస్తుంటే దీన్ని వైద్యపరిభాషలో 'బైలేటరల్ పీసీఓడీ' అంటారు. ఈ సమస్యకు కచ్చితమైన కారణాలు తెలియనప్పటికీ జన్యుపరమైన అంశాలు ఒక కారణంగా భావిస్తున్నారు. అంతేగాక ఎఫ్ఎస్‌హెచ్, ఎల్‌హెచ్, ఈస్ట్రోజెన్, టెస్టోస్టెరాన్ హార్మోన్ల అసమతౌల్యత వల్ల ఈ సమస్య తలెత్తవచ్చు. సరైన జీవనశైలి పాటించనివారిలోనూ ఇది ఎక్కువ.

లక్షణాలు: నెలసరి సరిగా రాకపోవడం, వచ్చినా అండాశయం నుంచి అండం విడుదల కాకపోవడం, రుతుస్రావం సమయంలో ఎక్కువ రక్తంపోవడం, రెండు రుతుక్రమాల మధ్యకాలంలో రక్తస్రావం కావడం, నెలసరి వచ్చే సమయంలో కడుపులో బాగా నొప్పిరావడం, నెలసరి రాకపోవడం, బరువు పెరగడం, తలవెంట్రుకలు రాలిపోతుండటం, ముఖం, వీపు, శరీరంపై మొటిమలు రావడం, ముఖం, ఛాతీపైన మగవారిలా వెంట్రుకలు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీనివల్ల సంతానం కలగకపోవడం, స్థూలకాయం, డయాబెటిస్, కొందరిలో చాలా అరుదుగా హృద్రోగ సమస్యలు రావచ్చు. రోగి భౌతిక లక్షణాలతో పాటు అల్ట్రాసౌండ్ స్కాన్, హెచ్‌సీజీ, టెస్టోస్టెరాన్, ఆండ్రోజెన్, ప్రోలాక్టిన్ మొదలైన హార్మోన్ల పరీక్షలు, రక్తంలో చక్కెరపాళ్లు, కొలెస్ట్రాల్ శాతం వంటి పరీక్షలతో దీన్ని నిర్ధారణ చేయవచ్చు.

చికిత్స: హోమియోలో సరైన కాన్‌స్టిట్యూషన్ సిమిలియం విధానంలో హార్మోన్ వ్యవస్థను పరిపుష్టం చేయడం ద్వారా ఎలాంటి దుష్ఫలితాలు లేకుండా శాశ్వతంగా పీసీఓడీని నయం చేయవచ్చు.



డాక్టర్ శ్రీకాంత్ మొర్లావర్, సీఎండీ,
హోమియోకేర్ ఇంటర్నేషనల్, హైదరాబాద్

హైపోథైరాయిడిజమ్‌కు చికిత్స ఉందా?

నా వయసు 36 ఏళ్లు. ఈ మధ్య నేను బరువు పెరుగుతున్నాను. పీరియడ్స్ సక్రమంగా రాకపోవడం వల్ల టీఎస్‌హెచ్ పరీక్ష చేశారు. హైపోథైరాయిడిజమ్ ఉందని తెలిసింది. నేను జీవితాంతం మందులు వాడాల్సిందేనా? హోమియోలో శాశ్వతంగా తగ్గించే మందులు ఏమైనా ఉన్నాయా?

- ఒక సోదరి, మిర్యాలగూడ

మానవ శరీరంలో థైరాయిడ్ గ్రంథి ముఖ్యమైన భూమిక పోషిస్తుంది. శరీరంలోని వివిధ రకాల జన్యుక్రియల సమతౌల్యతకు టీ3, టీ4, టీఎస్‌హెచ్ హార్మోన్లు ఉపయోగపడతాయి. హైపోథైరాయిడ్ బరువు పెరిగే సమస్య. హైపోథైరాయిడిజమ్ అనేది మానవ శరీరంలో థైరాయిడ్ అనే హార్మోన్ ఉత్పత్తి తగ్గడం వల్ల వస్తుంది. ఈ ఆధునిక కాలంలో సుమారు మూడు శాతం మంది హైపోథైరాయిడిజమ్‌తో బాధపడుతున్నారు. ఆకస్మికంగా బరువు పెరగడం ఈ సమస్యను సూచిస్తుంది. హైపోథైరాయిడిజమ్ ఏ వయసులోని వారికైనా రావచ్చు. స్త్రీలలో, పిల్లల్లో ఈ సమస్య ఎక్కువగా వస్తుంది. శిశువుల్లో క్రెటినిజం అనే ఒక రకమైన హైపోథైరాయిడిజమ్ వస్తుంది. థైరాయిడిజమ్ నుంచి తగినంత మోతాదులో హార్మోన్ టీ3, టీ4 ఉత్పన్నం కావడానికి మన శరీరంలో చాలినంత అయోడిన్, టీఎస్‌హెచ్ (మెదడులోని పిట్యుటరీ గ్రంథి నుంచి ఉత్పన్నమయ్యే థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్) అవసరం. అయోడిన్ లోపించడం వల్ల హైపోథైరాయిడిజమ్ సమస్య వస్తుంది.

లక్షణాలు: ● బరువు పెరగడం, కాళ్లు చేతుల్లో నీరు చేరడం ● జుట్టు రాలడం, చర్మం పొడిబారటం, మలబద్ధకం ● గొంతు బొంగురుపోవడం, తొందరగా అలసిపోవడం, కండరాల నొప్పి, ● కోపం, అలసట, నిరాశ, కీళ్లనొప్పి ● రుచి, వాసన, స్పర్శ తగ్గడం ● సంతానలేమి, నీరసం, డిప్రెషన్

నిర్ధారణ పరీక్షలు: రక్తపరీక్షలు, థైరాయిడ్ యాంటీబాడీస్, థైరాయిడ్ స్కానింగ్, అల్ట్రాసౌండ్.

చికిత్స: హోమియో విధానంలో హైపోథైరాయిడిజమ్ సమస్యను అదుపు చేసే చాలా రకాల ఔషధాలు అందుబాటులో ఉన్నాయి. అయితే అవి శారీరక, మానసిక లక్షణాలను పరిగణనలోకి తీసుకొని ఇవ్వాల్సి ఉంటుంది. హోమియోపతిలో సాధారణంగా కాల్కేరియా కార్బ్, కాల్కేరియా ఫాస్, అయోడమ్, థైరాడినమ్, స్పాంజియా వంటి మందులను రోగుల లక్షణాలను బట్టి ఇవ్వాల్సి ఉంటుంది. అనుభవజ్ఞులైన డాక్టర్ల పర్యవేక్షణలో మందులు వాడటం వల్ల హైపోథైరాయిడిజమ్‌ను పూర్తిగా నయం చేయవచ్చు.



డాక్టర్ మురళి కె. అంకిరెడ్డి,
ఎండీ (హోమియో), స్టార్ హోమియోపతి, హైదరాబాద్

మూత్ర విసర్జన సమయంలో మంట!

నా వయసు 30 ఏళ్లు. ఇటీవల మూత్రం వెంటవెంటనే వస్తోంది. అంతే కాదు విసర్జన సమయంలో చాలా మంటగానూ ఉంటోంది. నా సమస్యకు పరిష్కారం సూచించండి.

- కె. లలిత, కాకినాడ

మూత్ర విసర్జక వ్యవస్థలో వచ్చే ఇన్ఫెక్షన్లను యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్‌గా పేర్కొంటారు. ఇవి మహిళల్లో చాలా ఎక్కువే. వీటిని రెండు రకాలుగా విభజించవచ్చు. ● **అప్పర్ యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్ :** ఇందులో మూత్రపిండాలు, మూత్రనాళాలకు ఇన్ఫెక్షన్ వస్తుంది. మూత్రపిండాలకు వచ్చే ఇన్ఫెక్షన్‌ను పైలోనెఫ్రైటిస్ అంటారు. విపరీతమైన జ్వరం, చలి, వికారం, వాంతులు దీని లక్షణాలు. ● **లోవర్ యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్:** ఇందులో మూత్రాశయం, యురెథ్రాలు ఉంటాయి. మూత్రాశయం ఇన్ఫెక్షన్‌ను సిస్టయిటిస్ అంటారు. యురెథ్రా ఇన్ఫెక్షన్‌ను యురెథ్రయిటిస్ అంటారు.

కారణాలు: యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్‌లోని దాదాపు 90 శాతం కేసుల్లో ఈ సమస్యకు ప్రధానంగా కారణం ఈ-కొలై అనే బ్యాక్టీరియా. ఇది పేగుల్లో, మలద్వారం వద్ద పరాన్నజీవిగా జీవిస్తూ ఉంటుంది. సరైన వ్యక్తిగత పరిశుభ్రత పాటించనివారిలో ఈ-కొలై బ్యాక్టీరియా పైపైకి పాకుతూ మూత్రకోశ ఇన్ఫెక్షన్స్‌కు దారితీస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు ఉండటం కూడా మూత్రవిసర్జనకు ప్రధాన అడ్డంకిగా మారి, దీనివల్ల కూడా బ్యాక్టీరియా త్వరగా అభివృద్ధి చెంది ఇన్ఫెక్షన్‌కు దారితీయవచ్చు. రోగనిరోధక శక్తి తగ్గినవారిలో తరచూ యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్ రావచ్చు.

లక్షణాలు: మూత్రవిసర్జనకు ముందుగానీ, తర్వాతగానీ విపరీతమైన మంట ఉండటం, ఎక్కువసార్లు మూత్రవిసర్జనకు వెళ్లాల్సి రావడం, మూత్రంలో రక్తం పడటం, పొత్తికడుపు వద్ద నొప్పి, చలిజ్వరం, వాంతులు, వికారం

చికిత్స: హోమియోలో వ్యాధి లక్షణాలను పరిగణనలోకి తీసుకొని, వ్యక్తి తత్వాన్ని బట్టి మందులను సూచిస్తారు. యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్‌ను నయం చేయడానికి హోమియోలో మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. వీటిని నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో, క్రమం తప్పకుండా వాడితే మంచి ఫలితాలు ఉంటాయి.



డాక్టర్ ఎ.ఎం. రెడ్డి, సీఎండీ,
పాజిటివ్ హోమియోపతి, హైదరాబాద్



స్క్రీన్ టెస్ట్



1 బాలీవుడ్ నటి శ్రద్ధాకపూర్ తెలుగులో ఒక ప్రముఖ హీరో సరసన నటిస్తోంది. ఎవరా హీరో?
ఎ) ప్రభాస్ బి) మహేశ్‌బాబు
సి) ఎన్టీఆర్ డి) వరుణ్‌తేజ్

5 రామ్‌చరణ్ నటిస్తున్న 'రంగస్థలం' చిత్రం ఏ కాలానికి సంబంధించిన కథో తెలుసా?
ఎ) 1960 బి) 1985
సి) 1990 డి) 1970



6 'నిన్ను కోరి' చిత్రం ద్వారా పేరు తెచ్చుకున్న దర్శకుడు శివ నిర్వాణ తాజా చిత్రంలో నాగచైతన్య హీరోగా నటిస్తున్నాడు. మరి చైతన్య ప్రక్కన హీరోయిన్ ఎవరో తెలుసా?
ఎ) సమంత బి) కాజల్ అగర్వాల్
సి) లావణ్యత్రిపాఠి డి) అనుపమ పరమేశ్వరన్

18 ఎన్టీఆర్, జయసుధ నటించిన ఈ స్టిల్ ఏ సినిమాలోనిది?
ఎ) మనుషులంతా ఒక్కటే
బి) యుగపురుషుడు సి) మహాపురుషుడు
డి) మేజర్ చంద్రకాంత్

12 'జతకలిసే.. జతకలిసే జగములు రెండు జతకలిసే' పాట రచయిత ఎవరు?
ఎ) సిరివెన్నెల సీతారామశాస్త్రి
బి) శ్రీమణి
సి) రామజోగయ్య శాస్త్రి
డి) అనంత శ్రీరామ్

14 'వాల్‌పోస్టర్' అనే సినిమా బ్యానర్‌ను ప్రారంభించిన ప్రముఖ హీరో ఎవరు?
ఎ) కల్యాణ్‌రామ్ బి) నాని
సి) మంచు మనోజ్ డి) 'అల్లరి' నరేశ్

9 'అంతం, రాత్రి' సినిమాల ద్వారా దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఒక నూతన సంగీత దర్శకుడిని తెలుగు తెరకు పరిచయం చేశాడు. ఎవరతను?
ఎ) యం.యం.కీరవాణి
బి) మణిశర్మ
సి) రమణ గోగుల
డి) సందీప్ చౌతా

2 'ఆపద్బాంధవుడు' చిత్రంలో చిరంజీవి నాటకాలు వేస్తూ, ఓ దేవుని పాత్రను పోషించాడు? అది ఏ దేవుని పాత్రో తెలుసా?
ఎ) రాముడు బి) కృష్ణుడు
సి) శివుడు డి) వెంకటేశ్వరస్వామి

20 'బాహుబలి'లో రమ్యకృష్ణ పాత్రకు మొదట ఓ ప్రముఖ హీరోయిన్‌ను అనుకొన్నారు. కొన్ని కారణాల వల్ల ఆమె ఆ పాత్రను చేయలేకపోయారు. ఎవరా హీరోయిన్?
ఎ) టబూ
బి) శ్రీదేవి
సి) రేఖ
డి) మాధురీ దీక్షిత్

17 ఈ ఫొటోలోని చిన్నారి ఇప్పుడు ప్రముఖ హీరోయిన్. ఆమె ఎవరు?
ఎ) హన్సిక
బి) రకుల్‌ప్రీత్‌సింగ్
సి) సమంత
డి) తాప్సీ

13 'మనం పెరిగే కొద్దీ మన చుట్టూ ఉన్న మనుషులు మారొచ్చు.. ప్రపంచం మారొచ్చు కానీ ఒక్కటి మాత్రం ఎప్పటికీ మారదు శైలు. నేను నిన్ను చూసిన ప్రతిసారి ప్రేమలో పడటం' అనే డైలాగ్ 'నేను శైలజ' సినిమాలోనిది. ఈ సినిమా స్టోరీ రైటర్ ఎవరో కనుక్కోండి?
ఎ) సంపత్ నంది
బి) కోన వెంకట్
సి) కిషోర్ తిరుమల
డి) పరుచూరి బ్రదర్స్

4 'కుమారి 21 ఎఫ్' చిత్రం ద్వారా హెబ్బాపటేల్ ఫేమస్ అయ్యారు. కొందరు అదే తనకు మొదటి సినిమా అనుకుంటారు. అంతకుముందే హెబ్బా ఒక మంచి సినిమాలో నటించింది. ఆ సినిమా పేరేంటి?
ఎ) అలా ఎలా
బి) అనగనగా ఓ రాత్రి
సి) అనగనగా ఓ ఊరిలో
డి) అనుకోకుండా

7 పూజా హెగ్డే సరసన తెలుగులో నటించిన మొదటి హీరో ఎవరు?
ఎ) అల్లు అర్జున్
బి) సాయిధరమ్ తేజ్
సి) వరుణ్ తేజ్
డి) అల్లు శిరీష్

16 నటి కీర్తి సురేశ్ అమ్మగారు మేనక కూడా తెలుగులో నటించారు. ఆమె నటించిన సినిమాలో ఇప్పటి స్టార్ హీరో నటించారు. ఆ హీరో ఎవరో తెలుసా?
ఎ) బాలకృష్ణ బి) చిరంజీవి
సి) నాగార్జున డి) వెంకటేశ్

11 నటుడు ఉదయ్ కిరణ్‌ని సిల్వర్ స్క్రీన్‌కి పరిచయం చేసిన దర్శకుడెవరో తెలుసా?
ఎ) వీవీ వినాయక్
బి) విజయ్ భాస్కర్
సి) తేజ
డి) త్రివిక్రమ్

10 దర్శకునిగా ఎన్నో సూపర్ హిట్లు ఇచ్చిన యస్.వి.కృష్ణారెడ్డి ఓ పండగ పేరుతో విడుదలైన సినిమా ద్వారా హీరోగా మారారు. ఆ సినిమా పేరేంటి?
ఎ) విజయదశమి బి) దీపావళి
సి) సంక్రాంతి డి) ఉగాది

8 హీరో రామ్‌కు సొంత నిర్మాణ సంస్థ ఉంది. ఆ సంస్థ పేరు స్రవంతి మూవీస్. కానీ ఆయన హీరోగా పరిచయమైన నిర్మాణ సంస్థ పేరేంటి?
ఎ) శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్
బి) 14 రీల్స్ సి) బొమ్మరిల్లు
డి) సురేశ్ ప్రొడక్షన్స్



3 అల్లు అర్జున్ నటిస్తున్న సినిమా పేరు 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. ఈ సినిమాలో ఆయన పక్కన నటిస్తున్న హీరోయిన్ ఎవరు?
ఎ) రాశీ ఖన్నా బి) రకుల్‌ప్రీత్
సి) అను ఇమ్మాన్యుయేల్
డి) పూజా హెగ్డే

19 తెలుగులో లేడీ సూపర్ స్టార్‌గా పేరు తెచ్చుకున్న హీరోయిన్ ఎవరో తెలుసా?
ఎ) రాధ బి) రాధిక
సి) విజయశాంతి డి) సుహాసిని

15 ట్విట్టర్ అనే సామాజిక మాధ్యమంలో దర్శకుడు ఆర్జీవి చాలా ఫేమస్. ఆయన ట్విట్టర్ ఐడీ ఏంటో తెలుసా?
ఎ) జూమ్‌ఇన్ ఆర్జీవి బి) ఐయామ్ ఆర్జీవి
సి) దిస్ ఈజ్ ఆర్జీవి డి) ఆర్జీవి జూమ్‌ఇన్

నిర్వహణ
శివ మల్లాల

మీరు 6 సమాధానాల కంటే తక్కువ చెబితే... మీకు సినిమా అంటే ఇష్టం
10 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే ఇంట్రెస్ట్
15 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే పిచ్చి
20 సమాధానాలూ చెప్పగలిగితే... ఇంకోసారి ఈ క్విజ్ చదవకండి!

సమాధానాలు
1) ఎ 2) సి 3) డి 4) ఎ
5) బి 6) ఎ 7) సి 8) సి
9) బి 10) డి 11) సి
12) సి 13) సి 14) బి
15) డి 16) బి
17) ఎ 18) సి
19) సి 20) బి



రామ్‌చరణ్, అయాన్

ఎంత సక్కగున్నావో

...బుజ్జి అయాన్‌ని చిట్టిబాబు గెటప్‌లో చూసినవాళ్లు ఇలా అనకుండా ఉండలేకపోయారు. బుడతడు అచ్చంగా తన మామ రామ్‌చరణ్ గెటప్‌లో దిగిపోయాడు. ఫొటోలు చూశారుగా. చిన్న చిట్టిబాబు భలే ముద్దుగా ఉన్నాడు కదూ. ''రంగమ్మ మంగమ్మ ఏం పిల్లడు! హార్డ్‌కోర్ చరణ్ మామ ఫ్యాన్. 'రంగస్థలం' సాంగ్స్‌ను ప్లే చేయమని ప్రతి రోజూ అయాన్ అల్లరి చేస్తున్నాడు. ఎంత సక్కగున్నావ్ బే' అని చిట్టిబాబు గెటప్‌లో ఉన్న కొడుకు అయాన్ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు అల్లు అర్జున్. 'లైక్ మామ లైక్ అల్లుడు' అన్నారు అల్లు అర్జున్ వైఫ్ అల్లు స్నేహారెడ్డి. రామ్‌చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, చెరుకూరి మోహన్ నిర్మించిన చిత్రం 'రంగస్థలం'. ఈ సినిమాలో వినికిడి లోపం ఉన్న చిట్టిబాబు పాత్రలో రామ్‌చరణ్, రామలక్ష్మి పాత్రలో సమంత, చిట్టిబాబు బ్రదర్ కె. కుమార్‌బాబు పాత్రలో ఆది పినిశెట్టి నటించారు. జగపతిబాబు, ప్రకాశ్‌రాజ్, సీనియర్ నరేశ్, అనసూయ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాను ఈ నెల 30న రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

ఇది నకిలీ.. అసలు త్వరలో!



సంజయ్‌దత్

హీరోగా సంజయ్‌దత్ ఇండస్ట్రీలో సూపర్ స్టార్‌డమ్ సంపాదించుకున్నారు. కానీ కొన్ని అనుకోని సంఘటనలు ఆయన జీవితాన్ని మరింత పాపులర్ అండ్ ఇంట్రస్టింగ్‌గా చేశాయి. అందుకే ఆయన బయోగ్రఫీ ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఆల్రెడీ రణ్‌బీర్ సింగ్ హీరోగా రాజ్‌కుమార్ హిరాని దర్శకత్వంలో సంజయ్‌దత్ జీవితం ఆధారంగా ఓ సినిమా రూపొందుతోంది. ఈ ఏడాది విడుదల కానుంది. కానీ ఇంతలోనే సంజయ్‌దత్ బయోగ్రఫీ అంటూ ''ది క్రేజీ అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ బాలీవుడ్ బ్యాడ్‌బాయ్ సంజయ్‌దత్'' అనే టైటిల్‌తో ఓ బుక్ మార్కెట్‌లో వచ్చింది. ఈ బుక్ గురించి సంజయ్‌దత్ స్పందించారు. ''మార్కెట్‌లో ఉన్న నా బయోగ్రఫీ బుక్‌కి, నాకు ఎలాంటి సంబంధం లేదు. ఆ బుక్‌ని ప్రచురించినవాళ్లు నా అనుమతి తీసుకోలేదు. మా లాయర్స్ సంబంధిత వ్యక్తులకు నోటీసులు పంపించడం జరిగింది. పబ్లిక్ డొమైన్‌లో లభించిన సమాచారం ఆధారంగా ఈ పుస్తకం రాయబడిందని సంబంధిత పుస్తక ప్రచురణ సంస్థ పేర్కొంది. కానీ వాటిలో ఉన్న విషయాలు నా పాత ఇంటర్వ్యూలోనివని తెలిసింది. అందులో అన్నీ నిజాలు లేవు. కొన్ని గాసిప్స్, చెప్పుడు మాటలు కూడా ఉన్నాయి'' అని అన్నారు. ఆయన ఇంకా చెబుతూ– ''ఇక ఏ ఇతర రచయితలు నన్ను, నా కుటుంబాన్ని ఇబ్బందిపెట్టరని భావిస్తున్నాను. నా అఫీషియల్ బయోగ్రఫీని త్వరలోనే విడుదల చేస్తా. అందులో ఉన్న సంగతులే వాస్తవమైనవి'' అన్నారు.

అప్పుడే అయిపోయిందా అంటారు



గురురాజ్

మలయాళ 'ప్రేమమ్' ఫేమ్ నివిన్ పాలీ అతిథిగా, కొత్త నటీనటులు నటించిన చిత్రం 'ఆనందం'. గణేష్ రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా మలయాళంలో ఘనవిజయం సాధించింది. ఈ చిత్రాన్ని అదే పేరుతో నిర్మాత ఎత్తరి గురురాజ్ తెలుగులో ఈరోజు విడుదల చేస్తున్నారు. గురురాజ్ మాట్లాడుతూ– ''కాలేజీలో పిక్నిక్‌కి వెళ్లొచ్చే విద్యార్థుల కథే ఈ చిత్రం. నేటి యువతరంతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది. సినిమా చూస్తున్నంత సేపు కాలేజీ రోజులు గుర్తుకొస్తాయి. వేసవిలో ప్రేక్షకులను నవ్వుల జల్లులు పంచే చిత్రమిది. సినిమా చూశాక అప్పుడే అయిపోయిందా! అంటారు. మలయాళంలో 4కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం 20కోట్లు వసూలు చేసింది. ఈ సినిమా రీమేక్ హక్కుల కోసం చాలామంది నిర్మాతలు సంప్రదించారు. అయితే.. యూనివర్సల్ కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం తెలుగు నేటివిటీకి సరిపోయేలా ఉండటంతో రీమేక్ చేయకుండా డబ్ చేశాం. 'చిన్న సినిమాలను ప్రోత్సహించాలి' అంటూ స్టార్ హీరోలు, డైరెక్టర్లు, పెద్ద నిర్మాతలంతా మైకుల్లో ఉపన్యాసాలు ఇస్తుంటారే కానీ, ఆచరణలో పెట్టరు. చిన్న సినిమాలను ప్రోత్సహించినప్పుడే చాలామందికి పని దొరుకుతుంది. నటుడవ్వాలని హైదరాబాద్‌కొచ్చిన నేను బ్రహ్మానందంగారు, రాజేంద్రప్రసాద్‌గారు వంటి వారితోపాటు చాలా సినిమాల్లో నటించా. కానీ, బ్రేక్ రాకపోవడంతో రియల్ ఎస్టేట్ రంగంలోకి వెళ్లా. మళ్లీ నిర్మాతగా మారా. త్వరలోనే మా సుఖీభవ మూవీస్ బ్యానర్‌లో ఓ స్ట్రెయిట్ ఫిల్మ్ నిర్మించనున్నా'' అన్నారు.